

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 186

శుక్రవారం 26-9-2025



వారి గుండె అస్సాం కోసమే..

అస్సాం గొంతుకగా మారిన
జుబిన్ గార్గ్ దంపతులు – ఫ్యామిలీలో



ఎంత వింత నోబెల్!

చిత్ర విచిత్ర ఆవిష్కరణలకు
ఉత్తుత్తి బహుమతులు. – ఫ్యామిలీలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



iPhone 17

Magichromatic.



Go to IndiaiStore.com to find Apple Authorised stores near you.

Available now at an Exchange Effective Price of ₹49900*

Inclusive of **₹6000*** instant cashback on credit cards of

ICICI Bank | SBI card

+

Exchange bonus up to **₹7000***

	iPhone 17
MRP (incl. of all taxes) (256 GB, 1N)	₹82900.00
Instant Cashback*	₹6000.00
Exchange value of your old smartphone*	₹20000.00
Exchange bonus*	₹7000.00
Exchange Effective Price*	**₹49900.00**

*Terms and conditions apply.
Please scan the QR Code for terms and conditions.

INDIA iSTORE

INGRAM | Redington

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 22 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 186


'నా అక్కలూ..చెల్లెళ్లు...తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



జీఎస్టీ సంస్కరణలు ఆగవు

జీఎస్టీలో సంస్కరణలు కొనసాగుతాయని మోదీ ప్రకటించారు. మున్ముందు ప్రజలపై పన్నుల భారం తగ్గుతుందన్నారు.

వివరాలు 6లో ▸



నూతన 'తేజస్సు'

97 తేజస్ ఎంకే-1ఏ యుద్ధ విమానాల కొనుగోలుకు హెచ్ఏఎల్‌తో భారత వైమానిక దళం ఒప్పందం కుదుర్చుకుంది.

వివరాలు 6లో ▸

సర్కారువారి మెట్రో

ఎల్ అండ్ టీ నుంచి ప్రాజెక్టు తొలిదశ స్వాధీనానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

సాక్షి, హైదరాబాద్

హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్టు తొలి దశను ఎల్ అండ్ టీ గ్రూప్ నుంచి స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఎల్ అండ్ టీకి ఉన్న రూ. 13 వేల కోట్ల రుణ భారాన్ని మోసేందుకు ముందుకొచ్చింది. అలాగే ఎల్ అండ్ టీ మెట్రోరైల్ హైదరాబాద్ లిమిటెడ్‌లో ఆ సంస్థకు ఉన్న ఈక్విటీలో రూ. 2 వేల కోట్లను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద చెల్లించనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఎల్ అండ్ టీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.వి. సుబ్రమణ్యన్ మధ్య జరిగిన కీలక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో 2024 నవంబర్ నుంచి ఈ విషయంలో కొనసాగుతున్న ప్రతిష్టంభనకు తెరపడింది.

మెట్రో విస్తరణ వేళ..

మెట్రో రెండో దశ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు

మిగతా 14వ పేజీలో ▶



- రూ. 13 వేల కోట్ల ఆ సంస్థ రుణ భారాన్ని మోసేందుకు అంగీకారం
- మెట్రోరైల్ లిమిటెడ్‌లో ఈక్విటీ కింద రూ. 2 వేల కోట్ల చెల్లింపునకూ ఓకే
- సీఎం రేవంత్ సమక్షంలో ఆ సంస్థ చైర్మన్‌తో భేటీలో ఏకాభిప్రాయం
- రవాణా కార్యకలాపాల నిర్వహణ నుంచి నిష్క్రమిస్తున్నట్లు తెలిపిన ఎల్ అండ్ టీ సీఎండీ

రెండు నుంచి తొమ్మిదవ స్థానానికి..

హైదరాబాద్‌లో మెట్రో రైల్ పొడవు పరంగా దేశంలో 2014లో రెండవ స్థానంలో ఉండగా ప్రస్తుతం 9వ స్థానానికి పడిపోయింది. పలు నగరాలు మెట్రోను విస్తరించినా హైదరాబాద్‌లో మాత్రం సాధ్యం కాలేదు. ఈ నేపథ్యంలో పెరుగుతున్న రవాణా డిమాండ్‌ను తీర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఫేజ్ 2ఏ, 2బీ విస్తరణ కింద 8 లైన్లకు సంబంధించిన 163 కి.మీ. పొడవైన మెట్రో నెట్‌వర్క్‌ను ప్రతిపాదించడం తెలిసిందే.

NECC – NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Venkobb CHICKEN

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate				
₹ 76	Ex Farm Live Bird	100 kg	Dressed with Skin	177 kg
	Retail Live Bird	122 kg	Skin Less	201 kg

Issued in the interest of consumers

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా మళ్లీ డి.రాజా

- వివరాలు 6లో▶

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ నేత డి.రాజా వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు.







సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 26-9-2025



'ఒంటరితనం మెదడుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది కాబట్టి సామాజిక సంబంధాలపై దృష్టి పెట్టాలి. దానిలో భాగమే ఇష్టమైన వ్యక్తులను కలుసుకోవడం. ఇది మానసికంగా చురుకుగా ఉండడానికి ఉపకరిస్తుంది. మానసిక చురుకుదనం వల్ల ఫీల్-గుడ్ కెమికల్స్ విడుదల అవుతాయి' అంటున్నారు ప్రముఖ న్యూరోసర్జన్ డా.ప్రశాంత్ కటాకోల్.

● న్యూస్ మేకర్

వారి గుండె అస్సాం కోసమే కొట్టుకుంది



భార్య గరిమతో జుబీన్ గార్గ్

జుబీన్ గార్గ్ అంతిమయాత్ర

ఒక గాయకుడు మరణిస్తే జనం సముద్రంలా పోటెత్తడం జుబీన్ గార్గ్ అంతిమ యాత్రలో దేశం చూసింది. ఎవరీ జుబీన్ గార్గ్ అని ఆరా తీసింది. అతడు అస్సాం గొంతుక, అస్సాం సంగీతానికి గుండెకాయ. అభిమానులు 'కింగ్ ఆఫ్ హమ్మింగ్' అని పిలుచుకునే జుబీన్ గార్గ్ ఈశాన్య రాష్ట్రాలన్నీ గర్వపడే సంగీత సముద్రం. గాయకుడు, సంగీత కారుడు, వాద్యకారుడు, సామాజిక సేవకుడు, దాత... ఇంకా మరెన్నో. ఇప్పటికి దాదాపు పదివేలకు పైగా పాటలు పాడి, రికార్డు చేసి స్థానిక గీతాలకు గొంతుకనిచ్చాడు. అంతేకాదు ప్రజల తరఫున అవసరమైనప్పుడల్లా ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొంతెత్తడానికి కూడా వెనుకాడలేదు. అందుకే అతణ్ణి జనం గుండెల్లో పెట్టుకున్నారు. చనిపోతే గుండెలు పగిలేలా ఏడ్చారు. ఒకప్పుడు దేశాన్ని ఒక ఊపు ఊపిన 'యాలీ... రహమ్ వాలీ' పాట జుబిన్ పాడిందే.

జుబీన్ మెహతా అంతటి వాడు కావాలని...

జుబీన్ గార్గ్ అసలు పేరు మోహిని మోహన్. ప్రఖ్యాత సంగీతకారుడు జుబీన్ మెహతా అంతటివాడు కావాలని జుబీన్ గార్గ్ అని పెట్టుకున్నాడు. గార్గ్ అతని గోత్రనామం. తల్లి గాయని కావడం, తండ్రి కవి కావడంతో వారిద్దరి అంశతో వాగ్గేయకారుడు అయ్యాడు. క్షణాల్లో పాట కట్టి పాడగలడు. అందులో అస్సామీ సంస్కృతిని చూపిస్తాడు. హిందీ, బెంగాలీ, అస్సామీ తదితర భాషల్లోనే కాదు ఈశాన్య రాష్ట్రాల స్థానిక భాషల్లో కూడా పాడాడు. సింగపూర్‌లో జరుగుతున్న నార్త్ ఇండియా ఫెస్టివల్‌లో ప్రదర్శన ఇచ్చేందుకు వెళ్లిన జుబిన్ సెప్టెంబర్ 19న సముద్ర స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మరణించాడు. ఆ సమయంలో అతని ఒంటి మీద లైఫ్ జాకెట్ లేదు. అతని పార్థివదేహం భారత్‌కు చేరుకోగానే వేలాది మంది అభిమానులు అతన్ని ఆఖరిసారి చూసేందుకు ఎయిర్‌పోర్ట్‌కు తరలి వచ్చారు. సెప్టెంబర్ 23న జరిగిన అంతిమయాత్రలో లక్షలాది మంది పాల్గొన్నారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. అతని స్మారక స్థూపం కోసం మూడున్నర ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది.

అతని ప్రేమకథ

జుబీన్ గార్గ్‌కు వేలాది మంది అమ్మాయిలు ఫ్యాన్స్‌గా ఉన్నారు. వారిలో ఒకమ్మాయిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఆమె పేరు గరిమా సైకియా. జుబిన్ ఆల్బమ్స్ 'అనామిక', 'మాయ' విని గరిమ ఆయనకు అభిమానిగా మారారు. ఆ సమయంలో ఆమె ముంబయిలో ఉన్నారు. ఇంటి నుంచి దూరంగా ఉంటూ, హోమ్‌సిక్ అనుభవిస్తున్న ఆమెకు ఆ పాటలు ప్రశాంతతను అందించాయి. తన అభిమానాన్ని ఓ ఉత్తరం రూపంలో రాసి ఆయనకు పంపారు. జుబీన్ తన అభిమానులకు ఎప్పుడూ ప్రత్యుత్తరం రాయలేదు. మొదటి సారి గరిమ రాసిన ఉత్తరానికి ప్రత్యుత్తరం రాశాడు. వారి ప్రేమకు అక్కడే బీజం పడింది. ఆ తర్వాత కొంతకాలం ఉత్తరాల ద్వారా ప్రేమ బలపడింది. అయితే అన్ని ప్రేమకథల్లాగే వీరి ప్రేమకూ ఆటంకాలు తప్పలేదు. గరిమ కుటుంబం ఈ ప్రేమను అంగీకరించలేదు. ఆమె తండ్రి ససేమిరా అన్నారు. గరిమ సైతం జుబీన్ ప్రవర్తనతో కొంత విసిగిపోయారు. ఆయనకు దూరంగా ఉండటమే మంచిదని భావించి దూరంగా వెళ్లారు. ఆ తర్వాత జుబీన్ పరిస్థితి తలకిందులైంది. దేని మీదా ఏకాగ్రత నిలవలేదు. ఆ ప్రభావం అతను చేస్తున్న పని మీద పడింది. పాటల్లో పస ఉండటం లేదని అభిమానులు పెదవి విరిచారు. డిప్రెషన్ చుట్టుముట్టింది. ఇదంతా విన్నాక గరిమ మనసు కరిగింది. ఒకరి నొకరు విడిచి ఉండలేరని ఇద్దరికీ అర్థమై 2002 ఫిబ్రవరి 4న వివాహం చేసుకున్నారు. 23 ఏళ్లుగా వారి బంధం పటిష్ఠంగా ఉంది. ఉన్నట్టుండి జుబీన్ లేకపోవడాన్ని గరిమ జీర్ణించుకోలేకపోతున్నారు. వారిద్దరి ప్రేమ గురించి తెలిసినవారంతా కన్నీరు పెడుతున్నారు.

సమాజం కోసం కలిసి నడిచారు

జుబీన్ గార్గ్–గరిమ దంపతులకు సొంత పిల్లలు లేరు. కానీ 15 మంది నిరుపేద పిల్లల్ని వారు దత్తత తీసుకొని, వారి ఆలనాపాలనా చూశారు. వీరిలో 'కాజలి' అనే పాప వారిద్దరికీ ఎంతో ప్రియమైన బిడ్డ. ఓరోజు జుబీన్ కారులో ఇంటికి వస్తున్న సమయంలో రోడ్డు పక్కన ఓ చిన్నారి కనిపించింది. చిన్నవయసులో కూలి పనులు చేస్తూ యజమాని చేత తిట్లు తింటోంది. వెంటనే స్పందించిన జుబీన్ ఆ పాపను అక్కున చేర్చుకున్నారు. తన బిడ్డగా దత్తత చేసుకున్నారు. అనంతరం ఆ పాపకు చదువు, పోషణ బాధ్యతంతా తానే తీసుకున్నారు. ఈ విషయంలో గరిమ ఆయనకు చేదోడుగా నిలిచారు. అలా తమ వద్దకు వచ్చి చేరిన 15 మంది పిల్లల్ని సొంత తల్లిలా పెంచుతున్నారు.

ఇది మాత్రమే కాదు, అస్సామ్ వరదలు వచ్చినప్పుడు బాధితులకు సాయం అందించారు. కోవిడ్ సమయంలో జనాలు ఇబ్బంది పడుతున్నప్పుడు ధైర్యంగా ముందుకొచ్చి, తమ ఇంటినే చికిత్సాలయంగా మార్చారు. ఎంతోమందికి వ్యక్తిగతంగా సాయం అందించారు.

తన కళతోనే కాక, తన మంచి గుణాలతో ప్రజల గుండెల్లో నిలిచిన జుబీన్ లేరన్న విషాద వార్త అందర్నీ కలచివేసింది. మళ్లీ అలాంటి వ్యక్తి పుట్టబోరంటూ ఆయన అభిమానులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఫ్యాషన్



ఫ్యాషన్ రంగంపై ఇష్టంతో చేస్తున్న సాఫ్ట్‌వేర్ జాబ్‌ను వదిలేసి, తనదైన డిజైన్ శైలిని దుస్తులపైన చూపుతున్నారు మాదాపూర్‌లో ఉంటున్న కావ్యారెడ్డి. నేత కార్మికులతో కలిసి వింటేజ్, క్రియేటివ్ డిజైన్స్‌ని రూపొందిస్తున్నారు. వారి జీవనశైలిపైన డాక్యుమెంటరీ రూపొందించారు. చిత్రకారిణిగా, శాస్త్రీయ నృత్యకారిణిగా, యోగా ట్రైనర్‌గానూ రాణిస్తున్న కావ్య ఈ రంగంలో ఎదురయ్యే సవాళ్లనూ, వాటిని తాను ఎదుర్కొంటున్న తీరును ఇలా వివరించారు.

ప్రతిదీ యుద్ధమే!

నవశక్తి



కావ్యారెడ్డి

"చిన్నప్పటి నుంచి ఫ్యాషన్ రంగం అంటే చాలా ఇష్టం. ఫ్యాషన్‌ని కెరీర్‌గా మార్చుకోవాలని చాలా ప్రయత్నించాను. కానీ, బీటెక్ అయ్యాక సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగిగా మారిపోయాను. నా సొంత సంపాదనతో డిజైనింగ్ రంగంలోకి రావాలని ఆలోచన. దాంతో ఉద్యోగిగా ఉన్నా నాదైన సొంత డిజైన్స్‌ను ప్లాన్ చేస్తూనే ఉన్నాను. ఉద్యోగినిగా మంచి పొజిషన్‌లో ఉన్నా అది మానేసి, ఫ్యాషన్ కాలేజీలో స్టూడెంట్‌గా జాయిన్ అయ్యాను. కోర్సు పూర్తయ్యాక ఒక ఫ్యాషన్ కంపెనీలో ఉద్యోగినిగా చేరి, కమర్షియల్‌గా మన ఆలోచనలను ఎలా తీసుకువెళ్లాలో నేర్చుకున్నాను. కెమెరా, గ్రాఫిక్స్, డిజిటల్ మార్కెటింగ్.. ఇవన్నీ నేర్చుకొని మూడేళ్ల క్రితం 'సఖ్య' పేరుతో నా సొంత బ్రాండ్‌ను ప్రారంభించాను.

రీల్.. రియల్..

కాబోయే వధూవరుల డ్రెస్సింగ్‌కి మా డిజైన్ స్టూడియోకి వస్తారు. వారి స్కిన్ టోన్, హైట్.. దృష్టిలో పెట్టుకొని వివిధ రకాల మోడల్ డ్రెస్సులతో మా దగ్గరే ఒక ర్యాంప్‌వాక్ చేయిస్తాను. దానిని కెమెరాలో రికార్డ్ చేసి, ఇస్తాను. అదేవిధంగా రియల్‌గా ఎలా ఉన్నారో 3 మిర్రర్ కాన్సెప్ట్‌తో చూపిస్తాను. దీంతో సరైన ఫిటింగ్, డిజైన్, కలర్.. ఇవన్నీ చూసుకొని వారు సంతృప్తి చెందితేనే డిజైన్ చేసి ఇస్తాను.

మన చేనేతలు

గద్వాల్, పోచంపల్లి, ధర్మవరం.. ఒక్కో హ్యాండ్లూమ్‌కి సంబంధించి పది చీరలు స్పెషల్‌గా డిజైన్ చేస్తాను. వాటి ప్రింట్లు, డిజైన్ ప్రత్యేకంగా క్రియేట్ చేస్తాను. చేనేత కారుల జీవన విధానంపైన డాక్యుమెంటరీ చేశాను. వారిలో ఎంతో సృజన ఉంది. అయితే వారు చెప్పేదేమంటే– 'మేం మా ప్రాణం పెట్టి రోజులు, నెలలు కష్టపడి ఒక చీర డిజైన్ చేస్తాం. అలాంటిదే నార్త్ నుంచి రెప్లికాలు తెచ్చి, మా జీవనోపాధిని దెబ్బ తీస్తున్నారు' అనే బాధను వ్యక్తం చేశారు.

మరిన్ని డిజైన్ల కోసం..

ఆర్గానిక్ వైట్ క్లాత్ తీసుకొని, ఆర్గానిక్ డైస్‌తో మా ప్రత్యేకమైన డిజైన్స్ వేయిస్తాను. వాటిని డెవలప్ చేసి, ఆ డిజైన్స్‌ని ఉపయోగిస్తాం. డిజైన్‌కి రెప్లికా లేకుండా చూడటమే మా ప్రత్యేకత. సినీతారలు, అవార్డు ఫంక్షన్లకు నా డిజైన్స్ వెళుతుంటాయి. ఫ్యాషన్ కాలేజీలలో గెస్ట్ లెక్చర్స్ ఇవ్వడం, ట్రెనింగ్ ఇవ్వడమూ చేస్తుంటాను. ఈ రంగంలో చూపుతున్న ప్రతిభకు అవార్డులూ అందుకున్నాను.

వచ్చిన ఆర్డర్‌ను టైమ్ ప్రకారం ఇవ్వడం ఒక పెద్ద టాస్క్. దీంట్లో మెటీరియల్, వర్కర్స్, డబ్బును తిరిగి రాబట్టుకోవడం, మెయింటెనెన్స్... ప్రతిదీ యుద్ధమే. స్త్రీ ఎదగాలని చేసే ప్రతి ప్రయత్నంలో అన్నింటా అడ్డంకులు ఉంటాయి. ఇన్నింటిలో నా సొంత ఆసక్తులను వదలుకోను. పెయింటింగ్స్ వేస్తుంటాను. శాస్త్రీయ నృత్యంలో సాధన చేస్తుంటాను. యోగా ట్రైనర్‌గా క్లాసులు తీసుకుంటాను'' అంటూ ఈ జీవన యుద్ధంలో తన పోరాట పటిమను పెంచుకుంటున్న తీరును వివరించారు ఈ డిజైనర్.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

● ఎంపవర్‌మెంట్

ఒంటరి సైన్యం



నిర్మల్ చందేల్

పెళ్లైన రెండు సంవత్సరాలకే నిర్మల్ చందేల్ భర్త చనిపోయాడు. హిమాచల్ ప్రదేశ్‌లోని మండీకి చెందిన నిర్మల్‌కు ఒకవైపు తట్టుకోలేని దుఃఖం, మరో వైపు ఎన్నో ఆంక్షలు. నిర్మల్ అలంకరించుకోవడానికి లేదు. కొత్త దుస్తులు ధరించడానికి లేదు. బయటికి వెళ్లడానికి లేదు. ఉత్సవాలు, వేడుకలలో పాల్గొనడానికి లేదు. ఆంక్షల వల్ల తనలో విషాదం మరింత ఎక్కువ అయింది. కొంతకాలానికి ఆమె పుట్టింటికి వెళ్లింది. కాస్త ఉపశమనంగా అనిపించింది. సోలన్ జిల్లాలోని ఒక స్వచ్ఛంద సంస్థలో అకౌంటెంట్‌గా చేరింది. ఉచిత భోజనంతో పాటు వసతి సౌకర్యం కూడా ఉండేది. అక్కడ తనలాగే ఎంతోమంది ఒంటరి మహిళలు ఉంటున్నారు. వారు కూడా తనలాగే ఎన్నో బాధలు అనుభవించారు. చిన్న వయసులోనే భర్తను కోల్పోయారు.

ఏక్లా నారీ శక్తి సంఘటన్ (ఇఎన్ఎస్ఎస్) అనే స్వచ్ఛంద సంస్థ హిమాచల్‌ప్రదేశ్ చాప్టర్‌కు ప్రాతినిధ్యం వహించడంతో నిర్మల్ జీవితం కొత్త మలుపు తీసుకుంది. ఈ చాప్టర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 19,445 సభ్యులు ఉన్నారు. 1999లో 350 మంది ఒంటరి మహిళలతో జైపూర్‌లో ప్రారంభమైన ఏక్లా నారీ శక్తి సంఘటన్‌లో ఇప్పుడు ఎనిమిది రాష్ట్రాలలో 2,50,000 మంది మహిళలు ఉన్నారు. రాజస్థాన్‌లో అత్యధిక సంఖ్యలో 1,02,000 మంది సభ్యులు ఉన్నారు. సభ్యులు ఆర్థికంగా సొంత కాళ్లమీద నిలబడేలా చేయడం నుంచి వారి ఆరోగ్య సంరక్షణ వరకు ఎన్నో విషయాలలో కృషి చేస్తోంది ఏక్లా నారీ శక్తి సంఘటన్. మన దేశంలో ఒంటరి మహిళల (సింగిల్ ఉమెన్) సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఒంటరి మహిళల సంఖ్య 2011లో 51.2 మిలియన్‌లు ఉండగా 2024కు 71.4 మిలియన్‌లకు చేరింది.

● సమ్‌థింగ్ స్పెషల్

ఎంత వింత నోబెల్!



వికాస్ కుమార్

సర్తక్ మిట్టల్

ఆవుకు కంచర గాడిదలా చారలు వేసి 'దీనివల్ల ఉపయోగం ఏమిటో తెలుసా' అని చెప్పిన వారికి, పాదరక్షలు దుర్వాసన వేయకుండా 'యూవీ-షూ ర్యాక్స్' డిజైన్ చేసిన వారికి, పిజ్జాలను ఇష్టంగా తినే బల్లుల గురించి చెప్పిన పరిశోధకులకు నోబెల్ బహుమతులు వరించాయి. అయితే ఇవి ఉత్తుత్తి నోబెల్ బహుమతులు. చమత్కార, విచిత్ర ఆవిష్కరణలకు ఇచ్చే ఐజీ నోబెల్ బహుమతులు.

దుర్వాసన వల్ల ఇబ్బంది ఏమిటో అందరికీ తెలుసు. ఆ దుర్వాసనే ఇద్దరు భారతీయులకు ఐజీ నోబెల్ బహుమతి తీసుకువచ్చింది. కాలేజీ క్యాంపస్‌లో క్లాసురూమ్ బయట షూస్ కుప్పలు తెప్పలుగా పడి ఉండేవి. వాటి నుంచి దుర్వాసన వచ్చేది. దీనికి పరిష్కార మార్గం కనిపెట్టాలని అనుకున్నాడు సర్తక్ మిట్టల్. తన ప్రొఫెసర్ వికాస్ కుమార్ (శివ్ నాడర్ యూనివర్సిటీ)తో కలిసి పరిశోధనలు మొదలు పెట్టాడు. ఎట్టకేలకు తమకు ఉన్న మైక్రోబయోలజీ, ఇంజనీరింగ్ జ్ఞానాన్ని ఉపయోగించి యూవీ ల్యాంప్స్‌తో ఫుట్‌వేర్‌ను శానిటైజ్ చేసే ర్యాక్‌ను తయారు చేశారు. వారి కృషికి గుర్తింపుగా వినూత్నమైన శాస్త్రీయ ఆవిష్కరణలకు ఇచ్చే ఐజీ నోబెల్ ప్రైజ్ వచ్చింది.

'పులి చారలు వేసుకున్నంత మాత్రాన నక్క పులి కాదు' లాంటిదే 'నల్లటి చారలు వేసుకున్నంత మాత్రాన ఆవు జడలబర్రె కాదు' అనేది సామెత. అయితే మాత్రం ఏమిటి? ఆ తెలుపు, నలుపు చారలే జపాన్ పరిశోధక బృందానికి ఐజీ నోబెల్ బహుమతిని తీసుకువచ్చాయి. బహుమతి సరే, ఇంతకీ ఆ చారల వల్ల ఉపయోగం ఏమిటి? అనే విషయానికి వస్తే...

సదరు నలుపు, తెలుపు చారల వల్ల ఆవులకు దోమలు కుట్టవని పరిశోధనాత్మకంగా కనిపెట్టారు ఆవిష్కర్తలు. ఈ చారలు దోమలమందుకు ప్రత్యామ్నాయంగా చెప్పుకోవచ్చు. 'ఆవులకు రంగు వేయడం వల్ల దోమలు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించవచ్చు' అంటున్నారు పరిశోధకులలో ఒకరైన టోమోకి కోజిమా.

ఆఫ్రికాలోని టోగో దేశంలో రెయిన్‌బో లిజార్డ్స్ పన్నీర్ పిజ్జాలను తినడానికి ఇష్టపడుతున్నాయని కనిపెట్టిన రోగెర్ మీక్‌కు, మద్యపానం చేయడం ఒక వ్యక్తి విదేశీ భాష మాట్లాడడాన్ని మెరుగుపరుస్తుందని తెలియజేసిన మ్యాట్ ఫీల్డ్ బృందానికి, తన వేలి గోరు పెరుగుదలను 35 సంవత్సరాల పాటు రికార్డ్ చేసి, విశ్లేషించిన విలియం బీన్‌కు. తాత్కాలిక నార్సిజానికి (తనను తాను గొప్పగా, ప్రత్యేకంగా భావించుకునే), హై ఐక్యూకు స్కోర్‌కు సంబంధం ఉంటుందని చెబుతున్న మార్కిన్, జిల్స్ గిగ్నాక్‌కు, తల్లి వెల్లుల్లి తింటే ఆ తల్లి పాలు తాగే శిశువు పొందే అనుభూతి గురించి పరిశోధించిన జూలీ మెనాల్లా, గ్యారీ బియోచాంప్‌లకు, టెఫ్లాన్ అనే ప్లాస్టిక్‌ను తినడంపై చేసిన విశ్లేషణకు రోటెమ్, డేనియల్‌లకు ఐజీ నోబెల్ బహుమతులు ఇచ్చారు.

అలా మొదలైంది...

ఐజీ నోబెల్ ప్రైజ్‌ను మొదట్లో తేలిగ్గా తీసుకునేవారు. నవ్వుకునేవారు. ఆ తరువాత మాత్రం ఐజీ నోబెల్‌కు ప్రాధాన్యత పెరిగింది. సైన్స్ హ్యూమర్ పత్రిక 'అనల్స్ ఆఫ్ ఇంప్రాబబుల్' 1991లో తొలిసారిగా ఐజీ నోబెల్ బహుమతులు ఇచ్చే సంప్రదాయాన్ని ప్రారంభించింది. జీవశాస్త్రం, రసాయనశాస్త్రం, ఇంజనీరింగ్ డిజైన్, భౌతికశాస్త్రం... మొదలైన విభాగాలలో ఈ బహుమతులు ఇస్తారు. బోస్టన్(యూఎస్)లో విజేతలకు బహుమతులు ఇస్తారు. నిజమైన నోబెల్ గ్రహీతలు విజేతలకు బహుమతులు ఇస్తారు. ఈ సంవత్సరం ఐజీ నోబెల్ థీమ్: జీర్ణక్రియ. గెస్ట్ స్పీకర్‌లలో ఒకరైన త్రిషా ప్రస్రిచా టాయిలెట్‌లలో స్మార్ట్‌ఫోన్‌లను ఉపయోగించడం వల్ల కలిగే నష్టాల గురించి పరిశోధించారు. ఐజీ నోబెల్ అవార్డ్‌లలో మన దేశానికి స్ట్రాంగ్ రికార్డ్ ఉంది.

● జీవన తత్వం

ఓ బామ్మ... ఒబామా



అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇటీవల 102 సంవత్సరాల వృద్ధురాలిని కలుసుకున్నాడు.

'మిమ్మల్ని చూడడం అద్భుతంగా ఉంది' అని ఆమెతో సంభాషణ మొదలుపెట్టాడు ఒబామా.

'మీలాంటి అద్భుత వ్యక్తులను చూడడం నాకు కూడా చాలా సంతోషంగా ఉంది' అని బదులిచ్చింది బామ్మ.

'ఈ వయసులోనూ మీరు చురుగ్గా ఎలా ఉండగలుగుతున్నారు?'

'మీ ఆహారపు అలవాట్లు ఏమిటి?'

'ఇలా ఉండడానికి కారణం జీన్స్ ప్రభావమా? లేక ప్రత్యేకమైన ఆరోగ్య జాగ్రత్తలు ఏమైనా తీసుకునేవారా?'

... ఇలాంటి ప్రశ్నలకు నవ్వుతూ, ఓపికగా సమాధానం ఇచ్చింది బామ్మ.

'ఇంట్లో వండిన పదార్థాలనే తింటాను' అని ఒకటికి రెండుసార్లు చెప్పింది.

ఆమె సమాధానాలకు ఒక రూపం ఇస్తే... అందులో మినియేచర్ లైఫ్ ఫిలాసఫీ కనిపిస్తుంది.

'ఒడిదొడుకులు లేకుండా స్థిరంగా ఉండాలి. మేలు చేసే ఆహారాన్ని ఇష్టపడాలి. ఈ క్షణాన్ని వృథా చేయవద్దు అన్నట్లు ప్రతి క్షణాన్ని ఆస్వాదించాలి. ఆనందించాలి'

'సుసాన్, 102 ఏళ్ల వయసులోనూ నేను మీలాగే ఉండాలని కోరుకుంటున్నాను' అనే కాప్షన్‌తో బరాక్ ఒబామా 'ఎక్స్'లో చేసిన పోస్ట్‌కు మిలియన్‌ల కొద్దీ వ్యూస్ వచ్చాయి.

● హెయిర్ కేర్

కేశసంపద కోసం...



వారంలో మూడుసార్లు తప్పనిసరిగా తలస్నానం చేయాలి. ఈ మూడుసార్లూ తలస్నానం చేసే ముందురోజు రాత్రి కుదుళ్లకు పట్టేలా ఆముదంతో పది నిమిషాల పాటు మర్దనా చేయాలి. మరుసటిరోజు ఉదయం తలకు పెరుగు పట్టించి, తలస్నానం చేయాలి. అలాగే వారంలో రెండవసారి తల స్నానానికి ముందు తలకు నిమ్మరసం అప్లై చేసి తలస్నానం చేయాలి. అదేవిధంగా వారంలో మూడవసారి తలస్నానం చేసేముందు కొబ్బరి నూనె తలకు పట్టించి తలస్నానం చేయాలి. ఇలా వారంలో మూడుసార్లు ఈ జాగ్రత్తలు తీసుకోవడం వల్ల జుట్టు రాలడాన్ని అరికట్టవచ్చు.

● బొమ్మల కొలువు



అద్దేపల్లి లిఖితశ్రీ, హైదరాబాద్

మీరు బొమ్మల కొలువు పెట్టారా?

దసరాకు మీరు బొమ్మల కొలువు పెట్టారా? అయితే ఆ బొమ్మల కొలువుతో ఒక సెల్ఫీ తీసుకుని ఊరు, పేరు రాసి ఈ కింది చిరునామాకు మెయిల్ చేయండి. మాకు అందిన వాటిలో బాగున్న వాటిని ఫ్యామిలీలో ప్రచురిస్తాం.


sakshibommalakoluvu@gmail.com

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
సెప్టెంబర్ 25న ముగింపు ధరలలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,18,910	1,16,150	1,14,440	1,16,150	1,18,000	1,14,650
బంగారం (22 క్యారెట్లు)	1,11,110	1,04,900	1,04,900	1,08,050	1,08,560	1,05,100
వెండి	1,42,500	1,38,300	1,50,000	1,38,300	1,39,900	1,50,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 22 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 186
శుక్రవారం 26-9-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



ఇక గ్రూప్-2,3 నియామకాలు!
వేగవంతంగా ఉద్యోగ నియామకాలు పూర్తి చేసేలా టీజీపీఎస్సీ కసరత్తు -17లో



భారత్‌లో సౌర వెలుగులు
27 వేల చదరపు కి.మీ. బంజరు భూమిలో ప్యానెళ్ల ఏర్పాటుకు చాన్స్ -16లో



రైలు నుంచి అగ్ని వర్షం
ఇంటర్మీడియట్ రేంజ్ అగ్ని-ప్రైమ్ క్షిపణిని రైలు ఆధారిత మొబైల్ లాంచర్ నుంచి డీఆర్‌డీఓ విజయవంతంగా పరీక్షించింది.
వివరాలు 6లో ▸



ఆ '3 విధ్వంసాల'పై...
ఐరాసలో తనకు ఎదురైన ఘటనలపై లోతుగా దర్యాప్తు జరపాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ డిమాండ్ చేశారు.
వివరాలు 6లో ▸



సిరిసిల్ల కలెక్టర్ తీరు ఆక్షేపణీయం
నిర్వాసితురాలిపై క్రిమినల్ కేసు పెట్టి సిరిసిల్ల జిల్లా కలెక్టర్ చట్ట నియమాలను ఉల్లంఘించారని హైకోర్టు మండిపడింది.
వివరాలు 5లో ▸



మూడు రోజులు భారీ వర్షాలే..
రానున్న మూడు రోజులు పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ హెచ్చరించింది.
వివరాలు 7లో ▸

2,620 వైన్‌షాపులకు నోటిఫికేషన్



రాష్ట్రంలో వచ్చే రెండేళ్లకు కొత్త మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలో 2,620 మద్యం దుకాణాలకు ఈ నెల 26 నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులను స్వీకరించనుంది. దరఖాస్తు రుసుమును రూ. 3 లక్షలుగా నిర్ణయించారు. 5లో

ఇదండీ సంగతి



తెలంగాణలోనూ సీఎం బ్రేక్‌ఫాస్ట్


చెన్నైలో సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్

వచ్చే ఏడాది నుంచి పథకం అమలు చేస్తాం: సీఎం రేవంత్

- తమిళనాడులో ఈ పథకం నా హృదయాన్ని తాకింది
- కరుణానిధి స్ఫూర్తితో స్థానిక ఎన్నికల్లో 69 శాతం రిజర్వేషన్లు
- ఓబీసీలకు 42 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 27 శాతం అమలు
- చెన్నైలో 'విద్యలో ముందంజలో తమిళనాడు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్

తమిళనాడులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో అమలు చేస్తున్న 'సీఎం బ్రేక్‌ఫాస్ట్'పథకం తన హృదయాన్ని తాకిందని, వచ్చే ఏడాది నుంచి తెలంగాణలో కూడా ఈ పథకాన్ని ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తమిళనాడు ప్రభుత్వ ఆహ్వానం మేరకు చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన 'విద్యలో ముందంజలో తమిళనాడు'కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. అన్నాదురై, కరుణానిధి, కామరాజ్ వంటి గొప్ప యోధులు జన్మించిన రాష్ట్రం తమిళనాడు అని కొనియాడారు. కరుణానిధి విజన్‌ను స్టాలిన్, ఉదయనిధి అమలుచేస్తున్నారని అభినందించారు. 'మేం కరుణానిధిని స్ఫూర్తిగా తీసుకున్నాం. మా రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు 42 శాతం.. ఎస్సీ, ఎస్టీలకు 27 శాతం.. మొత్తంగా 69 శాతం రిజర్వేషన్లు ఇవ్వబోతున్నాం'అని వెల్లడించారు. ఎన్నో శతాబ్దాల నుంచి తమిళ, తెలుగు రాష్ట్రాలు, ప్రజల మధ్య సాంస్కృతిక, చారిత్రకంగా బలమైన సంబంధం ఉందని గుర్తుచేశారు. సామాజిక న్యాయం అమలులో తమిళనాడు, తెలంగాణ మధ్య సారూప్యతలున్నాయని
మిగతా 8వ పేజీలో ▶

'చిరు'.. ఎవడు?

అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు


- పరిశ్రమ పెద్దలు మాజీ సీఎం జగన్‌ను కలిసిన సందర్భంగా 'గట్టిగా ఎవడూ..' అడగలేదంటూ చిరంజీవినుద్దేశించి వ్యాఖ్య
- మాజీ సీఎం వైఎస్ జగన్‌పైనా బాలకృష్ణ పరుష వ్యాఖ్యలు
- వెంటనే బాలయ్య వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన చిరంజీవి..
- అమెరికా నుంచి ప్రకటన విడుదల
- జగన్ తనను సాదరంగా భోజనానికి ఆహ్వానించి గౌరవించారన్న మెగాస్టార్
- నాడు తాము చర్చించిన మీదటే వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య సినిమా టికెట్‌రేట్లు పెంచారన్న చిరంజీవి..





సాక్షి, అమరావతి: ఏపీ శాసనసభ వేదికగా మెగాస్టార్ చిరంజీవిని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దారుణంగా అవమానించారు. చిరంజీవిని ఉద్దేశించి 'ఎవడు..?'అంటూ తూలనాడుతూ తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. గురువారం అసెంబ్లీలో శాంతి భద్రతల అంశంపై చర్చ సందర్భంగా ఈ దృశ్యం చోటు చేసుకుంది. కాగా అసెంబ్లీలో బాలయ్య చేసిన వ్యాఖ్యలను విదేశాల్లో ఉన్న చిరంజీవి తీవ్రంగా ఖండించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ నాడు తనను సాదరంగా భోజనానికి ఆహ్వానించి గౌరవించారని గుర్తు చేసుకున్నారు. ఆ తరువాత కొద్దిరోజులకు సినీ ప్రముఖులతో కలసి మరోసారి వైఎస్ జగన్ నివాసానికి వెళ్లి పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయనతో చర్చించానని పేర్కొన్నారు. నాడు.. వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య సినిమా టికెట్ రేట్లు పెంచడానికి ఆ సమావేశమే కారణమైందని స్పష్టం చేశారు. ఇక మాజీ సీఎం వైఎస్ జగన్ పేరును పరోక్షంగా ప్రస్తావిస్తూ వాడు.. వీడు.. సైకో..! అంటూ బాలకృష్ణ దుర్భాషలాడటాన్ని బట్టి ఆయన మానసిక స్థాయిపై మరోసారి సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.
- వివరాలు 14లో ▶

'ఓజీ'తో ప్రజలకు ఒరిగేదేముంది?



- టికెట్ల ధర పెంపుపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు.. రూ.800 వెచ్చించి ఎందుకు టికెట్ కొనాలి?
- ప్రజలను అడిగి సినిమా తీశారా?
- పవన్ కల్యాణ్ సినిమా టికెట్ల ధరల పెంపుపై ఫైర్.. సింగిల్ జడ్జే నిర్ణయిస్తారన్న డివిజన్ బెంచ్ -2లో

ఎన్నికలే ఎజెండా..

పార్టీ నేతలతో కేసీఆర్ భేటీ

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక పోరుపై దిశానిర్దేశం
- జిల్లా నేతలతో కేటీఆర్, హరీశ్‌రావు టెలికాన్ఫరెన్స్.. బతుకమ్మ ద్వారా సర్కారును ఎండగట్టాలని ఆదేశం

8లో





App Store Google play
ఇక్కడ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి.
376 నాణ్యతా చెక్ పాయింట్లు
ధృవీకరించబడిన కారు వివరాలు*
1 సంవత్సరం వరకు వారంటీ మరియు 3 ఉచిత సేవలు*
*నియమాలు మరియు షరతులు వర్తిస్తాయి. Verified Car History మరియు Warranty కేవలం True Value చే ధృవీకరించబడిన కార్లపై మాత్రమే వర్తిస్తుంది. ఉచిత సేవలు లేబర్ ఛార్జీలపై మాత్రమే వర్తిస్తాయి. గ్లాస్ పై నలుపు ఛాయలు లైటింగ్ ప్రభావం వలన కలిగింది. ఉపయోగించిన చిత్రాలు కేవలం ఉదాహరణ లక్ష్యాలు కోసం మాత్రమే.
సందేహాలు కోసం 1800 102 1800కి కాల్ చేయండి | లేదా www.marutisuzukitruevalue.comని సందర్శించండి.
TRUE VALUE CERTIFIED
HYDERABAD: SECUNDERABAD, AUTOFIN: QUTHBULLAPUR: 8885040011, 9177922446 | MADHAPUR, GEM : 9912458000 | KALYANI MOTORS, KARMANGHAT: 9100102763, 9100114822 | TELLAPUR: 9063126501 | MEDIPALLY, HIMAYATNAGAR MITHRA: 7799886249 | NACHARAM: 7386780127 | SOMAJIGUDA, RKS: 9848866685 | MALAKPET, RKS: 9866819121 | KUSHAIGUDA RKS: 9542117795 | KOMPALLY, RKS: 9666693008 | BACHUPALLY, SAI SERVICE: 9160851515 | GACHIBOWLI, JAYABHERI AUTOMOTIVES: 9281105826 | HAYATNAGAR, JAYABHERI: 9100084455 | GOPANPALLE, JAYABHERI: 7799711226 | VARUN MOTORS - VANASTHALIPURAM: 7995024736, 7995052292 | BEGUMPET: 9100367806 | MADINAGUDA: 9052225052 | HABSIGUDA: 9052379797 | B.N.REDDY NAGAR: 9347068721, 9154855369 | BANJARAHILLS: 9989474453| RAMPALLY: 7995024745 | NIZAMPET: 9052225052| GACHIBOWLI: 8639880054 | ISNAPUR: 9966704555, SERILINGAMPALLY - PAVAN MOTORS: 8374459192 | SHAMSHABAD, ADARSHA AUTOMOTIVE: GURAMGUDA: 8297046633 | TRIMULGHERRY, ACER: 9154073240 | OLD ALWAL, ADARSHA AUTO WORLD: 6309888308, 9133665616.

క్లుప్తంగా...

దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల దోషికి మరణశిక్ష నిలిపివేత

హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే



న్యూఢిల్లీ: సంచలనం సృష్టించిన దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో దోషిగా తేలిన ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాదికి తెలంగాణ హైకోర్టు విధించిన మరణశిక్షపై సుప్రీంకోర్టు స్టే విధించింది. 2013 నాటి జంట పేలుళ్లలో 18 మంది మరణించగా, 131 మంది తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ కేసులో దోషి అయిన ఉగ్రవాది అసదుల్లా అక్తర్ మరణశిక్షపై దాఖలుచేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్‌మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజరియా ధర్మాసనం గురువారం విచారించింది. అక్తర్‌కు హైకోర్టు విధించిన మరణశిక్ష అమలుపై స్టే విధిస్తున్నామని పేర్కొంది. అక్తర్‌తోపాటు నిషేధిత ఉగ్రసంస్థకు చెందిన ఐదుగురు ఉగ్రవాదులకు తెలంగాణ హైకోర్టు గత ఏప్రిల్‌లో మరణశిక్ష విధించింది. ఢిల్లీ జైల్లో ఉన్న అక్తర్ ఈ తీర్పును సవాల్‌చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జైల్లో ఆయన ఏ పని చేశారు, ఆయన ప్రవర్తన ఎలా ఉందో పూర్తి వివరాలతో 8 వారాల్లోగా నివేదిక ఇవ్వాలని జైలు సూపరింటెండెంట్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. అక్తర్ మానసిక పరిస్థితిపై ప్రభుత్వ వైద్యుడితో తనిఖీ చేయించి నివేదిక ఇవ్వాలని పేర్కొంది. తదుపరి విచారణను 12 వారాలకు వాయిదా వేసింది.

అమరవీరుల సంస్మరణదినం ఏర్పాట్లపై డీజీపీ సమీక్ష

అధికారులకు పలు సూచనలు



సాక్షి, హైదరాబాద్: ప్రతి ఏడాది అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ అమరవీరుల సంస్మరణదినం ఏర్పాట్లపై డీజీపీ డా.జితేందర్ సమీక్షించారు. గురువారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఇంటెలిజెన్స్ డీజీ బి.శివధర్‌రెడ్డి, అడిషనల్ డీజీలు మహేశ్ భగవత్, అనిల్‌కుమార్, చారుసిన్హా, సంజయ్ కుమార్ జైన్‌తో కలిసి పోలీసు అధికారులకు డీజీపీ పలు సూచనలు ఇచ్చారు. పోలీస్ సంస్మరణ దినం సందర్భంగా పోలీస్ అమరవీరుల వివరాలతో కూడిన పుస్తకాన్ని ముద్రించాలని, హోర్డింగ్స్, బ్యానర్లు, పోస్టర్లు ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో ఓపెన్ హౌస్‌లు నిర్వహించాలని, సీసీటీవీల ప్రాధాన్యత, షీ టీమ్స్, భరోసా కేంద్రాలపై అవగాహన కల్పించాలని, ప్రజలతో స్నేహపూర్వక పోలీసింగ్‌ను కొనసాగించాలన్నారు. విద్యార్థులకు, పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించాలని, అమరులైన పోలీసు కుటుంబ సభ్యులను పోలీస్ అధికారులు కలవాలని, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో హైదరాబాద్ సిటీ అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి, ఐజీలు ఎం.రమేశ్, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు, తఫ్సీర్ ఇక్బాల్, ఏఐజీలు రమణ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు దసరా సెలవులు

ఈనెల 27 నుంచి అక్టోబర్ 4 వరకు..

సాక్షి, హైదరాబాద్: దసరా పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు ఈనెల 27 నుంచి అక్టోబర్ 4వ తేదీవరకు సెలవులను ప్రకటించింది. ఈ కేంద్రాలకు వరుసగా ఎనిమిది రోజుల పాటు సెలవులు ఇచ్చామని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల విజ్ఞప్తి మేరకు దసరా సెలవులు మంజూరు చేసినట్లు వివరించారు. కాగా, టుక్ హోమ్ రేషన్ విధానంలో లబ్ధిదారులకు పోషకాహారాన్ని అందజేయాలని మంత్రి సూచించారు. అంగన్‌వాడీల చరిత్రలో మొదటిసారిగా దసరా సెలవులు ఇస్తున్నట్లు తెలిపారు. దసరా సెలవులు మంజూరు చేయాలని అన్నపూర్ణ తదితర ప్రతినిధులు ఇప్పటికే మంత్రిని ప్రత్యేకంగా కలసి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క సెలవులు ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

సాక్షి
మీకు సాక్షి
దినపత్రిక అందడంలో
ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి
బదులుగా ఇతర దినపత్రికలు
వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు
ఉ. 7.00 గం.ల నుండి
రా. 8.00 గం.ల లోపు
తెలుపగలరు. వెంటనే తగిన
చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం
1800 425 9899

హెచ్‌-1బీ వీసా దరఖాస్తు రుసుమును భారీగా పెంచుతూ అమెరికా తీసుకున్న నిర్ణయం ముఖ్యంగా భారతీయులను షాక్‌కు గురి చేసింది. ఒక్క యూఎస్ మాత్రమే కాదు.. భారతీయులు సంప్రదాయకంగా ఉద్యోగాల కోసం తరలివెళ్లే అనేక పాశ్చాత్య దేశాల్లో ఇలాంటి అవరోధాలు ఉన్నాయి. ఈ దేశాలు చరిత్రాత్మకంగా నిపుణుల కొరతను పూడ్చుకోవడానికి, ఆర్థిక వృద్ధిని నడిపించడానికి భారత్, చైనా వంటి దేశాలపై ఆధారపడి ఉన్నాయి. అయితే ఇటీవలి కాలంలో ఆయా పాశ్చాత్య దేశాల్లోని ప్రజల ఆలోచనల్లో మార్పు వచ్చింది. విదేశీ కార్మికుల కంటే సొంత పౌరులకు ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో నైపుణ్యం కల విదేశీ కార్మికులను ప్రోత్సహించకుండా ఉండటానికి తమ వలస విధానాలకు అనుగుణంగా ఆయా దేశాలు మార్పులు చేసుకుంటున్నాయి. అదే సమయంలో అక్రమ, తక్కువ నైపుణ్యమున్న కార్మికులను నిలువరిస్తున్నాయి.

- వలస విధానాలు కఠినతరం చేస్తున్న అనేక దేశాలు
- భారతీయుల విదేశీ ఉద్యోగావకాశాలపై ప్రభావం
- మనవాళ్ల ఆదాయం ఎక్కువ ఉండటమూ కారణమే
- స్థానికుల్లో అసంతృప్తి చల్లబరిచేందుకు ప్రయత్నాలు

విదేశీ గడ్డపై అడ్డంకులు



చట్టబద్ధమైన, అక్రమ వలసదారులపై అమెరికా కఠిన చర్యలను ప్రారంభించక ముందే.. అనేక దేశాలు ఇలాంటి చర్యలు చేపట్టాయి. దీని ఫలితం.. సాధారణంగానే, ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ సంఖ్యలో ఉన్న భారతీయులపై పడింది. ఆయా దేశాలు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడానికి.. ఆర్థిక మందగమనం, ఉపాధి లేకపోవడం వంటి అనేక కారణాలు. కోవిడ్‌–19 మహమ్మారి, పెరుగుతున్న జీవన వ్యయ సంక్షోభం ఈ వలస వ్యతిరేక భావనను మరింత పెంచాయని నిపుణులు అంటున్నారు. యూఎస్, యూకే, ఆస్ట్రేలియా దేశాలు విదేశీ కార్మికుల రాకను కట్టడి చేయడం వల్ల భారతీయులకు అవకాశాలు సన్నగిల్లాయి. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం 2024 నాటికి అత్యధికంగా 54 లక్షల మంది భారతీయులు యూఎస్‌లో నివసిస్తున్నారు. వివిధ దేశాల్లో ఉన్న మొత్తం భారతీయుల్లో వీరి వాటా 15.3%. అలాగే 17 % మంది యూకే, జర్మనీ, కెనడా, ఆస్ట్రేలియా, స్వీడన్‌లలో ఉన్నారు.

– సాక్షి, స్పెషల్ డెస్క్

మనవాళ్ల ఆదాయం ఎక్కువ


కొన్ని ప్రధాన దేశాల్లో నివసిస్తున్న భారతీయుల ఆదాయం స్థానికుల ఆదాయం కంటే అధికంగా ఉంటోంది. తమ దేశంలో ఉంటూ తమ కంటే ఎక్కువ ఆర్జించడం ఆయా దేశాల స్థానికులకు, ముఖ్యంగా యువతకు మింగుడు పడడం లేదన్నది నిపుణుల మాట. యూఎస్ సిటిజన్స్‌తో పోలిస్తే.. అక్కడ ఉంటున్న భారతీయుల ఆదాయం రెండింతలకుపైగా ఉంది. ఆస్ట్రేలియా, జర్మనీల విషయంలో ఇది సుమారు 50 శాతం ఎక్కువ. భారతీయుల వల్ల తమ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయనే కోపం ఒకవైపు.. తమకంటే ఎక్కువ సంపాదిస్తున్నారన్న అసూయ మరోవైపు.. వెరసి ఆస్ట్రేలియా, యూకే వంటి అనేక దేశాల్లో స్థానిక యువత అక్కడున్న భారతీయులపై దాడులు చేస్తున్నారు. 'గో బ్యాక్ టు ఇండియా' అంటూ బహిరంగంగానే మనవాళ్లను హెచ్చరిస్తున్న సంఘటనలు సైతం పెరుగుతూనే ఉన్నాయి.

వలసలు ▶ తగ్గించాలని..

గడిచిన రెండు సంవత్సరాలలో వలసలను తగ్గించేందుకు పాశ్చాత్య దేశాలు అనేక నిర్ణయాలు తీసుకున్నాయి.

- **యూఎస్:** కొత్త హెచ్‌–1బీ వీసా దరఖాస్తుకు 1,00,000 డాలర్ల వన్‌–టైమ్ ఫీజు అమలులోకి తెచ్చింది.
- **యూకే:** వర్క్ పర్మిట్ కోసం కనీస వేతన పరిమితిని 38,700 పౌండ్స్ నుంచి 2025 జూలైలో 41,700 పౌండ్స్‌కు పెంచింది.
- **స్వీడన్:** వర్క్ పర్మిట్ కోసం కనీస జీతం పరిమితి 2023 అక్టోబర్ నుంచి రెండింతలకుపైగా అధికమై 29,680 క్రోనర్లకు (ఆ దేశ కరెన్సీ. ఒక క్రోనా సుమారు రూ.9.37) చేరింది.
- **కెనడా:** 2025లో విద్యార్థులు, కార్మికుల దరఖాస్తుల అనుమతిని 10–16% తగ్గించాలన్నది ప్రణాళిక.
- **ఆస్ట్రేలియా:** 2025 నాటికి నికర వలసలను సగానికి తగ్గించే ప్రయత్నంలో భాగంగా 2023–24లో విద్యార్థి వీసాల జారీని 34% తగ్గించారు.

భారతీయులకు జారీ అయిన వర్క్ వీసాలు



'ఓజీ'తో ప్రజలకు ఒరిగేదేముంది?

టికెట్ల ధర పెంపుపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

- రూ.800 వెచ్చించి ఎందుకు టికెట్ కొనాలి?
- ప్రజలను అడిగి సినిమా తీశారా?
- పవన్ కల్యాణ్ సినిమా టికెట్ల ధరల పెంపుపై ఫైర్
- సింగిల్ జడ్జే నిర్ణయిస్తారన్న డివిజన్ బెంచ్



సాక్షి, హైదరాబాద్: ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నటించిన 'ఓజీ' చిత్రంతో ప్రజలకు ఒరిగేది ఏముందని, టికెట్ ధర పెంచితే ఎందుకు కొనాలని ప్రభుత్వాన్ని, డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌ను హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ప్రశ్నించింది. రూ.వందల కోట్లతో చిత్ర నిర్మాణం చేపట్టే ముందు.. కొందరికి మాత్రమే రూ.కోట్లు ఇచ్చే ముందు ప్రజల అనుమతి తీసుకున్నారా అని నిలదీసింది. మీ ఇష్టం వచ్చినట్లు సినిమా తీసి వందల కోట్లు ఖర్చు చేశాం.. ప్రజలు కూడా వందలకు వందలు వెచ్చించి కొనాల్సిందేనని భావించడం సమర్థనీయం కాదంది. శుక్రవారం (26న) మరోసారి వాదనలు విని నిర్ణయం తీసుకోవాలని సింగిల్ జడ్జిని కోరుతున్నామని డివిజన్ బెంచ్ పేర్కొంది. సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని తేల్చిచెబుతూ అప్పీల్‌లో విచారణ ముగించింది.

సింగిల్ జడ్జి తీర్పుపై అప్పీల్

వచ్చే నెల 4 వరకు ఓజీ సినిమా టికెట్ ధరలు పెంచుతూ, ప్రత్యేక షోలకు అనుమతిస్తూ ప్రభుత్వం మెమో జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది బర్ల మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి మెమోను నిలిపివేశారు. తదుపరి విచారణ వచ్చే నెల 9కి వాయిదా వేశారు. సింగిల్ జడ్జి తీర్పుపై డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ హైకోర్టులో డివిజన్ బెంచ్ వద్ద అప్పీల్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అప్పీలెంట్ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్‌దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. సింగిల్ జడ్జి తదుపరి విచారణ వచ్చే నెల 9కి వాయిదా వేశారని, మెమో గడువు 4వ తేదీతో ముగుస్తుందన్నారు. ఆ తర్వాత విచారణతో అప్పీలెంట్‌కు ప్రయోజనం ఉండదన్నారు. పిటిషనర్‌కు కలిగింది రూ.100 నష్టం మాత్రమేనని, అది డిపాజిట్ చేస్తామన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుని రూ.100 కాదు.. రూ.100 కోట్లు డిపాజిట్ చేయండి అని అడిగింది. పిటిషనర్ దాఖలు చేసింది పిల్ కాదని, రిట్ పిటిషన్‌లో ప్రజా ప్రయోజనాలు కోరలేదని అవినాశ్ దేశాయ్ చెప్పారు. రిట్ పిటిషనర్ తరఫున న్యాయవాది విజయ్‌గోపాల్ వాదనలు వినిపిస్తూ.. మెమో జారీ చేసే అధికారం హోంశాఖ ముఖ్య కార్యదర్శికి లేదన్నారు. కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లకు మాత్రమే ఆ అధికారం ఉందన్నారు. గతంలో సినిమా టికెట్లపై దాఖలైన పిల్ విచారణ సందర్భంగా సీజే ధర్మాసనం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందని, వాటిని ఉల్లంఘిస్తూ ఇష్టం వచ్చినట్లు ధరలు పెంచుకోవడం చట్టవిరుద్ధమన్నారు. గేమ్ ఛేంజర్, పుష్ప చిత్రాలకు కూడా ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ఇదే హైకోర్టు నిలిపివేసిందని గుర్తు చేశారు.

కోర్టులు సమర్థించాలా?

వాదనలు విన్న డివిజన్ బెంచ్.. కొందరు ఎంపిక చేసిన వ్యక్తుల కోసం ప్రభుత్వం టికెట్ల ధరలు పెంచటం సరికాదంది. రూ.1,000 కోట్లు పెట్టి సినిమా తీయడం వల్ల ప్రజలకు ఒరిగేదేముందని ప్రశ్నించింది. అది కొందరు వ్యక్తుల లబ్ధికోసమేనని పేర్కొంది. రూ.150 టికెట్‌ను రూ.800కు ప్రజలు ఎందుకు కొనాలని.. దీనికి ప్రభుత్వం ఎందుకు సహకరించాలో ఒక్క కారణం చెప్పాలని అడిగింది. ఇలాంటి చర్యలను న్యాయస్థానాలు సమర్థించాలా అని ప్రశ్నించింది. ప్రజలకు చెప్పి హైబడ్జెట్ సినిమాలు తీస్తున్నారా.. వాళ్లు తీయమని అడిగారా అని నిలదీసింది. టికెట్ల పెంపు విధానపరమైన నిర్ణయమైతే జీవో జారీ చేయకుండా.. మెమో ఎలా విడుదల చేస్తారని తప్పుబట్టింది. శుక్రవారం సింగిల్ జడ్జి విచారణ చేపట్టి.. ఈ ఉత్తర్వులతో సంబంధం లేకుండా నిర్ణయం తీసుకుంటారని చెప్పింది.

ఎన్‌ఓసీ తెచ్చుకోండి.. క్లియరెన్స్ ఇస్తాం

సమ్మక్కసాగర్ ప్రాజెక్టుపై సీడబ్ల్యూసీ సంతృప్తి వ్యక్తీకరణ

- అన్ని అంశాలపై అనుమానాలను నివృత్తి చేసిన అధికారులు

సాక్షి, హైదరాబాద్: సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం) ప్రాజెక్టుకు సంబంధించిన ఆయకట్టు ప్రతిపాదనలతోపాటు హైడ్రాలజీ, అంతర్రాష్ట్ర అంశాలపై కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సంతృప్తి వ్యక్తం చేసింది. ప్రాజెక్టు ప్రతిపాదనలపై గురువారం ఢిల్లీలో సీడబ్ల్యూసీ నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ తరఫున సలహాదారుడు ఆదిత్యనాథ్ దాస్, ఈఎన్సీ (జనరల్) మహ్మద్ అంజాద్ హుస్సేన్, గోదావరి బోర్డు బేసిన్ డైరెక్టర్ సిద్ధాంతి సుబ్రమణ్యం ప్రసాద్, ములుగు చీఫ్ ఇంజనీర్ కుమారస్వామి హాజరు కాగా, సీడబ్ల్యూసీ తరఫున మెంబర్ పైథాంకర్‌తోపాటు అన్ని విభాగాల డైరెక్టర్లు హాజరయ్యారు. సమ్మక్కసాగర్ ఎగువన ఉన్న ప్రాజెక్టుల వారీగా వాటి కింద ఉన్న ఆయకట్టు, నీటి వినియోగ వివరాలు అందించాలని సీడబ్ల్యూసీ కోరగా.. అధికారులు సమర్పించారు. ప్రాజెక్టు కింద ఎస్‌ఆర్‌ఎస్పీ రెండోదశకు చెందిన 1.40 లక్షల ఎకరాలను స్థిరీకరించడంతోపాటు రామప్ప–పాకాల కింద 30 వేల ఎకరాలకు కొత్తగా సాగునీటిని అందించాలని నిర్ణయించుకున్నామని తెలంగాణ అధికారులు వివరించారు. ఎస్సారెస్పీ రెండోదశ ఆయకట్టును ఎన్ని ప్రాజెక్టుల కింద ప్రతిపాదిస్తారని సీడబ్ల్యూసీ అధికారులు ఆరా తీయగా.. 1996లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 190 టీఎంసీల నీటిలభ్యతతో క్లియరెన్స్ ఇచ్చిందని, తెలంగాణకు గేట్‌వేగా ఈ ప్రాజెక్టు ఉందని, జీ–1 నుంచి జీ–5 దాకా 190 టీఎంసీల నీటి లభ్యత ఉందని నిర్ధారించిందని గుర్తు చేశారు. అయితే 2006లో ఎస్సారెస్పీ రెండో దశకు అనుమతినిస్తున్నప్పుడు నీటిలభ్యత 145 టీఎంసీలు మాత్రమేనని సీడబ్ల్యూసీ తేల్చిందని, 2011లో అధ్యయనం చేస్తే 120 టీఎంసీలకు నీటి లభ్యత చేరిందని అధికారులు వివరణ ఇచ్చారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద 186 టీఎంసీల నీటి అవసరం ఉందని, శ్రీరాంసాగర్ ప్రాజెక్టును 120 టీఎంసీలతో కడితే.. పూడిక చేరికతో నిల్వ 80 టీఎంసీలకు చేరిందని, లైవ్ స్టోరేజ్ 60 టీఎంసీలు మాత్రమేనని నివేదించారు. ఎస్సారెస్పీ కాంప్లెక్స్ నుంచి 186 టీఎంసీల నీటిని అందించలేకపోతున్నామన్నారు. తొలిదశలో 9.68 లక్షల ఎకరాలు, రెండో దశలో 4.40 లక్షల ఆయకట్టు ఉందని అధికారులు గుర్తు చేశారు. అందువల్ల సమ్మక్కసాగర్ ప్రాజెక్టు నుంచి ఎస్సారెస్పీ రెండో దశ కింద ఉన్న 4.40 లక్షల ఎకరా లను స్థిరీకరించాలని నిర్ణయం తీసుకున్నామని నివేదించారు. ఎస్సారెస్పీలో నీటిఎద్దడి ఉన్నందునే... సమ్మక్కసాగర్ నుంచి నీటిని అందించాలని నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేశారు. దీంతో ప్రాజెక్టు సక్సెస్ రేటు కోసం సిమ్యులేషన్ అధ్యయనాలు చేసి, ప్రాజెక్టుల వారీగా వర్కింగ్ టేబుల్ అందించాలని సీడబ్ల్యూసీ కోరగా.. ఆ వివరాలన్నీ ఇప్పటికే అప్‌లోడ్ చేశామని, మళ్లీ అందిస్తామని అధికారులు బదులు ఇచ్చారు. దీంతో సీడబ్ల్యూసీ డైరెక్టరేట్లన్నీ సంతృప్తి వ్యక్తం చేశాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌ఓసీ తెచ్చుకుంటే క్లియరెన్స్ ఇస్తామన్నారు.

ఎన్టీపీసీ రామగుండంలో బీఎంఎస్ విజయం



విజయోత్సవంలో బీఎంఎస్ నాయకులు

జ్యోతినగర్ (రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు గుర్తింపు ఉద్యోగ సంఘం ఎన్నికల్లో బీఎంఎస్ అనుబంధ ఎన్టీపీసీ కార్మిక సంఘ్ విజయం సాధించింది. గురువారం ప్రాజెక్టు పరిపాలనా భవనంలో జరిగిన ఎన్నికల్లో ఎన్టీపీసీ కార్మిక సంఘ్ 212 ఓట్లకుగాను 102 ఓట్లు సాధించింది. ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ), ఎన్టీపీసీ కార్మిక సంఘ్ (బీఎంఎస్), ఎన్టీపీసీ యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)లు ఈ ఎన్నికల్లో పోటీ చేశాయి. 212 మందికి గాను 208 ఓట్లతో 98 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల ఫలితాలను ఎన్టీపీసీ ఏజీఎం (హెచ్‌ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్ ప్రకటించారు. ఐఎన్‌టీయూసీకి 94, సీఐటీయూకి 12 ఓట్లు రాగా బీఎంఎస్ అనుబంధ ఎన్టీపీసీ కార్మిక సంఘ్ 102 ఓట్లను సాధించి ప్రాతినిధ్య సంఘంగా అర్హత సాధించింది. ఐఎన్‌టీయూసీ 94 ఓట్లతో రెండో స్థానానికి పరిమితమైంది.విజయోత్సవ ర్యాలీలో సంధ్యారాణి, భాస్కర్‌రెడ్డి, సాగర్‌రాజు పాల్గొన్నారు.

నాగార్జున హక్కులను కాపాడతాం

ఆయన సెల్యులాయిడ్ సైంటిస్ట్ అని పేర్కొన్న ఢిల్లీ హైకోర్టు

- నాగార్జున పేరును దుర్వినియోగం చేయడం సరికాదంటూ వెబ్‌సైట్లకు మందలింపు
- ఆయన ఫొటోలు, వీడియోలు తొలగించాలని ఆదేశం





సాక్షి, న్యూఢిల్లీ: 'భారతీయ చలన చిత్ర రంగంలో అక్కినేని నాగార్జున స్టార్ హీరో. అందుకే ఆయనను సెల్యులాయిడ్ సైంటిస్ట్ అని పిలుస్తారు. అటువంటి స్టార్ హీరో వ్యక్తిగత హక్కులను కచ్చితంగా కాపాడతాం'అని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. ఆయన ఇమేజ్, పేరును దుర్వినియోగం చేయడం సరికాదంటూ సంబంధిత వెబ్‌సైట్‌లను మందలించింది. తక్షణం ఆ లింకులను తొలగించాలని ఆదేశించింది. అనుమతి లేకుండా తన పేరు, ఇమేజ్‌ను వాణిజ్య అవసరాలకు వాడుతున్నారని నాగార్జున ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఫొటోలు, వీడియోలు, పేరును ఉపయోగించి పలు వెబ్‌సైట్లు, సోషల్ మీడియా వేదికలు అక్రమంగా వ్యాపారం చేస్తున్నాయని పిటిషన్‌లో ఆరోపించారు. కొందరు తన ఫొటోలను మార్ఫింగ్ చేసి, అసభ్యకరమైన కంటెంట్, లింక్‌లు సృష్టిస్తున్నారని, ఇది తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తోందన్నారు ఈ పిటిషన్‌ను గురువారం జస్టిస్ తేజస్ కరియా సింగ్ బెంచ్ విచారించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వైభవ్ గగ్గర్, ప్రవీణ్ ఆనంద్ తదితరులు హాజరయ్యారు.

మూడు రూపాల్లో డ్యామేజ్

అశ్లీల కంటెంట్, మర్చంటైజింగ్, ఏఐ జనరేటెడ్ కంటెంట్ వంటి మూడు రూపాల్లో నాగార్జున ఇమేజ్‌ను డ్యామేజ్ చేస్తున్నారంటూ దీనికి సంబంధించి 14 యూఆర్‌ఎల్ (యూనిఫాం రిసోర్స్ లొకేటరీ)లను న్యాయవాది వైభవ్ గగ్గర్ కోర్టుకు సమర్పించారు. 'మూడు మార్గాల్లో మీ వ్యక్తిత్వ హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నట్లు మీరు గుర్తించారు. ఆ లింక్‌లను తొలగించమని వారికే చెప్పవచ్చు. ఇలాంటి వ్యక్తులు చాలా కీర్తివంతమైన జీవితాన్ని గడుపుతారు. తామిచ్చే ఉత్తర్వులతో ఎంతకాలం ఇలాంటివి ఆపగలం' అని జస్టిస్ కరియా పేర్కొన్నారు. అయినప్పటికీ.. తాము ఇప్పటికిప్పుడే నాగార్జున వ్యక్తిగత హక్కులను కాపాడేందుకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు న్యాయస్థానం పేర్కొంది.

గౌరవాన్ని కాపాడతాం

'దేశ చలన చిత్ర రంగంలో నాగార్జున పేరు, ప్రఖ్యాతులు కలిగిన వ్యక్తి. అటువంటి వ్యక్తి ఫొటో, వీడియోలను అడ్డుపెట్టుకుని కొందరు ఆర్థికంగా లబ్ధి చెందుతున్నారు. అనుమతిలేకుండా ఏఐ సహాయంతో వాళ్లు రూపొందించిన యూట్యూబ్ షార్ట్స్, ఇతర వీడియోలతో ఆయన ఇమేజ్ డ్యామేజ్ అవుతోంది. నటన శైలిలో బహుముఖ స్వభావం కలిగిన ఆయనను సెల్యులాయిడ్ సైంటిస్ట్‌గా పిలుస్తారు. అతనికి ట్విట్టర్‌లో 6 మిలియన్లు, ఫేస్‌బుక్‌లో 8.1 మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు' అని గగ్గర్ కోర్టుకు వివరించారు. 'యస్.. ఆయన (నాగార్జున) స్టార్ హీరో, సెల్యులాయిడ్ సైంటిస్ట్. భక్తిచిత్రాల ద్వారా ఆయనకెంతో గౌరవం ఉంది. ఆ గౌరవాన్ని మేం కాపాడతాం. ఆయన పేరును దుర్వినియోగం చేయడం సరికాదు. ఇకపై ఇలా జరిగితే చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకుంటాం'అని పేర్కొంటూ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

ఐఎన్‌ఎస్ అధ్యక్షుడిగా వివేక్ గుప్తా



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో వార్తాపత్రికలు, మ్యాగజైన్‌లు, పీరియాడికల్స్ ప్రచురణకర్తలతో కూడిన అతిపెద్ద సంఘమైన ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ (ఐఎన్‌ఎస్) అధ్యక్షుడిగా వివేక్ గుప్తా ఎన్నికయ్యారు. గురువారం ఢిల్లీలోని ఐఎన్‌ఎస్ కార్యాలయంలో 86వ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు 2025–26 సంవత్సరానికిగాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఐఎన్‌ఎస్ డిప్యూటీ ప్రెసిడెంట్‌గా కరణ్ రాజేంద్ర దర్డా (లోక్‌మాత్), వైస్ ప్రెసిడెంట్‌గా తన్మయ్ మహేశ్వరి, గౌరవ కోశాధికారిగా అనంత్ నాథ్ (గృహశోభిక), సెక్రటరీ జనరల్‌గా మేరీ పాల్ నియమితులయ్యారు. అలాగే ఎగ్జిక్యూటివ్ కమిటీలో మొత్తం 41 మంది సభ్యులుగా నియమితులవగా వారిలో కె.ఆర్.పి. రెడ్డి (సాక్షి), ఎస్. బాలసుబ్రమణియన్ ఆదిత్యన్ (డైలీ తంతి), గిరీశ్ అగర్వాల్ (దైనిక్ భాస్కర్–భోపాల్), సముద్ర భట్టాచార్య (హిందుస్తాన్ టైమ్స్–పాట్నా), వివేక్ గోయెంకా (ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్–ముంబై), మహేంద్ర మోహన్‌గుప్తా (దైనిక్ జాగరణ్), అతిదేబ్ సర్కార్(ద టెలిగ్రాఫ్), ఐ.వెంకట్ (ఈనాడు), జయంత్ మ్యాథ్యూ (మలయాళ మనోరమ), మోహిత్ జైన్ (ఎకనామిక్ టైమ్స్) తదితరులు ఉన్నారు.

ఈడీ విచారణకు హాజరైన జగపతిబాబు

సాహితీ ఇన్‌ఫ్రా కేసులో ప్రశ్నించిన అధికారులు



సాక్షి, హైదరాబాద్: సాహితీ ఇన్‌ఫ్రా కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సినీ నటుడు జగపతిబాబును ప్రశ్నించారు. ఈ మేరకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో జగపతిబాబు గురువారం విచారణకు హాజరయ్యారు. నాలుగు గంటలపాటు అధికారులు జగపతిబాబును ప్రశ్నించారు. ప్రీలాంచ్ ఆఫర్ల పేరిట వినియోగదారుల నుంచి రూ.వందల కోట్లు వసూలు చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న సాహితీ ఇన్‌ఫ్రా సంస్థను జగపతిబాబు ప్రమోట్ చేశారు. గతంలో సాహితీ సంస్థ తరఫున పలు ప్రకటనల్లో ఆయన నటించారు. జగపతిబాబుకు, సాహితీ సంస్థకు మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. సాహితీ సంస్థ ఎండీ లక్ష్మీనారాయణ బ్యాంకు ఖాతాల నుంచి సైతం జగపతిబాబుకు నగదు బదిలీ అయినట్టు ప్రాథమిక ఆధారాలు లభించినట్టు తెలిసింది. ఇటీవలే ఈడీ అధికారులు సాహితీ ఇన్‌ఫ్రా సంస్థ మాజీ డైరెక్టర్ సందు పూర్ణచందర్‌రావును అరెస్టు చేశారు. విచారణ సందర్భంగా వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగానే ఈడీ అధికారులు జగపతిబాబుకు నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. దర్యాప్తులో భాగంగా మరిన్ని కీలక ఆధారాలను ఈడీ అధికారులు గురువారంనాటి విచారణలో సేకరించారు.

స్మితా సబర్వాల్‌పై చర్యలొద్దు

జస్టిస్ ఘోష్ కమిషన్‌పై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా నాటి సీఎం ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్‌పై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ, తదుపరి విచారణ అక్టోబర్ 7కు వాయిదా వేసింది. జస్టిస్ చంద్రఘోష్ నివేదిక నిలిపివేయాలని కోరుతూ స్మితా సబర్వాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున మాజీ ఏఏజీ రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ.. ప్రాజెక్టు ఫైళ్లను కేబినెట్ ఆమోదం కోసం ఉంచనందుకు, నిబంధనలను ఉల్లంఘించినందుకు పిటిషనర్‌పై చర్యలకు కమిషన్ సిఫార్సు చేసిందన్నారు. కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. సీబీఐకి అప్పగించాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నివేదికను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ సిద్ధివర్ధన్ వాదనలు వినిపిస్తూ.. కమిషన్ నివేదిక ఆధారంగా పిటిషనర్‌పై ఎటువంటి ప్రతికూల చర్యలు ఉండవన్నారు. కౌంటర్ దాఖలుకు 10 రోజులు కావాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. అక్టోబర్ 7లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

సృష్టి కేసులో ఈడీ సోదాలు

- అక్రమార్జనలో మనీలాండరింగ్‌పై ఫోకస్
- హైదరాబాద్, విజయవాడ, విశాఖల్లో ఏకకాలంలో తనిఖీలు



సాక్షి, హైదరాబాద్: సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు గురువారం తెలంగాణ, ఏపీలోని పలు ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. పసిపిల్లల విక్రయాలు, ఫెర్టిలిటీ సెంటర్ మోసాలతో అక్రమార్జనలో మనీలాండరింగ్‌పై ఈడీ ఫోకస్ పెట్టింది. రూ.40 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు, ఈ డబ్బును వివిధ మార్గాల్లో మనీలాండరింగ్ చేసినట్లు ఆధారాలు సేకరించింది. దర్యాప్తులో భాగంగా ప్రధాన నిందితురాలు నమ్రత, ఇతర నిందితుల బ్యాంక్ లావాదేవీలు, ఆస్తుల కొనుగోళ్లు, దేశవిదేశాల్లో పెట్టుబడుల వివరాలను అధికారులు సేకరించారు. వాటి ఆధారంగానే గురువారం హైదరాబాద్‌లోని ఐదు ప్రాంతాల్లో, విజయవాడలోని రెండు ప్రాంతాల్లో, విశాఖపట్నంలో రెండు ప్రాంతాల్లో సోదాలు చేసినట్టు తెలిసింది. ఈ సందర్భంగా కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే 30 మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. 86 మందికి పైగా పిల్లల్ని చైల్డ్ ట్రాఫికింగ్ చేసినట్లు తేలింది.

సిమ్యులేటర్స్ @ హైదరాబాద్

యాక్సిల్ ఏరో ప్రైవేటు లిమిటెడ్ ద్వారా వాణిజ్య ఉత్పత్తి

- అమెరికా, యూరప్ నుంచి దిగుమతి అవసరం లేనట్లే
- మనమే అగ్రదేశాలకు ఎగుమతి చేసేలా సాంకేతికత వృద్ధి
- ఒక్కో ఫైట్ జెట్ సిమ్యులేటర్‌పై రూ.25 కోట్లకు పైనే ఆదా



ఫైటర్ జెట్ కాక్‌పిట్ సిమ్యులేటర్‌లో మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో టీ వర్క్స్ సీఈఓ జోగిందర్ తనికెళ్ల

సాక్షి, హైదరాబాద్: డ్రోన్లు, క్షిపణులు, విమానాల విడిభాగాలు, రక్షణరంగ ఉత్పత్తులతో దేశం దృష్టిని ఆకర్షిస్తున్న హైదరాబాద్. మరో భారీ ఆవిష్కరణకు సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో టీ వర్క్స్ వేదికగా యుద్ధ విమానాల ఫ్లైట్ 'సిమ్యులేటర్'రూపుదిద్దుకుంటోంది. ఎయిర్‌ఫోర్స్, నేవీ యుద్ధ విమానాల పైలట్ల శిక్షణ కోసం అవసరమయ్యే 'లెవెల్ డి'ఫుల్ ఫ్లైట్ సిమ్యులేటర్లను ఇప్పటి వరకు భారీ వ్యయంతో అమెరికా, యూరప్ దేశాల నుంచి భారత్ దిగుమతి చేసుకుంటోంది. ఇకపై ఆ అవసరం ఉండదని నిపుణులు అంటున్నారు. భవిష్యత్తులో ఫ్లైట్ సిమ్యులేటర్లను ఇతర దేశాలకు ఎగుమతి చేయగలిగే సాంకేతికత ఇక్కడ అభివృద్ధి చెందుతుందని చెప్తున్నారు. ఎయిర్‌ఫోర్స్ పైలట్లకు మొదట ఫ్లైట్ సిమ్యులేటర్లలో శిక్షణ ఇస్తారు. విమానం ఎగిరే కృత్రిమ వాతావరణాన్ని సృష్టించే సిమ్యులేటర్లు నిజంగా ఎయిర్ క్రాఫ్ట్‌ను గాలిలో నడిపిన అనుభూతిని ఇస్తాయి. కాక్‌పిట్‌లో కూర్చుని బయటి నుంచి శిక్షకులు ఇచ్చే సూచనల ప్రకారం ఎలక్ట్రానిక్ వ్యవస్థను నియంత్రించాల్సి ఉంటుంది. విమానం టేకాఫ్, ల్యాండింగ్, తలకిందులుగా ఎగరడం లాంటి అన్ని రకాల విన్యాసాల శిక్షణ సిమ్యులేటర్ ద్వారా లభిస్తాయి. యుద్ధ విమానాల్లో ఉండే ఎలక్ట్రానిక్, ఆటోమెటిక్ నియంత్రణ వ్యవస్థలన్నీ ఇందులో ఉంటాయి. ఎదురుగా అర్ధ చంద్రాకారంలో ఉండే స్క్రీన్ పైన ఫైటర్ జెట్ కదులుతున్న దృశ్యాలు కనిపిస్తాయి.

సిమ్యులేటర్ల తయారీకి అనుమతులు

యాక్సిల్ ఏరో ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ఈ సిమ్యులేటర్ల తయారీకి అన్ని అనుమతులు సాధించి వాణిజ్య ఉత్పత్తి మొదలు పెట్టింది. వచ్చే మూడేళ్లలో ఐదు సిమ్యులేటర్లను సరఫరా చేయడానికి రక్షణ శాఖ నెలకొల్పిన ఇన్నోవేషన్స్ ఫర్ డిఫెన్స్ ఎక్సలెన్స్ (ఐడెక్స్)తో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం మన ఎయిర్‌ఫోర్స్ దిగుమతి చేసుకుంటున్న ఒక్కో ఫైటర్ జెట్ సిమ్యులేటర్ వ్యయం రూ.50 కోట్ల వరకు ఉండగా.. యాక్సియల్ ఏరో రూ.25 కోట్ల నుంచి రూ.30 కోట్లకే అందజేస్తుంది. టీ-వర్క్స్ లో పరిశోధనలు సాగిస్తున్న ఈ సంస్థ.. ఎయిర్‌ఫోర్స్, నేవీ అవసరాలకు తగిన విధంగా ఫ్లైట్ సిమ్యులేటర్లను తయారు చేయడానికి సర్వం సిద్ధం చేసుకుంది. ప్రస్తుతం భారత్ దిగుమతి చేసుకుంటున్న సిమ్యులేటర్లతో పోలిస్తే ఇక్కడ తయారయ్యే సిమ్యులేటర్లు అత్యున్నత సాంకేతిక ప్రమాణాలను కలిగి ఉంటాయి. ప్రస్తుతం దిగుమతి చేసుకుంటున్న సిమ్యులేటర్లు అన్ని వైపులా 30 డిగ్రీల మేర మాత్రమే వంగడం, లేవడం చేయగలుగుతాయి. యాక్సిల్ ఏరో రూపొందిస్తున్న సిమ్యులేటర్లు 360 డిగ్రీల కోణంలో తిరిగే స్టివార్ట్ ప్లాట్‌ఫామ్‌ను కలిగి ఉంటాయి. దీని వల్ల యుద్ధ క్షేత్రంలో శత్రువుకు దొరకకుండా తప్పించుకునేందుకు ఫైటర్ జెట్లను నడిపించే పైలట్లు అనుసరించే విన్యాసాలన్నీ ఇందులో సాధ్యమవుతాయి. సిమ్యులేటర్ల వాణిజ్య ఉత్పత్తి ఊపందుకుంటే విడిభాగాలు అందించే అనుబంధ పరిశ్రమలు పుట్టుకొచ్చి ఎంఎస్‌ఎంఈ రంగానికి మేలు జరుగుతుందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. మరోవైపు భవిష్యత్తులో హైదరాబాద్ ఫ్లైట్ సిమ్యులేటర్ల ఉత్పత్తి కేంద్రంగా నిలవడంతోపాటు ఈ రంగంలో విదేశీ పెట్టుబడులకు అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు టీ వర్క్స్'ను సందర్శించి ఫ్లైట్ సిమ్యులేటర్ల పురోగతిని పరిశీలించారు.



ఆర్టీసీ బస్సెక్కితే బహుమతి

దసరాకు లక్కీ డ్రా నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: దసరా పండుగ నేపథ్యంలో తమ బస్సుల్లో ప్రయాణించే వారికి లక్కీ డ్రా నిర్వహించాలని టీజీఎస్‌ఆర్టీసీ నిర్ణయించింది. ఈ లక్కీ డ్రాలో రీజియన్‌కి ముగ్గురు చొప్పున 33 మందికి రూ.5.50 లక్షల విలువగల బహుమతులను సంస్థ అందజేయనుంది. ఒక్కో రీజియన్‌కు ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలను ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈ నెల 27 నుంచి అక్టోబర్ 6 వరకు టీజీఎస్‌ఆర్టీసీకి చెందిన హైఎండ్ బస్సులైన సెమీ డీలక్స్, మెట్రో డీలక్స్, డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి నాన్ ఏసీతో పాటు అన్ని రకాల ఏసీ బస్సుల్లో ప్రయాణించిన వారే ఈ లక్కీ డ్రాలో పాల్గొనేందుకు అర్హులు. ప్రయాణికులు తమ ప్రయాణం పూర్తయ్యాక టికెట్‌పై తమ పేరు, ఫోన్ నంబరు రాసి బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లో వేయాలి. ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులూ లక్కీ డ్రాలో పాల్గొనవచ్చు. గడువు ముగిశాక డ్రాప్ బాక్స్‌లను సంబంధిత ఆర్‌ఎం కార్యాలయాలకు చేర్చి.. అక్టోబర్ 8న ప్రతి రీజియన్ పరిధిలో లక్కీ డ్రా తీసి ముగ్గురు చొప్పున విజేతలను ప్రకటిస్తారు. దసరా లక్కీ డ్రాలో పెద్ద ఎత్తున పాల్గొనాలని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ప్రయాణికులను కోరారు. పూర్తి వివరాలకు కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033తోపాటు స్థానిక డిపో మేనేజర్లను సంప్రదించాలని సూచించారు. దసరాకు సొంతూళ్లకు వెళ్లే వారికి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని, 7,754 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు.



This Dussehra, drive home your favorite Kia with GST & additional festive benefits. Celebrate the triumph of new beginnings with bold design, advanced technology, and unmatched comfort. Start your journey of inspiration with a Kia made for every road ahead. Visit your nearest Kia dealership today.

Model	Reduction in Price (up to)	Now Starting at	Additional Festive Benefits
Sonet	₹1 64 470	₹7 30 138	₹1 03 360
Seltos	₹75 371	₹10 79 276	₹1 59 840
Syros	₹1 86 002	₹8 67 053	₹1 53 340
Carens	₹48 513	₹10 47 454	₹78 960
Carens Clavis	₹78 674	₹11 17 835	₹1 00 910

*Benefits available on other Kia cars as per applicability.

For more information, visit our dealership or contact:
1800 108 5000 | 093195 91407 | www.kia.com | Book Kia | kiacare@kiaindia.net | Look for "Kia India" @

*Terms & condition apply. Ex-showroom price mentioned is for the base variant (PAN India). Benefits shown are the combination of exchange, corporate, scrappage and special benefits which may vary from model to model and region to region. The product shown is for representation purposes only. Actual features, colors, and specifications may not be part or standard fitment and may vary. Kia India Pvt. Ltd. reserves the right to make any changes with respect to the trims, colors, specifications, and other details of any model as mentioned or to modify/ discontinue any offer/ scheme/ service without prior notice. Kia urges you to follow traffic rules, these are meant to keep you safe on the roads. Visit your nearest Kia dealership for more details.

Car Kia: Gachiowli - 7799906846, Jublee Hills - 7997858880, Financial District - 7330888041 ; **Malik Kia:** Kukatpally - 7399346666, Himayatnagar - 7995999340: **Landmark Kia:** Medipally- 9281428303, Bowenpally - 9347997583: **Prospera Kia:** Malakpet - 8047361444, Somajiguda - 8047361555: **Automotive Kia:** Kondapur - 7995699908, Nagole - 7995999404, R C Puram - 6309908117, A S Rao Nagar - 7670858585, Secunderabad - 7399417777



నిరంతరం పాపకార్యాలకు పాల్పడుతూ, తీరా మరణ ఘడియలు సమీపించాక, 'ఇప్పుడు నేను పశ్చాత్తాపపడుతున్నాను' అని అనేవారి పశ్చాత్తాపం ఆమోదించబడదు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 26 సెప్టెంబర్ 2025

లద్దాఖ్ జనఘోష

అలజడి రేగినప్పుడూ, అశాంతి జాడలు కనబడినప్పుడూ సకాలంలో దాన్ని చక్క దిద్దటమే పాలకుల ప్రథమ కర్తవ్యం కావాలి. వేరే దేశాలతో సరిహద్దులున్న ప్రాంతాల్లో ఇది మరింత అవసరం. ఆ దృష్టి లేకపోవటం వల్లే చైనా సరిహద్దుల్లో ఉన్న లద్దాఖ్‌లో సాగుతున్న ఉద్యమం అదుపు తప్పి హింసాత్మకంగా మారింది. ఆందోళనకారులు బీజేపీ కార్యాలయాన్ని దగ్ధం చేయటంతో పాటు కొన్ని వాహనాలకు కూడా నిప్పుపెట్టారు. ఇళ్లు, దుకాణాలపై దాడులు చేశారు. సీఆర్‌పీఎఫ్ కాల్పుల్లో నలుగురు మరణించారు. కర్ఫ్యూ విధించాల్సి వచ్చింది. 2019లో జమ్మూ–కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసి, జమ్మూ, కశ్మీర్‌ను చట్టసభ గల కేంద్ర పాలిత ప్రాంతంగా, లద్దాఖ్‌ను చట్టసభ లేని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చినప్పుడు ఈ ఆందోళనకు బీజం పడింది. లద్దాఖ్‌ను రాష్ట్రం చేసి చట్ట సభ ఏర్పాటు చేయాలని, ఈశాన్య రాష్ట్రాల మాదిరిగా రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌ను తమకూ వర్తింప చేయాలని లద్దాఖ్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. రాజ్యాంగంలోని 244వ అధికరణం కింద ఉన్న ఆరో షెడ్యూల్ పరిధిలోకి లద్దాఖ్‌ను తీసుకొస్తే శాసన, న్యాయ, పాలనాపరమైన నిర్ణయాలు తీసుకొనే స్వయంపాలిత జిల్లా మండళ్లు ఏర్పడ తాయి. అవి లేనట్టయితే పరిశ్రమల స్థాపన పేరిట భూములు బయటివారికి పోతాయనీ, వారి ప్రాబల్యం పెరుగుతుందనీ ఉద్యమకారులు చెబుతున్నారు. గత అయిదేళ్లుగా ఎంతో శాంతియుతంగా ఉద్యమం కొనసాగుతోంది. దీనికి లేహ్ అపెక్స్ బాడీ (ఎల్‌ఏబీ), కార్గిల్ డెమాక్రటిక్ అలయెన్స్ (కేడీఏ) నాయకత్వం వహిస్తున్నాయి.

ఉద్యమాలు జరుగుతున్నప్పుడు వాటిని స్వప్రయోజనాలకు వినియోగించుకోవాలని చూసేవారు ఎప్పుడూ ఉంటారు. అలాంటి శక్తులకు అవకాశ మీయరాదనుకుంటే సాధ్యమైనంత త్వరగా పరిష్కార మార్గాన్ని అన్వేషించాలి. లద్దాఖ్ ఉద్యమ డిమాండ్లు చూస్తే అవి గొంతెమ్మ కోరికలేమీ కాదని తెలుస్తుంది. ఈ ప్రాంత యువతకు ప్రభుత్వో ద్యోగాల్లో అన్యాయం జరగకూడదనుకుంటే లద్దాఖ్‌కు ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. జమ్మూ–కశ్మీర్‌లో భాగంగా ఉన్నప్పుడు అక్కడి సర్వీస్ కమిషన్ ద్వారా నియామకాలుండేవి. కేంద్రపాలిత ప్రాంతమైనాక అది కాస్తా పోయింది. మూడేళ్ల పాటు నిరుద్యోగులు ఆశగా ఎదురుచూశాక కేంద్ర సంస్థ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్సెస్సీ) రంగంలోకి దిగింది. కానీ ఆ ప్రక్రియ ఒక కొలిక్కి రావటా నికి ఎంతో సమయం పట్టింది. నిరుడు ఎస్సెస్సీ 797 పోస్టుల భర్తీకి ప్రకటనిస్తే 30,000 మంది దరఖాస్తు చేశారు. 2021–22, 2022–23 మధ్య పట్టభద్రుల్లో నిరుద్యోగిత ఒక్కసారిగా 16 శాతం పెరిగింది. పలువురికి వయఃపరిమితి దాటింది. దానికి తోడు స్వయంపాలిత మండళ్లు రెండున్నా... వాటిలో స్థానికేతర అధికారుల హవా నడుస్తోంది. సహజంగానే రాజకీయ వ్యవస్థకు చోటు లేదు గనుక పార్టీలు సైతం ఈ ఉద్యమాన్ని ప్రోత్సహిస్తున్నాయి. లద్దాఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తితో పాటు దాని పరిధిలోని లేహ్, కార్గిల్‌లకు రెండు పార్లమెంటరీ స్థానాలు ఇవ్వాలని ఉద్యమకారులు కోరటం గమనించదగ్గది.

భౌగోళికంగా పర్వతప్రాంతం, తీవ్ర వాతావరణ స్థితిగతుల వల్ల అక్కడ పరిశ్రమల స్థాపనకు వచ్చేవారు తక్కువ. 13 గిగావాట్ల సౌరశక్తి ప్లాంట్‌కు లేహ్‌లోని పాంగ్ ప్రాంతంలో అనుమతించారు. కానీ దానికి దాదాపు 80 కిలోమీటర్ల ప్రాంతం కావాలి. ఈ ప్రాజెక్టు వస్తే పశుపోషణపై, సంచారజాతుల వారిపై తీవ్ర ప్రభావం పడుతుందనీ, జీవిక దెబ్బతింటుందనీ ఉద్యమకారుల ఆరోపణ. అసలే పర్యావరణం క్షీణించి అకాల వర్షాలూ, అత్యధిక ఉష్ణోగ్రతలతో హిమానీనదులు కొడిగడుతున్న నేపథ్యంలో ఇలాంటి పరిశ్రమలు అవసరం లేదన్నది వారి వాదన. ఉద్యమకారుల డిమాండ్లలో హేతుబద్ధమైన వాటిని తక్షణం పరిష్కరించటం, మిగిలినవాటిపై పరిశీలనకు తగిన వ్యవస్థను ఏర్పాటు చేయటం అవసరమని ఇప్పటికైనా పాలకులు గ్రహించాలి. ఉద్యమ నాయకుడు సోనమ్ వాంగ్‌చుక్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థపై వెంటనే చర్యలు మొదలుపెట్టడం సబబేనా? హింసకు ఆయనే కారకుడని తేలితే వేరే విషయం. తగిన విచారణ జరిగితే అన్నీ బయటికొస్తాయి. ఉద్యమం మరింత తీవ్రం కాకూడదనుకుంటే అంతవరకూ ఓపిక పట్టడం అత్యవసరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, తిథి: శు.చవితి ఉ.6.19 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: విశాఖ రా.8.14 వరకు, తదుపరి అనూరాధ, వర్జ్యం: రా.12.40 నుండి 2.26 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.17 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.19 నుండి 1.07 వరకు, అమృత ఘడియలు: ఉ.10.29 నుండి 12.15 వరకు.

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం: 5.53
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ టాక్

నేనే గుర్తొస్తా!



జర్నలిస్టులకు తగిన కామెంట్ కోసం వెంటనే నేను ఎందుకు గుర్తొస్తానంటే వారు నన్నొక చక్కటి సోర్స్‌గా భావిస్తారు. నా లోచూపు... వారికి కొత్త ఆలోచన కలిగిస్తుంది. పైగా వారి గడువులకు నేను అందుబాటులో ఉంటాను. ఇది వృత్తి నైపుణ్యం కాదని ఎవరైనా అనగలరా?

– మార్క్ బెనియోఫ్, సేల్స్‌ఫోర్స్ సీఈవో

అద్దె ఆటో



నేను బంగారు పతకం సాధించినందు వల్ల స్పోర్ట్స్ కోటాలో నాకు వచ్చిన ఉద్యోగం మా కుటుం బంలోని చాలా ఆర్థిక ఇబ్బందులను తీరుస్తుంది. నాన్నగారికి నేను ఆటో రిక్షా కొనివ్వగలను. కాబట్టి ఆయన ఇక అద్దె ఆటో నడపనవసరం లేదు.

– మీనాక్షీ హుడా, ఇండియన్ బాక్సర్

తినబోతోంది!



ప్రపంచాన్ని సాఫ్ట్‌వేర్ తినేస్తోంది. ఇప్పుడు ఏఐ వచ్చి సాఫ్ట్‌వేర్‌ను తినబోతోంది. తర్వాత ఏంటి?! ఏం లేదు. భవిష్యత్తును అంచనా వేయడానికి ఉత్తమ మార్గం దానిని కనిపెట్టటమే! విఫలం అవటానికి సిద్ధంగా ఉన్నవారే కొత్త ఆవిష్కరణ చేయగలరు.

– జెన్సెన్ హువాంగ్, ఎన్విడియా కో–ఫౌండర్

దాచేస్తాను!



నవ్వించే ముందు నేను చాలా ఆలోచించాలి. నేను మహిళను! ముస్లింను. కమెడియన్‌ను!! నా మాటలను తారుమారు చేసి కోపతాపాలను రాజేసే అవకాశం ఉంటుంది. అందుకే నా పోస్టులలో, ఈవెంట్‌లలో నేను నా ఐడెంటిటీని దాచే ప్రయత్నం చేస్తాను.

– దాహబ్ చిష్తి, స్టాండప్ కమెడియన్

టీవీ లేదు



నేను సిగ్గరి పిల్లవాడిని. టీవీ లేకుండా పెరిగాను. నాకు ఒక కుక్క ఉండేది. స్నేహితులు లేరు. నేను నా కుక్కతోనే దాగుడు మూతలు ఆడేవాడిని. బహుశా కొంతమంది 'ఊహాత్మక స్నేహితులు ఉండవచ్చు. అదే నన్ను రచయితను చేసిందా?

– డాన్ బ్రౌన్, అమెరికన్ రచయిత

మరో ప్రపంచం



సంకల్ప బలం అనంతంగా, శక్తి సమృద్ధిగా, తెలివితేటలు మన చేతివేళ్ల కొనల్లో ఉన్నట్లుగా భవిష్యత్తును ఊహించుకోండి. నా వంతుగా నేను నిర్మించబోయే ప్రపంచం ఇదే! పడినప్పటికీ, తిరిగి లేచి, ఆ నిర్మాణానికి నేను మరింతగా తోడ్పడతాను.

– కవిన్ భారతీ మిట్టల్, ఇంటర్నెట్ ఆంత్రప్రెన్యూర్

ఒప్పందమా? వ్యూహాత్మకమా!

విశ్లేషణ



టంకశాల అశోక్

పాకిస్తాన్, సౌదీ అరేబియాల మధ్య అనూహ్యమైన రీతిలో ఈనెల 17న జరిగిన రక్షణ ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. రెండు దేశాల రక్షణ సంబంధాలు కొన్ని దశాబ్దాలుగా ఉన్నవే. సౌదీ రాజు ఫైజల్, పాక్ అప్పటి ప్రధాని అయూబ్ ఖాన్‌ల మధ్య 1967 లోనూ ఒక రక్షణ ఒప్పందం కుదిరింది. కానీ అప్పటి పరిస్థితులు, అవసరాలు సాధారణ స్థాయివి. అప్పటికి పాకిస్తాన్ అణ్వాయుధ దేశం కూడా కాదు. నాటి నుంచి 58 సంవత్సరాల సుదీర్ఘకాలంలో అన్నీ మారాయి. అరబ్ దేశాలు, ముస్లిం దేశాలతో పాటు ప్రపంచవ్యాప్తంగానూ ఎంతో సంక్లిష్టంగా కూడా అయ్యాయి. అందువల్లనే ప్రస్తుత ఒప్పందం గమనార్హమైనది అవుతున్నది.

దాడి తర్వాతే కుదిరిన ఒప్పందం!

ఒప్పందం జరిగిన తక్షణ పరిణామాలు కూడా ప్రాముఖ్యం కలిగినవి. ఈ నెల 9న గల్ఫ్ దేశమైన ఖతార్‌పై ఇజ్రాయెల్ క్షిపణి దాడి జరిపి అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. అమెరికాతో వ్యూహాత్మక సంబంధం గల అరబ్ దేశాలు, తమ ప్రాంతంలో అర డజను అమెరికన్ సైనిక స్థావరాలకు ఆశ్రయం ఇస్తున్నవి అయినప్పటికీ ఈ దాడి జరగటం ఒకటైతే, మళ్లీ దాడులకు వెనుకాడబోమని ఇజ్రాయెల్ ప్రకటించింది. అది చాలదన్నట్లు అమెరికా విదేశాంగమంత్రి మార్కో రూబియో స్వయంగా టెల్ అవీవ్‌కు వెళ్లి ఇజ్రాయెల్‌కు మద్దతు ప్రకటించటం సౌదీతో పాటుగా సహ గల్ఫ్ దేశాలన్నింటిని తీవ్రమైన అభద్రతా భావానికి గురిచేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అర్థోక్తులు వాటికి తోడయ్యాయి. ఈ తక్షణ నేపథ్యంలో జరిగిందే పాకిస్తాన్‌తో సౌదీ రక్షణ ఒప్పందం.

అక్కరకు రాని అగ్రరాజ్యం

ఒప్పందం అనంతరం మీడియా ప్రశ్నలకు సౌదీ ప్రభుత్వం ప్రతినిధి ఇచ్చిన ఒక సమాధానం ఇదే స్థితిని ధ్రువీకరిస్తున్నది. ఇరు దేశాల మధ్య రక్షణ సంబంధాలు కొన్ని దశాబ్దాలుగా ఉండి, 1967 నాటి ఒప్పందం కూడా ఒకటి ఉన్నప్పుడు తిరిగి ఈ ఒప్పందం ఎందుకన్న ప్రశ్నకు ఆ ప్రతినిధి ఇచ్చిన సమాధానం – 'అనిశ్చితంగా మారిన భవిష్యత్ అవసరాల కోసం' అని! పైన ప్రస్తావించిన పరిణామాల కారణంగా భవిష్యత్తు ఎందుకు అనిశ్చితంగా మారిందో వేరే వివరణ అవసరం లేదు. ఇక్కడ గుర్తించవలసిన మరొక విషయం ఏమంటే, అటువంటి అనిశ్చిత పరిస్థితులలో ఒక అణ్వస్త్ర దేశంతో సౌదీకి ఒప్పందం అవసరమైంది. సాటి గల్ఫ్ దేశం అయిన ఖతార్‌పై ఇజ్రాయెల్ అనే ఒక అణ్వస్త్ర దేశం దాడి జరిపినప్పుడు మరొక అణ్వస్త్ర దేశమైన అమెరికాతో తమకు గల వ్యూహాత్మక సంబంధం సౌదీకి కొరగానిది అయింది. దాంతో ఇస్లామిక్ దేశమైన పాకిస్తాన్‌తో పరస్పర రక్షణ ఒప్పందం అనివార్యం అయినట్లుగా కనిపిస్తోంది.



రక్షణ కోసం : సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్

◆ పాక్–సౌదీల మధ్య రక్షణ సంబంధాలు కొన్ని దశాబ్దాలుగా ఉండి, 1967 నాటి ఒప్పందం కూడా ఒకటి ఉన్నప్పుడు తిరిగి ఈ తాజా ఒప్పందం ఎందుకన్న ప్రశ్నకు – 'అనిశ్చితంగా మారిన భవిష్యత్ అవసరాల కోసం' అనే సమాధానం ఇరు దేశాల నుంచీ వస్తోంది!

మిగతా దేశాలూ చేరుతాయా?!

ఒప్పంద పాఠం వెల్లడి కాలేదు గానీ, వారు అధికారికంగా ఒక ప్రకటనలో తెలియజేసిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి: 'రెండింటిలో ఏ దేశం పైన బయటి నుండి ఎవరు దాడి జరిపినా రెండవ దేశంపై కూడా జరిపినట్లే పరిగణించి, దాడికి గురైన దేశానికి తోడుగా నిలుస్తారు. ఉభయుల రక్షణకు అవసరమైన పరస్పర సహకార చర్యలు ఇప్పటికన్నా మరింతగా తీసుకుంటారు'. ఈ ఒప్పందం పరిధిలోకి పాకిస్తాన్ అణ్వస్త్రాలు కూడా వస్తాయా అన్న సూటి ప్రశ్నకు రెండు దేశాల ప్రతినిధులు కూడా... పాకిస్తాన్‌కు గల ఆయుధశక్తి మొత్తం వస్తుందని స్పష్టం చేశారు. పాకిస్తాన్ అణు దేశమే గాక ముస్లిం ప్రపంచంలో అతిపెద్ద సైనిక శక్తి. ఇజ్రాయెల్ నుంచి ముప్పు ఎదుర్కొంటున్న ఇతర గల్ఫ్ దేశాలు సైతం ఈ ఒప్పందంలో చేరవచ్చునా అన్న ప్రశ్నకు పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్, తమ ద్వారాలు ఎవరికీ మూసుకుపోలేదన్నారు.

ఖతార్‌పై ఇజ్రాయెల్ దాడి 9న; అరబ్, ఇస్లామిక్ దేశాల శిఖరాగ్ర సమావేశం 15న జరిగిన తర్వాత, 17న ఈ ఒప్పందం కుదిరినప్పటి నుంచి వారం రోజులలో ఆ సమావేశ దేశాలు గాని; ఇజ్రాయెల్, అమెరికా, యూరప్‌లు గాని స్పందించలేదు. భారత ప్రభుత్వ ప్రతినిధి మాత్రం, 'మా మనోభావాలను సౌదీ నాయకత్వం మన్నించగలదని ఆశిస్తున్నా'మన్నది. అయితే, వెంటనే తలెత్తుతున్న ప్రశ్నలు కొన్ని ఉన్నాయి. ఒకవేళ సౌదీపై ఇజ్రాయెల్ దాడి జరిపితే పాకిస్తాన్ యుద్ధంలో పాల్గొంటుందా? పాల్గొంటే అమెరికా ఏం చేయవచ్చు? అదే విధంగా ఇండియా–పాక్‌ల మధ్య సాయుధ ఘర్షణ, లేదా యుద్ధం జరిగితే సౌదీ ప్రభుత్వం తన అపారమైన ఆయుధ సంపత్తిని పాకిస్తాన్‌కు సమకూర్చుతుందా... అన్నవి ఆ ప్రశ్నలు. ఇక్కడ పాక్ రక్షణ మంత్రి 20వ తేదీన చెప్పిన మాటను గమనించాలి. తమ ఒప్పందం ఇరువురి ఆత్మరక్షణకే తప్ప ఇతరులపై దాడి చేసేందుకు కాదని, ఒకవేళ తమపై భారతదేశం దాడి జరిపితే మాత్రం సౌదీ అరేబియా తప్పక రంగంలోకి వస్తుందని, ఆ విషయమై ఎంత మాత్రం సందేహం అక్కర లేదని అన్నారాయన.

ఊహకందని పర్యవసానాలు

భారత ప్రభుత్వం ఈ అసాధారణ పరిణామాన్ని అనివార్యంగా గమనికలోకి తీసుకోవలసి ఉంటుంది. ఒకవేళ రాగల రోజులలో మరిన్ని అరబ్, ముస్లిం దేశాలు ఈ ఒప్పందంలో చేరితే పరిస్థితి తీవ్రత ఆ మేరకు పెరుగుతుంది. ఇజ్రాయెల్, అమెరికా తీరును బట్టి అది జరగవచ్చు కూడా! ఒప్పందానికి ఇది ఒక కోణం కాగా, ఇజ్రాయెల్ వైఖరిలో గమనించవలసిన మరొక కోణం ఉంది. వారి దాడులు ఖతార్‌తో ఆగుతాయా లేక ఇతర గల్ఫ్ దేశాలకు విస్తరించే అవకాశం ఉందా? ఈ దేశాలకు అమెరికాతో గల వ్యూహాత్మక సంబంధాలు, ఆ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాల పరిస్థితి ఏమిటి? ప్రస్తుత ఒప్పందాన్ని ప్రభావితం చేసి నిరుపయోగంగా మార్చేందుకు అమెరికా ప్రయత్నిస్తుందా? ఇటువంటి ఒప్పందం మూలంగా రాజకీయంగా పాకిస్తాన్ పాత్ర బలోపేతంగా మారే అవకాశం ఉంది గనుక ఆ ప్రభావం భారత్‌పై ఏ విధంగా ఉండ వచ్చు?... అన్నీ ప్రశ్నలే.

ముమ్ముందు అనేక మలుపులు

ఏమైనా... ఖతార్‌పై దాడి, అమెరికా మౌనం, దోహా శిఖరాగ్ర సమావేశం, సౌదీ–పాక్ ఒప్పందం అనే నాలుగు పరిణామాలు మాత్రం అసాధారణమైనవి. కేవలం 9 రోజుల పరిధిలో చోటు చేసుకున్న ఈ పరిణామాల అర్థం ముమ్ముందు అనేక రూపాలలో ఉంటుంది. ఈ పరిణామ పరంపరకంతా మూలకారణమైన పాలస్తీనా సమస్య ఏమి కానున్నదనేది అన్నింటికీ మించిన ప్రశ్న. వాస్తవానికి ఆ సమస్య కొనసాగటంలో ఇజ్రాయెల్, అమెరికాల బాధ్యత ఎంతున్నా, పరిష్కారం కోసం కచ్చితమైన వైఖరితో పట్టుదలగా ప్రయత్నించని దోషం మాత్రం అరబ్ దేశాలదే! వారు ఇప్పటికైనా ఆ పని చేయనట్లయితే, అన్ని దాడులు, పాలస్తీనా హత్యాకాండల దోషం వారిదే అవుతుంది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సమస్యగా కాదు... సదవకాశంగా చూద్దాం!

హెచ్–1బి వీసా రుసుమును పెంచుతూ ట్రంప్ తీసుకున్న నిర్ణయం తాత్కాలికంగా మనల్ని నిస్పృహకు గురి చేసినా... దీర్ఘ కాలంలో మేలు చేస్తుంది. నిజానికి మన 'ఆత్మనిర్భర్' నినాదానికీ, 'అమెరికాను మళ్ళీ గొప్ప దేశంగా చేయడ'మనే (మాగా) ట్రంప్ పిలుపునకూ మధ్య పెద్దగా తేడా ఏమీ లేదు. మరి దానిమీద మనం ఇంతగా స్పందించడం దేనికి?

అమెరికా నిర్ణయం సుశిక్షితులైన, ప్రజ్ఞావంతులు, ప్రతిభావంతులు అయిన భారతీయ వృత్తినిపుణుల సంఖ్యను ఆ దేశంలో తగ్గిస్తుంది. కొత్తగా కాలుమోపబోయే వారి సంఖ్య పరిమితమవుతుంది. అమెరికాకు వెళ్ళడాన్ని నిరుత్సాహపరుస్తుంది. కానీ, ఆ కోవకు చెందినవారికి అమెరికాలో కొరత ఉందన్నది కూడా వాస్తవం. అమెరికా కోణం నుంచి చూస్తే అది న్యాయబద్ధమైనదే. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు గైకొనే హక్కు ట్రంప్‌కు ఉంది. దానిపై మన స్పందన తార్కికమైనదిగా ఉండాలి.

భారతీయ పత్తి పరిశ్రమను 19వ శతాబ్దంలో బ్రిటిష్ పాలకులు నాశనం చేశారు. నేతపనివారినీ, పత్తి పరిశ్రమలో పనిచేస్తున్న చాలా మందినీ బ్రిటన్‌కు తీసుకెళ్ళారు. మాంచెస్టర్ రాత్రికి రాత్రి పత్తి మార్కెట్ కేంద్రంగా అవతరించింది. భారతీయుల్లో చాలా మంది దాన్ని న్యాయవిరుద్ధమైన చర్యగానే పరిగణించారు. ఇంగ్లండ్ ఒక కిలో పత్తిని కూడా ఎన్నడూ పండించకపోయినా, యూరప్ లోనే వస్త్ర పరిశ్రమకు చాలా ముఖ్యమైన కేంద్రంగా మాంచెస్టర్ రూపుదిద్దుకుంది. నిపుణులైన కార్మికులను భారత్ నుంచి బలవంతంగా తీసుకెళ్ళిన కారణంగానే అది సాధ్యమైంది. వాస్తవానికి, ట్రంప్ ఇపుడు దానికి విరుద్ధమైన పని చేస్తున్నారు. సాంకేతిక నిపుణులను లేదా నిపుణులైన సిబ్బందిని తమ దేశం నుంచి పంపించేయాలని చూస్తున్నారు. అమెరికాకు రాకుండా నివారిస్తున్నారు. కానీ, దామాషా ప్రకారం చూస్తే, మనవారిని తీసుకెళ్ళడం వల్ల బ్రిటిష్ వారు బాగుపడినంతగా, మనవారిని పంపించేయడం వల్ల అమెరికా లబ్ధి పొందబోవడం లేదు.

◆ అత్యంత ప్రతిభావంతులైన వృత్తినిపుణులను భారత దేశంలోనే అట్టిపెట్టుకునేందుకు, వారు భారతీయ ప్రయోజనాలకు ఉపయోగపడేటట్లు చేసుకునేందుకు ఇది స్పష్టంగా నిజమైన అవకాశం కల్పిస్తోంది.

ట్రంప్ నిర్ణయం ఆత్మనిర్భర్ భావనను మరింత బలంగా ముందుకు తీసుకెళ్ళేందుకు పురికొల్పినదవుతుంది. ఇందుకు మన ప్రభుత్వం సైన్స్, టెక్నాలజీ, నియంత్రణలపై దృష్టి పెట్టి కీలక రంగాల్లో సత్వర సంస్కరణలు తీసుకురావాలి. సర్వవిధాలా ప్రతిభావంతులను ఆకర్షించి, అండగా నిలిచి, నిలబెట్టుకుని ప్రోత్సహించే సరైన పర్యావరణ వ్యవస్థను సృష్టించాలి. విశ్వవిద్యాలయాలను పటిష్ఠపరచాలి. హెచ్–1బితో ట్రంప్ తాజా దాడి, ఐఐటీలు, ఐఐఎస్‌సీలు తదితర ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి తాజా గ్రాడ్యుయేట్లు తండోపతండాలుగా అమెరికాకు తరలిపోకుండా తగ్గించడానికి, ఇంకా చెప్పాలంటే ఆగిపోవడానికి కూడా తోడ్పడవచ్చు.

అత్యంత ప్రతిభావంతులైన వృత్తినిపుణులను భారతదేశంలోనే అట్టిపెట్టుకునేందుకు, వారు భారతీయ ప్రయోజనాలకు ఉపయోగపడేటట్లు చేసుకునేందుకు ఇది స్పష్టంగా నిజమైన అవకాశం కల్పిస్తోంది. విద్యార్థుల చదువు, శిక్షణలకు ప్రతి ఐఐటీ పైనా భారత్ రూ. 1000 కోట్లకు పైగా వెచ్చిస్తోంది. కానీ, వాటి నుంచి దేశం పూర్తి ఫలాలను నిజంగానే పొందడం లేదు. అమెరికా, యూరప్‌లకు చెందిన అనేక సంస్థల సీఈఓలుగా మన ఐఐటీ మెరికలు పని చేస్తూంటే వారి పేర్లు, పాత్రలను గొప్పగా చెప్పుకుంటూ గర్విస్తున్నాం. భారతీయుల ఆలోచనా శక్తి, వారసత్వం, ప్రజ్ఞాపాటవాలను ప్రపంచంలోని మిగిలిన దేశాలకు వినమ్రంగా, బలంగా, ఆత్మవిశ్వాసంతో చాటి చెప్పేందుకు, నిరూపించుకునేందుకు సమయం ఆసన్నమైంది.

– ప్రొఫెసర్ అర్జుల రామచంద్రారెడ్డి,
మాజీ వైస్ చాన్సలర్, యోగి వేమన యూనివర్సిటీ

చేనేతపై పెనుభారమే!

ఇన్ బాక్స్

మన దేశంలో చేనేత పరిశ్రమ అత్యంత పురాతనమైన వృత్తి. దీనిని దేశ వారసత్వ సంపదగా కూడా గుర్తిస్తారు. వ్యవసాయ రంగం తరువాత దేశంలో ఎక్కువమంది గ్రామీణ ప్రజలు ఆధార పడ్డ రంగం చేనేత రంగం. కానీ ఇటీవల వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పుల్లో భాగంగా చేనేత, టెక్స్‌టైల్ రంగంపై ఏకంగా 18 శాతం జీఎస్టీని విధించడంతో ఆ రంగంపై పెను భారం పడనుంది.

రూ. 1,000 కంటే తక్కువ ధర ఉన్న చేనేత వస్త్రాలపై 5 శాతం, ఆ ధర కంటే ఎక్కువ ధర ఉండే చేనేత వస్త్రాలపై 12 శాతం జీఎస్టీని ఇప్పటివరకు విధించారు. నూతన జీఎస్టీలో భాగంగా 2,500 రూపాయల కంటే తక్కువ ధర ఉండే వస్త్రాలపై 5 శాతం, 2,500 రూపాయల కంటే ఎక్కువ ధర ఉండే చేనేత, ఇతర వస్త్రాలపై ఉన్న 12 శాతం జీఎస్టీని 18 శాతానికి పెంచారు. గత కొన్నేళ్లుగా మార్కెట్‌లో ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఫలితంగా వస్త్రాల ధరలు పెరిగి 5 శాతం స్లాబ్ నుండి 12 శాతం స్లాబ్‌లోకి వచ్చాయి. దీంతో మార్కెట్‌లో డిమాండ్ లేకుండా పోతోంది. ఫలితంగా ఆదాయం కోల్పోయి చాలా కుటుంబాలు చేనేత వృత్తిని వదిలి ఇతర వృత్తులను ఎంచుకుంటున్నాయి. ఇప్పుడు జీఎస్టీని కొన్ని దుస్తులకు పెంచడంతో రానున్న రోజుల్లో చేనేత పరిశ్రమ మరింత నష్టాలను ఎదుర్కోక తప్పదు. ఇప్పుడు దేశంలో పేరొందిన పోచంపల్లి, కంచి, బెనారస్, ధర్మవరం, గద్వాల్ చేనేత వస్త్రాలు కేవలం రూ. 2,500 లోపే మార్కెట్‌లో దొరుకుతాయా? ఎటువంటి శారీరక శ్రమతో పనిలేకుండా కృత్రిమ దారాలతో, యంత్రాల సహాయంతో తయారు చేసే పాలిస్టర్ వంటి వస్త్రాలపై జీఎస్టీని 12 శాతం నుండి 5 శాతానికి తగ్గించడం ఈ సందర్భంగా గమనార్హం. ఈ వస్త్రాలు తక్కువ ధర లకు లభించడంతో వినియోగదారులు వాటిపై మొగ్గుచూపే అవకాశం ఉంటుంది. ఫలితంగా చేనేత పరిశ్రమకు మరింత నష్టాలు వచ్చే అవకాశం ఉంది. నిజానికి చేనేత వస్త్రాలు విలాసవంతమైన వస్తువులు కావు. అవి భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక. ముఖ్యంగా, లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తున్నాయి. అలాంటి ఉత్పత్తులపై జీఎస్టీని తీసివేయాలి. లేదా ధరల సీలింగ్ లిమిట్‌ను హేతుబద్ధీకరించాలి. స్వదేశీ వస్తువులనే ప్రోత్సహించాలి. 'వోకల్ ఫర్ లోకల్', స్వదేశంలోనే ప్రతి వస్తువును తయారు చేయాలంటూ 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్భర్ భారత్' అంటున్న కేంద్ర ప్రభుత్వం... స్వదేశీ సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే చేనేత వస్త్రాలపై జీఎస్టీ విషయంపై పునఃసమీక్ష చేయాలి.




– డా॥ రామకృష్ణ బందారు
కామర్స్ అధ్యాపకులు, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ

ఆర్టీఐ దరఖాస్తుల వెల్లువ

డేటా పాయింట్

కేంద్ర ప్రభుత్వానికి, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలకు వస్తున్న సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) దరఖాస్తులు ఏటా పెరుగుతున్నాయి.



ఆధారం: డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్

స్థిత ప్రజ్ఞత్వం



'పుట్టినవారు మరణించటం తథ్యం. చనిపోయినవారు మళ్ళీ పుట్టటం తప్పదు. ఇది నివారించలేని విషయం' అని భారతీయుల విశ్వాసం. ఎందరో మహానుభావులు వేల సంవత్సరాలు గొప్ప తపస్సు చేసి, మరణం లేని వరాన్ని కోరుకుని, అది సాధ్యం కాదని తెలుసుకుని, తమకనుకూలంగా ఉండే విధంగా మరణాన్ని కోరుకున్నారు. కాబట్టి, నివారించలేని విషయాన్ని గురించి చింతించటం వ్యర్థం.

ఈ పుడమిపై పుట్టిన వారందరూ కర్మలు చేయాలి. ఏ లక్ష్యం లేకుండా జీవించకూడదు. అయితే కర్మ ఫలాల పట్ల ఆసక్తిని త్యజించి, జయాపజయాల భారం దైవానికే వదిలిపెట్టాలి. అప్పుడు ఎటువంటి ఫలితమైనా బాధించదు. 'స్థితప్రజ్ఞత్వం' గలవారికి మాత్రమే ఇది సాధ్యం. స్థితప్రజ్ఞుని లక్షణాలు ఏమిటని అర్జునుడు కృష్ణుని (భగవద్గీతలో) అడుగుతాడు. సమస్త విషయాలలో సమబుద్ధి, స్థిరచిత్తం కలిగి ఉండటమే 'స్థిత ప్రజ్ఞత్వం' అని కృష్ణుడు సమాధానం చెబుతాడు. దుఃఖాలకు ఉద్వేగం పొందకూడదు. సుఖాలకు పొంగిపోకూడదు. శుభాశుభాలు పొందినపుడు ఆనందించక, ద్వేషించక తామరాకు మీద నీటి బొట్టులా అతీతంగా ఉండటమే స్థితప్రజ్ఞత్వం.

పండితులైనా, సామాన్యులైనా ఇంద్రియాలను ఎంత నిగ్రహించాలని ప్రయత్నించినా అవి మనసును లౌకిక విషయాల మీదకు మళ్ళించేస్తాయి. ఇంద్రియ నిగ్రహం అభ్యాసంతో సాధించాలి. ధ్యానంతో సాధించాలి. ఎవరి ఇంద్రియాలు స్వాధీనంలో ఉంటాయో వారి ప్రజ్ఞ స్థిరంగా ఉంటుంది.

లౌకిక విషయాలను గురించే తలపోస్తూ ఉండేవారికి వాటితోనే సంబంధం బలపడుతుంది. వారు కామ, క్రోధాలకు వశులవుతారు. ఈర్ష్య, అసూయలకు వశులవుతారు. స్థిరబుద్ధి కలవారు వీటికి దూరంగా ఉంటారు. మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడు అన్ని దుఃఖాలూ నశిస్తాయి. ప్రశాంత మనస్కుని బుద్ధి త్వరలోనే స్థిరత్వం పొందుతుంది. అన్ని కోరికలనూ వదిలి అహంకార, మమకారాలను విడిచినవారు శాంతిని పొందుతారు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి



దుర్గమ్మకు మల్లన్న పట్టువస్త్రాలు

శ్రీశైలం టెంపుల్: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రి పైనున్న శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్లకు శ్రీశైల దేవస్థానం తరఫున గురువారం పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు దంపతులు, ఏఈఓ హరిదాసు, పర్యవేక్షకులు ఉమేష్, అర్చకులు, వేదపండితులు, పలువురు అధికారులు సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలను సమర్పించారు.

ఇంటర్ బోర్డులో అవకతవకలపై విచారణ చేపట్టాలి

- టీజీఎల్ఏ ప్రధాన కార్యదర్శి

సాక్షి, హైదరాబాద్ : ఇంటర్ బోర్డు కార్యాలయంలో నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని టీజీఎల్ఏ ప్రధాన కార్యదర్శి మాచర్ల రామకృష్ణ గౌడ్ డిమాండ్ చేశారు. బోర్డులో అధికార దుర్వినియోగం, నిధుల దుర్వినియోగానికి సంబంధించిన వివరాలను సీఎంవోలో సమర్పించినట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. బోర్డులో ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రభుత్వ బ్యాంకు డిపాజిట్లను ప్రైవేటు బ్యాంకులకు బదిలీ చేశారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పరిపాలన, ఆర్థిక కమిటీ అనుమతి లేకుండా బిల్డింగ్ మరమ్మతులు, 6 వేల కెమెరాల కొనుగోలు, 2 వేల సీసీ కెమెరాలు అద్దెకు తీసుకున్నారన్నారు.

సిరిసిల్ల కలెక్టర్ తీరు ఆక్షేపణీయం

- తీవ్రంగా మందలించాలని సీఎస్‌కు హైకోర్టు ఆదేశం
- ప్రజాస్వామ్యంపై నమ్మకం పోయేలా వ్యవహరించారని ఆగ్రహం
- నిర్వాసితురాలి పిటిషన్‌ను అనుమతిస్తూ తీర్పు

సాక్షి, హైదరాబాద్: తమ ఆదేశాలు పాటించకపోగా భూ నిర్వాసితురాలిపై క్రిమినల్ కేసు పెట్టి రాజన్న సిరిసిల్ల కలెక్టర్ చట్ట నియమాలను ఉల్లంఘించారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషనర్ హక్కులను, స్వేచ్ఛాయుత జీవనాన్ని, ప్రాథమిక హక్కులను హరించేలా ప్రవర్తించారని మండిపడింది. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తీరు ఆక్షేపణీయమని, ఆయను పిలిచి తీవ్రంగా మందలించాలని సీఎస్‌ను ఆదేశించింది. ఇంకా సర్వీసు ఉన్నందున ఆయన సర్వీసులో కొనసాగాలన్న ఒకే ఒక్క కోణంలో చూసి నేరుగా తామే చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయడం లేదని చెప్పింది. పిటిషనర్‌పై ప్రభుత్వం కేసు ఉపసంహరించుకుంటామని చెప్పినందున వేరే ఉత్తర్వులు అవసరం లేదంటూ నిర్వాసితురాలి పిటిషన్‌ను అనుమతిస్తూ తీర్పునిచ్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన వనపట్ల కవిత ఇంటిని ప్రభుత్వం 2004లో సేకరించింది. అయితే నిర్వాసితుల జాబితాలో తన పేరు లేదంటూ కవిత హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ జాబితాలో ఆమె పేరు చేర్చి పరిహారం చెల్లించాలని హైకోర్టు గతంలో ఆదేశించింది. ఈ ఉత్తర్వులు అమలు కాలేదంటూ కవిత కోర్టు ధిక్కరణ పిటిషన్ వేయగా పరిహారం చెల్లించాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ ప్రభుత్వం అప్పీల్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యాలు విచారణలో ఉన్నాయి.

కలెక్టర్ లేఖ ఆధారంగా ఎఫ్ఐఆర్

కోర్టును తప్పుదోవపట్టించి ఉత్తర్వులు పొందారంటూ కవితపై సివిల్/క్రిమినల్ చర్యలకు ఉపక్రమించాలని ఆర్డీవో, వేములవాడ తహసీల్దార్‌కు కలెక్టర్ లేఖలు రాశారు. ఈ లేఖ ఆధారంగా తహసీల్దార్ ఫిర్యాదు చేయడంతో వేములవాడ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలంటూ కవిత అప్పుడు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి విచారణ చేపట్టి న్యాయస్థానాలపై కలెక్టర్‌కు గౌరవం లేదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తి ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. తప్పుడు సమాచారంతో కోర్టు నుంచి ఉత్తర్వులు పొంది ఉంటే తమకు చెప్పకుండా పిటిషనర్‌పై పోలీసు కేసు నమోదు పెట్టడం చట్టవిరుద్ధమని అప్పుడు తీర్పు ఇచ్చారు. కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా చర్యలు తీసుకొనే అధికారం కలెక్టర్‌కు లేదన్నారు.

2,620 వైన్ షాపుల ఏర్పాటుకు నోటిఫికేషన్

- ఈ నెల 26 నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తుల స్వీకరణ
- అక్టోబర్ 23న లక్కీ డ్రా ద్వారా దుకాణాల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే రెండేళ్ల కాలానికి (డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30 వరకు) కొత్త మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలో 2,620 మద్యం దుకాణాలకు ఈ నెల 26 నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులను స్వీకరించనుంది. దరఖాస్తు రుసుమును రూ. 3 లక్షలుగా ఎక్సైజ్‌శాఖ నిర్ణయించింది. తద్వారా దాదాపు రూ. 3 వేల కోట్ల ఆదాయం ఖజానాకు చేరుతుందని అంచనా వేస్తోంది. దరఖాస్తుతోపాటు రూ. 3 లక్షల డీడీ లేదా చలాన్ రూపంలో చెల్లించిన రసీదు జత పరచాల్సి ఉంటుందని ఎక్సైజ్‌శాఖ పేర్కొంది. ఒక వ్యక్తి ఎన్ని దుకాణాల కోసమైనా దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉంది. మద్యం దుకాణాల్లో గౌడ కులస్తులకు 15%, ఎస్సీలకు 10%, ఎస్టీలకు 5% రిజర్వేషన్లు కల్పించారు. ఆయా దుకాణాలకు దరఖాస్తు చేసుకొనే వారు ఫీజుతోపాటు కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ గడువులోగా ఆ పత్రం అందకపోతే నవంబర్ 15 వరకు సమర్పించే వెసులుబాటు ఇచ్చారు. ఈ మేరకు హామీ పత్రాలను జత చేయాల్సి ఉంటుంది. దరఖాస్తులను రిజిస్టర్ పోస్ట్, మొయిల్ ద్వారా పంపిస్తే స్వీకరించబోమని ఆబ్కారీ శాఖ తెలిపింది. దరఖాస్తులు అందజేసిన వారికి రసీదుతోపాటు అక్టోబర్ 23న డ్రాలో పాల్గొనడానికి అవసరమైన ఎంట్రీ పాసు రసీదు ఇస్తామని పేర్కొంది. ఎక్సైజ్ చట్టం 1968 ప్రకారం శిక్ష పడిన వారు, ప్రభుత్వానికి బకాయిలు పడి సక్రమంగా చెల్లింపులు చేయని వారు దుకాణాలు పొందేందుకు అనర్హులు.

30న ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ

- 27న బతుకమ్మ కార్నివాల్.. 28న బైక్, సైకిల్ ర్యాలీలు
- 29న సరూర్‌నగర్ స్టేడియంలో బతుకమ్మ.. 10 వేల మందితో గిన్నిస్ రికార్డుకు ప్రయత్నం
- మంత్రులు జూపల్లి, కొండా సురేఖ, సీతక్క వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 30వ తేదీన ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నామని మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క తెలిపారు. 29న గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లక్ష్యంగా సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని, ఆ దిశగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో అధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ నెల 27న ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ కార్నివాల్, 28న బైక్, సైకిల్ ర్యాలీలు, 29న సరూర్‌నగర్ స్టేడియంలో 10 వేల మంది మహిళలతో బతుకమ్మ గిన్నిస్ రికార్డు, 30న ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ ఉంటాయని తెలిపారు. అందుకోసం ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బతుకమ్మలను నిమజ్జనం చేసే ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పండుగ ప్రాశస్త్యానికి అద్దం పట్టేలా హైదరాబాద్‌లో చారిత్రక ప్రదేశాలతోపాటు ప్రధాన జంక్షన్లను అందమైన ఆకృతులతో, విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. సరూర్‌నగర్ స్టేడియంలో 29న 63 అడుగుల ఎత్తయిన బతుకమ్మను ఏర్పాటు చేసి గిన్నిస్‌కెక్కేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ సమీక్షలో రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ వల్లూరు క్రాంతి, భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి పాల్గొన్నారు.



ప్రజాపాలన బతుకమ్మ పాటను ఆవిష్కరిస్తున్న కొండా సురేఖ, జూపల్లి, సీతక్క. చిత్రంలో రమ్యారావు

రామ రామ రామ ఉయ్యాలో..

సచివాలయంలో బతుకమ్మ ఉత్సవాలు

తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో తెలంగాణ సచివాలయం పచ్చదనంతో నిండిపోయింది. తెలంగాణ సచివాలయంలో గురువారం సంప్రదాయాలకు అద్దం పట్టేలా బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులతో మంత్రులు సీతక్క, కొండా సురేఖ బతుకమ్మ ఆడారు. తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ బతుకమ్మ ఉత్సవాలలో.. సచివాలయంలోని ఉన్నతాధికారుల నుంచి అన్ని స్థాయిల్లోని మహిళా ఉద్యోగులు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు.



రైలు నుంచి అగ్ని వర్షం

అగ్ని-ప్రైమ్ క్షిపణి పరీక్ష విజయవంతం • డీఆర్‌డీఓ అరుదైన ఘనత • మిస్సైల్ పరిధి 2,000 కిలోమీటర్లు





న్యూఢిల్లీ: రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) అరుదైన ఘనత సాధించింది. ఇంటర్మీడియెట్ రేంజ్ అగ్ని-ప్రైమ్ క్షిపణిని రైలు ఆధారిత మొబైల్ లాంచర్ నుంచి విజయవంతంగా పరీక్షించింది. బుధవారం జరిగిన ఈ పరీక్షలో స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్(ఎస్ఎఫ్‌సీ) సైతం పాలుపంచుకుంది. అయితే, ఈ పరీక్ష ఎక్కడ చేపట్టారన్నది రక్షణ శాఖ బహిర్గతం చేయలేదు. స్థిరమైన ప్రదేశం నుంచి కాకుండా పట్టాలపై పరుగులు తీస్తున్న రైలు నుంచి మిస్సైల్‌ను పరీక్షించడం భారత క్షిపణి తయారీ రంగంలో ఒక కీలకమైన మైలురాయిగా భావిస్తున్నారు. క్షిపణులను దేశంలో ఎక్కడికైనా రైలులో సులభంగా తరలించే సామర్థ్యాన్ని భారత్ సాధించడం గమనార్హం. తదుపరి తరం అగ్ని-ప్రైమ్ మిస్సైల్ పరిధి 2,000 కిలోమీటర్లు. ఈ పరీక్ష విజయవంతం కావడం పట్ల రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తంచేశారు. రైలు నెట్‌వర్క్ నుంచి ఆయుధ వ్యవస్థను ప్రయోగించే సామర్థ్యం కలిగిన అతికొద్ది దేశాల జాబితాలో భారత్ సైతం సగర్వంగా చేరిందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా డిజైన్ చేసిన రైలు ఆధారిత మొబైల్ లాంచర్ నుంచి అగ్ని-ప్రైమ్‌ను సక్సెస్‌ఫుల్‌గా పరీక్షించినట్లు స్పష్టంచేశారు. అతి తక్కువ సమయంలోనే మిస్సైల్‌ను ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తరలించి, ప్రయోగించే సత్తా మన సొంతమని ఉద్ఘాటించారు. ఈ మేరకు రాజ్‌నాథ్ సింగ్ గురువారం 'ఎక్స్'లో పోస్టుచేశారు.

అత్యాధునిక క్షిపణి

అగ్ని-ప్రైమ్ క్షిపణి అత్యాధునికమైనదని రక్షణ శాఖ వెల్లడించింది. అగ్ని బాలిస్టిక్ క్షిపణుల శ్రేణిలో దీన్ని అభివృద్ధి చేశారు. ఇందులో నూతన తరం కమ్యూనికేషన్ వ్యవస్థలు, రక్షణ యంత్రాంగం ఉన్నట్లు పేర్కొంది. గ్రౌండ్ స్టేషన్ నుంచి క్షిపణిని నియంత్రించవచ్చని స్పష్టంచేసింది. భవిష్యత్తులో రక్షణ దళాల్లో రైలు ఆధారిత ఆయుధ వ్యవస్థలు, క్షిపణులను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు తెలియజేసింది. అగ్ని-ప్రైమ్ క్షిపణి పరీక్ష కార్యక్రమంలో డీఆర్‌డీఓ, ఎస్ఎఫ్‌సీ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. 'రోడ్ మొబైల్ వేరియెంట్' అగ్ని-ప్రైమ్ క్షిపణులను ఇప్పటికే రక్షణ దళాల్లో ప్రవేశపెట్టారు. పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో భారత్-పాకిస్తాన్ మధ్య ఘర్షణ జరిగిన తర్వాత నాలుగున్నర నెలల్లోగా రైలు ఆధారిత మొబైల్ లాంచర్‌తో మిస్సైల్‌ను విజయవంతంగా పరీక్షించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

గేమ్ చేంజర్

అగ్ని-ప్రైమ్ పరీక్ష కోసం రైలును ప్రత్యేకంగా రూపొందించారు. సాధారణ రైళ్లు ప్రయాణించే పట్టాలపైనే ఇది పరుగులు తీస్తుంది. శత్రు దేశాల రాడార్లు గుర్తించకుండా క్షిపణిని రైలు లోపల దాచిపెట్టి తరలించవచ్చు. వర్షం, ఎండ, చలి వంటి వాతావరణ పరిస్థితుల్లోనూ తరలించే అవకాశం ఉండడం మరో ప్రత్యేకత. దేశవ్యాప్తంగా రైలు నెట్‌వర్క్ ఉండడం సైన్యానికి కలిసొచ్చే అంశం. క్షిపణులను రైలు ద్వారా ఎక్కడికైనా తీసుకెళ్లవచ్చు. ఇదొక 'గేమ్ చేంజర్' అని డీఆర్‌డీఓ వర్గాలు స్పష్టంచేశాయి. రష్యా, చైనా తదితర దేశాలు రైలు ఆధారిత మొబైల్ మిస్సైల్ వ్యవస్థలను అభివృద్ధి చేసుకున్నాయి. అణుశక్తి సంపన్న దేశమైన భారత్ బహుళ రీతుల్లో క్షిపణులను ప్రయోగించే సామర్థ్యాన్ని సొంతం చేసుకోవడం గమనార్హం.

నూతన తేజస్సు

- రూ.62,370 కోట్లతో 97 తేజస్ ఎంకే-1ఏ ఫైటర్ జెట్ల కొనుగోలు
- హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌తో రక్షణ శాఖ ఒప్పందం

న్యూఢిల్లీ: భారత వైమానిక దళం(ఐఏఎఫ్) మరింత శక్తివంతంగా మారనుంది. అత్యాధునిక యుద్ధ విమానాల రాకతో ఐఏఎఫ్ కొత్త తేజస్సును సంతరించుకోనుంది. ఏకంగా 97 తేజస్ ఎంకే-1ఏ తేలికపాటి యుద్ధ విమానాల(ఎల్‌సీఏ) కొనుగోలుకు హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)తో భారత రక్షణ శాఖ గురువారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం విలువ పన్నులు మినహా రూ.62,370 కోట్లు. తేజస్ యుద్ధ విమానాల కొనుగోలుకు ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలోని కేబినెట్ కమిటీ నెల రోజుల క్రితమే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఒప్పందం ప్రకారం.. 2027–28 నుంచి యుద్ధ విమానాల అప్పగింత ప్రారంభమవు తుంది. ఆరేళ్లలోగా మొత్తం విమానాలను రక్షణ శాఖకు హెచ్ఏఎల్ అప్పగించాల్సి ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. ఇందులో 68 ఫైటర్ జెట్లు, 29 ట్విన్ సీటర్ విమానాలు ఉన్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించాయి.

ఏటా 11,750 మందికి ఉద్యోగాలు, ఉపాధి

ప్రభుత్వ రంగంలోని హెచ్ఏఎల్‌తో ఇలాంటి భారీ ఒప్పందం కుదుర్చుకోవడం ఇది రెండోసారి. 2021 ఫిబ్రవరిలో రూ.48,000 కోట్లతో 83 తేజస్ ఎంకే-1ఏ ఫైటర్ జెట్ల కొనుగోలు కోసం హెచ్ఏఎల్‌తో రక్షణ శాఖ ఒప్పందం చేసుకుంది. 2021 కంటే ఈసారి తయారు చేయబోతున్న ఫైటర్ జెట్లు మరింత ఆధునికమైనవి. ఇందులో 64 శాతం దేశీయ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానమే ఉంటుంది. అదనంగా 67 పరికరాలు చేర్చ బోతున్నారు. దేశీయంగా అభివృద్ధి చేసిన అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌ను చేర్చనున్నారు. ప్రతి ఏటా ప్రత్యక్షంగా, పరోక్షంగా 11,750 మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తా యని అంచనా. మొత్తం ఆరేళ్లపాటు ఒప్పందం అమల్లో ఉంటుంది. ఆత్మనిర్భర్ లక్ష్యానికి ఇదొక ప్రతీక అని అధికార వర్గాలు అభి వర్ణించాయి. ఆరు దశాబ్దాలకుపైగా సేవ లందించిన మిగ్–21 యుద్ధ విమానాలకు వీడ్కోలు పలుకుతూ వాటి స్థానంలో తేజస్ ఎంకే-1ఏ ఫైటర్ జెట్లను ప్రవేశపెట్టబో తున్నారు.

నేడు మిగ్–21 జెట్లకు వీడ్కోలు

ఘనమైన చరిత్ర కలిగిన మిగ్–21 యుద్ధ విమానాలకు వీడ్కోలు పలికే సమయం వచ్చేసింది. శుక్రవారం బైబై చెప్పబో తున్నారు. చండీగఢ్‌లోని ఎయిర్ ఫోర్స్ స్టేషన్ వేదిక కానుంది.

జీఎస్టీ సంస్కరణలు ఆగవు..!

ప్రజలపై పన్నుల భారం మరింత తగ్గిస్తాం

- కాంగ్రెస్ పాలనలో ట్యాక్స్ లూటీ
- సామాన్యులపై విపరీతంగా పన్నులు
- ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం

గ్రేటర్ నోయిడా/న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను(జీఎస్టీ)లో సంస్కరణలు ఇకపైనా కొనసాగుతాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ప్రజలపై పన్నుల భారం మరింత తగ్గుతుందని, దేశ ఆర్థిక వ్యవస్థ బలం పుంజుకుంటుందని అన్నారు. జీఎస్టీలో నిర్మాణాత్మక సంస్కరణలు దేశ ఆర్థిక రంగానికి కొత్త రెక్కలు తొడుగుతున్నాయని వ్యాఖ్యానించారు. సంస్కరణల విషయంలో బలమైన సంకల్ప శక్తి మనకు ఉందని ఉద్ఘాటించారు. దేశంలో ప్రజాస్వామ్య, రాజకీయ స్థిరత్వం కొనసాగుతుండడం సానుకూల అంశాలని వివరించారు. గురువారం ఉత్తరప్రదేశ్‌లో ఇంటర్నేషనల్ ట్రేడ్ షో–2025ను మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ ప్రభుత్వం పన్నుల భారాన్ని క్రమంగా తగ్గిస్తోందని, ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తోందని అన్నారు. జీఎస్టీలో ఇటీవలే కొత్త సంస్కరణలు తీసుకొచ్చామని, దీనివల్ల దేశ ప్రజలకు ఈ ఏడాది రూ.రెండున్నర లక్షల కోట్ల మేర లబ్ధి చేకూరుతుందని వివరించారు. నేడు దేశమంతా 'జీఎస్టీ ఆదా ఉత్సవాన్ని' గర్వంగా నిర్వహించుకుంటోందని వ్యాఖ్యానించారు. ఇది ఇక్కడితో ఆగదని, ప్రజల ఆశీస్సులతో జీఎస్టీలో మరిన్ని సంస్కరణలు తీసుకొస్తామని తేల్చిచెప్పారు. ప్రధాని మోదీ ఇంకా ఏం చెప్పారంటే...

అవరోధాలే మనకు కొత్త దారులు

''గత ప్రభుత్వాలు పాలనలో విఫలమయ్యాయి. అప్పటి నిర్వాకాలను కప్పిపుచ్చుకోవడానికి మా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. కాంగ్రెస్ పాలనలో సామాన్య ప్రజలపై విపరీతంగా పన్నులు విధించారు. ట్యాక్స్ లూటీ జరిగింది. ప్రజలు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. 2047 నాటికి 'పూర్తిగా అభివృద్ధి చెందిన భారత్' మన లక్ష్యం. ఆ దిశగానే దేశం పరుగులు తీస్తోంది. అంతర్జాతీయంగా పలు సవాళ్లు, అవరోధాలు ఉన్నప్పటికీ మన దేశం ఆకర్షణీయమైన ప్రగతి సాధిస్తోంది. అవరోధాలు మనకు అడ్డంకి కాదు. అవే మనకు కొత్త దారులు చూపిస్తున్నాయి. రాబోయే దశాబ్దాల కోసం ఇప్పుడే బలమైన పునాది వేస్తున్నాం. మన సంకల్పం ఆత్మనిర్భర్ భారత్. మన అవసరాలు తీర్చుకోవడానికి ఇతరులపై ఆధారపడడం కంటే నిస్సహాయత ఇంకేమైనా ఉంటుందా? రోజురోజుకీ మారుతున్న నేటి ప్రపంచంలో ఇతర దేశాలపై ఆధారపడితే అభివృద్ధి విషయంలో మనం రాజీపడాల్సి వస్తుంది. అందుకే మనం స్వయం సమృద్ధి సాధించాలి. మనం వాడుకొనే ప్రతి వస్తువూ ఇక్కడే తయారు కావాలి. మేడ్ ఇన్ ఇండియా సరుకులే మనం కొనుగోలు చేయాలి.

రష్యాతో స్నేహబంధం బలోపేతం

రష్యాతో మన స్నేహబంధం కాలపరీక్షకు నిలిచింది. రెండు దేశాల మధ్య రక్షణ సహకారం అవిచ్ఛిన్నంగా కొనసాగుతోంది. ఈసారి ఇంటర్నేషనల్ ట్రేడ్ షోలో రష్యా సైతం భాగస్వామి. ఈ కార్యక్రమం ద్వారా రష్యాతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటాం. రష్యా భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీలో ఏకే–203 రైఫిళ్ల తయారీ త్వరలోనే ప్రారంభం కాబోతోంది. ఉత్తరప్రదేశ్‌లో డిఫెన్స్ కారిడార్‌ను అభివృద్ధి చేస్తున్నాం. ఇక్కడ బ్రహ్మోస్ క్షిపణులు, ఆయుధ వ్యవస్థల తయారీ ఇప్పటికే ప్రారంభమైంది. దేశంలో స్వావలంబనను బలోపేతం చేసే విధానాలు రూపొందించాలని వ్యాపారులు, వాణిజ్యవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలను కోరుతున్నా. సైనిక దళాలకు అవసరమైన ఆయుధాలు, రక్షణ వ్యవస్థల కోసం విదేశాలపై ఆధారపడడం తగ్గించుకోవాలి. మనకు కావాల్సినవి మన దేశంలోనే తయారు చేసుకుందాం. సైన్యం వాడుకొనే వస్తువులు, ఆయుధాలపై మేడ్ ఇన్ ఇండియా ముద్ర ఉండాల్సిందే'' అని ప్రధాని మోదీ వివరించారు.



ఆహార శుద్ధి రంగంలో పెట్టుబడులు పెట్టండి

భారత ఆహార శుద్ధి రంగంలో పెట్టుబడులు పెట్టాలని అంతర్జాతీయ సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు మోదీ చెప్పారు. దేశంలో ఈ రంగంలో వ్యాపారాభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గత పదేళ్లుగా తమ ప్రభుత్వం ఆహార శుద్ధి రంగాన్ని ఎంతగానో ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. ఉత్పత్తి అనుసంధాన పథకాలు ప్రవేశపెట్టామని, మెగా ఫుడ్ పార్కులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వీటివల్ల ఆహార శుద్ధి సామర్థ్యం 20 రెట్లు పెరిగిందని, ఎగుమతులు రెండు రెట్లు పెరిగాయని ఉద్ఘాటించారు. గురువారం ఢిల్లీలో 'వరల్డ్ ఫుడ్ ఇండియా' నాలుగో ఎడిషన్ కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. శుద్ధి చేసిన ఆహారాన్ని నిల్వ చేయడానికి పర్యావరణహిత బయో డిగ్రేడబుల్ ప్యాకేజింగ్ తయారీలో సైతం పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను కోరారు.

విద్యుత్ ఉత్పత్తి అత్యవసరం

విద్యుత్ ఉత్పత్తి ప్రాధాన్యతను గత కాంగ్రెస్ ప్రభుత్వాలు విస్మరించాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. 21వ శతాబ్దంలో ఏ దేశమైనా వేగంగా ప్రగతి సాధించాలంటే విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవడం అత్యవసరమని స్పష్టంచేశారు. గురువారం రాజస్తాన్‌లోని బనస్వర జిల్లాలో ఆయన పర్యటించారు. రూ.1.22 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఇందులో రూ.42,000 కోట్లతో నిర్మించనున్న అణు విద్యుత్ ప్రాజెక్టు కూడా ఉంది. ఈ సందర్భంగా బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్ పాలనలో విచ్చలవిడిగా విద్యుత్ ఉండేదని, గ్రామాల్లో కనీసం ఐదు గంటలు కూడా కరెంటు సరఫరా అయ్యేది కాదని చెప్పారు. తగినంత విద్యుత్ లేకపోవడంతో కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాలేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. నేడు దేశవ్యాప్తంగా ప్రతి గ్రామానికీ విద్యుత్ సరఫరా అవుతోందని, ప్రజల జీవనం సులభతరంగా మారిందని అన్నారు. క్లీన్ ఎనర్జీలో ముందంజలో ఉన్న దేశాలు విజయవంతమైన దేశాలుగా కీర్తినందుకుంటాయని స్పష్టంచేశారు. బనస్వర జిల్లాలో 'పీఎం–కుసుమ్' పథకం లబ్ధిదారులతో ప్రధాని మోదీ సంభాషించారు. రైతుల అనుభవాలు అడిగి తెలుసుకున్నారు.

నేడు బిహార్ పథకం ప్రారంభం

బిహార్‌కు సంబంధించిన 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన'ను మోదీ శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద 75 లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాల్లోకి రూ.10,000 చొప్పున బదిలీ చేస్తారు. మొత్తం రూ.7,500 కోట్లు విడుదల చేయబోతున్నారు. మహిళల సాధికారత, స్వావలంబనే లక్ష్యమని బిహార్ ప్రభుత్వం వెల్లడించింది.

పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు మరింత పారదర్శకం: ఈసీ

న్యూఢిల్లీ: లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోలయ్యే పోస్టల్ ఓట్ల లెక్కింపును మరింత పారదర్శకంగా చేపట్టేందుకు ఎన్నికల కమిషన్(ఈసీ) చర్యలు తీసుకుంది. ప్రస్తుతం కౌంటింగ్ రోజు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును ఉదయం 8 గంటలకు, ఈవీఎంల కౌంటింగ్‌ను ఉదయం 8.30 గంటలకు మొదలు పెడుతున్నారు. ఈ విధానంలో ఈవీఎంల లెక్కింపు పూర్తయినా పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఇంకా కొనసాగిన సందర్భాలు సైతం ఉండేవి. అయితే చాలా సందర్భాల్లో ఈవీఎంల కంటే ముందుగానే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. అయితే ఏకరూపత, స్పష్టత కోసం పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతున్న కౌంటింగ్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పూర్తయిన తర్వాతే చివరి రెండు రౌండ్ల ఈవీఎంల లెక్కింపు చేపట్టాలని ఈసీ నిర్ణయం తీసుకుంది. వచ్చే నవంబర్‌లో బిహార్ అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో మొదటిసారిగా ఈ విధానం అమల్లోకి రానుంది.

ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు సర్కోజీకి ఐదేళ్ల జైలు



పారిస్: ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీ(70)కి ఐదేళ్ల జైలు శిక్ష పడింది. లిబియా నేత దివంగత కల్నల్ గడాఫీ నుంచి అక్రమంగా లక్షలాది యూరోలను పొందేందుకు నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు తేలడంతో పారిస్ క్రిమినల్ కోర్టు ఈ మేరకు గురువారం తీర్పు వెలువరించింది. ఈ తీర్పుపై మాజీ అధ్యక్షుడు అప్పీలుకు వెళ్లినా జైలుకు వెళ్లక తప్పదని జడ్జి పేర్కొనడం గమనార్హం. లిబియాపై అప్పట్లో పశ్చిమదేశాలు విధించిన ఆంక్షలను సడలించేందుకు సర్కోజీ సాయమందించడం, ప్రతిగా సర్కోజీ ఎన్నికల ప్రచారానికి గడాఫీ నిధులను సమకూర్చడం ఈ కుట్రలో కీలకంగా ఉన్నాయి. సర్కోజీ 2007–12 కాలంలో ఫ్రాన్స్ అధ్యక్షుడిగా ఉన్నారు.

2 పెన్నులు.. 19 బ్రష్‌లు.. 29 స్పూన్లు

హాపూర్(యూపీ): డ్రగ్స్‌కు బానిసై వైద్యచికిత్సలు చేయించుకుంటున్న ఓ వ్యక్తి కడుపులో పెన్నులు, టూత్ బ్రష్‌లు, స్పూన్లు బయట పడ్డాయి. ఉత్తర ప్రదేశ్‌లోని హాపూర్‌కు చెందిన దేవనందని ప్రైవేట్ ఆస్పత్రిలో ఈ విడ్డూరం చోటుచేసుకుంది. బులంద్‌షహర్‌కు చెందిన సచిన్ అనే వ్యక్తి డీ అడిక్షన్ సెంటర్‌లో చేరారు. తీవ్రమైన కడుపునొప్పి తో బాధపడుతున్న అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అల్ట్రాసౌండ్ పరీక్షలో అతడి పొట్టలో ఏవో వస్తువులు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. సర్జరీ చేసి, లోపలున్న 2 పెన్నులు, 19 టూత్ బ్రష్‌లు, 29 చెంచాలను వెలికి తీసి, అతడి ప్రాణాలను కాపాడారు.

ఆ 'మూడు విధ్వంసాల'పై దర్యాప్తు జరగాల్సిందే

- ఐరాసలో తనకు ఎదురైన అనుభవాలపై ట్రంప్ గరం గరం
- ట్రంప్ జనరల్ అసెంబ్లీకి వెళ్తుండగా ఆగిపోయిన ఎస్కలేటర్
- ప్రసంగిస్తుండగా నిలిచిపోయిన టెలిప్రాంప్టర్
- తన ప్రసంగం ఆడియో కూడా ఎవరికీ వినపడలేదన్న ట్రంప్
- ఈ విధ్వంసాలకు ఐరాస సిగ్గుపడాలని ట్రూత్ సోషల్‌లో ఆగ్రహం



ఆగిపోయిన ఎస్కలేటర్ మీద ట్రంప్, మెలానియా

న్యూయార్క్: ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా తనకు ఎదురైన చేదు అనుభవాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్కలేటర్, టెలీప్రాంప్టర్, ప్రసంగం సమయంలో ఆడియో ఆగిపోవటం యాదృచ్ఛికంగా జరిగిన పొరపాట్లు కాదని తన సొంత సోషల్‌మీడియా ప్లాట్‌ఫాం ట్రూత్ సోషల్‌లో బుధవారం అసహనం వ్యక్తం చేశారు. ఈ మూడు ఘటనలను 'మూడు విధ్వంసాలు'అని పేర్కొన్న ఆయన.. ఆ ఘటనలపై లోతుగా దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలకు ఐక్యరాజ్యసమితి సిగ్గుపడాలని ఆగ్రహం వ్యక్తంచేశారు.

అసలేం జరిగింది?

మూడు రోజుల క్రితం ఐరాస జనరల్ అసెంబ్లీలో ప్రసంగించేందుకు ఆ సంస్థ ప్రధాన కార్యాలయానికి ట్రంప్ వెళ్లారు. ఆయన ప్రధాన హాలులోకి వెళ్లేందుకు తన సతీమణి మెలానియా ట్రంప్‌తో కలిసి ఎస్కలేటర్ ఎక్కగానే అది ఆగిపోయింది. దీంతో వారు ఇద్దరు మెట్లు ఎక్కుతూ జనరల్ అసెంబ్లీ హాలులోకి వెళ్లారు. అక్కడ ప్రపంచ దేశాల ప్రతినిధులను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగం ప్రారంభించగానే టెలిప్రాంప్టర్ (ప్రసంగ పాఠం కనిపించే తెర) ఆగిపోయింది. దీంతో ఆయన ప్రసంగ పాఠం లేకుండానే 57 నిమిషాలు ఉపన్యాసం కొనసాగించారు. 15 నిమిషాల్లోనే టెలిప్రాంప్టర్‌ను తిరిగి పునరుద్ధరించినప్పటికీ ఆయన సొంతంగానే ప్రసంగం కొనసాగించారు. అయితే, తన మాటలు హాలులోని ఎవరికీ వినపడలేదని ఆ తర్వాత తనకు తెలిసిందని ట్రంప్ తెలిపారు.

ఐరాస సిగ్గుపడాలి

ఈ సాంకేతిక పొరపాట్లపై ఐరాసపై ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. ఈ ఘటనలపై ఐరాస సిగ్గుపడాలని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఐరాసలో నిన్న (అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం) నాకు నిజమైన అవమానం జరిగింది. ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు దురదృష్టకరమైన ఘటనలు జరిగాయి. అసెంబ్లీ హాలుకు వెళ్లేందుకు నేను, మెలానియా ఎస్కలేటర్ ఎక్కగానే అది ఆగిపోయింది. అదృష్టంకొద్ది మేము కిందపడలేదు. ఎస్కలేటర్ మెట్ల అంచులు చాలా పదునుగా ఉన్నాయి. కిందపడి ఉంటే ముఖానికి గాయాలయ్యేవి. మేము ఎస్కలేటర్ రెయిలింగ్ పట్టుకొని తమాయించుకున్నాం. లేదంటే ఇది పెద్ద విపత్తే అయ్యేది. తర్వాత నేను జనరల్ అసెంబ్లీలో ప్రసంగించేందుకు పోడియంపై నిలుచున్నాను. నా ప్రసంగం వినేందుకు ప్రపంచవ్యాప్తంగా కోట్లమందితోపాటు హాలులో ప్రపంచ దేశాల ప్రతినిధులంతా ఆసక్తిగా చూస్తున్నారు. అప్పుడే నా టెలిప్రాంప్టర్ ఆగిపోయింది. నాకు ఏమీ అర్థంకాలేదు. వెంటనే నేను ఆలోచించాను. మొదట ఎస్కలేటర్, ఇప్పుడు టెలిప్రాంప్టర్.. ఏంటీ ఈ ప్రదేశం ఇలా ఉంది అనిపించింది. శుభ సమాచారం ఏమిటంటే.. టెలిప్రాంప్టర్ లేకుండానే నేను చేసిన ప్రసంగానికి మంచి రివ్యూలు వచ్చాయి. ఇలా చాలా కొద్ది మంది మాత్రమే చేయగలరు. ఇక మూడో విధ్వంస ఘటన నేను ప్రసంగం ముగించిన తర్వాత తెలిసింది. నా ప్రసంగం హాలులో ఉన్నవారిలో ఇంటర్‌ప్రెటర్స్, ఇయర్‌పీస్‌లు పెట్టుకున్నవారికి తప్ప ఎవరికీ వినపడనేలేదు. ప్రసంగం పూర్తవగానే ఎలా ఉంది అని మెలానియాను అడిగాను. ఆమె 'నాకు ఒక్క మాట కూడా వినపడలేదు'అని చెప్పారు'అని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. ట్రంప్ ఆరోపణలపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ స్పందించారు. జరిగిన ఘటనలు దురదృష్టకరమని పేర్కొన్నారు. ఒక వీడియోగ్రాఫర్ పొరపాటు వల్లే ఎస్కలేటర్ ఆగిపోయిందని వివరణ ఇచ్చారు. కాగా, ఎస్కలేటర్ ఆగిపోయినప్పుడు ఐరాస సిబ్బంది ఎగతాళిగా మాట్లాడుకోవటం కనిపించిందని మీడియాలో వార్తలు వచ్చాయి.

వాంగ్‌చుక్ సంస్థ ఎఫ్‌సీఆర్ఏ లైసెన్సు రద్దు

లేహ్: లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా, రాజ్యాంగం ఆరోషెడ్యూల్‌లో చేర్చడం వంటి డిమాండ్లతో దీక్ష చేపట్టిన సోనమ్ వాంగ్‌చుక్ సారథ్యంలోని స్టూడెంట్స్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ మూవ్‌మెంట్ ఆఫ్ లద్దాఖ్(సెక్‌మోల్)కు ఫారిన్ కంట్రిబ్యూషన్ (రెగ్యులేషన్) చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) అనుమతి రద్దు చేస్తున్నట్లు హోం శాఖ తెలిపింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. సాంస్కృతిక, విద్యా కార్యక్రమాల నిర్వహణకుగాను సెక్‌మోల్ విదేశీ నిధులను అందుకునేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపింది. అయితే, నిధుల స్వీకరణలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు గుర్తించామని పేర్కొంది. వాంగ్‌చుక్‌తోపాటు లద్దాఖ్‌లోని వివిధ గ్రూపులతో ప్రభుత్వం జరుపుతున్న చర్చలు ఇష్టంలేని కొందరు చేసిన రాజకీయ ప్రేరేపిత ప్రకటనలే హింసాత్మక ఘటనలకు పురిగొల్పాయని కేంద్ర హోం శాఖ గురువారం పేర్కొంది. పాత, రెచ్చగొట్టే వీడియోలను మీడియాలో, సోషల్ మీడియాలో ప్రసారం చేయవద్దని కోరింది. ఈ నెల 25, 26వ తేదీలతోపాటు అక్టోబర్ 6న లద్దాఖ్ గ్రూపులతో చర్చలు జరుగుతాయంది.

లద్దాఖ్ హింసకు బలిపశువునయ్యా: వాంగ్‌చుక్

లద్దాఖ్‌లో ఇటీవలి హింసాత్మక ఆందోళనలకు కారణమంటూ తనపై హోంశాఖ ఆరోపణలు చేయడంపై ఉద్యమకారుడు వాంగ్‌చుక్ స్పందించారు. ఈ ప్రాంత సమస్యల్ని పరిష్కరించకుండా తనను బలిపశువును చేసేందుకు జరుగుతున్న కుట్రగా పేర్కొన్నారు. దీనివల్ల ఎలాంటి ఫలితమూ ఉండదని పేర్కొన్నారు. ప్రజాభద్రత చట్టం(పీఎస్ఏ)కింద అరెస్ట్ చేసి, రెండేళ్ల జైలులో పెట్టేందుకు కేసులు మోపినా తాను సిద్ధంగా ఉన్నానన్నారు. 'ఎవరో ఒకరిని బలిపశువును చేయడంతో వాళ్లు తెలివైన వాళ్లు కావచ్చు. కానీ, మేధావులు మాత్రం కాదు. ఈ సమయంలో మేధావులే తప్ప తెలివైనవారితో అవసరం లేదు. ఎందుకంటే యువత ఇప్పటికే తీవ్ర అసహనంతో ఉన్నారు'అని వాంగ్‌చుక్ పేర్కొన్నారు.

లేహ్ ప్రశాంతం

బుధవారం తీవ్ర హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్న లేహ్‌లో గురువారం ప్రశాంత పరిస్థితులు నెలకొన్నాయి. లేహ్‌లో కర్ఫ్యూ విధించారు. పోలీసులు, పారా మిలటరీ బలగాలు బందోబస్తు చేపట్టాయి. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలంటూ మొదలైన ఆందోళనలు లేహ్‌లో బుధవారం హింసా రూపం దాల్చి నలుగురు చనిపోగా, 40 మంది పోలీసులు సహా 90మంది గాయపడటం తెల్సిందే. ఇందుకు సంబంధించి ఆరోపణలపై 50 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ముందు జాగ్రత్తగా శుక్రవారం నుంచి రెండు రోజులపాటు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్ని మూసివేయాలని లేహ్ యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది.

కులగణనపై స్టేకు కర్నాటక హైకోర్టు నిరాకరణ

సర్వేలో పాల్గొనడం స్వచ్ఛందమే!

బెంగళూరు: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన కులగణన, సామాజిక ఆర్థిక విద్యా సర్వేపై స్టే ఇచ్చేందుకు కర్నాటక హైకోర్టు తిరస్కరించింది. సర్వేలో సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచాలని, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనేలా చూడాలని రాష్ట్ర వెనుకబడిన కులాల కమిషన్‌ను ఆదేశించింది. సర్వే చట్టబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విభు బఖ్రు, జస్టిస్ సీఎం జోషిల డివిజన్ బెంచ్ ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులను వెలువరించింది. ఈదశలో సర్వేను నిలిపివేయడం సముచితం కాదని భావిస్తున్నాం. సేకరించిన డేటాను ఎవరికీ వెల్లడించకూడదు. వెనుకబడిన తరగతుల కమిషన్ ఈ సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంటుందని నిర్ధారించుకోవాలి'అని పేర్కొంది. సర్వేలో పాల్గొనడం స్వచ్ఛందమని స్పష్టం చేస్తూ నోటిఫికేషన్ జారీ చేయాలని కోర్టు కమిషన్‌ను ఆదేశించింది. సమాచారం అందించడం తప్పని సరి కాదనే విషయాన్ని ఎన్యుమరేటర్లు పౌరుల కు ముందుగానే తెలియజేయాలంది.

వరుసగా మూడోసారి

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా డి.రాజా



చండీగఢ్: భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) జాతీయ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ నేత డి.రాజా వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. గురువారం చండీగఢ్‌లో జరిగిన పార్టీ 25వ మహాసభలో ఆయనను ఎన్నుకున్నారు. అలాగే 11 మంది సభ్యులతో నేషనల్ సెక్రెటేరియట్‌ను, 31 మందితో కార్యనిర్వాహక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సీపీఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ సభ్యుడిగా పంజాబ్ నేత హరదేవ్ అర్షి ఎన్నికయ్యారు. ఈ నెల 21న ప్రారంభమైన పార్టీ మహాసభలు గురువారం ముగిశాయి. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి 800 మందికిపైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు ఆమోదించారు. అట్టారీ–వాఘా బోర్డర్ పాయింట్ నుంచి పాకిస్తాన్‌తో వాణిజ్యం మళ్లీ ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనివల్ల పంజాబ్ రైతులకు, వ్యాపారులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షాకాలం పూర్తి చేసుకున్న ఖైదీలను, ఎలాంటి విచారణ లేకుండా కారాగారాల్లో మగ్గుతున్న వారిని వెంటనే జైళ్ల నుంచి విడుదల చేయాలని మరో తీర్మానంలో కోరారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుండడం, విద్యా రంగం పతనం అవుతుండడం పట్ల సీపీఐ ఆందోళన వ్యక్తంచేసింది. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవిని అధిష్టించిన మొట్టమొదటి దళిత నాయకుడిగా డి.రాజా రికార్డు సృష్టించారు. ఆయన తొలిసారిగా 2019లో సురవరం సుధాకర్‌రెడ్డి పదవీ విరమణ తర్వాత పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2022లో విజయవాడలో జరిగిన మహాసభలో రెండోసారి ఎన్నికయ్యారు. తాజాగా మూడోసారి ఈ పదవి దక్కించుకున్నారు. వాస్తవానికి 75 ఏళ్లు నిండితే కీలకమైన పదవుల నుంచి తప్పుకోవాలన్న నిబంధన సీపీఐలో ఉంది. ఈ నిబంధన నుంచి డి.రాజాకు మినహాయింపు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఆయనకు ఉన్న అనుభవంతోపాటు విపక్ష 'ఇండియా' కూటమి నేతలతో సన్నిహిత సంబంధాల నేపథ్యంలో మూడోసారి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు సీపీఐ వర్గాలు తెలిపాయి. త్వరలో జరుగబోయే బిహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో డి.రాజా సేవలు అవసరమని నిర్ణయానికి వచ్చినట్లు స్పష్టంచేశాయి. డి.రాజా 1949 జూన్ 3న తమిళనాడులోని వెల్లూరులో జన్మించారు.


విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం దుర్గమ్మ కాత్యాయనీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు- ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)


శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు కూష్మాండదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన బాసర సరస్వతీ దేవి - బాసర


శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం శ్రీమహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన వరంగల్ భద్రకాళీ అమ్మవారు - హనుమకొండ కల్చరల్


శరన్నవరాత్రి ఉత్సవాల్లో నాలుగో రోజైన గురువారం కూష్మాండమాతగా భక్తులకు దర్శనమిచ్చిన జోగులాంబ అమ్మవారు - అలంపూర్

మావోయిస్టు కోసాకు కన్నీటి వీడ్కోలు

- గోపాల్‌రావుపల్లెలో అంతిమయాత్ర.. ఎర్రజెండాలతో ఎరుపెక్కిన పల్లె


గోపాల్‌రావుపల్లెలో కోసా అంతిమయాత్ర. (ఇన్‌సెట్‌లో) కోసా మృతదేహం

సిరిసిల్ల: మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు కోసా అలియాస్ కడారి సత్యనారాయణరెడ్డి, అలియాస్ సాధు అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లెలో గురువారం జరిగాయి. ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కోసా మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతదేహాన్ని గురువారం గోపాల్‌రావుపల్లెకు తీసుకొచ్చారు. 1980 ఏప్రిల్‌లో పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌లోని కేశోరాం సిమెంట్ పరిశ్రమలో ఉద్యోగం చేస్తూ అజ్ఞాతంలోకి వెళ్లిన సత్యనారాయణరెడ్డి 45 ఏళ్ల తర్వాత ఎన్‌కౌంటర్‌లో మృతి చెంది..విగతజీవిగా స్వగ్రామానికి చేరారు. కోసా సోదరుడు కరుణాకర్‌రెడ్డి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ప్రజాసంఘాల ప్రతినిధులు, కవులు, కళాకారులు, పౌరహక్కుల సంఘాల నాయకులు, గ్రామస్తులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఎర్రజెండాలు చేతబట్టి.. పాటలు పాడుతూ..జోహార్లు.. కోసా అంటూ..నినాదాలు చేశారు. వర్షం పడుతున్నా.. లెక్కచేయకుండా.. వేలాది మంది అభిమానుల మధ్య కోసా కన్నీటి వీడ్కోలు పలికారు. అయితే కోసా అంతిమ యాత్రపై పోలీసుల నిఘా అడుగడుగునా కొనసాగింది.

క్లుప్తంగా...

హరీశ్‌రావు.. యాద'గిరి ప్రదక్షిణ'


గిరి ప్రదక్షిణ చేస్తున్న హరీశ్‌రావు. పక్కన మాజీ ఎమ్మెల్యే సునీత

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా గురువారం వేకువజామున సామూహిక గిరి ప్రదక్షిణ చేపట్టారు. గిరి ప్రదక్షిణలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు పాల్గొన్నారు. ఆయన బుధవారం అర్ధ రాత్రి యాదగిరిగుట్ట క్షేత్రానికి చెందిన ప్రెసిడెన్షియల్ సూట్‌లో బస చేశారు. వేకువజామున 5 గంటలకు వైకుంఠద్వారం నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. అనంతరం యాదగిరి కొండ పైకి చేరుకుని గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు ప్రథమ ప్రాకార మండపంలో వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. హరీశ్ వెంట ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

యాదగిరి క్షేత్రం ఇన్‌చార్జి ఈవోగా రవినాయక్


బాధ్యతలు స్వీకరిస్తున్న రవినాయక్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా ఐఏఎస్ అధికారి జి.రవినాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఈవో వెంకట్రావ్ నెలరోజుల పాటు సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీగా పనిచేస్తున్న జి.రవినాయక్‌ను ఇన్‌చార్జిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈవోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం.. రవినాయక్ గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను, శివాలయంలో మహాశివుడిని, శ్రీపర్వత వర్ధిని అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ప్రసాదం తయారీ కేంద్రాన్ని పరిశీలించి అధికారులతో సమావేశమయ్యారు.

చెన్నై షాపింగ్ మాల్ దసరా, దీపావళి ఆఫర్లు

ది చెన్నయ్ షాపింగ్ మాల్

సాక్షి, హైదరాబాద్: మగువలు ఎంతో ఇష్టపడే చెన్నై షాపింగ్ మాల్ దసరా, దీపావళి సందర్భంగా కళ్లు చెదిరే ఆఫర్లను ప్రకటించింది. సంప్రదాయ పండుగలను పురస్కరించుకుని బంపర్ ఆఫర్లు ఇస్తోంది. మహిళలు, పురుషులు, చిన్నారులకు నచ్చేలా వస్త్ర శ్రేణిలో లక్షల డిజైన్లను ప్రదర్శిస్తోంది. ట్రిపుల్ ధమాకాలో భాగంగా స్పాట్ గిఫ్ట్స్, కాంబో ఆఫర్లు, డిస్కౌంట్లు ప్రకటించింది. అంతేకాకుండా జీఎస్టీ 2.0 స్కీంకింద రూ.1,051 ధర నుంచి 2,625 రూపాయల విలువగల రెడీమేడ్ వస్త్రాల కొనుగోలుపై 6.25 శాతం తగ్గింపునిస్తోంది. పండుగల సందర్భంగా ఇస్తున్న ఈ ప్రత్యేక ఆఫర్లను తమ కస్టమర్లు వినియోగించుకోవాలని కోరుతోంది.

టార్గెట్.. టాప్ లీడర్స్

- మావోల నాయకత్వాన్ని తుద ముట్టించేలా ఎన్‌కౌంటర్లు
- ఇప్పటికే 9 మంది కేంద్ర కమిటీ సభ్యుల మరణం



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సగానికి పైగా తుడిచిపెట్టుకుపోయింది. ఇప్పటికైనా మావోయిస్టులు ఆయుధాలు వదిలేసి లొంగిపోవాలని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజు ఇటీవల ప్రకటించారు. 'మరోవైపు తలను తీసేస్తే కాళ్లు చేతులు ఏ పనీ చేయలేవు.. అందుకే మేము కిందిస్థాయి కేడర్ కంటే పైస్థాయిలో ఉన్న పెద్ద తలలే టార్గెట్‌గా యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్ చేపడుతున్నాం'అని నారాయణ్‌పూర్ ఎస్పీ రాబిన్సన్ గుడియా ఇటీవల మీడియాకు వెల్లడించారు. పోలీస్ బాస్‌ల ప్రకటనలకు తగ్గట్టుగానే ఏడాది కాలంలో ఏకంగా తొమ్మిది మంది కేంద్ర కమిటీ సభ్యులు చనిపోయారు. దీంతో 2026 మార్చి 31 కంటే ముందుగానే మావోయిస్టులు అంతమైపోతారనే వాదనలు జోరందుకున్నాయి.

మృతుల్లో తొలితరం నేతలే

కొండపల్లి సీతారామయ్య పీపుల్స్‌వార్ పార్టీని స్థాపించిన తొలినాళ్లలోనే ఉత్తర తెలంగాణ, దండకారణ్యం పర్‌స్పెక్టివ్ దృష్టితో పార్టీకి గెరిల్లా జోన్లు విస్తరించే పనిపై దృష్టి పెట్టారు. 1980లో బస్తర్ పంపిన తొలి బ్యాచ్‌లో కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోసా ఉండగా 1985–86లో పంపిన రెండో బ్యాచ్‌లో కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ రాజు దాదా అలియాస్ వికల్ప్ ఉన్నారు. ఇందులో వికల్ప్, ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో వాసు పేరుతో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూనే మైదాన ప్రాంతాల్లో పార్టీకి కావాల్సిన అండదండలు అందిస్తూ వచ్చారు. ఆ తర్వాత కాలంలో అజ్ఞాతంలోకి వెళ్లారు. ఇప్పటి వరకు మావోయిస్టుల అగ్రనేతలు, కేంద్ర కమిటీకి సంబంధించిన ప్రస్తావనలో ఎక్కువగా 80వ దశకంలో పార్టీలో కీలకంగా వ్యవహరించిన వారి పేర్లే ఎక్కువగా తెర మీదకు వస్తున్నాయి. అయితే, వీరి తర్వాత కాలంలో పూర్తిగా రహస్య ఆపరేషన్లు చేపట్టే బ్యాచ్ ఒకటి దండకారణ్యం వెళ్లినట్టు తెలుస్తోంది.

కరోనా తర్వాత నష్టాలు

కరోనా సెకండ్ వేవ్ తర్వాత మావోయిస్టు పార్టీ స్థితిగతుల్లో మార్పులు ఎక్కువగా వచ్చాయి. ఆపరేషన్ సమాధాన్-ప్రహార్‌తో మావోయిస్టుల సప్లై చెయిన్‌పై పోలీసుల నిఘా పెరిగింది. మరోవైపు వాయుమార్గంలో దాడులు కూడా ప్రారంభమయ్యాయి. వెరసి నిర్బంధం తీవ్రం కావడం, కరోనా కష్టాలతో పరిస్థితులు మారిపోవడం మొదలైంది.

- అనారోగ్య కారణాలతో రమణ, హరిభూషణ్ అలియాస్ యాప నారాయణ, రామకృష్ణ అలియాస్ ఆర్కే, కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్‌లు మరణించారు.
- ఆ తర్వాత 2021లో మహారాష్ట్రలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మిలింద్ బాబురావు తేల్‌టుంబే చనిపోయాడు. ఆపరేషన్ కగార్ మొదలైన తర్వాత ఏకంగా తొమ్మిది మంది కేంద్ర కమిటీ సభ్యులు చనిపోయారు.
- బెంగాల్ నుంచి ప్రశాంత్‌బోస్, శీలామరాండీలు 2021లో లొంగిపోగా ఇటీవల పోతుల కల్పన అలియాస్ సుజాత కూడా లొంగిపోయింది. మొత్తంగా కరోనా తర్వాత 17 మంది కేంద్ర కమిటీ సభ్యులను ఆ పార్టీ కోల్పోయింది.

ప్రస్తుతం కేంద్ర కమిటీలో ఉన్నవారు

పేరు	స్వస్థలం
ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి	జగిత్యాల జిల్లా
తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ	జగిత్యాల జిల్లా
పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న	పెద్దపల్లి జిల్లా
మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్	పెద్దపల్లి జిల్లా
పసునూరి నరహరి అలియాస్ విశ్వనాథ్	హనుమకొండ జిల్లా
పాక హన్మంతు అలియాస్ ఉయికే గణేశ్	నల్లగొండ జిల్లా
మిసిర్ బెస్రా అలియాస్ భాస్కర్	జార్ఖండ్
అనల్‌దా అలియాస్ తుపాన్‌దా	జార్ఖండ్
మడ్వి హిడ్మా అలియాస్ సంతోశ్	ఛత్తీస్‌గఢ్

వాగులో పశువుల కాపరులు

- కాపాడిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

కన్నాయిగూడెం: వాగులో చిక్కుకున్న పశువుల కాపరులను ఎన్డీఆర్ఎఫ్ బృందాలు క్షేమంగా బయటకు తీసుకొచ్చాయి. ములుగు జిల్లాలో జరిగిన ఈ సంఘటనపై కన్నాయిగూడెం ఎస్ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. కొంతమంది ఎప్పట్లాగే పశువులు, మేకలను మేపేందుకు గురువారం అడవికి వెళ్లారు. భారీ వర్షం కురవడంతో మండలంలోని బుట్టాయిగూడెం, సర్వాయికి మధ్యలో ఉన్న మల్కపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. బుట్టాయిగూడేనికి చెందిన మేకల కాపరులు సునార్కని సంజీవ, నరేశ్, మల్కపల్లికి చెందిన పశువుల కాపరులు కుంజదేవ, మనోజ్, దివ్య, పోడియం లక్ష్మి, కుంజ అడుమమ్మ మల్కపల్లి వాగు అవతల చిక్కుకున్నారు. గమనించిన గ్రామస్తులు డయల్ 100కు కాల్ చేశారు. దీంతో ఏటూరునాగారం సీఐ శ్రీనివాస్, స్థానిక తహసీల్దార్ సయ్యద్ సర్వర్ సంఘటన స్థలం వద్దకు చేరుకుని ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపారు. బోటు సాయంతో బాధితులను సురక్షితంగా వాగు దాటించారు. కాంగ్రెస్ నేత జాడి రాంబాబు చొరవ తీసుకొని అధికారులతో మాట్లాడి సహాయక చర్యలు చేపట్టారు. ఎస్ఐ వెంకటేశ్ ఆటోలో బాధితులను వారి ఇళ్లకు చేర్చారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు నిలకడగా వరద


శ్రీశైలంలో ఏడు గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

దోమలపెంట: శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నిలకడగా కొనసాగుతోంది. గురువారం రాత్రి 10 గంటల సమయంలో జూరాల, సుంకేసుల, హంద్రీ నుంచి మొత్తం 2,37,521 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా.. శ్రీశైలం ప్రాజెక్టు ఏడు గేట్లను.. ఒక్కొక్కటి పది అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,87,208 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో పాటు ఎడమ, కుడిగట్టు భూగర్భ విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ.. అదనంగా 65,742 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.1 అడుగుల వద్ద 199.2737 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

రాష్ట్రంలో ఎఫ్-3 సర్కార్: ఎన్వీ సుభాష్


బాధ్యతలు చేపడుతున్న ఎన్వీ సుభాష్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఎఫ్-3 (ఫేక్, ఫెయిల్డ్, ఫ్రాడ్)లతోనే సాగుతోందని బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ మండిపడ్డారు. ఆయన గురువారం పార్టీ కార్యాలయంలో అధికార ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బీసీ అభ్యర్థులకు 45 శాతం రిజర్వేషన్ కల్పిస్తుందన్నారు.

గోదావరికి మళ్లీ వరద ఉధృతి

- మేడిగడ్డ బరాజ్‌కు 7.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


టేకులగూడెం వద్ద మునిగిన జాతీయ రహదారి

కాళేశ్వరం/కన్నాయిగూడెం/వాజేడు: ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరి నదికి భారీగా వరద వస్తోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 11.310 మీటర్ల ఎత్తులో వరద పుష్కర ఘాటును తాకుతూ దిగువకు తరలిపోతోంది. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్‌కు 7.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతోంది. మొత్తం 85 గేట్లు ఎత్తి నీటిని దిగువకు అదేస్థాయిలో వదులుతున్నారు. గోదావరి ఉగ్రరూపం దాల్చుతుండడంతో పరీవాహక ప్రాంతాల్లోని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలుమార్లు పత్తి, వరి పంటలు నీటమునిగి నష్టపోయారు.

- ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామంలోని సమ్మక్క సాగర్ బరాజ్‌లోకి వరద భారీగా చేరింది. ఎగువన ఉన్న లక్ష్మీ, సరస్వతి, అన్నారం బరాజ్‌ల నుంచి సమ్మక్క సాగర్ బరాజ్‌లోకి 7,35,740 క్యూసెక్కుల నీరు చేరుతోంది. దీంతో 59 గేట్లను ఎత్తి అదేస్థాయిలో నీటిని దిగువకు వదులుతున్నారు.

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ మధ్య నిలిచిపోయిన రాకపోకలు

ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగూడెం గ్రామ సమీపంలో 163 నంబరు జాతీయ రహదారి ముంపునకు గురైంది. రేగుమాకు ఒర్రె ద్వారా వచ్చిన గోదావరి వరద నీరు బ్రిడ్జిని ముంచెత్తడంతో రహదారి మునిగిపోయింది. దీంతో తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వరద ముంచెత్తిన విషయం ప్రయాణికులకు తెలియదు.అప్పటికే అప్రమత్తమైన అధికారులు వరదలోకి ఎవరు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

మూడు రోజులు భారీ వర్షాలే...

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న మూడు రోజులు చాలాచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ హెచ్చరించింది. తూర్పు మధ్య బంగాళాఖాతం, దానికి సమీపంలో ఉన్న ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఉత్తర, మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో గురువారం అల్పపీడనం ఏర్పడింది. ఇది క్రమంగా బలపడి పశ్చిమ దిక్కున కదులుతూ వాయవ్య బంగాళాఖాతం, దానికి సమీపంలోని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలో శుక్రవారం వాయుగుండంగా మారే అవకాశముంది. తదుపరి ఈ వాయుగుండం దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర, కోస్తా తీరం ప్రాంతంలో ఈ నెల 27న తీరాన్ని దాటొచ్చు. మరోవైపు ఉపరితల ద్రోణి వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో ఏర్పడింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ, అత్యంత భారీ వర్షాలు కూడా నమోదు కావొచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది.

16 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం రాష్ట్రంలోని పలు జిల్లాలపై ఉంది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లోని చాలా ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు సూచించింది.

భారీ వర్షాలున్నాయి.. అప్రమత్తంగా ఉండండి

- సీఎం రేవంత్‌రెడ్డి




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ నివేదికపై సీఎం రేవంత్‌రెడ్డి అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. రానున్న రెండుమూడు రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతోందని, నిరంతరం జాగ్రత్తగా ఉండాలన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లు హైఅలర్ట్‌గా ఉండి పరిస్థితిని సమీక్షించాలని చెప్పారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను ముందస్తుగా ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. అన్ని కాజ్‌వేలను పరిశీలించాలని, రోడ్లపై వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి అక్కడ వాహనాల రాకపోకలను నిలిపివేయాలని సూచించారు. విద్యుత్ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.

సివిల్స్ ఇంటర్వ్యూలో ఫెయిలై.. సైబర్ నేరగాడిగా మారి..

సెలెక్ట్ కాకపోవడంతో డిప్రెషన్‌లోకి....

- ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి నేరాల బాట
- విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం... ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ చేసిన సీతయ్య
- ఇప్పటికే నగరంలో అనేక కేసులు
- తాజాగా అరెస్టు చేసి తీసుకెళ్లిన మహారాష్ట్ర పోలీసులు



సాక్షి, హైదరాబాద్: అతడి పేరు కిలారు సీతయ్య.. విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాడు. పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందాడు. సివిల్ సర్వీసెస్ పరీక్ష రాసి తొలి ప్రయత్నంలోనే ఇంటర్వ్యూ వరకు వెళ్లాడు. అనేక కోచింగ్ సెంటర్లకు విజిటింగ్ ఫ్యాకల్టీగా పనిచేశాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి సైబర్ నేరగాడిగా మారాడు. హైదరాబాద్, సైబరాబాద్‌ల్లో అనేక కేసులు నమోదై ఉన్న ఇతగాడు తాజాగా మహారాష్ట్రకు చెందిన ప్రొఫెసర్లకు టోకరా వేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పుణే సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం సీతయ్యను యాప్రాల్‌లో అరెస్టు చేసి తీసుకెళ్లారు.

సివిల్స్‌కు ఎంపిక కాకపోవడంతో డిప్రెషన్

ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామకు చెందిన డాక్టర్ సీతయ్య విద్యాభ్యాసం ఏపీ, తెలంగాణల్లో కొనసాగింది. ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్స్ విభాగంలో మాస్టర్స్ చేయడానికి లండన్ వెళ్లిన ఇతగాడు అక్కడి ఓ ప్రముఖ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశాడు. బాచుపల్లిలో ఉంటూ కొన్నాళ్లు హైదరాబాద్ శివార్లలోని ఓ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేశాడు. వివాహమైన తర్వాత అఖిల భారత సర్వీస్ అధికారిగా మారాలని భావించి సివిల్ సర్వీసెస్ పరీక్ష రాశాడు. మొదటి ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లాడు. అయితే సెలెక్ట్ కాకపోవడంతో డిప్రెషన్‌లోకి వెళ్లాడు. సీతయ్య ప్రవర్తన మారిపోవడం, ఉద్యోగం కూడా మానేయడంతో భార్య విడాకులు తీసుకుంది. సొంతంగా సివిల్స్ కోచింగ్ సెంటర్ పెట్టాలని భావించినా, అది సాధ్యం కాక కొన్ని సెంటర్లకు విజిటింగ్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్నాడు.

బెట్టింగ్ వ్యసనంతో నేరగాడిగా మారి...

డిప్రెషన్‌లో ఉన్న సీతయ్య దాని నుంచి బయటపడటానికి ఆన్‌లైన్ గేమింగ్ ఆడటం ప్రారంభించాడు. కొన్నాళ్లకు అది వ్యసనంగా మారి భారీస్థాయిలో బెట్టింగ్స్ పెట్టాడు. ఈ జల్సాలకు అవసరమైన డబ్బు కోసం సైబర్ నేరగాడిగా మారాడు. మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం వివిధ జాబ్ పోర్టల్స్‌లో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సేకరించిన సీతయ్య..వారిని సంప్రదించి దొడ్డిదారిలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఎర వేశాడు. తన వల్లో పడిన వారి నుంచి భారీ మొత్తం వసూలు చేసి వారికి నకిలీ ఆఫర్ లెటర్లు పంపించాడు. కొందరిని ఫోన్ ద్వారా ఇంటర్వ్యూలు కూడా చేశాడు. 2023 నుంచి ఈ పంథాలో మోసాలు చేస్తున్న ఇతడిపై హైదరాబాద్, సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్లతో పాటు గచ్చిబౌలి ఠాణాలోనూ అనేక కేసులు నమోదయ్యాయి. జైలుకు వెళ్లివచ్చినా సీతయ్య పంథా మారలేదు.

ఐఐటీ బాంబే ప్రొఫెసర్‌గా పుణేలో టోకరా

పుణేలోని సావిత్రిబాయి పూలే యూనివర్సిటీ వీసీకి ఈ ఏడాది జూలైలో ఫోన్ చేసిన ఇతగాడు తాను ఐఐటీ బాంబే ప్రొఫెసర్ అంటూ పరిచయం చేసుకున్నాడు. అంతరిక్ష రంగంలో ఆర్టిఫిషియల్ ఆధారిత ప్రయోగాలు చేపట్టే ప్రాజెక్టులకు తాము ఫండ్స్ ఇస్తున్నామని నమ్మించాడు. సదరు ప్రొఫెసర్ ఈ విషయాన్ని వర్సిటీ సీఈఓ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయనతో సంప్రదింపులు జరిపాడు. రూ.28 కోట్ల ఫండ్స్ ఇప్పిస్తానంటూ నమ్మించి దఫదఫాలుగా రూ.2.46 కోట్లు కాజేశాడు. జూలై 25–ఆగస్టు ఏడు మధ్య ఈ లావాదేవీలు జరగ్గా, తాము మోసపోయామని గుర్తించిన వర్సిటీ అధికారులు ఈ నెల మొదటివారంలో పుణే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సీతయ్య ఆచూకీ యాప్రాల్‌లో గుర్తించిన అధికారులు వచ్చి అరెస్టు చేసి తీసుకెళ్లారు. పుణే కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం ఆదివారం వరకు పోలీసు కస్టడీకి అప్పగించింది. మహారాష్ట్రలో ఉన్న మరో రెండు వర్సిటీలకు టోకరా వేయాలని సీతయ్య ప్రయత్నించినట్టు పోలీసులు గుర్తించారు.

ఇంద్రజాలికుడు వేణుకు అమెరికాలో సన్మానం



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ ఇంద్రజాలికుడు, ఇల్యూషనిస్ట్ సామల వేణుకు అమెరికాలోని హడ్సన్ కౌంటీ కమిషనర్ విలియం ఓడీ ప్రత్యేక అభినందన పత్రం అందజేశారు. వేణు 40 ఏళ్లకు పైగా సామాజిక, సాంస్కృతిక, కళలు, వినోద రంగాల్లో చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. కెర్నీ మేయర్ క్యారల్ జీన్ డాయిల్, న్యూజెర్సీ సిటీ కౌన్సిల్ అధ్యక్షురాలు జాయిస్ వాటర్‌మ్యాన్‌లు.. సామల వేణును సన్మానించారు. ఈ కార్యక్రమం న్యూజెర్సీ సిటీ మేయర్ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో రాజేందర్ దిచిపల్లి, సామాజిక కార్యకర్త అర్జుమండ్ జువేరియా, మాధవి సామల తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
(పోలీసు శాఖ)

ఇ-టెండరు నం. HCP/Tr/T1/Budget/1040/2025 — తేది : 23.09.2025

హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ వారికి సామ్‌సంగ్ ట్యాబ్‌లు, బ్లూ టూత్ ప్రింటర్స్ మరియు బాడీ వోర్న్ కెమెరాలు ఏర్పాటు చేయుట కొరకు తయారీదారులు మరియు డీలర్ల నుండి ఆన్‌లైన్ బిడ్లు కోరబడుచున్నవి. **టెండరు అప్‌లోడింగ్ కొరకు ప్రారంభ తేది :** 22.09.2025న 16.00 గం. నుండి మరియు **ఆన్‌లైన్ టెండరు అప్‌లోడింగ్‌కు చివరి తేది :** 09.10.2025న 17.00 గం.వరకు. టెండరు 10.10.2025న ఉ.11.30 గం.కు తెరువబడును. ఏవైనా వివరాల కొరకు సంప్రదించండి : ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఇ-ఛలాన్, హైదరాబాద్, ఫోన్ : 8712660653.

సం/- జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, ట్రాఫిక్, హైదరాబాద్

DIPR RO No. 8651-PP/CL/Advt/1/2025-26, Dt. : 25.09.2025

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా కలెక్టర్ కార్యాలయం, సర్వే & ల్యాండ్ రికార్డ్స్, ఖమ్మం జిల్లా

టెండరు ప్రకటన

నం. A3/368/2025 — తేది: 25-09-2025

అవసరమైన స్పెసిఫికేషన్స్ రెండు సంవత్సరాల వారంటీతో లేటెస్ట్ ఆండ్రాయిడ్ వర్షన్ సాఫ్ట్‌వేర్ మరియు అన్ని స్టాండర్డ్ యాక్సెసరీస్ కంట్రోలర్స్‌తో 2w రేడియో ఫ్రీక్వెన్సీతో 1408 ఛానల్స్‌తో 10 నం.ల GNSS IMU RTK రిసీవర్ సరఫరా కొరకు వివిధ ప్రొప్రైటర్స్ / సరఫరాదారుల నుండి సంక్షిప్త టెండర్లు కోరబడుతున్నవి. సీల్డ్ కవర్లు 26-09-2025 నుండి 30-09-2025 వరకు కార్యాలయ వేళలు (అనగా ఉ.10.30 గం. నుండి సా.5.00 గం. వరకు)లో చేరాలి మరియు అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే & ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయం, రూమ్ నం.S2, 2వ అంతస్తు, IDOC, వి.వి. పాలెం, ఖమ్మం వద్ద డ్రాప్ బాక్స్ లభించును. **గమనిక:** టెండర్లు తెరుచు తేది: చైర్మన్ (DPC) & అదనపు కలెక్టర్ (Rev.) ఛాంబర్, ఖమ్మం జిల్లాలో 07-10-2025న మ.3.00 గం.కు.

సం/- చైర్మన్ (DPC) & అదనపు కలెక్టర్ (రెవెన్యూ), ఖమ్మం

DIPR RO No.8657-PP/CL/Advt/1/2025-26, Dt: 25-09-2025

క్లుప్తంగా...

విద్యార్థుల్లో స్కిల్ డెవలప్‌మెంట్ పెంపు
మంత్రి కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు విద్యార్థుల్లో స్కిల్ డెవలప్ మెంట్ పెంపొందించాలనే లక్ష్యంతో.. ఇప్పటికే ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్‌ను ఏర్పాటు చేస్తోందని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, న్యాక్ వైస్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. సెప్టెంబర్ 5న టీచర్స్ డే పురస్కరించుకొని ఢిల్లీలో రాష్ట్రపతి నుంచి జాతీయ అవార్డు అందుకున్న న్యాక్ సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ స్నేహలత మంత్రిని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను మంత్రి సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. నల్లగొండలో అధునాతన హంగులతో నిర్మిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ అతి త్వరలో అందుబాటులోకి రానుందన్నారు. స్నేహలతను ప్రోత్సహించిన న్యాక్ డైరెక్టర్ శాంతిశ్రీని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు.

సీఎం చిత్రపటానికి అవమానం
స్టోర్‌రూమ్‌లో పడేసిన సిబ్బంది



జగిత్యాల రూరల్: జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తిలో ఇటీవల రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రారంభించారు. కొత్త గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులు ముఖ్యమంత్రి ఫొటో ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ మేరకు మాజీ ఎంపీటీసీ బందెల మమత భర్త శంకర్.. సీఎం చిత్రపటం తీసుకొచ్చి అధికారులకు అప్పగించారు. అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించి.. సీఎం చిత్రపటాన్ని స్టోర్ రూమ్‌లో నిర్లక్ష్యంగా పడేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. కొద్దిసేపే స్టోర్‌రూమ్‌లోని కుర్చీలో పెట్టామన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తాం
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు తగిన ప్రణాళికను రూపొందిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం సచివాలయంలో ఆయన ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్) ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఏఎస్ విజయ కుమార్ తదితరులు దేశ, విదేశాలలో అమలుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను, తద్వారా అధిక ఆదాయం పొందుతున్న రైతుల విజయ గాథలను మంత్రికి వివరించారు. తాము తెలంగాణ ప్రభుత్వంతో కలసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రకృతి వ్యవసాయంలో దిగుబడులు తగ్గుతాయని ఒక అపోహ ఉందని, కానీ ఏపీసీఎన్ఎఫ్ ప్రతినిధులు చెప్పిన రైతుల అనుభవాలు, తన సొంత అనుభవాలు అది తప్పని నిరూపించాయన్నారు. ఈ విధానంలో రైతుల నికరాదాయం మొదటి సంవత్సరం నుంచే పెరుగుతుందని అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకర ఉత్పత్తులు తయారు చేసి, మార్కెటింగ్ అవకాశాలను పెంచుకోవచ్చని పేర్కొన్నారు. ఈ విధానంలో 3 పంటలు తీసే అవకాశం ఉందని, అలాగే కలుపు, చీడపీడల సమస్య కూడా గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.

పీఎల్ఆర్ బోనస్‌పై చర్చలు



చర్చల్లో పాల్గొన్న సింగరేణి డైరెక్టర్(పా) గౌతం పొట్రూ, కార్మిక సంఘాల ప్రతినిధులు

గోదావరిఖని(రామగుండం): దేశవ్యాప్త బొగ్గు గని కార్మికుల ఫెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డు (పీఎల్ఆర్) బోనస్‌పై కోల్ ఇండియా యాజమాన్యం, జాతీయ కార్మిక సంఘాల ప్రతినిధులతో కోల్‌కతాలో చర్చలు జరుగుతున్నాయి. గతేడాది బొగ్గు గని కార్మికులకు పీఎల్ఆర్ బోనస్ రూ.93,750 చెల్లించారు. ఈసారి రూ.1.3 లక్షలు చెల్లించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే కోల్ ఇండియా యాజమాన్యం మాత్రం రూ.98 వేల వరకు ఇచ్చేందుకు అంగీకరించింది. దీనిపై కార్మిక సంఘాలు ఒప్పుకోకపోవడంతో చర్చలు అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశాలున్నాయి. ఒకవేళ ఒప్పందం పూర్తికాకుంటే శుక్రవారం చర్చలు జరగొచ్చు. చర్చల్లో సింగరేణి తరఫున డైరెక్టర్(పా) గౌతం పొట్రూ, కార్మిక సంఘాల నేతలు జనక్‌ప్రసాద్, రియాజ్ అహ్మద్ పాల్గొన్నారు. పీఎల్ఆర్ బోనస్ ఖరారైతే సంస్థ వ్యాప్తంగా 41 వేల మందికి వర్తించనుంది.

స్థానిక పోరుకు ఎస్ఈసీ సై

సర్వం సిద్ధం చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

- ప్రభుత్వం నుంచి రిజర్వేషన్ల ఖరారు ఆదేశాలు, ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలో తేదీలతో లేఖ అందిన వెంటనే షెడ్యూల్, నోటిఫికేషన్ జారీకి సన్నాహాలు
- ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు.. ఆ తర్వాతే పంచాయతీలకు...
- నేడు సీఎం రేవంత్‌రెడ్డితో పీఆర్ శాఖ ముఖ్య కార్యదర్శి, పీఆర్ డైరెక్టర్ భేటీ అయ్యే అవకాశం
- ప్రత్యేక జీవో జారీపై స్పష్టత వచ్చే అవకాశం



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సర్వం సిద్ధం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రిజర్వేషన్ల ఖరారు ఆదేశాలు, ఎన్నికల తేదీల నిర్వహణపై లేఖ అందిన వెనువెంటనే ఎన్నికల షెడ్యూల్‌తోపాటు నోటిఫికేషన్ జారీకి రెడీగా ఉంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నందున తమకు రాజకీయంగా ఉపయోగపడే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ముందుగా జరపాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ ఉన్నట్టు తెలుస్తోంది. ఆ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్నట్టు సమాచారం. అందుకే ముందుగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి, 18 నుంచి 21 రోజుల్లో ఎన్నికలు పూర్తి చేసేందుకు ఎస్ఈసీ ఏర్పాట్లు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఆ తర్వాత మళ్లీ వారం, పది రోజుల్లోనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా కసరత్తు చేస్తోంది.

నేడు సీఎంతో ఉన్నతస్థాయి అధికారుల భేటీ?

శుక్రవారం ఉదయం సీఎం రేవంత్‌రెడ్డితో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్, పీఆర్ఆర్‌డీ డైరెక్టర్ డా.సృజన, ఇతర అధికారులు సమావేశం కానున్నట్టు అధికార వర్గాల సమాచారం. బీసీలకు విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు సంబంధించిన ప్రత్యేక జీవోలపైనే చర్చ ఉంటుందనే ప్రచారం సాగుతోంది. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లకు సంబంధించి సీఎం స్పష్టత తీసుకుంటారని చెబుతున్నారు. శుక్రవారమే అటు బీసీ సంక్షేమశాఖ లేదా ప్రణాళిక శాఖ ద్వారా స్థానిక సంస్థల్లో బీసీలకు విద్య, ఉపాధి అవకాశాల్లో 42 శాతం, పంచాయతీరాజ్ శాఖ ద్వారా బీసీలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్ల కల్పనపై ప్రత్యేక జీవోలు విడుదల అయ్యే అవకాశం ఉందని జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి.

జీఓలు జారీ కాగానే...

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవోతోపాటు, ఎన్నికల తేదీని తెలియజేస్తూ ప్రభుత్వం అధికారిక లేఖ అందజేసిన వెంటనే కార్యరంగంలోకి దూకేలా ఎస్ఈసీ సన్నాహాలు పూర్తి చేసినట్టు సమాచారం. సర్కార్ నుంచి సమాచారం అందిన వెంటనే ఎన్నికలు ఏర్పాట్లపై ఎస్ఈసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పీఆర్, రెవెన్యూ ఇతర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్టు అధికార వర్గాల సమాచారం. ఈ ఉన్నతస్థాయి సమావేశానికి చీఫ్ సెక్రటరీ కూడా హాజరై, ఆయా శాఖల వారీగా ఎన్నికల సన్నద్ధతను సమీక్షించనున్నట్టు తెలుస్తోంది.

గతంలో 3 దశలు... ఇప్పుడు 2 దశల్లోనా?

గతంలో పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు మూడు దశల్లో జరగగా...ఈసారి రెండు విడతల్లోనే పూర్తిచేసే ఆలోచనతో ఎస్ఈసీ ఉన్నట్టు తెలిసింది. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నట్టుగా ఎస్ఈసీ వర్గాలు వెల్లడించాయి. బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధం చేసుకొని, ఎన్నికల సిబ్బంది ఎంపిక, శిక్షణ, ఎన్నికల మెటీరియల్ ప్రింట్ చేసి, మార్గదర్శకాలు, ఇతర పుస్తకాల ముద్రణ, తదితరాల తయారీ, గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు తమ వెబ్‌సైట్‌లోని టీ–పోల్‌లో సిద్ధం చేసి పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళా రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ఎస్ఈసీకి ఉత్తర్వులు అందగానే ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నం కానుంది. రిజర్వేషన్ల ఖరారు, ఎన్నికల తేదీలు మినహా ఎన్నికల నిర్వహణకు సంబంధించి మిగతా సమస్యలేవీ లేనందున ఎస్ఈసీ సంసిద్ధంగా ఉన్నట్టుగా ఆ వర్గాలు వెల్లడించాయి.

తెలంగాణలోనూ సీఎం బ్రేక్‌ఫాస్ట్

▶ మొదటి పేజీ తరువాయి

సీఎం అన్నారు.

తమిళనాడు విద్యావిధానం దేశానికి అనుసరణీయం

మద్రాస్ స్టేట్ ముఖ్యమంత్రిగా పనిచేసిన కామరాజ్ నాడు తీసుకువచ్చిన విద్యా విధానాన్ని దేశం నేడు అనుసరిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ.. కామరాజ్ ప్లాన్‌ను తీసుకువచ్చారని, ఈ కార్యక్రమం తమిళనాడు యువతకు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. దక్షిణాదికి చెందిన కేరళ, కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు తమిళనాడు విద్యా విధానం ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. తెలంగాణలో తాము విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. తమిళనాడు పేదలకు అండగా మంచి సీఎం స్టాలిన్ ఉన్నారని ప్రశంసించారు.

స్కిల్, స్పోర్ట్స్ వర్సిటీలు తెచ్చాం

తెలంగాణలో యువతలో నైపుణ్యం పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించినట్లు సీఎం రేవంత్ గుర్తుచేశారు. 'తెలంగాణలో ఏటా 1.10 లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు కళాశాలల నుంచి బయటకు వస్తున్నారు. నైపుణ్యలేమితో ఉద్యోగాలు దక్కకపోతుండడంతో వారి స్కిల్స్ పెంచి ఉద్యోగాలు సాధించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా ప్రారంభించాం. ఇక్కడ అనేక మంది క్రికెట్, టెన్నిస్, ఇతర క్రీడాకారులు ఉన్నారు. అందులోకి సంజయ్ గోయెంకా, అభినవ్ బింద్రా, కపిల్ దేవ్, ఉపాసన కొణిదెల వంటి క్రీడాకారులు, కార్పొరేట్లను తీసుకున్నాం. స్పోర్ట్స్ అకాడమీని కూడా ఏర్పాటు చేస్తున్నాం. తమిళ విద్యార్థులు, కోచ్‌లకు స్పోర్ట్స్ యూనివర్సిటీలో అవకాశాలు కల్పిస్తాం. ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్స్ సాధించే బాధ్యత తెలంగాణ–తమిళనాడు తీసుకుంటాయి. మోదీ, అమిత్ షాతో అది సాధ్యం కాదు'అని సీఎం పేర్కొన్నారు.

వంద నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

అన్ని వర్గాల విద్యార్థులు ఒకేచోట చదువుకోవాలన్న లక్ష్యంతో తెలంగాణలోని 100 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'గతంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలకు వేర్వేరు పాఠశాలలు ఉండేవి. మేం వారంతా వేర్వేరని అనుకోవడం లేదు. అందుకే వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విద్యార్థులంతా ఒకే చోట చదువుకుంటారు. ప్రతి స్కూల్‌ను 25 ఎకరాల్లో రూ.200 కోట్లతో నిర్మిస్తున్నాం. 1956లో ప్రారంభించిన ఐటీఐల్లో ఇప్పటికీ అదే సిలబస్ కొనసాగిస్తున్నారు. డీజిల్ మెకానిక్, ప్లంబర్ ట్రైనింగ్ ఇస్తున్నారు. అక్కడ శిక్షణ తీసుకున్న వారికి ఉపాధి లభించడం లేదు. అందుకే టాటా కంపెనీ భాగస్వామ్యంతో తెలంగాణలో ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీ) అప్‌గ్రేడ్ చేస్తున్నాం. ఇటీవలే నూతన విద్యా విధానం తీసుకువచ్చాం. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే ఏడాది నుంచి నర్సరీ ప్రారంభిస్తున్నాం. తమిళనాడులో మాదిరే తెలంగాణలో కూడా అనేక ఉన్నత విద్యా సంస్థలున్నాయి. తమిళనాడు, తెలంగాణ దేశానికి రోడ్‌మ్యాప్ ఇవ్వనున్నాయి. నాలెడ్జ్ హబ్ కానున్నాయి. విద్య మాత్రమే దేశంలో సమానత్వం, సామాజిక న్యాయం, అభివృద్ధి సాధనకు మార్గమని భావిస్తున్నాం. విద్యను విప్లవంగా మేం భావిస్తున్నాం'అని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై రెండు రోజుల్లో జీఓ

- స్థానిక ఎన్నికల నిర్వహణకే ప్రభుత్వం మొగ్గు
- ఈ–ఫార్ములా రేస్ కేసులో కేటీఆర్ అరెస్టు తప్పదు
- ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్



సాక్షి, న్యూఢిల్లీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు అంశంపై రెండు రోజుల్లో ప్రభుత్వం జీఓ జారీ చేసే అవకాశముందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. ఆ జీఓ విడుదలైన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలనేది ప్రభుత్వం ఆలోచనగా ఉందన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. డీసీసీల ఎంపిక కోసం నియమించిన ఏఐసీసీ పరిశీలకులతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లతో సమావేశంలో పాల్గొనేందుకు బుధవారం మహేశ్‌గౌడ్ ఢిల్లీకి వచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. అధిష్టానం నియమించిన ఏఐసీసీ పరిశీలకులు అక్టోబర్ 4న తెలంగాణలో పర్యటిస్తారని చెప్పారు.

సర్వేలో ముందున్న వారికే జూబ్లీహిల్స్ టికెట్

'జూబ్లీహిల్స్ టికెట్ కోసం చాలామంది పోటీ పడుతున్నారు. వారిలో సీఎన్ రెడ్డి, నవీన్‌యాదవ్, బాబా ఫసియొద్దీన్, బొంతు రామ్మోహన్ సహా కొంత మంది బయటి వారు కూడా ఉన్నారు. స్థానికుడికే సీటు ఇవ్వాలనే డిమాండ్ బాగా ఉంది. ఇప్పటికే ముగ్గురు మంత్రులతో ఒక కమిటీ వేశాం. సర్వేలు కూడా చేస్తున్నాం. సర్వేలో ఎవరు ముందుంటే వారికే సీటు ఇచ్చి బరిలోకి దింపుతాం. కంటోన్మెంట్‌లో జరిగిన ఉప ఎన్నికలో సానుభూతి పని చేయలేదు. కాంగ్రెస్ గెలిచింది. జూబ్లీహిల్స్‌లోనూ అదే జరుగుతుంది'అని మహేశ్‌గౌడ్ చెప్పారు.

ఈ–ఫార్ములా కార్ రేస్‌లో ప్రభుత్వం దగ్గర ఆధారాలు ఉన్నాయి

'ఈ–ఫార్ములా కార్ రేస్ కేసులో ప్రభుత్వం దగ్గర అన్ని రకాల ఆధారాలు ఉన్నాయి. మాజీమంత్రి కేటీఆర్ అరెస్టు తప్పదు. గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరిపితే బాగుంటుంది. కేసీఆర్ కూతురు కవితది ఆస్తుల పంచాయితీ. కాంగ్రెస్‌తో కవితకు ఎలాంటి సంబంధం లేదు. బీఆర్ఎస్ నాలుగు ముక్కలైంది'అని మహేశ్‌గౌడ్ అన్నారు.

ఎన్నికలే ఎజెండా..

- పార్టీ నేతలతో బీఆర్ఎస్ అధినేత కీలక భేటీ
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక పోరుపై దిశానిర్దేశం
- జిల్లా నేతలతో కేటీఆర్, హరీశ్‌రావు టెలికాన్ఫరెన్స్
- బతుకమ్మ ద్వారా సర్కారును ఎండగట్టాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ నేతలతో కీలక భేటీ నిర్వహించారు. ఎర్రవల్లి నివాసంలో గురువారం జరిగిన ఈ భేటీలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం కేడర్‌తో జరుగుతున్న సమావేశాల వివరాలను కేటీఆర్ వివరించారు. పోలింగ్ బూత్ స్థాయిలో ప్రతి ఓటర్‌ను చేరుకునేలా పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయాలని కేసీఆర్ ఆదేశించారు. కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి రిజర్వాయర్ ఎత్తు పెంపుతో కృష్ణా జలాల్లో తెలంగాణకు జరిగే నష్టం గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. బనకచర్ల లింకు ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరితో రాష్ట్రానికి జరిగే నష్టంపై బీఆర్ఎస్ పోరాడకతప్పదని కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై సీబీఐ ప్రాథమిక సమాచార సేకరణ ప్రారంభించిందనే వార్తల నేపథ్యంలో పీసీ ఘోష్ కమిషన్ ఎదుట వాదన వినిపించిన తరహాలోనే ముందుకు వెళ్లాలని కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిసింది.

స్థానిక ఎన్నికలపై టెలి కాన్ఫరెన్స్

రేపోమాపో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందనే వార్తల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్‌రావు గురువారం పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ముఖ్య నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎరువుల కొరత మొదలుకుని బతుకమ్మ పండుగ ఏర్పాట్ల వరకు ప్రభుత్వం అన్ని అంశాల్లోనూ విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. స్థానిక ఎన్నికలను సవాల్‌గా తీసుకుని ప్రజల్లోకి వెళ్లాలని, ఊరూరా పార్టీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించాలని కేటీఆర్ ఆదేశించారు.

నీటి పంపకాలపై రేవంత్, ఉత్తమ్ అసత్య ప్రచారాలు

బహిరంగ లేఖలో మాజీ ఎంపీ వినోద్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది మొదలుకొని రెండేళ్లుగా మాజీ సీఎం కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విష ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. రెండు తెలుగు రాష్ట్రాల నడుమ నదీజలాల పంపకాలపై అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్‌కు రాసిన బహిరంగ లేఖను వినోద్ కుమార్ గురువారం విడుదల చేశారు. కృష్ణా జలాలపై బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట మంత్రి ఉత్తమ్ స్వయంగా హాజరై వాదన వినిపించిన నేపథ్యంలో వాస్తవాలు చెప్పేందుకు బహిరంగ లేఖ రాస్తున్నట్టు వెల్లడించారు. అంతర్ రాష్ట్ర నదీ జల వివాదాల చట్టంలో సెక్షన్ 3 కేసీఆర్ సుదీర్ఘ పోరాటం వల్లే సాధ్యమైందన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు బీజేపీ ఫోబియా

ఆధారాలు లేకుండా చిల్లర మాటలు మాట్లాడుతున్నారు : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు బీజేపీ ఫోబియా పట్టుకుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సీఎంతో సహా ప్రతి ఒక్కరు బీజేపీపై ఇష్టారాజ్యంగా ఆరోపణలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు కలిసి పనిచేశారని, పదవులు పంచుకున్నారని గుర్తు చేశారు. అలాంటి వారు బీజేపీకి నీతులు, కథలు చెప్పాల్సిన పనిలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిని సీబీఐ పరిశీలిస్తోందని, త్వరలో నిర్ణయం తీసుకుంటుందన్నారు. గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. రాష్ట్రంలో పలు జాతీయ రహదారులు అభివృద్ధి, విస్తరణ పనులపై ఆయనతో చర్చించారు. అనంతరం తన నివాసంలో కిషన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 26 ప్రాజెక్టులు డీపీఆర్ స్టేజ్‌లో ఉన్నాయని.. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత.. ఎప్పుడు ప్రాజెక్టులు పూర్తవుతాయనే వివరాలు వెల్లడిస్తామన్నారు.

రేవంత్ వ్యవహారం సరిగాలేదు..

'మెట్రో విస్తరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహారశైలిని సమంజసంగా లేదు. ప్రజాప్రతినిధిగా తెలంగాణ రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు రావాలని, ప్రజలకు మేలు జరగాలని కోరుకునే వ్యక్తుల్లో ముందు వరుసలో నేనుంటాను. నేను కానీ, కేంద్రం కానీ మెట్రో రాకుండా అడ్డుకోవడం లేదు. రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ మెట్రో విషయంలో అందరికంటే ముందే మేం చురుగ్గా వ్యవహరించాం. ట్రిపుల్ ఆర్‌కు ముందుగానే కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. మెట్రో విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయాలి. ఆర్థిక సంస్థలు రుణాలు ఇస్తున్నప్పుడు చాలా విషయాలపై స్పష్టత కావాలని అడుగుతాయి. మెట్రో ఇప్పటికే నష్టాల్లో నడుస్తోంది. ఇది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. దీన్ని వారే తేల్చుకోవాలి. మెట్రో విషయంలో అన్ని రకాలుగా మా సహకారం ఉంటుంది'అని కిషన్‌రెడ్డి తెలిపారు.

రూ.30,425 కోట్లతో 1,174 కిలోమీటర్లకుపైగా జాతీయ రహదారులు

'కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో ఈ సంవత్సరం.. కొత్తగా 767 కిలోమీటర్ల మేర రూ.29,555 కోట్లు విలువైన వివిధ జాతీయ రహదారుల ప్రాజెక్టులను చేపట్టనుంది. దీనికి అదనంగా ఈ సంవత్సరం సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఐఆర్ఎఫ్) కూడా మంజూరయ్యాయి. తెలంగాణలో 422 కిలోమీటర్ల సీఐఆర్ఎఫ్ రోడ్డుకు రూ.868 కోట్లతో పనులు ప్రారంభం కానున్నాయి. మొత్తం కలిపి 1,174 కిలోమీటర్లకు గానూ.. రూ.30,425 కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టుల పనులు తెలంగాణలో ప్రారంభమవుతాయి. హైదరాబాద్–శ్రీశైలం రోడ్డు మార్గంలో భక్తులు, పర్యాటకుల సౌకర్యం కోసం.. 4లేన్ ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వే చేపట్టాలని కేంద్రం భావిస్తోంది. హైదరాబాద్, కల్వకుర్తి మధ్యలో 4లేన్ కావాలని అడిగాం. దానిపై నిర్ణయం తీసుకుంటామని గడ్కరీ చెప్పారు'అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

రాష్ట్రంలో కేంద్రం చేపట్టనున్న ప్రాజెక్టులివే
పూర్తి వివరాలు సాక్షి ప్లస్ లో

మరింత ఉత్తమ విత్తనాలు రావాలి

- రాష్ట్రంలో విత్తన ఉత్పత్తి, ఎగుమతులపై దృష్టి పెట్టాలి
- హైదరాబాద్ సీడ్ కాంక్లేవ్–2025లో మంత్రి ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా కొనసాగాలంటే పరిశోధనలు బలోపేతం చేసి, ఎగుమతులను విస్తరించి, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని హోటల్ దస్పల్లాలో సీడ్స్‌మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'హైదరాబాద్ సీడ్ కాంక్లేవ్ 2025'లో గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విత్తన కంపెనీలు దేశానికి ఎంతో సేవ చేస్తున్నాయని, వారికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం ఇస్తుందని హామీ ఇచ్చారు. వ్యవసాయంలో నాణ్యమైన విత్తనం అత్యంత ముఖ్యమైన ఇన్‌పుట్ అని అన్నారు. విత్తనం దిగుబడిని నిర్ణయిస్తుందని, ఎరువులు, నీటి పారుదల సామర్థ్యాన్ని పెంచుతుందని తెలిపారు. సీడ్ కంపెనీలు పరిశోధన, అభివృద్ధిపై మరింత దృష్టి సారించాలని, అధిక దిగుబడినిచ్చే కొత్త వరి రకాలను అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. అన్ని పంటలలోనూ ఆవిష్కరణలు జరగాలని, అదే రైతుల ఆదాయాన్ని పెంచే మార్గమని పేర్కొన్నారు. తెలంగాణ విత్తన పరిశ్రమ అంతర్జాతీయ స్థాయిలో విస్తరిస్తోందని తెలిపారు. గతంలో వ్యవసాయ విశ్వ విద్యాలయాలు మాత్రమే మేలురకం విత్తనాలను రూపొందించేవని గుర్తుచేశా రు. వ్యవసాయం చేసే రాజకీయ నాయకుడు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అని ఉత్తమ్ కొనియాడారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కె. సత్యనారాయణ, అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణతోపాటు సీడ్ కంపెనీలు, పరిశోధనా సంస్థలు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డితో మాజీ ఎమ్మెల్యే కోనప్ప, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ క్రిష్ణ

'గులాబీ' గూటికి కోనప్ప

- సోదరుడితో కలసి పార్టీ మారిన మాజీ ఎమ్మెల్యే

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయన సోదరుడు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ క్రిష్ణతో కలిసి గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినా, కొంత కాలంగా కోనప్ప పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. అధికార పార్టీలో ఉండి కూడా నియోజకవర్గ అభివృద్ధి పనులు చేసుకోలేకపోతున్నట్లు నిరాశ వ్యక్తంచేశారు. మరోవైపు సిర్పూర్ నియోజకవర్గంలో క్రియాశీలంగా మారిన ఎమ్మెల్సీ దండే విఠల్‌కు కోనప్పకు మధ్య పొసగడం లేదు. వీరి పంచాయితీ గాంధీభవన్ వరకు వెళ్లినా పరిష్కారం కాలేదు. దీంతో ఆయన తిరిగి సొంత గూటికి చేరారు.

ఆర్ఎస్పీతో వైరం: సిర్పూర్ నియోజకవర్గం నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ (ఆర్ఎస్పీ).. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి స్థానికంగా పట్టు పెంచుకుంటున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ చేసిన ఆయన.. బీజేపీ గెలుపునకు, తన ఓటమి కారణమయ్యారని కోనప్ప ఆగ్రహంతో ఉన్నారు. ఈ క్రమంలో ఆర్ఎస్పీ బీఆర్ఎస్‌లో చేరడంతో కోనప్ప లోక్‌సభ ఎన్నికల ముందు మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో కలసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే, కాంగ్రెస్‌లో తనకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆగ్రహంతో ఉన్నారు.

అంగన్‌వాడీలపై సర్కారు కర్కశత్వం

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- చలో సెక్రటేరియట్‌కు పిలుపునిస్తే అరెస్టులు తగవు
- వారి సమస్యలు పరిష్కరించాలి



సాక్షి, హైదరాబాద్/సిద్దిపేటజోన్: అంగన్‌వాడీ టీచర్లపై రేవంత్ ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తమ సమస్యల పరిష్కారం కోసం చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి పిలుపునిచ్చిన అంగన్‌వాడీలపై ప్రభుత్వం పోలీసులను ప్రయోగించడాన్ని ఆయన ఖండించారు. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామంటూ బీరాలు పలికిన రేవంత్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లను రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లకు తరలించడం సిగ్గుచేటని గురువారం ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. ఆడబిడ్డలకు ముఖ్యమంత్రి రేవంత్ బతుకమ్మ పండుగ సంబురం లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. 2014 ముందు అంగన్‌వాడీ టీచర్లకు రూ.4,200, వారి సహాయకులకు రూ.2,200 వేతనం లభించేదన్నారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.13,650, మినీ అంగన్ వాడీ టీచర్లకు రూ.7,800, అంగన్ వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800లకు కేసీఆర్ ప్రభుత్వం పెంచిందన్నారు. అయితే అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.18 వేలకు పెంచుతామని, ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ అడ్రస్ లేకుండా పోయిందన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

బతుకమ్మ పండుగ ఏర్పాట్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం

తెలంగాణ సంప్రదాయ పండుగ బతుకమ్మను కాంగ్రెస్ ప్రభుత్వం దండగ లెక్క చూస్తోందని, అందుకే గ్రామాల్లో ఏర్పాట్లపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను తగ్గించే ప్రయత్నంలో ఉందని ఆయన ఆరోపించారు. ప్రపంచంలో పూలను కొలిచే, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే ఉందన్నారు.

ఇష్టానుసారంగా మారుస్తున్నారు

- ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌పై మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ధ్వజం
- గ్రీన్ ఫీల్డ్ హైవే బాధితులతో తెలంగాణ భవన్‌లో భేటీ



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్‌ఆర్) అలైన్‌మెంట్‌ను కాంగ్రెస్ నేతలు ఇష్టారాజ్యంగా మారుస్తున్నారని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. పేద రైతుల భూములు లాక్కుంటూ, నష్ట పరిహారం కూడా సక్రమంగా చెల్లించడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతీసారి ప్రజలకు ఇబ్బందులు తప్పవన్నారు. ట్రిపుల్‌ఆర్ మూలంగా భూములు కోల్పోతున్న రైతులు సంఘటితంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో గురువారం కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ట్రిపుల్ ఆర్ గ్రీన్ ఫీల్డ్ హైవే బాధితుల సమావేశం జరిగింది. శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, మర్రి జనార్దన్ రెడ్డి బాధితులతో భేటీ అయ్యారు. ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్పునకు వ్యతిరేకంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు అన్ని మార్గాలు అవలంబిస్తామని శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ విమర్శించారు. కమీషన్ల కోసమే రేవంత్ ప్రభుత్వం ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మారుస్తోందన్నారు. అలైన్‌మెంట్ మార్పు ద్వారా లాభాలు దండుకునేందుకు సీఎం రేవంత్ రియల్ ఎస్టేట్ వ్యాపారిలా ఆలోచిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి విమర్శించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే.. పెద్దలతో కుమ్మక్కై రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. భూములు కాపాడుకునేందుకు రైతులు ఎంతకైనా తెగిస్తారని మర్రి జనార్దన్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



సైబర్ నేరగాళ్లపై సస్పెక్ట్ షీట్స్

సైబర్ నేరగాళ్లను కట్టడి చేసేందుకు సిటీ పోలీసులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. పదే పదే ఈ నేరాలకు పాల్పడే వారిపై సస్పెక్ట్ షీట్స్ తెరవనున్నారు. -10లో



రక్షణ ఛత్రం.. 'షీ అస్త్ర'ం..

దేశంలో మొట్టమొదటి ఉమెన్ యాప్. ఫేస్‌బుక్, ఇన్‌స్టాకు ప్రత్యామ్నాయం. మహిళా అడ్వొకేట్ వెన్నల బృందం 'షీ అస్త్ర' అనే సోషల్ యాప్‌నకు రూపకల్పన చేసింది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/23.0

నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముంది. గరిష్టంగా 30, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

బతుకమ్మకుంట ప్రారంభోత్సవం నేడు



విద్యుద్దీపాల మధ్య బతుకమ్మ కుంట

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన బతుకమ్మ కుంటను శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ప్రస్తుతం బతుకమ్మ కుంటను ఓ పిక్నిక్ స్పాట్‌గా అభివృద్ధి చేసి.. చుట్టూ పిల్లల ప్లే ఏరియాతో పాటు అనేక ఆకర్షణలు అందుబాటులోకి తెచ్చారు. వృద్ధులు సేద దీరేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయి. వాకింగ్ చేసే వారి కోసం చెరువు చుట్టూ నడక దారి, ఆక్రమణలకు తావు లేకుండా చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ చెరువు వరద నీటితో నిండు కుండను తలపిస్తుండటంతో బోటు షికారు కూడా అందుబాటులోకి వచ్చింది. బతుకమ్మకుంటను సీఎం నగర ప్రజలకు అంకితం ఇవ్వనున్నారు. బతుకమ్మ ఉత్సవాలను సైతం నిర్వహిస్తున్నారు. ఈ కుంట అభివృద్ధికి హైడ్రా తీసుకున్న చొరవకు స్థానికులు అభినందనలు తెలుపుతున్నారు.

నేడు రవీంద్రభారతిలో నర్సుల బతుకమ్మ

లక్డీకాపూల్: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో శుక్రవారం సాయంత్రం రవీంద్ర భారతిలో బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కల్పన గౌడ్, రాపోలు శేఖర్ తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి నర్సింగ్ ఆఫీసర్లు పెద్ద సంఖ్యలో ఈ వేడుకలకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. బతుకమ్మ వేడుకలపై వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆదిలక్ష్మి, లలితలు స్పష్టం చేశారు.

ఓయూలో ఎన్నికల హోరు

జోరందుకున్న ఉద్యోగ సంఘాల ప్రచారం



మేనిఫెస్టో విడుదల చేస్తున్న ఖదీర్ తదితరులు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యోగాల సంఘాల ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఈ నెల 27న పలు ఉద్యోగ సంఘాల ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో గురువారం ఎన్జీఓస్ స్టాఫ్ అసోసియేషన్ అబ్దుల్ ఖదీర్ ఖాన్, బి. వెంకటేష్ ప్యానెల్ 43 హామీలతో రూపొందించిన ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. ఓయూలోని నాన్ టీచింగ్ ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్జీఓస్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్ష అభ్యర్థి అబ్దుల్ ఖదీర్ ఖాన్, ప్రధాన కార్యదర్శి అభ్యర్థి బి.వెంకటేష్‌లు మాట్లాడుతూ.. తమ ప్యానెల్‌లోని 9 మందిని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. తాము గెలిస్తే ఉద్యోగుల సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు పాటుపడతామన్నారు. ఉద్యోగులందరికి హెల్త్ కార్డులు, సీపీఎస్, ఓపీఎస్ విధానం అమలు చేయిస్తామన్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.





ప్రకృతి సంబరం
పడతుల ఆనందం

కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో గురువారం బతుకమ్మ ఉత్సవాలు ఉత్సాహభరితంగా సాగాయి. యూనివర్సిటీ విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి దర్బార్ హాల్ ముందు సంబురంగా ఆడారు. డీజే హోరులో దాండియా పాటలు పాడారు.

మెట్రోకు గుడ్‌బై

ఆ రైల్‌తో అనుబంధానికి బీటలు

- నిర్వహణ నుంచి ఎల్అండ్‌టీ వెనకడుగు
- ప్రభుత్వంతో ఒప్పందానికి నిరాకరణ
- ముగిసిన 9 ఏళ్ల ఒప్పందం

ముందుగానే వెల్లడించిన 'సాక్షి'

సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్ మెట్రో రైల్‌తో ఎల్అండ్‌టీ అనుబంధానికి బీటలు వారాయి. ఈ ప్రాజెక్టు నిర్వహణ నుంచి వైదొలగనున్నట్లు ఎల్అండ్‌టీ సంస్థ గురువారం మరోసారి స్పష్టంగా తేల్చిచెప్పింది. ఏటేటా పెరుగుతున్న నష్టాలు, ప్రభుత్వం నుంచి ఆశించిన రాయితీలు లభించకపోవడం, ప్రాజెక్టు ప్రారంభమైన కొద్ది కాలానికే కోవిడ్ విజృంభించడం వంటి వివిధ కారణాలతో ఆ సంస్థ సుమారు రూ.5,500 కోట్లకు పైగా నష్టాలను మూటగట్టుకుంది. ఈ క్రమంలో మెట్రో భారాన్ని మోయడం తమ వల్ల కాదని ఇప్పటికే పలు దఫాలుగా స్పష్టం చేసింది. ఇటీవల కేంద్రానికి రాసిన లేఖలోనూ అదే విషయాన్ని వెల్లడించింది. ఈ లేఖలోని వివరాలను 'సాక్షి' ముందే వెల్లడించి సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత వరుస పరిణామాలు చోటుచేసుకున్నాయి. మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని బదిలీ చేయడంతో పాటు, ఎల్అండ్‌టీతో ప్రభుత్వం చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయింది. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు నుంచి తప్పుకోవడం మినహా తమకు మరో ప్రత్యామ్నాయం లేదని, ప్రభుత్వంతో మరే విధమైన ఒప్పందానికి తాము సిద్ధంగా లేమని స్పష్టం చేయడంతో భాగ్యనగర మెట్రోకు ఎల్అండ్‌టీకి ఉన్న బంధం ముగిసిపోయింది.

అడుగులు ఇలా..

- హైదరాబాద్‌లో ప్రజారవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకొని అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం మెట్రో నిర్మాణానికి చర్యలు చేపట్టింది. నాటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో ముందు చూపుతో హైదరాబాద్ అభివృద్ధిని, నగరంలో లాస్ట్‌మైల్ కనెక్టివిటీ సదుపాయాన్ని దృష్టిలో ఉంచుకొని మెట్రో ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అన్ని రంగాల్లో హైదరాబాద్ అభివృద్ధి చెందాలంటే మెట్రో ఎంతో అవసరమని గుర్తించారు. మెట్రో ప్రాజెక్టు వల్ల రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటుందని, దాంతో మిగతా రంగాల్లోనూ నగరంలో అభివృద్ధి పరుగులు తీస్తుందని అప్పటి ప్రభుత్వం భావించింది. ఈ మేరకు 2007లో కేంద్రం నుంచి ఆమోదం పొంది పీపీపీ పద్ధతిలో ప్రాజెక్టును ప్రారంభించారు.
- 2010 సెప్టెంబర్‌లో అప్పటి ఉమ్మడి ప్రభుత్వంతో ఎల్అండ్‌టీ ఒప్పందం కుదుర్చుకుంది. అయిదేళ్లలో ప్రాజెక్టును నిర్మించి 30 ఏళ్లపాటు రైళ్లను నడపనున్నట్లు ఆ ఒప్పందంలో పేర్కొంది. ఈ లెక్కన 2015 నాటికి మెట్రో రైళ్లు అందుబాటులోకి రావాలి. కానీ మరో రెండు సంవత్సరాలు ఆలస్యంగా 2017లో రైళ్లు పట్టాలెక్కాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు అంటే 9 ఏళ్లుగా ఎల్అండ్‌టీయే రైళ్లను నడుపుతోంది. మూడు కారిడార్‌లలో 69 కి.మీ.మార్గంలో మెట్రో రైళ్లు నడుస్తున్నాయి. నాగోల్-రాయదుర్గం, ఎల్బీనగర్- మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్‌ల మధ్య ప్రతిరోజు 57 రైళ్లు 1000 ట్రిప్పులకు పైగా తిరుగుతున్నాయి. రోజుకు సుమారు 5 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. కొన్ని స్టేషన్‌లకు లాస్ట్‌మైల్ కనెక్టివిటీ సదుపాయం ఉంది. చాలావరకు వాహనాలకు పార్కింగ్ సదుపాయం లేకపోవడం, సరైన కనెక్టివిటీ సదుపాయాలు లేకపోవడం వంటి సమస్యలు కూడా ఉన్నాయి.



మరో 21 ఏళ్లు అవకాశం ఉన్నా..

ఒప్పందం ప్రకారం ఎల్అండ్‌టీకి మరో 21 సంవత్సరాల పాటు నిర్వహించేందుకు అవకాశం ఉంది. ఈ ఒప్పందంలో భాగంగానే మెట్రో కారిడార్‌లకు ఇరువైపులా, నగరంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 18 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని ఎల్అండ్‌టీకి ప్రభుత్వం లీజుకు ఇచ్చినట్లు అంచనా. పలుచోట్ల మాల్స్ నిర్మించి అద్దెలకు ఇచ్చారు. రాయదుర్గం వద్ద మరో ప్రైవేట్ సంస్థకు సబ్ లీజ్‌కు ఇచ్చారు. కానీ ఇప్పుడు ఈ సంస్థ వైదొలగడం ఖరారైన నేపథ్యంలో ఒప్పందంలోని వివిధ అంశాలపై ఎలా ముందుకు వెళ్తారనేది ఆసక్తికరంగా మారింది.

మద్యం దుకాణాలకు టెండర్లు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: మద్యం దుకాణాలకు ఔత్సాహిక వ్యాపారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ గురువారం నోటిఫికేషన్ వెలువడింది. రెండేళ్ల కాలానికి డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30 వరకు కొత్త లైసెన్సులు మంజూరు చేయనున్నారు. ఈసారి కూడా షాపుల కేటాయింపులో ఎస్సీ (10శాతం), ఎస్టీ (5శాతం), గౌడ (15 శాతం) కులస్తులకు రిజర్వేషన్లు కేటాయించారు. ఈ నెల 26 నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఒక్కో దరఖాస్తు రుసుం రూ.3 లక్షలు. అక్టోబర్ 23న షాపుల వారీగా లక్కీ డ్రా తీస్తారు. డిసెంబర్ 1 నుంచి కొత్త మద్యం పాలసీ అమల్లోకి రానుంది. సరూర్‌నగర్ ఎక్సైజ్ పరిధిలో 138 మద్యం షాపులు ఉండగా, వీటిలో 25 గౌడ కులస్తులకు, 11 ఎస్సీలకు, ఎస్టీలకు 2 ఖరారు చేశారు. మిగిలిన షాపులను జనరల్ కేటగిరీలో ప్రకటించారు. శంషాబాద్ ఎక్సైజ్ పరిధిలో 111 మద్యం షాపులు ఉండగా.. 9 గౌడ్స్‌కు, 6 ఎస్సీలకు కేటాయించారు.

'పవర్'ఫుల్ పోస్టులే కావాలి

అలా లేకుంటే పని చేసేందుకు ససేమిరా

- బదిలీ స్థానాల్లో విధులకు అధికారులు నో
- బల్దియాలో అంతర్గత బదిలీలతో కొత్త సమస్యలు



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్.. తాను బాధ్యతలు స్వీకరించిన కొద్దికాలం నుంచే అంతర్గత బదిలీల చర్యలు చేపట్టారు. వాటి వల్ల ప్రయోజనం కలుగుతుందని ఆయన భావించినప్పటికీ సత్ఫలితాలు కనిపించడం లేదు. స్వల్ప కాలంలోనే తరచూ బదిలీలతో కొందరు.. ఉన్నత స్థానాల్లోంచి వాటికంటే తక్కువ అధికారం ఉన్న స్థానాల్లో నియమించారని కొందరు.. అసలు పనులే చేయడం లేదు. తమ స్థాయికి తగిన పోస్టులివ్వలేదని కొందరు డ్యూటీలకు రావడమే మానేశారు. ఆ మాటకొస్తే.. కర్ణన్‌ను కమిషనర్‌గా నియమించాక జీహెచ్ఎంసీలో ఆయన కంటే సీనియర్ అయిన ఐఏఎస్ అధికారి ఒకరు జీహెచ్ఎంసీకే రాలేదు. దాంతో ప్రభుత్వం ఆయనను రాష్ట్రస్థాయి పోస్టుకు బదిలీ చేసింది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్లు, సర్కిళ్ల పరిధుల్లో డిప్యూటీ కమిషనర్లుగా ఉన్న వారిని ఆ స్థాయి కంటే తక్కువ స్థాయివిగా భావించే జాయింట్ కమిషనర్లుగా నియమించడంతో కొందరు అసలు విధులకే రాకుండా మానేశారు. కొందరు తప్పదన్నట్లు సదరు పోస్టుల్లో చేరినా అసలు పనులు మాని, తాము కోరుకున్న పోస్టుల కోసం సచివాలయం చుట్టూ, మంత్రుల చుట్టూ, ఇతరత్రా రాజకీయనేతల చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం. జీహెచ్ఎంసీలో పని ఒత్తిడి తీవ్రంగా ఉన్న ఓ విభాగంలో ముగ్గురు జాయింట్ కమిషనర్లను నియమిస్తే.. ఇద్దరు తమకిచ్చిన పనులు మాని పైరవీల వేటలోనే ఉన్నట్లు తెలుస్తోంది.

కొందరికి తక్కువ.. కొందరికి ఎక్కువ

- మరోవైపు కొందరు ఉన్నతాధికారులకు మాత్రం అదనపు భారం పడుతోంది. వాస్తవానికి జీహెచ్ఎంసీలో జోనల్ కమిషనర్లకు పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. జీహెచ్ఎంసీ స్థాయిలో కమిషనర్ కంటే కూడా జోనల్ స్థాయిలో వారికే ఎక్కువ పనులుంటాయి. అలాంటిది కొందరు జోనల్ కమిషనర్లకే ఇతరత్రా విభాగాల అదనపు బాధ్యతలు కూడా అప్పగించడంతో వారికి పని ఒత్తిడి ఎక్కువగా ఉంటోంది. బాగా పని చేస్తారని బరువంతా వారిపైనే మోపుతున్నారనే ఆరోపణలున్నాయి. ఒక జోనల్ కమిషనర్..మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో కీలక స్థానంలో ఉన్నారు. మరో జోనల్ కమిషనర్‌కు కీలకమైన జోనల్ బాధ్యతలతో పాటు ప్రధాన కార్యాలయంలోనూ కీలకమైన ఐటీ, రెవెన్యూ విభాగాల బాధ్యతలున్నాయి.
- అధిక నిర్మాణాలతో పాటు అధిక పనులుండే మరో జోనల్ కమిషనర్‌కు ప్రధాన కార్యాలయంలో ఎన్నికల విభాగం బాధ్యతలప్పగించారు. వారందరూ ప్రతిరోజూ రెండు పోస్టుల నిర్వహణకు గాను దూరంగా ఉన్నప్పటికీ రెండు కార్యాలయాలకు వెళ్లక తప్పని పరిస్థితి. ఇదే తరుణంలో ప్రధాన కార్యాలయంలోని కొందరు అడిషనల్ కమిషనర్లకు మాత్రం పేరుకు మాత్రం రెండేసి విభాగాలున్నప్పటికీ, వాటిల్లో చేసేందుకు పెద్దగా పనేమీ ఉండదు. అయినప్పటికీ, విద్యుత్ విభాగానికి మాత్రం అడిషనల్ కమిషనర్ లేరు. నగరంలో అత్యంత సమస్యాత్మక అంశాల్లో వీధిదీపాల సమస్య ప్రధానమైనది. అయినప్పటికీ, వీధిదీపాలను పర్యవేక్షించేందుకు విద్యుత్ విభాగానికి అడిషనల్ కమిషరే లేదు. చేసేవారికి అదనపు భారం. చేయని వారికి నామమాత్రం. ఇంకొందరు ఎక్కడుంటారో, ఏంచేస్తారో తెలియదు. పోస్టు మాత్రం జీహెచ్ఎంసీలో ఉంటుంది. ఇదీ జీహెచ్ఎంసీ తీరు.

మురుగు శుద్ధిలో ముందడుగు

- నేడు 39 అమృత్ ఎస్టీపీలకు సీఎం శంకుస్థాపన
- ఆరు ఎస్టీపీలను ప్రారంభించనున్న రేవంత్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణాసియాలోనే వంద శాతం మురుగును శుద్ధి చేసే తొలి నగరంగా రికార్డు సృష్టించేందుకు మహా హైదరాబాద్ సిద్ధమవుతోంది. రాబోయే పదేళ్ల వరకు ఉత్పత్తయ్యే మురుగును సైతం శుద్ధి చేసేందుకు ముందస్తు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో జలమండలి అడుగులు వేస్తోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద మంజూరైన ఎస్టీపీల నిర్మాణాలకు సిద్ధమైంది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 39 ప్రాంతాల్లో సుమారు 972 ఎమ్మెల్డీల సామర్థ్యంతో నిర్మించే ఎస్టీపీల పనులకు శుక్రవారం అంబర్‌పేట వద్ద సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేస్తారు. అదేవిధంగా నిర్మాణాలు పూర్తి చేసుకున్న మరో 6 ఎస్టీపీలను ఆయన లాంఛనంగా ప్రారంభించనున్నారు.

రెండేళ్లలో నిర్మాణాలు పూర్తయ్యేలా..

కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద మంజూరు చేసిన 39 మురుగు నీటి శుద్ధి కేంద్రాలను రెండు ప్యాకేజీల కింద నిర్మాణాలను పూర్తి చేసేలా జలమండలి చర్యలు చేపట్టింది. మొత్తం ఎస్టీపీల్లో ఒకటి పీపీపీ మోడ్‌లో.. మిగిలిన రెండు ప్యాకేజీల్లో 38 హైబ్రిడ్ అన్యూయిటీ మోడల్ (హ్యామ్)విధానంలో నిర్మాణ పనులు పూర్తి చేయనున్నారు. ప్యాకేజీ-1లో 16 ఎస్టీపీలు, ప్యాకేజీ-2లో 22 ఎస్టీపీలు నిర్మిస్తారు. మొత్తం అంచనా వ్యయం సుమారు రూ.3,849.10 కోట్లు. ఇందులో ఎస్టీపీల నిర్మాణ వ్యయం రూ. 2,569.81 కోట్లు. 15ఏళ్ల పాటు నిర్వహణకు రూ. 1,279.29 కోట్లు వెచ్చించనున్నారు. ఎస్టీపీల ప్రాజెక్టుల నిర్మాణ వ్యయంలో కేంద్రం 30శాతం, రాష్ట్రం 30 శాతం, నిర్మాణ సంస్థ 40 శాతం నిధులు సమకూర్చనుంది.



మూసీ పక్కన అంబర్‌పేటలో ఎస్టీపీ

వచ్చే పదేళ్లలో..

రాబోయే పదేళ్లలో మురుగు ఉత్పత్తి 2,815 ఎమ్మెల్డీ కావచ్చని జలమండలి అంచనా వేస్తోంది. అమృత్ 2.0 కింద 39 ఎస్టీపీలు పూర్తయితే 2,850 ఎమ్మెల్డీలను శుద్ధి చేసే అవకాశం ఉంటుందని భావిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్ అర్బన్ ఆగ్లోమెరేషన్ పరిధిలో రోజువారీగా 1950 మిలియన్ లీటర్ గ్యాలన్ల (ఎమ్మెల్డీ) మురుగు నీరు ఉత్పన్నమవుతోంది. ఇందులో జీహెచ్ఎంసీ పరిధిలో 1,650 ఎమ్మెల్డీ ఉంటుంది. ఇప్పటికే 37 ఎస్టీపీల ద్వారా 1,444 ఎమ్మెల్డీ మురుగు నీటిని శుద్ధి చేస్తోంది. మరో 332. 5 ఎమ్మెల్డీ సామర్థ్యం గల ఆరు ఎస్టీపీలు నిర్మాణాలు పూర్తయి అందుబాటులో రానున్నాయి. మిగిలిన రెండు పూర్తయితే దాదాపు 1,878 ఎమ్మెల్డీల మురుగు శుద్ధి చేయవచ్చు. కాగా.. హైదరాబాద్ సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా మూసీ నదిపై సుమారు 62 ఎస్టీపీల నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించింది.

బైక్‌పై సీఎండీ బస్తీబాట!

ఎల్సీలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు



బస్తీలో బైక్‌పై పర్యటిస్తున్న సీఎండీ

సాక్షి, సిటీబ్యూరో: పెండింగ్‌లో ఉన్న విద్యుత్ కనెక్షన్ల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత ఇంజినీర్లకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాలు జారీ చేశారు. నూతన సర్వీసులు, టైటిల్ ట్రాన్స్‌ఫర్, సోలార్ నెట్ మీటరింగ్, పీఎం సూర్యఘర్ దరఖాస్తులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఉద్దేశపూర్వకంగా దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టిన ఇంజినీర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. బస్తీబాటలో భాగంగా గురువారం పాతబస్తీలోని మొఘల్‌పురా, బేహరుపియాబస్తీ, గొల్లఖిడికి బస్తీల్లో ఆయన బైక్‌పై పర్యటించారు. ఆపరేషన్స్ డైరెక్టర్ డాక్టర్ నరహింహులును వెనుక సీట్లో కూర్చొబెట్టుకుని ఆయన బైక్ నడుపుతూ మార్గంమధ్యలో పలువురు వినియోగదారులతో మాట్లాడారు. అనంతరం చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న 593 ఎల్‌టీఎం(అపార్ట్‌మెంట్లు/ లే అవుట్ల) దరఖాస్తులపై సమీక్షించారు. కొత్త కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులంతా శనివారం ఇస్తున్న లైన్ క్లియరెన్స్(ఎల్సీ)లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక నుంచి వారానికి ఒక రోజు (శనివారం) మాత్రమే ఎల్సీలు ఇస్తున్నట్లు తెలిపారు. ఎల్సీ ఇచ్చిన సమయంలోనే లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, డీటీఆర్‌లకు రిపేర్లు, ఏబీ స్విచ్‌లకు మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.



గుండెపోటుతో రచయిత వెంకట్‌గౌడ్ మృతి

గాంధీ కళాశాలకు భౌతికకాయం అప్పగింత



వెంకట్‌గౌడ్ (ఫైల్)

సాక్షి, హైదరాబాద్/గాంధీ ఆస్పత్రి: ప్రముఖ రచయిత కొంపెల్లి వెంకట్ గౌడ్ (52) గురువారం ఉదయం గుండెపోటుకు గురై చికిత్స పొందుతూ విద్యానగర్‌లో మృతి చెందారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలం కలకోవ గ్రామానికి చెందిన వెంకట్‌గౌడ్ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చరిత్ర తోపాటు తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాలపై పలు రచనలు చేశారు. మృతుని కోరిక మేరకు కుటుంబసభ్యులు ఆయన భౌతికకాయాన్ని సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఆయన నేత్రాలు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు సేకరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా మెడికల్ జేఏసీ కన్వీనర్ వేణుగోపాల్ గౌడ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీలు రామారావు గౌడ్, సత్యంగౌడ్, గౌడ జేఏసీ చైర్మన్ అంబాల నారాయణగౌడ్, ముద్దగోని రాంమోహన్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం వైస్ ప్రెసిడెంట్ తొడసనూరి సత్యగౌడ్, బూర వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

'వెంకట్‌గౌడ్ మృతి తెలంగాణకు తీరని లోటు'

తెలంగాణ వాది, ప్రముఖ రచయిత కొంపల్లి వెంకట్‌గౌడ్ మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన పాత్ర అసామాన్యమని, రచనల ద్వారా బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం తన సాహిత్య జీవితాన్ని సాగించారని అన్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి జీవితఖైదు

అబిడ్స్: మైనర్‌పై లైంగిక దాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు సెషన్స్ జడ్జ్ టి.అనిత తీర్పునిచ్చారు. మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌హాట్ ఇందిరానగర్‌కు చెందిన గ్యాస్ డెలివరీ బాయ్ దుర్గా శంకర్ అలియాస్ తరుణ్ (29) గతేడాది తమ ఇంటి సమీపంలో నివసిస్తున్న ఓ మైనర్ బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశ పెట్టారు. కాగా గురువారం సెషన్ జడ్జి అనిత కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్ తెలిపారు.

సైబర్ నేరగాళ్లపై సస్పెక్ట్ షీట్స్

రిపీటెడ్ అఫెండర్లపై తెరవాలని నిర్ణయం

- అనునిత్యం నిఘా, పర్యవేక్షణ కోసం ఇలా
- నేరగాళ్లలో బయటి రాష్ట్రాల వాళ్లే ఎక్కువ
- షీట్లు తెరిచినా వారిపై చర్యలు సాధ్యం కాని అంశమే



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా ఈ తరహా నేరగాళ్లను కట్టడి చేసేందుకు సిటీ పోలీసులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. పదే పదే ఈ నేరాలు పాల్పడే వారిపై సస్పెక్ట్ షీట్స్ తెరవనున్నారు. ఈ మేరకు ఈ ఠాణా స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్‌ఓ) ఉన్న ఏసీపీ అందరూ ఇన్‌స్పెక్టర్లు, సబ్–ఇన్‌స్పెక్టర్లకు కీలక ఉత్తర్వులు జారీ చేశారు. ఆ కేటుగాళ్లపై నిరంతర నిఘా ఉంచడానికి, వారి కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే సిటీలో నమోదవుతున్న సైబర్ నేరాల్లో పట్టుబడుతున్న నిందితుల్లో బయటి రాష్ట్రాలకు చెందిన వాళ్లే ఎక్కువ. ఈ నేపథ్యంలో సస్పెక్ట్ షీట్స్ లక్ష్యం ఎంత వరకు నెరవేరుతుందనేది వేచి చూడాల్సిందే.

బీఎన్ఎస్ అమలులోకి రావడంతో..

రౌడీలపై రౌడీషీట్, చోరులపై సిటీ డోషియర్ క్రిమినల్ (సీడీసీ) షీట్, సమస్యాత్మక వ్యక్తులపై హిస్టరీ షీట్, మత పరమైన నేరాలు చేసిన వారిపై కమ్యూనల్ షీట్, భూ కబ్జాకోరులపై లాండ్ గ్రాబర్ షీట్ తెరవడం ఏళ్లుగా కొనసాగుతోంది. ఈ మేరకు తెలంగాణ స్టేట్ పోలీసు మాన్యువల్‌లో అవకాశం ఉంది. నిర్ణీత కాలంలో ఒకటి కంటే ఎక్కువ నేరాలు చేసే రిపీటెడ్ అఫెండర్లపై వీటిని తెరుస్తారు. అయితే సైబర్ నేరాలు చేసే వారిలోనూ అనేక మంది రిపీటెడ్ అఫెండర్లు ఉంటున్నారు. ఒకరే అనేక నేరాలు చేస్తుండగా... పదేపదే చేస్తున్న వాళ్లూ ఉంటున్నారు. వీరి పైనా సస్పెక్ట్ షీట్స్ తెరిచే అవకాశం భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) ద్వారా సైబర్ క్రైమ్ పోలీసులకు దక్కింది. దీంతో పదేపదే, అనేక నేరాలు చేస్తున్న సైబర్ నేరగాళ్లపై పైనా సస్పెక్ట్ షీట్స్‌ను తెరవనున్నారు.

పటిష్ట నిఘా, పర్యవేక్షణకు అవకాశం...

ఇప్పటి వరకు అసాంఘిక శక్తులపై చట్ట పరిధిలో తెరుస్తున్న షీట్స్‌లో స్వల్ప మార్పులతో సైబర్ క్రైమ్ అధికారులు ఈ సస్పెక్ట్ షీట్లు నమోదు చేయనున్నారు. వీటిలో సదరు నేరగాడికి సంబంధించిన ఫొటో, చిరునామా, నమోదై ఉన్న కేసులు, నేరం చేసే విధానం సహా పూర్తి సమాచారం పొందుపరుస్తారు. ఈ వివరాలను తమ వద్ద ఉంచుకోవడంతో పాటు సదరు నేరగాళ్లు ఏ ఠాణా పరిధిలో నివసిస్తుంటే ఆ పోలీసు స్టేషన్‌కు పంపుతారు. ఆయా ఠాణాల్లో వీరి ఫొటోలను అందుబాటులో ఉంచుతారు. దీనివల్ల ఆయా చోట్ల పోలీసు అధికారులు మారినప్పటికీ వీరిపై పక్కా నిఘా ఉంచడానికి అవకాశం ఉంటుందని పోలీసులు చెప్తున్నారు. నేరగాడి చిరునామా మారినప్పుడల్లా ఈ షీట్‌ను ఆ పరిధిలోని ఠాణాకు పంపిస్తారు.

ఆ పోలీసులు సహకరిస్తారా..?

నగరంలో నమోదవుతున్న సైబర్ నేరాల్లో అరెస్టు అవుతున్న నిందితుల్లో బయటి రాష్ట్రాల వాళ్లు ఎక్కువగా ఉంటున్నారు. తమ ప్రాంతాల్లో ఎలాంటి నేర చరిత్ర లేని వీరు బయటి ప్రాంతాలను టార్గెట్‌గా చేసుకుని రెచ్చిపోతున్నారు. ఇలాంటి వారిపై ఇక్కడ షీట్ తెరిచినా ఉపయోగం లేదు. దీన్ని పరిగణలోకి తీసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు ఇలాంటి నేరగాళ్లపై షీట్లు తెరవడంతో పాటు ఆ వివరాలను వారు నివసిస్తున్న ప్రాంతం ఏ జిల్లా పరిధిలోని వస్తుందో ఆ జిల్లా ఎస్పీలకు లేఖ ద్వారా నివేదించాలని భావిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఉత్తరాదిలో ఉన్న అనేక పోలీసు విభాగాలు నేరగాళ్లతో ములాఖత్ అయి ఉంటున్నాయి. ఈ కారణంగానే వాళ్లు ఎంత వరకు సమర్థంగా నిఘా ఉంచుతారు, ముందస్తు చర్యలు తీసుకుంటారన్నది పోలీసులు సైతం స్పష్టంగా చెప్పలేకపోతున్నారు.

ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచితే...

ఆర్థికాంశాలతో ముడిపడి ఉన్న, సాధారణ, సోషల్‌మీడియా వేదికగా జరిగే సైబర్ నేరగాళ్లపై తెరిచిన సస్పెక్ట్ షీటర్ల వివరాలను కేవలం పోలీసుస్టేషన్లలో ఉంచడం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయడం సాధ్యం కాదనే వాదన ఉంది. సామాన్యులు, మోసగాళ్ల ఎత్తులకు ఆకర్షితులవుతున్న వారు ఠాణాలకు వెళ్లి వివరాలు సరి చూసుకోవడం సాధ్యం కాదు. ఇలాంటి వారి వివరాలను పోలీసు అధికారిక వెబ్‌సైట్‌లోనూ ప్రత్యేక లింకు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. దీనివల్ల ప్రతి ఒక్కరూ ఇంటర్ నెట్ ద్వారా మోసాగాళ్ల వివరాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మరోపక్క ఈ షీట్లు తెరవాలనే నిర్ణయం వెనుక మరో కోణం ఉందని, సోషల్ మీడియా గొంతు నొక్కాలనే ప్రయత్నం ఉందనే విమర్శలూ వినిపిస్తున్నాయి.

తండ్రీ కొడుకులపై దాడి



గాయపడిన షేక్ ఖాదిర్

చాదర్‌ఘాట్: పాత గొడవల నేపథ్యంలో కొందరు యువకులు తండ్రీ కొడుకులపై దాడి చేసి గాయపరిచిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... శంకర్‌నగర్‌కు చెందిన షేక్ షాబాజ్‌తో ఈనెల 22న రాత్రి అదే ప్రాంతానికి చెందిన సోయబ్ అకారణంగా గొడవ పడ్డాడు. అందుకు షాబాజ్ అభ్యంతరం చెప్పటంతో షాబాజ్, అతని తండ్రి షేక్ ఖాదిర్‌పై దాడి చేయడంతో వారు చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. దీనిని మనసులో పెట్టుకున్న సోయబ్ తన బంధువులు ఒమర్, ఒవైసీతో ఈనెల 24న రాత్రి శంకర్‌నగర్‌లోని ఓ హోటల్ వద్ద తండ్రీ కొడుకులపై కర్రలు, రాడ్లులతో దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు చాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎగ్జిబిషన్ సొసైటీ ఎన్నికలు నేడే

అబిడ్స్: నగరంలోని ఎగ్జిబిషన్ సొసైటీకి ఈ నెల 26న శుక్రవారం ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గత ఆరేళ్లుగా ఏటా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అయితే ప్రస్తుత పాలకవర్గంలోని ఒకరిద్దరు వ్యక్తులు స్వార్థ రాజకీయాలకు పాల్పడుతూ..... ఒంటెద్దు పోకడలకు వెళ్లడంతో మరో ప్యానెల్ సభ్యులు ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రంగంలోకి దిగారు. దీంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఒకరిద్దరు సభ్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుండటంతో దానిని వ్యతిరేకిస్తూ పలువురు సభ్యులు ఎన్నికల బరిలోకి దిగారు. 277 మంది సభ్యులు ఉన్న ఈ సొసైటీలో దాదాపు 30 మంది సభ్యులు విదేశాల్లో ఉండడంతో శుక్రవారం జరిగే ఎన్నికల్లో దాదాపు 200 నుంచి 220 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనవచ్చని అంచనా. ప్రస్తుత పాలకవర్గం హయాంలోనే దేశంలోనే మొదటి మహిళా పాలిటెక్నిక్ కళాశాల అయిన కమలానెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు తార్నాకలోని మరో విద్యాసంస్థ మూతపడినా ప్రస్తుత పాలకవర్గం పట్టించుకోలేదని మరో ప్యానెల్ సభ్యులు సొసైటీ సభ్యులకు వివరిస్తూ మద్దతు కోరుతున్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో కొనసాగుతున్న గాంధీ దర్శన్‌లో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయని స్వయాన ట్రస్ట్ కార్యదర్శి ఎగ్జిబిషన్ సొసైటీకి ఫిర్యాదు చేసినా పాలకమండలి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. శుక్రవారం జరిగే ఎన్నికల్లో ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులుగా ఉన్న పలువురు ఐఏఎస్‌లు, పలువురు ఉన్నతాధికారులు, పలువురు మాజీ మంత్రులతో పాటు పలువురు ప్రముఖులు కూడా ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

బైక్ పైనుంచి కింద పడి వ్యక్తి మృతి



రతన్ (ఫైల్)

మియాపూర్: మద్యం మత్తులో స్కూటీపై వెళుతుండగా కింద పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ పర్వీద్ అహ్మద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పశ్చి బెంగాల్ రాష్ట్రానికి చెందిన రతన్ తీర్థోనీయా(41) నగరానికి వలసవచ్చి కొండాపూర్ శ్రీరాంనగర్ కాలనీలో స్నేహితులతో కలిసి ఉంటూ స్థానికంగా ఓ హోటల్‌లో సర్వీస్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి అతను ప్రేమ్ నగర్‌లో తన స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నాడు. పార్టీ మధ్యలో మద్యం అయిపోవడంతో రతన్ మద్యం తెచ్చేందుకు న్యూ – హాఫీజ్‌పేటలోని వైన్స్ షాప్‌కు వెళ్లాడు. అయితే అప్పటికే మద్యం మత్తులో ఉన్న రతన్ నడిచి వచ్చేందుకు సాధ్యం కాకపోవడంతో తనను తీసుకెళ్లేందుకు తన స్నేహితుడు సిబ్బును రప్పించాడు. సిబ్బు రతన్‌ను స్కూటీపై రాంగ్ రూట్‌లో వెళ్తుండగా వెనుక కూర్చున్న రతన్ అదుపు తప్పి కిందపడ్డాడు. అతడి చేతిలో ఉన్న మద్యం సీసా పగిలి మెడకు గుచ్చుకోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు కొండాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచనమేరకు మెరుగైన చికిత్స కోసం నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ ఫొటోను డీపీగా పెట్టుకుని బెదిరింపులు

కేసు నమోదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ ఫొటో డీపీగా పెట్టుకుని బెదిరింపులకు పాల్పడుతున్న ఆగంతకులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన వ్యాపారి సాయి కిరణ్‌కు ఈ నెల 10న రెండు నెంబర్ల నుంచి ఫోన్ చేసిన ఆగంతకులు తాము ఎస్‌బీఐ కలెక్షన్ ఏజెంట్లమని చెప్పారు. క్రెడిట్ కార్డు బకాయి వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు రావాలని బెదిరించారు. ఇందుకోసం బంజారాహిల్స్ ఎస్‌ఐ రాఘవేంద్ర (నిజానికి ఇన్‌స్పెక్టర్) పేరుతో ట్రూకాలర్‌లో ఆయన ఫోటోను ఉపయోగించాడు. దీనికి తోడు అవమానకరంగా మాట్లాడటంతో బాధితుడు ఫోన్ నెంబర్లు, ఆగంతకులు ఉపయోగించిన స్క్రీన్‌షాట్లతో బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి

బాలానగర్: మద్యం మత్తులో ఓ వ్యక్తి భవనం పైకి ఎక్కుతూ మెట్లపై నుంచి జారి పడటంతో మృతి చెందిన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. నవజీవన్‌నగర్‌లో నివాసం ఉంటున్న పాతరపల్లి నాగరాజు (44) బుధవారం రాత్రి మద్యం మత్తులో మెట్లు ఎక్కుతూ ప్రమాదవశాత్తు రెండో అంతస్తు నుంచి జారి కింద పడిపోయాడు. దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు అతడిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమష్టి పోరాటంతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: నిరుద్యోగుల సమస్యలపై సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఉస్మానియా ఆసుపత్రిలో కొనసాగుతున్న అశోక్ అమరణ నిరాహార దీక్షకు మద్దతు తెలపాలని కోరుతూ అశోక్ భార్య సునీత నిరుద్యోగులతో కలిసి విద్యానగర్ బీసీ భవన్‌లో ఆర్.కృష్ణయ్యను కలిశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యపై అశోక్ తెగించి కొట్లాడుతున్నారన్నారు. 12 రోజులుగా అమరణ నిరాహార దీక్ష కొనసాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. అణిచివేస్తే భారీ మూల్యం తప్పదన్నారు. అశోక్‌కు ఏమి జరిగినా ప్రభుత్వనిదే బాధ్యతని హెచ్చరించారు. సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశం ప్రభుత్వం, మంత్రులు, ముఖ్యమంత్రికి లేదా అని ప్రశ్నించారు. నిరుద్యోగుల సహకారంతోనే ప్రభుత్వం ఏర్పాటు చేశామని చెబుతున్న ముఖ్యమంత్రి వారి సమస్యను ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. మూడేళ్ల ప్రభుత్వం అధికారంలో ఉంటుందని ఆలోగా నిరుద్యోగ సమస్య లేకుండా చూడాలన్నారు. రాజకీయ కోణంలో కాకుండా నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అశోక్ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని ఆయన వెనుక నిరుద్యోగ యువత ఉందన్నారు. వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వాలని, అశోక్‌తో చర్చించి అమరణ నిరాహార దీక్షను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సొంత హాస్టల్స్ సమస్యలపై పోరాటం కొనసాగిస్తామన్నారు. జీవో నెంబర్ 29ని రద్దు చేయకపోతే ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతిలాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదన్నారు. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్నందునే అమరణ నిరాహార దీక్షకు అశోక్ దిగాడని 12 రోజులుగా ఒక్క మంత్రి కూడా దీనిపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే అశోక్‌తో చర్చలు జరపాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గ్రూప్–1 అభ్యర్థి ఝాన్సీ రాణి మాట్లాడుతూ ఏడాది తిరిగేలోపే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న ముఖ్యమంత్రి దసరా లోపు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో నీలా వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి కేసు వాయిదా

- కౌశిక్‌రెడ్డి గైర్హాజరు
- విచారణను అక్టోబర్ 22కు వాయిదా వేసిన నాంపల్లి కోర్టు

సిటీ కోర్టులు: గత అసెంబ్లీ ఎన్నికల్లో కమలాపూర్ పోలీసులు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నమోదుచేసిన కేసుపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ జరిగింది. కౌశిక్ రెడ్డి కోర్టుకు హాజరు కాకపోవడంతో న్యాయస్థనం విచారణను అక్టోబర్ 22కు వాయిదా వేసింది. 2023 నవంబర్ 28న అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కమలాపూర్ బస్టాండ్ సమీపంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ.. ఈ ఎన్నికల్లో "మీరు ఓటు వేయకుంటే మా ముగ్గురు చావులను చూడండి అని, మీరు ఓటు వేసి లీడ్ ఇస్తే విజయ యాత్రకు వస్తా, లేదంటే మా శవయాత్రకు మీరు రండి" అని ప్రజలకు పాడి కౌశిక్‌రెడ్డి స్టేట్‌మెంట్ ఇచ్చారని, ఈ వీడియో వైరల్ కావడంతో ఎన్నికల అధికారి ఫిర్యాదు మేరకు కమలాపూర్ పోలీసులు సెక్షన్ 171, 171ఎఫ్, 188 ఐపీసీ కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసుపై నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో గురువారం జరిగిన విచారణకు ఆయన గైర్హాజరు అయ్యారు. అయితే గత విచారణలోనూ కౌశిక్‌రెడ్డి నేరుగా హాజరుకావడంతో సీఆర్‌పీసీ సెక్షన్ 251 కింద ఎక్జామినేషన్ చేసిన కోర్టు వివరాలు నమోదు చేసుకుంది. ఈ విచారణకు సాక్ష్యులు హాజరుకావాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికి వారు హాజరుకాకపోవడంతో విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. ఆ విచారణకు కూడా సాక్షులు హాజరుకాకపోతే.. వారి తరుపు సాక్ష్యాన్ని రద్దు చేయనున్నట్లు కోర్టు పోలీసులకు వివరించింది.

ఎంపీ బండి సంజయ్ కేసు వాయిదా

అక్టోబర్ 18కి వాయిదా వేసిన నాంపల్లి కోర్టు

సిటీ కోర్టులు: గత ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై నమోదైన కేసుపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ జరిగింది. బండి సంజయ్ గైర్హాజరు కావడంతో విచారణను అక్టోబర్ 18కు వాయిదా వేసింది. ఈ విచారణకు సాక్ష్యులు కూడా హాజరు కాకపోవడంతో వారి సాక్ష్యాన్ని కోర్టు రద్దు చేసింది. తదుపరి విచారణలో బండి సంజయ్ సీఆర్‌పీసీ 313 ఎగ్జామినేషన్‌కు హాజరు కావాలని సూచిస్తూ విచారణను వాయిదా వేసింది. గత ఎమ్మెల్యే ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా.. రోడ్డుపై ఎన్నికల ప్రచార సభను ఏర్పాటు చేసినందుకు అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రస్తుత కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై హుజూరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించకుండా రోడ్డుపై సభ ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, అంతేకాకుండా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘిస్తూ రోడ్‌షో నిర్వహించి స్థానికులు, ప్రజలకు ఇబ్బందికలిగేలా వ్యవహరించారని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగిన విచారణకు బండి సంజయ్ ముఖ్యమైన సమావేశాలలో ఉన్నారని, అందుచేత కోర్టుకు హాజరుకాలేకపోతున్నారని, ఆయన తరుపు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. దీంతో విచారణను వచ్చే నెలకు వాయిదా వేస్తున్నట్లు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు తెలిపింది.

రిహాబిలిటేషన్ సెంటర్‌లో దారుణ హత్య

- ముగ్గురి మధ్య గొడవ
- ఇద్దరు కలిసి ఓ వ్యక్తిని హత్య చేసిన వైనం



సందీప్ (ఫైల్)

మియాపూర్: రిహాబిలిటేషన్ సెంటర్(పునరావాస కేంద్రం)లో చికిత్స పొందుతున్న ఇద్దరు వ్యక్తులు కలిసి మరో వ్యక్తిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన అతను మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పల్నాడు జిల్లా, పిడుగురాళ్ల గ్రామానికి చెందిన సందీప్ (39) డ్రగ్స్‌కు అలవాటు పడటంతో కుటుంబ సభ్యులు అతడిని ఎనిమిది నెలల క్రితం మియాపూర్‌లోని రపా రిహాబిలిటేషన్ సెంటర్‌లో చేర్పించారు. అదే సెంటర్‌లో నల్గొండకు చెందిన ఆదిల్, బార్సస్‌కు చెందిన సులేమాన్ కూడా గత రెండు నెలలుగా చికిత్స పొందుతున్నారు. గత కొన్ని రోజులుగా సులేమాన్, ఆదిల్, సందీప్‌ల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కౌన్సెలింగ్ క్లాస్‌కు వెళ్లే సమయంలో సులేమాన్, ఆదిల్ సందీప్‌తో గొడపడ్డారు. అతడిని కిచెన్ బాల్కానీలోకి తీసుకువెళ్లి కర్రలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సెంటర్ సిబ్బంది అతడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే తను మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆసుపత్రి వైద్యుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న మియాపూర్ పోలీసులు ఆధారాలు సేకరించారు. మృతుడు సందీప్ తండ్రి వెంకటనర్సింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు సులేమాన్, ఆదిల్‌లను అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

యువతి కిడ్నాప్ కేసులో ముగ్గురి అరెస్ట్



ఆందోళన చేస్తున్న శ్వేత భర్త ప్రవీణ్ కుటుంబసభ్యులు

కీసర: నవ వధువును బలవంతంగా తీసుకెళ్లిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రేమ వివాహం చేసుకుందన్న కారణంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సంపల్లిలో శ్వేత అనే యువతిని ఆమె తల్లిదండ్రులు బుధవారం బలవంతంగా లాక్కెళ్లారు. దీంతో శ్వేత భర్త ప్రవీణ్ అతడి కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం కీసర పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ శ్వేత కిడ్నాప్ కేసులో ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. శ్వేత ఆచూకీ కోసం రెండు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎస్.ఐ శ్రీనివాస్‌రెడ్డితో శ్వేత తండ్రి ఫోన్‌లో మాట్లాడించారు. ప్రస్తుతం ఆమె తల్లిదండ్రుల వద్ద క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. త్వరలోనే ఆమెను కీసర పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి భర్తకు అప్పగించనున్నట్లు తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య



అనీల్‌కుమార్ మృత దేహం

హయత్‌నగర్: హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... మెదక్ జిల్లా, చిల్లపల్లి గ్రామానికి చెందిన సాయిలు కుమారుడు అనీల్‌కుమార్ (21) హయత్‌నగర్‌లోని విజయ రీసెర్చ్ ఆఫ్ ఫార్మా మెడికల్ లేబరేటరీలో ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చదువుతూ సమీపంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంటున్నాడు. గురువారం గదిలో ఎవరూ లేని సమయంలో తలుపులు గడియ పెట్టుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హాస్టల్ సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గల్ఫ్‌లో చిక్కుకున్న మా నాన్నను కాపాడండి



మాట్లాడుతున్న మొహమ్మద్ గౌస్ కుటుంబ సభ్యులు

పంజగుట్ట: ఏజెంట్, తోటి ఉద్యోగుల చేతితో మోసపోయి గత రెండేళ్లుగా గల్ఫ్‌లో చిక్కుకుపోయిన తన భర్తను ఇండియాకు రప్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని మిర్యాలగూడ, రాంనగర్‌కు చెందిన అమీనా సాఫూత్ అన్నారు. ఈ మేరకు ఆమె గురువారం తన నలుగురు పిల్లలతో కలిసి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు .. తన భర్త మొహమ్మద్ గౌస్ మిర్యాలగూడ పట్టణంలో ఆటో నడుపుకునే వాడని, 2023 మార్చ్ 21న దుబాయ్‌కు చెందిన సమీర్ అనే ఏజెంట్ ద్వారా రూ. 1.20 లక్షలు ఖర్చు పెట్టి దుబాయ్‌లోని యాక్షన్ ఇంటర్‌నేషనల్ సర్వీస్ కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా ఉద్యోగానికి వెళ్లినట్లు తెలిపింది. కొన్ని నెలల పాటు వారు అతడిని బాగానే చూసుకున్నారన్నారు. ఆ తర్వాత సమీర్ అతని వద్ద పని చేసే విక్కి అలియాస్ హిమాన్షు, డ్రైవర్ అలి అనే ముగ్గురు వ్యక్తులు దుబాయ్‌లోని కార్యాలయంలో అపాయింట్‌మెంట్ తీసుకోవాలని, బ్యాంక్ అకౌంట్, వసతి పేరుతో కొన్ని పత్రాలపై మొహమ్మద్ గౌస్‌తో సంతకాలు, పాస్‌పోర్టు, వీసా, ఇక్వామా తీసుకున్నారని తెలిపారు. సదరు డాక్యుమెంట్ల ఆధారంగా తన భర్త గౌస్ పేరుతో క్రెడిట్‌కార్డులు, పర్సనల్ లోన్లు తీసుకుని మోసం చేశారన్నారు. ఈ విషయం తన భర్త తనకు ఫోన్ చేసి చెప్పాడని గత 18 నెలలుగా అతను స్నేహితుల వద్ద తలదాచుకుని మసీదు వద్ద ఒకపూట భోజనం చేస్తూ అర్ధాకలితో అలమటిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పాస్‌పోర్టు, వీసా లేక ఎక్కడా పనిచేసుకోలేక బయటికి వెళ్లలేక ఇబ్బందులు పడుతుండటంతో తాము ఇప్పటివరకు రూ. 80 వేలు పంపించామని ఇక పంపే స్తోమత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, బండి సంజయ్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని తన భర్తను ఇండియాకు రప్పించేలా చూడాలని వేడుకున్నారు. సమావేశంలో మొహమ్మద్ గౌస్ తల్లి మొహమ్మద్ అఫ్జలున్నిసా బేగం, పిల్లలు అనీసా విసాల్, అర్షక్ వసీల్, అరూబా వాఫియా, ఆసిల్ వాఫిక్ తదితరులు పాల్గొన్నారు.

మీ ఆప్తుల అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి, జయంతిల ప్రకటనల కోసం సంప్రదించండి.

Ph: 040-23256000 Ext: 6344, 9912220352

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ ఫ్యూచర్ సిటీ @ కడ్తాల్ టౌన్‌లో DTCP అప్రూవల్ వెంచర్‌లో అన్ని డెవలప్‌మెంట్స్‌తో వెంటనే ఇల్లు కట్టుకునే ప్లాట్స్ కలవు. బ్యాంక్ లోన్ కలదు. సంప్ర : 96666 95886 [HA-1518]

■ VJA, కంచికచర్ల, ఔటర్ రింగ్‌రోడ్ సమీపంలో AP CRDA, DTCP ప్లాట్స్ చ॥గ॥ 3,900 to 7,800 ఇళ్లమధ్యలో ప్లాట్స్, ఫామ్‌హౌస్ ప్లాట్ 1 సెంటు 1,45,000/-. ✆ 63012 98734 [B-103]

■ I, Mukesh Jangid R/o H.No 7-605/9, Subhasnagar Pipeline Road, Jeedimetla, Quthbullapur, Medchal-Malkajgiri, Telangana-55 have changed my Minor Son's Name from Vikas Jangid to Vishnu Jangid for all purposes. [DA-15401]

■ I, Vijaya Laxmi W/o, Banda Beeraiah (Late). R/o 3-74, Peddapur (V), Sadashivapet (M), Sangareddy (Dist), Pincode - 502306. have Changed my Name to Banda Laxmi. [DA-46051]

LOST

■ I, HR Shivram S/o Ram Mohan Rao R/o 8-3-191/327, 60-D, Vengalarao Nagar Hyderabad-38. as Lost Original Sale Deed D/c No. 849 of 1984 Register at SRO District Registrar of R R Dist, TS. While travelling Vengalarao Nagar to SR Nagar if found anybody Call : 9393899464 [HA-4406]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800538]

OLD AGE HOME

■ వృద్ధులు, NRI'S లగ్జరీ రూమ్స్, లిఫ్ట్ @ మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్, ఉప్పల్ & చీర్యాల్. మీన్స్ భోజన వసతి. 7981467036, 939103 9990, 6281125552 [H-783382]

PERSONAL CARE

CHANGE OF NAME

■ తేతల గాయత్రి సుధాకర్, W/o తేతల సుధాకర్ రెడ్డి, R/o A906, ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, హఫీజ్‌పేట్, హైదరాబాద్-49, నా పేరు ఇప్పటి నుంచి 'తేతల గాయత్రి'గా మార్చుకున్నాను. నోటరీ పుష్ప లత సమక్షంలో సంతకం చేసాను. [HA-15943]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9010244403	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	9912225453

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–11లోని ఉదయ్‌నగర్ బస్తీలో ఎట్టకేలకు సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. గత కొన్నేళ్లుగా రోడ్డంతా గుంతలమయమై స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాదాల బారిన పడుతున్నారు. బస్తీవాసులు ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఇంజినీర్లు ఈ పనులు ప్రారంభించేందుకు గత మూడు నెలల నుంచి కసరత్తు చేస్తుండగా ఎడతెరిపి లేని వానలతో పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు బుధవారం రాత్రి ఇక్కడ రోడ్డు పనులు ప్రారంభించారు.

విద్యుత్ అధికారుల బస్తీబాట



ఉదయ్‌నగర్‌లో పర్యటిస్తున్న విద్యుత్ అధికారులు

బంజారాహిల్స్: క్షేత్రస్థాయిలో సమస్యలు పరిశీలించి పరిష్కరించే దిశగా విద్యుత్ అధికారులు చేపట్టిన బస్తీబాట గురువారం బంజారాహిల్స్ రోడ్డునెంబర్–11లోని ఉదయ్‌నగర్‌లో జరిగింది. బస్తీ జనరల్ సెక్రటరీ నజీర్ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతూ.. గత నెల రోజుల నుంచి బస్తీలో బంచ్ కేబుల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, దీని వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. తాము కోరిన విధంగా కరెంటు స్తంభాలు కూడా ఏర్పాటు చేశారని, ఇంకో నాలుగు చోట్ల ఏర్పాటు చేయాల్సి ఉందని, రోజూ వర్షాలు పడుతుండడంతో పనుల్లో ఆటంకం ఏర్పడిందని అధికారులు వెల్లడించారు. త్వరలోనే ఆ పనులను కూడా పూర్తి చేస్తామన్నారు.

అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ గౌతమ్‌నగర్‌లో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక మండపంలో కొలువుదీరిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ప్రారంభించారు.

దసరా ప్రత్యేకం.. ఆకృతి ఎగ్జిబిషన్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని తాజ్ కృష్ణా వేదికగా మూడ్రోజుల పాటు కొనసాగే ఆకృతి దసరా స్పెషల్ ఎగ్జిబిషన్ గురువారం ప్రారంభమైంది. ఈ ఎగ్జిబిషన్‌లో 68 మంది డిజైనర్లు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు.

రైలుకింద పడి చేపల వ్యాపారి ఆత్మహత్య

సికింద్రాబాద్: ముషీరాబాద్ రాంనగర్ గుండు ప్రాంతానికి చెందిన హోల్‌సేల్ చేపల వ్యాపారి గురువారం రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సికింద్రాబాద్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ కే.కోటేశ్వర్‌రావు వివరాల మేరకు... చర్లపల్లి రైల్వేస్టేషన్ 4వ నెంబర్ ప్లాట్‌ఫామ్ పక్కన ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతదేహం పడిఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు మృతుడు రాంనగర్ గుండు ప్రాంతానికి చెందిన చేపల వ్యాపారి సారారపు సతీష్‌కుమార్ (46)గా గుర్తించారు. రెండు రోజుల క్రితం సతీష్‌కుమార్ తన భార్య, ఇద్దరు పిల్లలతో మహబూబాబాద్ జిల్లాకు సమీప బంధువు మృతి చెందడంతో అంత్యక్రియకు హాజరయ్యేందుకు నగరం నుంచి బయలుదేరి వెళ్లాడు. కుటుంబ సభ్యులను అక్కడే వదిలేసిన సతీష్‌కుమార్ ఈనెల 24న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో మహబూబాబాద్ నుంచి బయలుదేరి చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. రైల్వేస్టేషన్ నాల్గో నెంబర్ వద్ద గల రైలు పట్టాలపై పడుకుని రైలుకింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించిన రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నపూర్ణా.. నమోస్తుతే..



అన్నపూర్ణా దేవిగా జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి



అన్నపూర్ణా దేవిగా బంజారాహిల్స్ కనక దుర్గా దేవి



25 వేల గాజులతో అమ్మవారి అలంకారం



ఫిలింనగర్ దైవసన్నిధానంలో చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు



రాజశ్యామలా దేవిగా దైవసన్నిధానం రాజరాజేశ్వరి దేవి



అఖిలాండేశ్వరి దేవిగా అలంకారంలో శ్రీనగర్‌కాలనీ శ్రీ భ్రమరాంబికా దేవి



అన్నపూర్ణా దేవి అలంకారంలో మాగంటి కాలనీ విజయ కనకదుర్గా దేవి



బ్రహ్మశంకర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆలయాల్లో వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రి వేడుకల్లో భాగంగా గురువారం జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి భక్తులకు అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చారు. బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న విజయగణపతి స్వామి ఆలయంలో అమ్మవారిని 25 వేల గాజులతో కాత్యాయనీ దేవిగా అలంకరించారు. ఫిలింనగర్ దైవసన్నిదానంలో జరిగిన చండీ హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్ బస్తీలో పోచమ్మతల్లి దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చండీహోమం నిర్వహించారు. శ్రీనగర్ కాలనీ శ్రీ భ్రమరాంబికా దేవి అమ్మవారు అఖిలాండేశ్వరి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

–బంజారాహిల్స్



ఇందిరానగర్ నల్లపోచమ్మ గుడిలో నిర్వహించిన హోమంలో పాల్గొన్న భక్తులు

సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



బతుకమ్మ ఆడుతున్న మంత్రి సీతక్క

వెంగళరావునగర్: బతుకమ్మ పర్వదినం మన రాష్ట్ర సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మహిళా శిశుసంక్షేమశాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. ప్రతి పర్వదినాన్ని ఇక్కడ ఘనంగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా బతుకమ్మ వేడుకల్లో ప్రతి అధికారి పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ డైరెక్టర్ శృతి ఓజా, కమిషన్ సభ్యులు అపర్ణ, చందన, వందనగౌడ్, సరిత, ప్రేమలత అగర్వాల్, వచన్‌కుమార్, ఆర్‌జేడీ మోతె పాల్గొన్నారు.

బడిని బతికించిన టీచర్‌కు సత్కారం



లక్డీకాపూల్ : విద్యార్థులను బడిబాట పట్టించడం, పాఠశాలకు సౌకర్యాలు కల్పించడంలో ఎనలేని కృషి చేసి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును అందుకున్నారు యాదాద్రి భువనగిరి జిల్లాలోని యర్రంబల్లికి చెందిన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వనం శ్రీనివాసులు. నేషనల్ టీచర్ ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించారు. గురువారం ఈ కార్యక్రమాని స్థానిక బిర్లా పానిటోరియంలో శారదా ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వహించింది. 12 ఏళ్లుగా మూతబడిన యర్రంబెల్లి ప్రాథమిక పాఠశాలను పునః ప్రారంభించి మౌలిక వసతులు కల్పించి విద్యార్థులను ఆకర్షించే విధంగా కృషి చేసినందుకు ఆయనకు అవార్డు దక్కింది. తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఇటికాల పురుషోత్తం చేతుల మీదుగా శ్రీనివాసులు అందుకున్నారు.

ఎర్రగడ్డ ఆస్పత్రిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్



శ్రీనగర్‌కాలనీ: కుటుంబంలో మహిళలే ముఖ్యులని, మహిళలు మానసికంగా ఆత్మవిశ్వాసంతో పట్టుదలతో విజయాలు సాధించాలని ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత అన్నారు. గురువారం ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల ఆరోగ్యం, మానసిక స్థితిగతులపై పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఉస్మానియా మెడికల్ కాలేజీ డాక్టర్లు అక్కడి స్థానిక మహిళలకు పలు పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజీవి, డాక్టర్ ప్రణవిరెడ్డి, డాక్టర్ శృతి, డాక్టర్ వీరభద్రం పాల్గొన్నారు.

భావోద్వేగాలను నడిపించే దిక్సూచి గుండె

బంజారాహిల్స్: వరల్డ్ హార్ట్ డే పురస్కరించుకుని దిల్ తో బచ్చా హై..హర్ దిన్ నయీ కహానీ లిఖ్‌తా హై' అనే శీర్షికతో తీసిన చిత్రాన్ని గురువారం బంజారాహిల్స్ కేర్ హాస్పటల్‌లో ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేర్ గ్రూప్ ఆఫ్ హాస్పటల్స్ చీఫ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ శులభ్ డాంగ్ మాట్లాడుతూ.. 'కేర్ హాస్పిటల్స్‌లో తాము గుండెను కేవలం ఒక అవయవంగా కాదని, భావోద్వేగాలను నడిపించే దిక్సూచిగా భావిస్తామన్నారు. ఈ చిత్రం నేటి ఉద్యోగుల కష్టాలను చూపిస్తుందన్నారు. మన హృదయాన్ని వినడం, ఆరోగ్యంగా, ఆనందంగా జీవించడానికి మొదటి అడుగు అని గుర్తు చేస్తుందన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా కేర్ హాస్పిటల్స్ విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా ఈ సినిమా ప్రదర్శనతో పాటు ప్రముఖ స్టేషన్లలో రేడియో ప్రసారాలు, నగరంలో కార్పొరేట్ సంస్థల్లో అవగాహన డ్రైవ్‌లు, అన్ని కేర్ హాస్పటల్స్ యూనిట్లలో వాక్‌థాన్‌లు నిర్వహించబడుతున్నాయన్నారు.

బైక్, సెల్‌ఫోన్‌తో పరార్

వెంగళరావునగర్: మద్యం తాగేందుకు వచ్చిన వ్యక్తి నుంచి ఫోన్, ద్విచక్ర వాహనాన్ని లాక్కుని పారిపోయిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఎల్లారెడ్డిగూడకు చెందిన మహ్మద్ సాజిద్ పాషా ఈనె 22న మద్యం తాగేందుకు మధురానగర్‌లోని ఎస్ఎల్ వైన్‌షాపు వద్దకు వచ్చాడు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తి పరిచయం అయ్యాడు. ఇద్దరూ కలిసి మద్యం తాగారు. కాసేపటికి సదరు వ్యక్తి పాషా వద్ద నుంచి ఫోన్, ద్విచక్ర వాహనాన్ని లాక్కుని పారిపోయాడు. అతడి కోసం పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నకిలీ ఫేస్‌బుక్ ఐడీతో మహిళకు వేధింపులు

పోలీసులకు ఫిర్యాదు

వెంగళరావునగర్: నకిలీ ఐడీ సృష్టించి మహిళను వేధిస్తున్న ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రహమత్‌నగర్‌లో నివసించే ఓ మహి ప్రైవేట్ జాబ్ చేసోంది. ఈ నెల 20న ఆమె స్నేహితుడు ఫోన్‌చేసి నీకు ఫేస్‌బుక్ ఐడీ ఉందా అని అడిగాడు. లేదని ఆమె సమాధానం చెప్పగా సింధూ సింధూ అనే ఫేస్‌బుక్ చూడమని చెప్పాడు. ఆ ప్రొఫైల్ ఫేస్ త్రివేణిలాగా ఉంది. అయితే ఆమె తన సొంత ఐడీతో ఛాట్ చేసినట్టు మరొక స్నేహితుడికి సమాచారం ఇచ్చింది. వారి సంభాషణ తర్వాత నకిలీ వినియోగదారుడు ఆమెకు ఫొటోలను షేర్ చేశాడు. నెల రోజుల కిందట స్నాప్‌ఛాట్‌లో స్టోరీ పోస్ట్ చేసిన సమయంలో అది పబ్లిక్‌గా ఉంది. తర్వాత నకిలీ ఖాతాదారుడు ఆ ఫొటోలు నిజమైనవని, కొద్ది సేపటిలోనే వీడియో కాల్ చేస్తానని, నగదును చెల్లించాలని డిమాండ్ చేశాడు. న్యూడ్ కాల్‌పై ఆసక్తి ఉంటే తన నెంబర్‌కు కాల్ చేయాలని పేర్కొంటూ ఆమె ఫొటోను స్టోరీగా పోస్ట్ చేశాడు. ఇదంతా తెలుసుకున్న బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

పెద్ద శేష వాహన సేవలో శ్రీవారు



వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వర స్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం ధ్వజారోహణం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం స్వామివారిని పెద్ద శేష వాహనంపై ఊరేగించారు. సాయంత్రం స్వామివారిని హనుమంత వాహన సేవలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సిపిరి అర్జున్ యాదవ్, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస శర్మ, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వమే జీతాలు చెల్లించాలి

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా ఔట్ సోర్సింగ్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ మైనారిటీస్ ఔట్ సోర్సింగ్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ రాజమ్మద్ మాట్లాడారు. సకాలంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు రాక నానా ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం అన్ని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని వేసవి సెలవుల కాలానికి జీతాలు ఎలాంటి తగ్గింపు లేకుండా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి నెల జీతాలు 5వ తేదీ లోపు తప్పనిసరిగా విడుదల చేయాలని అన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షులు మహమ్మద్ రాజమ్మద్

ఈ విషయంపై ఇటీవల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో యాకుబ్ పాషా, షేక్ జానీ పాషా, సుల్తానా షాహిన్, ఫిలోమినా, సాధిక్, రేష్మా ఫర్హీన్, ఇంతియాజ్ అలీ పాల్గొన్నారు.

ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కెంబాసారం కృష్ణ

హిమాయత్‌నగర్ : అన్ని రంగాల్లో వెనుకబడిన ఎరుకల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్లు కేటాయించాలని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘ విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర కార్యాలయంలో గురువారం సంఘ రాష్ట్ర అధ్యక్షులు కెంబాసారం కృష్ణ మీడియాతో మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఎస్టీల రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. రాష్ట్రంలో 10 శాతం రిజర్వేషన్లు అమలు అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎరుకల భవన్ నిర్మాణం కోసం రూ.2 కోట్లు ప్రొసీడింగ్ అందించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లకు కృతజ్ఞతలు అన్నారు. ఈ సమావేశంలో విజయ్ కుమార్, దేవర యాదగిరి, కూతాడి శివరాజ్, కట్ట విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సెలూన్ చాటున వ్యభిచారం

రహమత్‌నగర్ : సెలూన్ సెంటర్ మాటున వ్యభిచారం నిర్వహిస్తున్న పలువురిని బోరబండ పోలీసులు అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గాయత్రి టవర్స్ 2 అంతస్తులో ఏలెక్స్ సెలూన్ కొనసాగుతుంది.ఇందులో వ్యభిచారం కొనసాగుతుందన్న సమాచారంలో బుధవారం పోలీసులు దాడిచేసి ప్రదీప్, రిజ్వాన్, ఉమర్‌తో పాటు ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు.

మురుగుమయం.. పట్టించుకోరేం?



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు–2లోని ఇందిరానగర్ బస్తీని గడిచిన నెల రోజులుగా మురుగు సమస్య పట్టి పీడిస్తోంది. నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు మ్యాన్‌హోళ్లలో వ్యర్థాలు నిండిపోవడంతో పాటు ఎగువ ప్రాంతాల్లో ఉన్న వారు తమ సెల్లార్లలో ఉన్న నీటిని పంపింగ్ చేస్తుండటంతో దిగువన ఉన్నవీధి మొత్తం మురుగుమయం అవుతున్నదని బస్తీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరానగర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహం పక్క గల్లీలో నెల రోజుల నుంచి మురుగు ప్రవహిస్తూనే ఉంటుందని సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



రహమత్‌నగర్: రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో గురువారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సలీంబాబానగర్‌లో కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, సైట్–3లో మహిళా కో ఆపరేటివ్ చైర్ పర్సన్ శోభారాణి, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సీసీ రోడ్ల పనులు ప్రారంభించారు.





సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

విమానానికి పక్షి తగలలేదు..

శంషాబాద్: జైపూర్ నుంచి హైదరాబాద్‌కు గురువారం ఉదయం చేరుకున్న ఇండిగో 6ఈ–816 విమానానికి ఏ పక్షి కూడా ఢీ కొనలేదని జీఎంఆర్ ఎయిర్‌పోర్టు వర్గాలు అధికారికంగా తెలిపాయి. అయితే ల్యాండింగ్ సమయంలో ఓ పక్షి ఢీ కొనడంతో పైలట్ చాకచక్యంగా విమానం దింపారని, ప్రయాణికులు సురక్షితంగా బయపటడ్డారని ప్రచారం జరిగింది. దీనిపై ఎయిర్‌పోర్టు అధికారులు విచారణ చేపట్టి, విమానానికి అలాంటి సంఘటనేదీ జరగలేదని నిర్ధారించారు.

కమీషన్ బకాయిలు విడుదల చేయాలి

ప్రధాని మోదీకి ఓ రేషన్ డీలర్ లేఖ



సాక్షి,సిటీ బ్యూరో: ప్రభుత్వ చౌకధరల దుకాణాల డీలర్ల కమీషన్ బకాయిలు విడుదల చేయాలని మెదక్ జిల్లా నర్సాపూర్ రేషన్ డీలర్ ఆనంద్ కుమార్ ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు గురువారం ప్రధానికి లేఖ ద్వారా వినతిపత్రం పంపించారు. ఐదు నెలలుగా కేంద్ర ప్రభుత్వం నుంచి రేషన్ పంపిణీకి సంబంధించిన కమీషన్ విడుదల కావడం లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కమీషన్ రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం గడవడం కష్టంగా తయారైందన్నారు. దసరా, దీపావళి వంటి ముఖ్యమైన పండుగలకు అవసరమైన దుస్తులు, ప్రాథమిక అవసరాలు కూడా తీర్చడం సాధ్యం కావడం లేదని పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో వెంటనే బకాయిలు విడుదల చేసి డీలర్లను ఆదుకోవాలని కోరారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలోని దసరా స్పెషల్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌ను ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో దేవాదబ్రహ్మోత్సవ్ 2025ను పురస్కరించుకుని సాయంత్రం 5.30 నుంచి 8.30 గంటల వరకు ప్రముఖ కళాకారులచే అన్నమాచార్య సంకీర్తనలతో నాదనైవేద్యం కార్యక్రమం జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఉద్యానవన శాఖ గ్రాండ్ నర్సరీ మేళా పేరుతో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హార్టికల్చర్ షో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ హాల్‌లో దసరా పండుగ ప్రత్యేకంగా హ్యాండ్‌లూమ్ ఇండియా పేరిట స్వచ్ఛమైన ఫైబర్ సిల్క్ ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పెన్సిల్ డ్రాయింగ్స్, స్కల్ప్చర్స్, స్టేకిడ్ స్టోరీస్, దీప్ ఇంటీరియల్స్ చిత్ర ప్రదర్శనలు అందుబాటులో ఉంటాయి.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ గఫార్ ఖాన్ కాలనీలోని లేబుల్స్ ది పాప్ అప్ స్పేస్‌లో ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఖిజార్ స్కిల్స్ సోలో ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

భగాయత్.. పేరు గొప్ప ఊరు దిబ్బ

కనీస సౌకర్యాలు లేక సతమతం



ఉప్పల్ భగాయత్‌లో రోడ్డుపై పేరుకుపోయిన బురద

ఉప్పల్: విశాలమైన వంద అడుగుల రహదారులు.. ఆకాశానంటే కట్టడాలు.. ఆహా అనిపించేలా ఉంటుంది ఈ ప్రాంతం.. ఇలా అంతన్నారు.. ఇంతన్నారు.. చివరికి తుస్సుమనిపించారు హెచ్ఎండీఏ అధికారులు. ప్లాట్లు చేసి అమ్మేటప్పుడు ఏమేమో చెప్పి ఊదరగొట్టారు. ప్లాట్లు వేలం వేసే సమయంలో అరచేతిలో వైకుంఠం చూపించారు. ఇప్పుడు ఒట్టి చేతులు చూపిస్తున్నారు. ఇదీ ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లే అవుట్ పరిస్థితి. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ శాఖల మధ్య సమన్వయం కొరవడటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఉప్పల్ భగాయత్ బాధ్యత తమది కాదంటే తమది కాదంటూ మొహం చాటేస్తున్నారు. దీంతో ఇక్కడ సమస్యలు తాండవిస్తున్నాయి.

- ఇక్కడ రోడ్లు ఊడ్చేవారి ఊసేలేదు..
- వర్షం వస్తే గోదారులవుతున్న రహదారులు
- పట్టించుకోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు



డిమార్ట్ ఎదుట రోడ్డుపై నిలిచిన వరదనీరు

హైదరాబాద్ మహానగరంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లే అవుట్ 'పేరు గొప్ప ఊరు దిబ్బ'లా మారింది. అధికారుల అలసత్వం వల్ల వసతుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. ఎక్కడ చూసినా చెత్తాచెదారమే. మురికి కూపంలా దర్శనమిస్తోంది. వర్షం వస్తే రహదారులు గోదారులవుతున్నాయి. దీంతో హెచ్ఎండీఏ లే అవుట్‌లో నివసించేవారు నిత్యం నరక యాతన అనుభవిస్తున్నారు.

పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం...

పారిశుద్ధ్య పనులు చేపట్టడానికి జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్లపై ఎక్కడ చూసినా చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు, నెలల తరబడి పేరుకుపోయిన మురుగు స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

రోడ్లపై గుట్టలుగా భవన నిర్మాణ వ్యర్థాలు..

ఉప్పల్ భగాయత్‌లోని అంతర్గత రహదారులపై భవన నిర్మాణ వ్యర్థాలు గుట్టలుగుట్టలుగా కనిపిస్తున్నాయి. ఖాళీ ప్రదేశాల్లో హోటళ్ల వ్యర్థాలు, చెత్తాచెదారం పారపోయడంతో దోమలు, దుర్వాసన విజృంభిస్తున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో ఏర్పాటు చేసిన అతిపెద్ద హెచ్ఎండీఏ లేఅవుట్ ఉప్పల్ భగాయత్. ఫేజ్–1, ఫేజ్–2లుగా విభజించిన లే అవుట్ 420 ఎకరాలపై మాటే. ప్రస్తుతం ఇప్పటికే దాదాపుగా రెండు వెలకుపైగా కుటుంబాలు ఇక్కడ నివాసముంటాయి. సంవత్సరానికి రూ.5 కోట్లకు పైగానే ట్యాక్స్ చెల్లిస్తున్నారు. నిర్మాణాలకు ఇచ్చే అనుమతులతో సంవత్సరానికి వచ్చే ఆదాయం దాదాపుగా రూ. 3 వేల కోట్లకుపైగానే ఖజానాకు చేరుతోంది. వసతుల లేమిపై ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లోకాయుక్తలో 2024లో ఫిర్యాదు చేశారు.

ఇంకా జీహెచ్ఎంసీకి అప్పగించలేదు...



ఉప్పల్ భగాయత్‌కు సంబంధించి రోడ్లు, పార్కు స్థలాలను జీహెచ్ఎంసీకి అప్పగించలేదు. శానిటేషన్ చేయాల్సిన బాధ్యత మాదే. ఈ మధ్యకాలంలోనే 21 మంది పారిశుద్ధ్య సిబ్బందిని, సూపర్‌వైజర్‌ను నియమించాం. ఫేజ్ –2 కోసం అదనంగా మరో 21 మంది పారిశుద్ధ్య కార్మికులు కావాలని కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపాం. త్వరలో భగాయత్‌లో చెత్త సమస్యను పరిష్కరిస్తాం. పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ రాజు



ఉప్పల్ భగాయత్‌లో రోడ్డుపై పోసిన చెత్తాచెదారం

రోడ్లన్నీ గుంతలమయం



రోడ్లన్నీ గుంతలు పడి ఉన్నాయి. రాత్రిపూట రావాలంటే భయం భయంగా ఉంది. గేటెడ్ కమ్యూనిటీకి వచ్చినా కష్టాలు తప్పడం లేదు. ఎంతో ఆశతో ఇక్కడికి వచ్చాం. ఆశలన్నీ నీరుగారాయి. దోమలు, మురుగు సమస్య లేకుండా చూడాలి.

–డా.రాఘవేంద్ర ప్రసాద్, వాసవి మెట్రోపోలీస్ అపార్టుమెంట్ నివాసి

కమిషనర్‌ను కలుస్తాం..

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారుల మధ్య సమన్వయం లేక పోవడం స్థానికులకు శాపంగా మారింది. ఇక్కడి ప్రజల అవస్థలను ఎవరూ పట్టించుకోవడంలేదు. చెత్తను తొలగించేందుకు ప్రత్యేక యంత్రాలు అవసరం. త్వరలో జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి సమస్యలను వివరిస్తాం

– ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల మధుసూదన్‌రెడ్డి

రోడ్లు ఊడ్చి నాలుగు నెలలు కావచ్చు..



రాత్రియితే చాలు కుక్కలతోపాటు గంజాయి తాగుబోతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కొంతకాలంగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లపై వరద నీరు నిలిచి దోమలు వృద్ధి చెందాయి. వర్షం పడ్డప్పుడు రోడ్లన్నీ గోదారులవుతున్నాయి. మా అపార్టుమెంట్ ఉన్న ప్రాంతంలో రోడ్లు ఊడ్చి నాలుగు నెలలు కావచ్చు.

–అమర్, వాసవి మెట్రో పోలీస్ అపార్టుమెంట్ నివాసి

న్యాయవాదులకు రక్షణ చట్టం అవసరం

ఇందిరా పార్కు వద్ద న్యాయదీక్షలో వక్తలు



న్యాయదీక్షలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, వీహెచ్, జస్టిస్ చంద్రకుమార్

కవాడిగూడ: తెలంగాణలో న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని తేవాలని, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను అందజేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ జూనియర్ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయదీక్ష నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, జస్టిస్ చంద్ర కుమార్ తదితరులు దీక్షాశిబిరానికి వచ్చి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు ప్రతి నెలా రూ.15 వేల స్టైపండ్ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్టేషన్ బెయిల్ ఇచ్చే అధికారం న్యాయస్థానాలకు ఉండాలని అభిప్రాయపడ్డారు. జూనియర్ న్యాయవాదులు చట్టాలపై మరింత అవగాహన పెంచుకొని కోర్టుల్లో సామాన్యులకు న్యాయం చేసే విధంగా కృషి చేయాలని సూచించారు. న్యాయవాదుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హనుమంతరావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల వంశీ కృష్ణ, వేముల రామకృష్ణ కె.శ్యామ్, సూర్య, సురేష్ కుమార్, మహేందర్, నరేష్, నవీన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ జయంతిని బహిష్కరిస్తున్నాం

తెలంగాణ రజక సంఘం అధ్యక్షుడు పూసాల సంపత్

బంజారాహిల్స్: ప్రభుత్వం నిర్వహిస్తున్న సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 130వ జయంతిని బహిష్కరిస్తున్నట్లు తెలంగాణ రజక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పూసాల సంపత్ తెలిపారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–11లోని ఉదయ్‌నగర్‌లో గురువారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐలమ్మను అవమానించడం బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తగదన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ సారయ్య చోద్యం చూడటం సరికాదన్నారు. ఉత్సవాల కోసం జిల్లాకు కేవలం రూ.10 వేల చొప్పున 33 జిల్లాలకు నిధులు కేటాయించడం రాష్ట్ర రజకులను అవమానించడమేనని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని జిల్లాకు రూ.2 లక్షలు కేటాయించాలని కోరారు. ఈ మేరకు రవీంద్రభారతిలో ప్రభుత్వం నిర్వహించే ఐలమ్మ జయంతి సభను రాష్ట్రంలో ఉన్న రజకులందరూ బహిష్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రాచకొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం



నల్లకుంట: వైద్య రంగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని తెలంగాణ ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఆడిటోరియంలో 'వరల్డ్ ఫార్మసిస్ట్ డే'నిర్వహించారు. అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షుడు జాలిగామ అశోక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుదర్శన్ మాట్లాడారు. వైద్యులు తమ వృత్తిలో రాణించాలంటే ఫార్మసిస్టుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఫార్మసిస్టులకు సరైన చట్టాలు తీసుకువచ్చి ఈ రంగాన్ని మరింత పటిష్టం చేయాలని, ఫార్మసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. 732 ఫార్మసిస్ట్ ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, 104 అంబులెన్స్ సిబ్బందికి ఆరు నెలలుగా రావాల్సిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కత్తి జనార్దన్, డాక్టర్ కిరణ్, తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్. శ్యామ్‌సుందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు, వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

ప్రపంచస్థాయి పరిశోధనల్లో హెచ్‌సీయూ స్థానం బలోపేతం

వైస్‌చాన్స్‌లర్ ప్రొ.బీజే రావు

రాయదుర్గం: ప్రపంచస్థాయి పరిశోధనా ర్యాంకింగ్‌లో తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటామని హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు స్పష్టం చేశారు. స్టాన్‌ఫోర్డ్/ ఎల్సెవియర్ తాజా ప్రామాణిక సైటేషన్ సూచికల నవీకరణ ప్రకారం ప్రపంచ స్థాయి 2 శాతం శాస్త్రవేత్తల్లో హెచ్‌సీయూ నుంచి 34 మంది ఫ్యాకల్టీ ప్రతినిధులకు గుర్తింపు వచ్చిందని తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ స్టాన్‌ఫోర్డ్ అధ్యన ఫలితాలతో తాము మరోసారి రాణించినట్లుగా గుర్తింపు దక్కిందని పేర్కొన్నారు. కెమిస్ట్రీ, లైఫ్‌సైన్సెస్, ఫిజిక్స్, కంప్యూటేషనల్ సైన్సెస్, ఆర్ట్స్, హ్యుమానిటీస్ సహా విస్తృత శ్రేణి విభాగాలు హెచ్‌సీయూలో ఉన్నాయని చెప్పారు. ఈ గుర్తింపే కాకుండా శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు, లెర్న్ అకాడమీల ఫెలోషిప్‌లు, పరిశోధనలో రాణించినందుకు భారత రాష్ట్రపతి విజిటర్ అవార్డులు వంటి ప్రతిష్ఠాత్మకమైన పురస్కారాలు సాధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో హెచ్‌సీయూ ప్రగతి సాధించిందని తెలిపారు. కెరీర్–లాంగ్ ఇంపాక్ట్ జాబితాలో 24 మంది హెచ్‌సీయూ అధ్యాపక సభ్యులు గుర్తింపు పొందారని పేర్కొన్నారు.

నేడు ప్రవాసీ రాజస్థానీ మీట్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ప్రవాసీ రాజస్థానీ మీట్ పేరిట కీలక సమావేశం శుక్రవారం జరగనుంది. నగరంలోని తాజ్ కృష్ణా హోటల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ హాజరుకానున్నారని నిర్వాహక సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రవాసీ రాజస్థానీలు, పెట్టుబడిదారులు, ప్రభుత్వ ప్రతినిధులకు ఒక ఉమ్మడి వేదికగా ఉపయోగపడుతుందని, పారిశ్రామిక సహకారం, పెట్టుబడులకు కొత్త మార్గాలను తెరుస్తుందని పేర్కొన్నారు.

టీజీ పీజీ ఎల్‌సెట్ అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల

లాలాపేట: ఎల్ఎల్ఎమ్ కోర్సుల్లో ప్రవేశానికి టీజీ పీజీఎల్‌సెట్–2025 నోటిఫికేషన్ ఫస్ట్ ఫేజ్ షెడ్యూల్‌ను గురువారం ఓయూ అధికారులు విడుదల చేశారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 6 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్, ఆన్‌లైన్ పేమెంట్‌తోపాటు సర్టిఫికెట్లను స్కాన్ చేసి లాసెట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులు సూచించారు.

అక్టోబర్ 8, 9 తేదీల్లో ఓయూలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ఎన్‌సీసీ, పీహెచ్, క్యాప్, స్పోర్ట్స్ కేటగిరీ అభ్యర్థులకు ఫిజికల్ వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. వచ్చే నెల 10న వెరిఫికేషన్ చేసిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు. వచ్చే నెల 11, 12 తేదీల్లో మొదటి ఫేజ్ వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలని సూచించారు. 13న ఎడిట్ కోసం అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. అక్టోబర్ 15న కాలేజీలవారీగా ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు. 16 నుంచి 18 వరకు ఆయా కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్టు చేయాలని సూచించారు.

కొంపెల్లి వెంకట్ గౌడ్ చిరస్మరణీయుడు

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



వెంకట్ గౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్ గౌడ్, బాలరాజ్ గౌడ్, వెంకన్న గౌడ్, నారాయణ గౌడ్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బహుజన విప్లవవీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్రను రచించిన గొప్ప రచయిత కొంపెల్లి వెంకట్ గౌడ్ అని, రచయితగా, సామాజికవేత్తగా వెంకట్ గౌడ్ చిరస్మరణీయుడని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం చిక్కడపల్లిలోని బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కార్యాలయంలో వెంకట్‌గౌడ్ సంతాపసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మహనీయుల జీవితచరిత్రలు రాసిన వెంకట్‌గౌడ్ గొప్ప వ్యక్తి అని కొనియాడారు. బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగొని బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ వెంకట్ గౌడ్ గౌడ సామాజిక ఉద్యమంలో నూతన ఒరవడిని తేచ్చారని అన్నారు. గౌడ కల్లుగీత వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ మాట్లాడుతూ వెంకట్ గౌడ్ మరణం తెలంగాణ సాహిత్య రంగానికి, బీసీలకు తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర నాయకులు సుగూరి దుర్గయ్య గౌడ్, అంబాల నారాయణ గౌడ్, దొమ్మాట వెంకట్, బడేసాబ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

30న అంబేడ్కర్ వర్సిటీ స్నాతకోత్సవం

- హాజరుకానున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ప్రజాకవి గోరటి వెంకన్నకు గౌరవ డాక్టరేట్



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 26వ స్నాతకోత్సవం ఈ నెల 30న వర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఘంటా చక్రపాణి తెలిపారు. గురువారం క్యాంపస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రిజిస్ట్రార్ ఎల్.విజయకృష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ బోజు శ్రీనివాస్‌తో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ జిష్ణుదేవ్‌వర్మ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఎం.ఫిల్, పీహెచ్‌డీ పట్టాలను, ఆయా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, బుక్ ప్రైజ్‌లను అందించనున్నట్లు వివరించారు. ముఖ్యఅతిథిగా న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) ఉపకులపతి ప్రొఫెసర్ ఉమా కాంజీలాల హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఇందులో 60,288 మంది అభ్యర్థులకు డిగ్రీలు, డిప్లొమాలు, సర్టిఫికెట్లు అందించనున్నట్లు వెల్లడించారు. ఈ స్నాతకోత్సవంలో ప్రజాకవి గోరటి వెంకన్నకు గౌరవ డాక్టరేట్ అందించనున్నట్లు తెలిపారు. ప్రఖ్యాత శాంతి విద్యా ప్రచారకులు, ఆరోగ్యకర విధానంలో పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంపొందించి, నేరాల శాతం తగ్గించడానికి కృషి చేస్తున్న ప్రేమ్‌రావత్‌ను డాక్టర్ ఆఫ్ లెటర్స్‌తో సత్కరించబోతున్నట్లు పేర్కొన్నారు.

'తెలంగాణ భాష - సమగ్ర పరిశీలన' గ్రంథం ఆవిష్కరణ

సుల్తాన్‌బజార్: మాతృభాష, సంస్కృతికి విద్యార్థి దశ నుంచే పిల్లల్లో బీజం పడాలని, ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా మారుతున్నాయని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య గంట జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో 'తెలంగాణ భాష – సమగ్ర పరిశీలన'అనే గ్రంథాన్ని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పుడు ఇంగ్లిష్ చదువులు ఎక్కువ కావడంతో విద్యార్థులు తెలుగు భాషకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు మూతపడటం ఆందోళనకర విషయమన్నారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష తెలంగాణ ప్రాంతంలోనే పుట్టిందని, ఆంధ్రప్రదేశ్‌లో కాదని అన్నారు. శాతవాహనుల కాలం నుంచి చివరి నిజాం వరకు తెలుగు భాష ఉందని అయితే తెలంగాణ ప్రాంతంలో ఉర్దూ ప్రభావం ఉండటం వల్ల యాస కొంత వరకు మారిందని అన్నారు. ప్రముఖ కవి అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఈ గ్రంథాన్ని అంకితం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో బతుకమ్మ సంబురాలు

ఆడిపాడినా ఐఏఎస్ అధికారిణులు



వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీలో బతుకమ్మ ఆడుతున్న ఐఏఎస్ అధికారులు దేవసేన, యోగితా రాణా, వీసీ సూర్య ధనుంజయ్

సుల్తాన్‌బజార్: కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో బతుకమ్మ ఉత్సవాలు గురువారం ఉత్సాహభరితంగా జరిగాయి. వర్సిటీలోని వివిధ విభాగాల విద్యార్థినులు బతుకమ్మలను తమదైన శైలీలో పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి దర్బార్ హాల్ ముందు బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు చేసుకున్నారు. డీజే హోరులో దాండియా నృత్యం చేశారు. కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన, హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యదర్శి యోగిత రాణా ముఖ్య అతిథులుగా హాజరై బతుకమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థినులతో కలిసి బతుకమ్మ చుట్టూ ఆడిపాడారు. విద్యార్థినుల్లో జోష్ నింపారు. అనంతరం దేవసేన మాట్లాడుతూ మహిళలందరూ కలిసి జరుపుకుని ఐక్యతను చాటే పండుగ బతుకమ్మ అని అన్నారు. ఇలాంటి పండుగలు విద్యార్థినుల్లో నూతనోత్సాహాన్ని తీసుకువస్తాయన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, విద్యాశాఖ స్పెషల్ సెక్రెటరీ హరిత, ప్రిన్సిపాల్ లోకపావని, అధ్యాపకులు ప్రొఫెసర్ జ్యోతి పాల్గొన్నారు.

రైల్వే చక్రబంధం నుంచి మల్కాజిగిరికి విముక్తి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: నిరంతరం ఎదురవుతున్న ట్రాఫిక్ కష్టాలను పరిష్కరించేందుకు మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టి రైల్వే చక్రబంధం నుంచి విముక్తి కలిగేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం చేపట్టిన అభివృద్ధి పనులపై గురువారం వినాయక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాజ్‌పేయ్‌నగర్ ఆర్‌యూబీకి రూ.74.47 కోట్లు, ఆర్‌కే పురం ఫ్లైఓవర్‌కి రూ.210 కోట్లు, ఆర్‌యూబీకి రూ.35 కోట్లు, పీవోసీ రోడ్లు అభివృద్ధికి రూ.464 కోట్లు, తుర్కపల్లి ఆర్‌యూబీకి రూ.5 కోట్లు, జనప్రియ ఆర్‌యూబీకి రూ.6.6 కోట్లు, గౌతనగర్ ఆర్‌యూబీకి రూ.28 కోట్లు మంజూరుకు కృషి చేసినట్లు చెప్పారు. 5 ఎంఎల్‌డీ రిజర్వాయర్‌కి రూ.14.95 కోట్లు, సఫిల్‌గూడ యూపీహెచ్‌సీకి 500 గజాల ప్రభుత్వ స్థలం, రూ.1.43 కోట్లు మంజూరు, జిల్లా కోర్టు భవన నిర్మాణానికి రూ.42 కోట్లు, అల్వాల్ ఫైర్‌స్టేషన్‌కు 11 గుంటల ప్రభుత్వ భూమి కేటాయింపునకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీలో ఆమోదం కోసం కృషి, డిగ్రీ కళాశాలకు రూ.2 కోట్లు మంజూరు, విద్యుత్ శాఖ అభివృద్ధి పనులకు రూ.42 కోట్లు, జీహెచ్ఎంసీ ద్వారా సీసీ రోడ్డు, బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల సాధనలో మద్దతుగా నిలిచిన వివిధ శాఖల అధికారులకు, కార్పొరేటర్లకు, నాయకులకు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీత, మాజీ కార్పొరేటర్లు బద్ధం పుష్పలత, జగదీష్ గౌడ్, ఏకే మురుగేష్, నాయకులు బద్దం పరుశురాంరెడ్డి, జేఏసీ వెంకన్న, జీకే హన్మంతరావు, రాముయాదవ్, చిన్న యాదవ్, ఉస్మాన్, శివగౌడ్, హేమంత్ పటేల్, వంశీ ముదిరాజ్, రాజశేఖర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవద్దు

జాజుల శ్రీనివాస్ గౌడ్



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

పంజగుట్ట: రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై రెడ్డి కులస్తులు హైకోర్టుకు వెళ్లడం తగదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రెడ్డి జాగృతి అధ్యక్షుడు మాధవరెడ్డి, జులపల్లి మల్లవ్వ అనే వ్యక్తులు హైకోర్టుకు వెళ్లారని, రాష్ట్రంలో రెడ్డి వర్సెస్ బీసీ అనే పరిస్థితి రావద్దని, కలిసిమెలిసి ఉండాలంటే రిజర్వేషన్లను అడ్డుకోవద్దని అన్నారు. ఇప్పటికే బీసీ రిజర్వేషన్లపై కేసు వేసిన వారి ఇళ్ల ముట్టడికి బీసీ సంఘాలు, నాయకులు ఎంతో ఒత్తిడి తెస్తున్నారని, బీసీలు రోడ్డుమీదకు వస్తే తట్టుకోలేరని ఆయన హెచ్చరించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ బీసీ సంఘాల నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఇస్తున్నారు, 8 శాతం ఉన్న అగ్రకులాల వారికి 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇస్తున్నారు, 60 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తే తప్పేంటి'అని ఆయన ప్రశ్నించారు. రెడ్డి కులస్తుల తీరు మారకుంటే నవంబర్ 9వ తేదీన భువనగిరిలో జరిగే భారీ బీసీ బహిరంగ సభలో 'రెడ్డి కో హటావో బీసీ రిజర్వేషన్ బచావో'నినాదం ఇస్తామని హెచ్చరించారు. సమావేశంలో ప్రొఫెసర్ బాగయ్య, సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ సగర, బీసీ జాగృతి అధ్యక్షుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్ • శుక్రవారం • 26 • సెప్టెంబర్ • 2025

కార్ రేస్‌లో ఛాంపియన్‌గా నవీన్..



బంజారాహిల్స్: టాంజానియాలో జరిగిన ఎంకే వావా ర్యాలీలో హైదరాబాద్‌కు చెందిన నవీన్ పులిగిళ్ల ఛాంపియన్‌గా నిలిచారు. ఇటీవల టాంజానియాలో ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన రేసర్లు పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఇందులో గచ్చిబౌలిలో నివసించే యువ ఆర్కిటెక్చర్ నవీన్ విజేతగా నిలిచారు. ప్రపంచంలో ఎక్కడ కారు రేసింగ్ జరిగినా ఇండియా నుంచి నవీన్ పాల్గొంటూ తన సత్తా చాటుతున్నారు. టాంజానియా రేస్‌లో వందోసారి పాల్గొని చాంపియన్‌గా నిలిచారు. ఆటోమొబైల్‌పై ఆసక్తితో విదేశాల్లో చదువుకున్న నవీన్ చాంపియన్ రేసర్‌గా ప్రపంచ గుర్తింపు పొందారు. ఇటీవలే కెన్యాలోని నైవాషా ఎడారిలో జరిగిన సఫారీ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రమాదకరమైన లోయల్లో లక్ష్యాన్ని చేరుకుని ఫోర్డ్ ఫియాస్టా ర్యాలీ–3 చాంపియన్‌గా నిలిచారు. హంపిలో ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ నిర్వహించిన పోటీల్లో వరుసగా మూడు సార్లు చాంపియన్‌గా నిలిచారు. న్యూజిల్యాండ్ ఆసియా పసిఫిక్ ర్యాలీలో మూడో స్థానంలో నిలిచాడు. ఆ తర్వాత వరల్డ్ ర్యాలీ చాంపియన్‌షిప్‌కు ఎంపికై కేరళకు చెందిన కో–డ్రైవర్‌గా మూసా షరీఫ్‌తో కలిసి టాంజానియాలో జరిగిన రేస్‌లో చాంపియన్‌గా నిలిచి భారత కీర్తిని నలు దిశలా చాటారు. చాంపియన్‌షిప్ గెలిచిన తర్వాత భారత జాతీయ పతాకాన్ని రెపరెపలాడిస్తూ భారత కీర్తిని మరింతగా ముందుకుతీసుకెళ్లారు.



27న నేచర్ క్యాంప్

గచ్చిబౌలి: ఫారెస్ట్ ట్రెక్‌పార్కులో నేచర్ క్యాంప్, బర్డ్స్ వాక్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రంజిత్ నాయక్ తెలిపారు. మంచిరేవులలోని ఫారెస్ట్ ట్రెక్‌పార్కులో 27 శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఆదివారం ఉదయం పది గంటల వరకూ నేచర్ క్యాంప్ ఉంటుందని తెలిపారు. టీం బిల్డింగ్, టెంట్ పిచింగ్, నోక్టర్నల్ వాక్, నైట్ క్యాంపింగ్, క్యాంప్ ఫైర్, ట్రెక్కింగ్, నేచర్ ట్రయల్, బర్డ్ వాచింగ్ ఉంటాయన్నారు. సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం, ఉదయం టిఫిన్ అందిస్తామన్నారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 9.30 గంటల వరకు ఫారెస్ట్ ట్రెక్ పార్కులో బర్డ్ వాక్‌లో పిల్లలు, పెద్దలు పక్షుల జాతులను గుర్తించవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 73823–07476, 94935–49399లను సంప్రదించాలని సూచించారు.

రొమ్ము కేన్సర్ అవేర్నెస్ రన్..
‘పింక్‌థాన్’

సాక్షి, సిటీ బ్యూరో: బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన కల్పించడమే లక్ష్యంగా హైదరాబాద్‌తో పాటు ముంబై, బెంగళూరు, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై నగరాల్లో పింక్‌థాన్ రన్ నిర్వహించనున్నారు. జైడస్ లైఫ్‌సైన్సెస్ ఆధ్వర్యంలో డిసెంబరు 21న నిర్వహించనున్న ఈ రన్‌లో 30 వేల



మందికి పైగా మహిళలు పాల్గొనున్నారని, ఇందులో అల్ట్రా రన్స్, రీలే రన్ ఉన్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రతి నెల మూడు నిమిషాల సెల్ఫ్ బ్రెస్ట్ ఎగ్జామ్ మహిళల ప్రాణాలను రొమ్ము కేన్సర్ నుంచి కాపాడగలదని జైడస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శర్విల్ పటేల్ తెలిపారు. పింక్‌థాన్‌తో మరింత మందిని చైతన్యపరచడమే లక్ష్యమన్నారు. దేశంలో యేటా రెండు లక్షల మంది మహిళలు బ్రెస్ట్ కేన్సర్ బాధితులు అవుతున్నారని ఫిట్‌నెస్ ఐకాన్ పింక్‌థాన్ ఫౌండర్ మిలింద్ సోమన్ అన్నారు.

ఏఐ నైపుణ్యాలకు..
సర్వీస్ నౌ యూనివర్సిటీ

సాక్షి, సిటీబ్యూరో: బిజినెస్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో అంతర్జాతీయ ఏఐ వేదిక సర్వీస్ నౌ (ఎన్‌వైఎస్ఇ.ఎన్‌ఓడబ్ల్యూ) తన కొత్త విద్యా కార్యక్రమం ‘సర్వీస్ నౌ యూనివర్సిటీ’ని మాదాపూర్‌లోని నోవోటెల్‌లో తొలి ఏఐ స్కిల్స్ సమ్మిట్‌లో ఆవిష్కరించింది. సర్వీస్ నౌ ఇండియా టెక్నాలజీ బిజినెస్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ సుమీత్ మథూర్ మాట్లాడుతూ ఏఐ వేగంగా అభివృద్ధి చెందుతున్నా, భారతీయ సంస్థలలో 26 శాతం యాజమాన్యాలు, ఉద్యోగుల్లో అవసరమైన నైపుణ్యాలపై స్పష్టత రాలేదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని 2027 నాటికి దేశంలో 10 లక్షల మందికి నైపుణ్యాభివృద్ధి, ప్రపంచవ్యాప్తంగా 30 లక్షల మందికి శిక్షణే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దీనికి దేశవ్యాప్తంగా 1,200 మంది విద్యార్థులు ప్రత్యక్షంగా 20,000 మంది వర్చువల్‌గా హాజరయ్యారు.

తరంగ్ నైట్స్ - దాండియా నైట్ 2025..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని జీబీఆర్ కొంపల్లి కల్చరల్ గార్డెన్స్ వేదికగా ఈ నెల 27న ‘తరంగ్ నైట్స్–దాండియా నైట్ 2025’ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రమాన్ ఈవెంట్స్ అండ్ బిజినెస్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ దాండియా సంబరాల్లో సినీ నటులు, టీవీ ఆర్టిస్టులు, ప్రముఖ డీజే తలం (పుణే) ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నారని పేర్కొన్నారు. సంప్రదాయ దాండియా నృత్యానికి పునరుజ్జీవనం, విద్యార్థులు, యువ తరానికి సాంస్కృతిక వేదికగా ఈ వేడుకలు నిలువనున్నాయి.



సోషల్ మీడియా యాప్స్ అంటే ఒకప్పుడు ఎంటర్‌టైన్మెంట్.. వ్యక్తిగత అనుభూతి, అభిరుచులు ఉత్సాహంగా పంచుకోవడం.. కానీ ప్రస్తుతం హేట్ స్పీచ్, విద్వేషాలు, నెగెటివ్ కామెంట్స్, బాడీ షేమింగ్ వంటి అంశాలకు ఆన్‌లైన్ వేదికలుగా మారాయి. ముఖ్యంగా అమ్మాయిలకు, మహిళలకు ఫేస్‌బుక్, ఇన్‌స్టా వంటి వేదికలు మరింత అసభ్యకరంగా మారాయి. జెన్ జీ బ్యాచ్ అయితే మరీ హద్దు అదుపు లేకుండా ట్రోలింగ్, లీచింగ్‌కు పాల్పడుతున్నారు. ఇలాంటి తరుణంలో మహిళలు, యూత్ గరల్స్‌కు ప్రత్యామ్నాయ ఆన్‌లైన్ వేదికల అవసరముందని ఆలోచించారు నగరానికి చెందిన మహిళా అడ్వొకేట్ వెన్నెల. ఇందులో భాగంగానే కేవలం మహిళల కోసమే ‘షీ అస్త్ర’ అనే సోషల్ యాప్ రూపొందించారు.

– సాక్షి, సిటీబ్యూరో

ఇన్నోవేషన్ల వేదికగా..

ఈ ‘షీ అస్త్ర’ యాప్‌లో మహిళల కోసం ప్రత్యేకంగా రూమ్స్ ఉంటాయి. టాలెంట్ రూమ్‌లో యువత ఆర్ట్స్, స్కిల్స్ ప్రోత్సహించేలా రూపొందించారు. ముఖ్యంగా జెన్ జీ అట్రాక్షన్, గుర్తింపునకు వారిలోని నైపుణ్యాన్ని, కళలను షేర్ చేసుకోవచ్చు. అమ్మాయిలు స్వేచ్ఛగా మాట్లాడుకోడానికి, చర్చించుకోడానికి గాసిప్ రూమ్, ఈ తరం ఇన్నోవేషన్స్, స్టార్టప్స్, బ్రాండ్స్ ప్రమోట్ చేసుకోడానికి రికమండేషన్ రూమ్ వంటివి ఉన్నాయి. డిప్రెషన్, ట్రోమా వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రైవసీతో సిస్టర్ ఎస్ఓఎస్ వేదిక ఉంది. మహిళలకు ప్రోత్సాహం, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ‘షీ అస్త్ర స్కూల్’ తయారు చేశారు. ఇది మహిళలకు పెద్దబాలశిక్ష మాదిరి అని వెన్నెల తెలిపారు. మిగతా సోషల్ యాప్స్‌లో ట్రోలింగ్ రిపోర్ట్ చేయడానికి ట్రోల్ పోలీస్, సెకండరీ విక్టిమైజేషన్, హాష్‌ట్యాగ్ వంటి ఎన్నో ఫీచర్లు ఇందులో ఉండటం విశేషం.

రక్షణ ఛత్రం..
‘షీ అస్త్ర’ం..

దేశంలో మొట్టమొదటి ఉమెన్ యాప్

- ఫేస్‌బుక్, ఇన్‌స్టాకు ప్రత్యామ్నాయంగా
- ఆధార్ గుర్తింపుతో మహిళలకు మాత్రమే
- భద్రత, వినోదంతో పాటు స్టార్టప్ ప్రమోషన్ వేదిక
- మహిళా అడ్వొకేట్ వెన్నెల బృందం రూపకల్పన
- ఆవిష్కరించిన దర్శకులు శేఖర్ కమ్ముల, మహిళా ఐఏఎస్, ఐఆర్ఎస్ అధికారులు..

అడ్వొకేట్ ప్రాక్టీస్‌లో భాగంగా మహిళలకు సైబర్, ఆన్‌లైన్ వేధింపులకు సంబంధించిన పలు సున్నితమైన, సూక్ష్మమైన అంశాలను.. అవి ప్రభావితం చేసే పరిస్థితులను ప్రత్యక్షంగా చూశానని యాప్ రూపొందించిన వెన్నెల తెలిపారు. సోషల్ మీడియా ట్రోలింగ్‌తో ఎందరో అమ్మాయిలు, ఇన్‌ఫ్లుయెన్సర్స్ నిరాశ, నిస్పృహలోకి చేరుకోవడం సర్వసాధారణం. ఇలాంటి





పరిస్థితులకు పరిష్కారంగా మిగతా సోషల్ యాప్స్‌లాగే కేవలం ఉమెన్ కోసం ‘షీ అస్త్ర’ యాప్ రూపుదిద్దుకుంది. దీనికి మహిళగా తప్పనిసరి ఆధార్ అప్రూవల్ అవసరం. దేశంలో మొదటి ఆధార్ అనుసంధానిత యాప్ కావడం దీని ప్రత్యేకత. ఈ యాప్‌ను నగరంలోని టీహబ్ వేదికగా దేశ వ్యాప్తంగా అందుబాటులో ఉండేలా ప్రముఖ సినీ దర్శకులు శేఖర్ కమ్ముల, ఐఏఎస్ ఆఫీసర్ భవానీ శ్రీ, ఐఆర్ఎస్ అధికారి బలరాం, ఐఏఎమ్‌సీ డిప్యూటీ రిజిస్ట్రార్ నిక్షిత నిరంజన్ ఆవిష్కరించారు.



నా వంతు సహకారంగా..

సోషల్ మీడియాలో ఒక ఫొటో పెడితే ఎన్నో నెగెటివ్ కామెంట్స్, ట్రోలింగ్.. మహిళలు స్వేచ్ఛగా తమ ఆలోచనలను పంచుకోలేకపోతున్నారు. దీనిని మార్చడానికి నేనేం చేయగలను అనే ఆలోచన నుంచి నా సాంకేతిక బృందం అశ్విన్, నవ్య, దీక్ష, నవీన్ సహకారంతో దీనిని సృష్టించాం. ప్రస్తుతం దేశంలో మరికొద్ది రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి రానుంది. నెలకు చిన్నమొత్తం రుసుముతో దీనిని వినియోగించుకోవచ్చు. షీ అస్త్ర మహిళ కోసం మొదటి సారి భారత్ నుంచి ఆవిష్కృతమైందని గర్వంగా చెప్పుకుంటాను.

– వెన్నెల, యాప్ క్రియేటర్, అడ్వొకేట్

కామెంట్లకు గ్రూప్‌రిపోర్ట్..

ప్రస్తుత తరుణంలో అమ్మాయిలకు సురక్షితమైన వర్చువల్ స్పేస్ లేదనే చెప్పాలి. 10వ తరగతి చదువుతున్న చిన్న పిల్లలు సైతం ఆన్‌లైన్‌లో ట్రోల్ చేయడం, అభ్యంతరకరమైన, అశ్లీల కామెంట్లు పెట్టడం సాధారణమైపోయింది. ఈ తరుణంలో షీ అస్త్ర యాప్ మంచి ఆవిష్కరణ. అశ్లీల, అసభ్య కామెంట్లకు గ్రూప్ రిపోర్ట్ ఆప్షన్ ప్రతిఒక్కరూ వినియోగించాలి. చట్టాలు, సైబర్ క్రైమ్ ప్రభావవంతంగా ఉంటే మహిళలు తమ ఆలోచనలను మరింత ఉన్నతంగా పంచుకోగలుగుతారు.

– శేఖర్ కమ్ముల, సినీ దర్శకుడు

ట్రోలింగ్ నుంచి రక్షణగా..

మహిళలకు సోషల్ మీడియా ట్రోలింగ్ అనేది యూనివర్స్ ప్రాబ్లం.. ఈ మధ్య ఒక అమ్మాయి విడాకులు తీసుకుని వేడుక చేసుకుంటే.. సోషల్ మీడియాలో వచ్చిన నెగెటివ్ కామెంట్స్ ఆశ్చర్యాన్ని కలిగించింది.. నాగాలాండ్‌లో ఐఏఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్నప్పుడు ఓ మహిళా ఉద్యోగి తన భర్త నుంచి మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురవుతుందని తెలుసుకోడానికి చాలా సమయం పట్టింది. అనంతరం కేసులు, కౌన్సెలింగ్‌తో పరిష్కారం చూపించగలిగా. ఇలాంటి పరిస్థితుల్లో మహిళలు రిపోర్ట్ చేయడం అలవర్చుకోవాలి.

– భవానీ శ్రీ, ఐఏఎస్, జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి

నెగెటివిటీకి దూరంగా..

గత ఇరవై సంవత్సరాలుగా సోషల్ మీడియా వాడకం ఎక్కువగా పెరగడం.. దీంతో పాటు మహిళలపై ట్రోలింగ్ పెరిగింది. ముఖ్యంగా మార్ఫింగ్, ఫేక్ అకౌంట్స్ వంటివి సమస్యగా మారాయి. సాంకేతిక పరంగా మహిళలకు సురక్షితమైన షీ అస్త్ర వంటి ఆన్‌లైన్ వేదికలు పెరగాలి. ఇది అనువైన డిజైనింగ్ క్రియేటింగ్ స్పేస్ కావలి.. ట్రోలింగ్, నెగెటివిటీకి దూరంగా.. షీ అస్త్రలోని ప్రైవసీ పాలసీ, మల్టిపుల్ ఫీచర్స్, రిపోర్టింగ్ ఆప్షన్స్ అమ్మాయిలకు మేలు చేస్తాయి.

– నిక్షిత నిరంజన్, ఐఏఎమ్‌సీ డిప్యూటీ రిజిస్ట్రార్.

రెండు అంశాల సమ్మిళితం..

సామాజికంగానే కాదు ఆన్‌లైన్ వేదికగా కూడా అమ్మాయిలకు అనువైన పరిస్థితులు కనపడట్లేదు. ఈ తరంలో వచ్చిన మార్పు ఇది.. దీనికి అనుగుణంగా సాంకేతికంగా, న్యాయ శాఖ పరంగా మార్పులు రావాల్సిన అవసరముంది. ఈ రెండు అంశాల సమ్మిళితమే షీ అస్త్ర యాప్. అడ్వొకేట్ సేవలందిస్తూనే ఇలాంటి సాంకేతిక పరిష్కారం అందించిన వెన్నెల టీం ప్రయత్నం అభినందనీయం.

– బలరాం, ఎస్‌సీసీఎల్ చైర్‌పర్సన్–ఎండీ

డ్రగ్స్ రహిత దేశం కోసం సైక్లింగ్..

- ధ్యానం, సైక్లింగ్ జీవితాన్ని మార్చేశాయి
- నేడు నగరానికి చేరుకోనున్న తరుణ్ పర్మార్

సాక్షి, సిటీబ్యూరో: ధ్యానంపై అవగాహన కల్పించడంతో పాటు భారత ప్రభుత్వ ‘నాషా ముక్త్ భారత్ అభియాన్’కు మద్దతు ఇవ్వడంలో భాగంగా సైక్లింగ్ ప్రయాణం చేపట్టిన తరుణ్ పర్మార్ నేడు నగరానికి చేరుకోనున్నారు. అహ్మదాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, హార్ట్‌ఫుల్‌నెస్ ప్రాక్టీషనర్ తరుణ్ పర్మార్ సెప్టెంబర్ 13న నోయిడా నుంచి మొదలు పెట్టిన ఈ సైక్లింగ్ 7 రాష్ట్రాలు, ప్రముఖ నగరాల్లో అవగాహన కల్పిస్తూ రోజుకు దాదాపు 140 కిలో మీటర్లు ప్రయాణిస్తున్నారు. ఈ ప్రయాణంలో భాగంగా నేడు హైదరాబాద్‌కు చేరుకుని రేపు నగరంలోని కన్హా శాంతి వనం – హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ వేదికగా తన సైక్లింగ్ ప్రయాణాన్ని ముగించనున్నారు. తరుణ్ పర్మార్ ఈ అవగాహన సైక్లింగ్ ప్రయాణంలో భాగంగా మొత్తం 1700 కి.మీ సైక్లింగ్ చేసి ఈ తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా తరుణ్ తన అభిప్రాయాలు పంచుకుంటూ.. సైక్లింగ్, ధ్యానం తన జీవన గమ్యాలే తన సంతృప్తి అని పేర్కొన్నారు. ధ్యానం తన జీవితాన్ని మార్చేసిందని, మాదకద్రవ్య రహిత భారతదేశం కోసం నిర్వహిస్తున్న ఉద్యమంలో తాను భాగం కావడం సంతోషంగా ఉందని అన్నారు.



పెద్దలకు భరోసా..

- రాచకొండలో సీనియర్ సిటిజెన్స్ కోసం గోల్డెన్ కేర్
- సైబర్ భద్రతపై అవగాహన, వైద్య సహాయం, ఆరోగ్య బీమా సేవలు
- హెల్ప్‌లైన్ నంబరు 14567, వాట్సాప్ 8712662111
- కార్యక్రమాన్ని ప్రారంభించిన పోలీసు కమిషనర్ సుధీర్ బాబు

కడుపున పుట్టిన పిల్లలే కాదు.. కనిపించకుండా ఎక్కడో నక్కిన సైబర్ నేరస్తుల చేతిలోనూ వేధింపులు, సైబర్ మోసాలకు గురవుతున్న వృద్ధులకు భరోసా కల్పించేందుకు రాచకొండ పోలీసులు అడుగులు ముందుకేశారు. రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ (ఆర్కేఎస్సీ)తో కలిసి గోల్డెన్ కేర్ ‘మన కోసం శ్రమించిన వారికి మన సంరక్షణ’ అనే వినూత్న కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని వృద్ధులకు రక్షణ, సంరక్షణ, గౌరవం అందించడమే దీని ప్రధాన లక్ష్యం.

– సాక్షి, సిటీబ్యూరో

గోల్డెన్ కేర్ ద్వారా వారికి భద్రత మాత్రమే కాదు, ఆప్యాయం, గౌరవం, ఆత్మీయతను అందించనున్నారు. వృద్ధులు సమాజానికి నిజమైన మూలస్తంభాలు, జ్ఞాననిధులని రాచకొండ పోలీస్ కమిషనర్ జీ సుధీర్ బాబు కొనియాడారు. రాచకొండ పోలీసులు ఎల్లప్పుడూ మీ కుటుంబ సభ్యుల్లా ఉంటారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన సీనియర్ సిటిజన్స్ అందరికీ కిట్స్ పంపిణీ చేశారు.

సైబర్ భద్రత, ఆరోగ్య బీమా..

గోల్డెన్ కేర్ కార్యక్రమం కింద వృద్ధులకు నియమిత పర్యటనలు, నైతిక సహకారం అందించడంతో పాటు ఎస్ఓఎస్ సెటప్, వైద్య, అత్యవసర సహాయం కోసం ఆస్పత్రులతో ఒప్పందాలు, ఆరోగ్య బీమా సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మార్గదర్శనం అందిస్తారు. వృద్ధులకు ఆర్థిక, సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తారు. మోసాల బారిన పడితే పోలీసులకు తెలియజేసే ప్రక్రియలో సహాయం, శారీరక లేదా మానసిక వేధింపుల కేసుల దర్యాప్తు, జోక్యం చేసుకోవడం, నిర్లక్ష్యానికి గురైనా విడిచిపెట్టే సంఘటనలలో తగిన పరిష్కారం అందిస్తారు. వీటితో పాటు వృద్ధులు తప్పిపోయినా, ఏదైనా వస్తువులు పొగొట్టుకున్నా వాటిని కనుగొనడంలో పోలీసులు సహాయం అందిస్తారు.

హెల్ప్ లైన్ నంబర్లతో..

గోల్డెన్ కేర్ సేవల కోసం రాచకొండ పోలీసులు ప్రత్యేకంగా హెల్ప్ లైన్ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ నంబరు 14567 లేదా రాచకొండ వాట్సాప్ నంబర్ 87126 62111లతో సంప్రదించవచ్చు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్–144 కింద వృద్ధులను పోషించకుండా నిర్లక్ష్యం చేసినవారిపై పోలీసులు చర్యలు తీసుకుంటారు. అలాగే, మెయింటెనెన్స్ యాక్ట్ (సెక్షన్లు 4, 5) వృద్ధులు తమ పిల్లల నుండి ఆర్థిక సహాయం పొందేలా అవకాశం కల్పిస్తుంది. డీసీపీలు పద్మజ, ప్రవీణ్ కుమార్, ఆకాంక్ష్ యాదవ్, సునీతా రెడ్డి, అరవింద్ బాబు, ఇందిరా, ఉషా రాణి, నాగలక్ష్మి, రమణా రెడ్డి, మనోహర్, ఆర్కేఎస్సీ జాయింట్ సెక్రటరీ శివ కారడి, చీఫ్ కో–ఆర్డినేటర్ సావిత్రి పాల్గొన్నారు.





గట్టిగా 'ఎవడూ' అడగలేదు

అసెంబ్లీలో చిరంజీవిపై బాలకృష్ణ ఫైర్

సాక్షి, అమరావతి: మెగాస్టార్ చిరంజీవిపై హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ శాసనసభలో గురువారం అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. చిరంజీవిని ఏకవచనంతో సంబోధిస్తూ 'ఎవడు' అంటూ మాట్లాడారు. శాసనసభలో గురువారం శాంతిభద్రతల అంశంపై చర్చ సందర్భంగా బీజేపీ సభ్యుడు కామినేని శ్రీనివాస్ మాట్లాడిన విషయాలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు చిరంజీవిని అవమానించారని, ఆయన్ను కలవడానికి వెళితే కలవకుండా సినిమాటోగ్రఫీ మంత్రిని కలవమన్నారని శ్రీనివాస్ చెప్పారు. దీనిపై జోక్యం చేసుకున్న బాలకృష్ణ.. కామినేని శ్రీనివాస్ చెప్పినదంతా అబద్ధమని కొట్టిపడేశారు. చిరంజీవి గట్టిగా అడిగితే సీఎం వచ్చాడనేది అబద్ధమని, అక్కడ గట్టిగా ఎవడూ అడగలేదని బాలకృష్ణ అన్నారు. గట్టిగా అడిగితేనే ఆయన కలవడానికి వచ్చాడని, లేకపోతే సినిమాటోగ్రఫీ మంత్రిని కలవమన్నారనేది అసత్యమని, ఆయన గట్టిగా చెబితే దిగొచ్చాడంట.. అని వ్యంగ్యంగా అన్నారు. 'గట్టిగా అడిగారా.. ఎవడు అడిగాడు గట్టిగా, అడిగితే వచ్చాడా వీడు కలవడానికి. నాన్సెన్స్' అంటూ బాలకృష్ణ వ్యాఖ్యలు చేశారు.

జగన్‌పైనా పరుష పదజాలం

ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి బాలకృష్ణ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. 'ఇండస్ట్రీ వాళ్లు సైకో గాడిని కలవడానికి వెళ్లినప్పుడు..' అంటూ పరుష పదజాలాన్ని వాడటమేకాక వాడు, వీడు అంటూ సభ్యత లేకుండా మాట్లాడారు. ఆయన మాట్లాడిన తీరును బట్టి ఆయన మామూలుగా లేరనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

కూటమి పాలనలోనూ అవమానం అంటూ ఆగ్రహం

కూటమి ప్రభుత్వంలోనూ తనకు అవమానం జరిగినట్టు బాలకృష్ణ ఫైర్ అయ్యారు. ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కి లిస్ట్ తయారు చేయమని ఈ ప్రభుత్వంలోనూ తనకు ఆహ్వానపత్రం వచ్చిందని, అందులో తనది తొమ్మిదో పేరు వేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అది వేసింది ఎవడని సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేష్‌ని అడిగానని చెప్పారు.

జగన్ నన్ను సాదరంగా ఆహ్వానించారు

- అసెంబ్లీలో బాలకృష్ణ వ్యాఖ్యలపై సినీ నటుడు చిరంజీవి
- వైఎస్ జగన్ ఆహ్వానం మేరకే ముందు నేను ఇంటికి వెళ్లాను
- భోజనం చేస్తున్నప్పుడే సమస్యల గురించి వివరించాను
- కొందరు నిర్మాతలు, దర్శకులు, ఫిలిం చాంబర్ ప్రతినిధులు సీఎంతో మాట్లాడమని కోరితేనే ముందుకొచ్చా
- అప్పటి సినిమాటోగ్రఫీ మంత్రి పేర్ని నానితో మాట్లాడి సీఎం జగన్ అపాయింట్‌మెంట్ కోరాను
- నన్ను ముందుగా ఇంటికి భోజనానికి సాదరంగా ఆహ్వానించారు
- ప్రభుత్వానికి, సినీ పరిశ్రమకు మధ్య గ్యాప్ ఉందనుకుంటున్నారని జగన్‌కు చెప్పాను
- ఆ తర్వాత సినీ ప్రతినిధులతో కలిసి రావాలని మంత్రి నాని నాకు ఫోన్ చేశారు
- అప్పట్లో బాలకృష్ణ అందుబాటులోకి రాలేదు
- నా చొరవ వల్లే సినిమా టికెట్ల ధరలు పెరిగాయి
- మీ వీరసింహా రెడ్డి అయినా, నా వాల్తేరు వీరయ్య సినిమాకైనా టికెట్ రేట్లు పెంచడానికి అదే కారణమైంది



సాక్షి, అమరావతి: సినీ పరిశ్రమలో సమస్యలపై చర్చించేందుకు గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను సాదరంగా ఆహ్వానించినట్లు సినీ నటుడు చిరంజీవి స్పష్టం చేశారు. అసలు వైఎస్ జగన్ ఆహ్వానం మేరకే ఆయన నివాసానికి వెళ్లినట్లు తెలిపారు. భోజనం చేస్తున్న సమయంలోనే తాను సినీ పరిశ్రమ ఇబ్బందుల్ని అప్పటి సీఎం జగన్‌కు వివరించినట్లు స్పష్టం చేశారు. గురువారం శాసనసభలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడిన అంశంపై ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ స్పందిస్తూ తన ప్రస్తావన తీసుకురావడంపై స్పందిస్తూ చిరంజీవి ఓ ప్రకటన విడుదల చేశారు. ''అసెంబ్లీలో కామినేని శ్రీనివాస్ చెప్పినట్లు చిరంజీవి గట్టిగా అడిగితే అప్పుడు ఈయన వచ్చాడు అన్నది అబద్ధం. గట్టిగా ఎవడూ అడగలేదు అక్కడ. ఆయనంత గట్టిగా చెబితే ఈయన దిగొచ్చాడంట. లేకపోతే సినిమాటోగ్రఫీ మినిస్టరును కలవండన్నాడట.. అంటూ బాలకృష్ణ ఒకింత వ్యంగ్యంగా చెప్పడాన్ని నేను టీవీ చానల్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూశాను. ఈ అంశంలో నా పేరు ప్రస్తావనకు వచ్చినందుకు ప్రజలకు వివరణ ఇవ్వాలనుకుంటున్నా'' అంటూ చిరంజీవి స్పందించారు. ఇంకా ఏం చెప్పారంటే..

నన్ను చొరవ తీసుకోమన్నారు..

రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉన్నప్పుడు తెలుగు సినీ పరిశ్రమకు చెందిన కొందరు నిర్మాతలు, దర్శకులు, ఫిలిం చాంబర్ ప్రతినిధులు నా వద్దకు వచ్చారు. సినీ నిర్మాణ వ్యయం పెరుగుతున్న దృష్ట్యా సినిమా టికెట్ల ధరల పెంపుదల గురించి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడితే బాగుంటుందని, అందుకు చొరవ తీసుకోవాలని కోరారు. అప్పుడు రాజమౌళి, కొరటాల శివ, త్రివిక్రమ్ శ్రీనివాస్, మహేష్, ఎన్టీ రామారావు, డీవీవీ దానయ్య, మైత్రి మూవీస్.. ఇంకా ఇద్దరు, ముగ్గురు ప్రముఖులు నా దగ్గరకు వచ్చారు. వారి సూచనల మేరకు నేను అప్పటి రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి పేర్ని నానితో ఫోన్‌లో మాట్లాడాను. టికెట్ల ధరల విషయం సీఎంతో మాట్లాడి చెబుతానన్నారు.

సీఎం ఆహ్వానం మేరకే ఇంటికి వెళ్లాను

అప్పటి మంత్రి పేర్ని నాని ఓ రోజు ఫోన్ చేసి 'ముఖ్యమంత్రి ముందు మీతో వన్ టు వన్ కలుస్తానని చెప్పారు. భోజనానికి (లంచ్‌కి) రావాలని చెప్పారు' అంటూ అపాయింట్‌మెంట్ ఇచ్చారు. సీఎం జగన్ ఆహ్వానం మేరకు నేను ఆయన నివాసానికి వెళ్లాను. నన్ను ఎంతో సాదరంగా ఆహ్వానించారు. భోజనం చేస్తున్న సమయంలోనే నేను సినీ పరిశ్రమ ఇబ్బందుల్ని వారికి వివరించాను. ఇండస్ట్రీకి, మీకు మధ్య గ్యాప్ ఉందని అందరూ అనుకుంటున్నారని, సమయం ఇస్తే అందరం కలిసి వస్తామని ఆయనకు తెలిపాను. కొన్ని రోజుల తర్వాత మంత్రి నాని నాకు ఫోన్ చేసి కోవిడ్ రెండో దశ కొనసాగుతున్నందున ఐదుగురు మాత్రమే వస్తే బాగుంటుందని చెప్పారు. నేనప్పుడు ఓ పది మంది వస్తామని చెబితే సరేనన్నారు. డేట్ ఫిక్స్ చేశారు. అప్పుడు నేను బాలకృష్ణను ఫోన్ ద్వారా సంప్రదించడానికి ప్రయత్నిస్తే అందుబాటులోకి రాలేదు. జెమిని కిరణ్‌ను వెళ్లి బాలకృష్ణను కలవమని చెప్పాను. ఆయన మూడుసార్లు ప్రయత్నించినా బాలకృష్ణను కలవలేకపోయారు. దీంతో నేను ఒక ఫ్లైట్ ఏర్పాటు చేసి ఆర్.నారాయణమూర్తితో సహా కొంత మందిని తీసుకుని వెళ్లి సీఎం జగన్‌ను కలిశాం.

నా చొరవతోనే టికెట్ ధరల పెంపు సాధ్యమైంది

సినీ ప్రముఖుల అందరి సమక్షంలోనే నాటి సీఎం వైఎస్ జగన్‌కు పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని వివరించి సహకారం అందించాలని కోరాను. అందుకు అక్కడున్న వారందరూ సాక్ష్యం. నేను ఆ చొరవ తీసుకోవడం వల్లే అప్పుడు ప్రభుత్వం సినిమా టికెట్ల ధరల పెంపుదలకు అంగీకరించింది. ఆ నిర్ణయం సినీ పరిశ్రమకు ఎంతో కొంత మేలు చేసింది. ఆ నిర్ణయంతో మీ వీరసింహారెడ్డి సినిమాకైనా, నా వాల్తేరు వీరయ్య సినిమాకైనా టికెట్ రేట్లు పెంచడానికి కారణమైంది. తద్వారా ఇటు నిర్మాతలకు, అటు డిస్ట్రిబ్యూటర్లకు, ఎగ్జిబిటర్లకు లాభం చేకూరింది. నేను రాష్ట్ర ముఖ్యమంత్రితోనైనా, సామాన్యుడితోనైనా నా సహజ సిద్ధమైన ధోరణిలోనే గౌరవం ఇచ్చిపుచ్చుకునే విధానంలోనే మాట్లాడతా. నేను ఇండియాలో లేను. అందుకే ప్రకటన విడుదల చేస్తున్నాను.

● బాబు - బాలయ్య నిజస్వరూపం బట్టబయలు

'వాడెవడు..?'

చిరంజీవిని తూలనాడిన బాలకృష్ణ

- అసెంబ్లీ వేదికగా మెగాస్టార్‌కు దారుణ అవమానం
- కనీసం వారించని, అడ్డుచెప్పని డిప్యూటీ స్పీకర్ రఘురామ
- అభ్యంతరం చెప్పని అధికార పక్షం
- సభలోనే ఉన్నా.. తప్పుబట్టని సీఎం చంద్రబాబు
- అది టీడీపీ విధానమేనని శాసనసభ వేదికగా సంకేతాలు
- గతంలోనూ ఎన్నోసార్లు చిరంజీవిని కించపరిచిన టీడీపీ
- 'అలగా జనం..' అంటూ కాపు సామాజికవర్గాన్ని దారుణంగా అవమానించిన బాలకృష్ణ
- జనసేన కార్యకర్తలను 'సంకర జాతి..' అని దూషించిన బాలయ్య
- తాజాగా అసెంబ్లీలోనే చిరంజీవికి దారుణ అవమానం
- బాలయ్య తీరుపై రగిలిపోతున్న చిరు అభిమానులు, కాపు సామాజికవర్గం
- వైఎస్సార్‌సీపీ హయాంలో చిరంజీవిని గౌరవించిన అప్పటి సీఎం వైఎస్ జగన్
- అదే విషయాన్ని తాజాగా వెల్లడించి గుర్తు చేసుకున్న చిరంజీవి
- 2004లో తన ఇంట్లోనే ఇద్దరిపై రివాల్వర్‌తో కాల్పులకు తెగబడిన బాలకృష్ణ
- ఆయనకు మెంటల్ ఉందని సర్టిఫికెట్ జారీ చేసిన నిమ్స్ డైరెక్టర్ కాకర్ల సుబ్బారావు
- ఎన్టీఆర్‌తో ఉన్న సాన్నిహిత్యంతో బాలకృష్ణకు సహకారం
- అయినా కాకర్లను 'బసవతారకం ట్రస్ట్' నుంచి తొలగించిన బాలకృష్ణ
- బాలకృష్ణ కాల్పుల కేసులో కక్ష సాధింపు చర్యలకు ఒడిగట్టని నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి
- అదీ వైఎస్సార్ ఔదార్యమని గుర్తు చేస్తున్న పరిశీలకులు

సాక్షి, అమరావతి:

'వాడెవడు....?'

ఇదీ చిరంజీవిని ఉద్దేశించి నందమూరి బాలకృష్ణ గురువారం శాసనసభలో చేసిన వ్యాఖ్య!

మెగాస్టార్ చిరంజీవిపై ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు సర్వత్రా తీవ్ర కలకలం సృష్టించాయి. బావ చంద్రబాబు మనసులో మాటనే బావమరిది బాలకృష్ణ వెల్లడించారన్నది స్పష్టమైంది. అందుకే సభలో అధికార కూటమి సభ్యులు ఎవరూ వ్యతిరేకించ లేదు. స్పీకర్ స్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు దీనిపై కనీసం అభ్యంతరం వ్యక్తం చేయలేదు. సీఎం చంద్రబాబు కూడా మౌనముద్ర దాల్చి బాలయ్య వ్యాఖ్యలను పరోక్షంగా సమర్థించారు. తద్వారా చిరంజీవి గురించి టీడీపీ అధికారిక విధానమే అదని శాసనసభ వేదికగా సంకేతాలిచ్చారు. బాలకృష్ణ వ్యాఖ్యలు మీడియాలోనూ, సోషల్ మీడియాలోనూ వైరల్‌గా మారాయి. చంద్రబాబు, బాలకృష్ణ గతంలో చిరంజీవిని అవమానించిన ఉదంతాలను అందరూ గుర్తు చేస్తున్నారు. కాపు సామాజిక వర్గాన్ని దూషించిన మాటలను ప్రస్తావిస్తున్నారు. అదే సమయంలో వైఎస్సార్‌సీపీ హయాంలో చిరంజీవిని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించి గౌరవించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. వెరసి బాలకృష్ణ శాసనసభలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. బాలయ్య తీరుపై చిరు అభిమానులు, కాపు సామాజికవర్గం రగిలిపోతోంది.

బాబు మనసులో మాట బాలయ్య నోట..

రాజకీయ వ్యూహంతోనే చిరుపై అభ్యంతరకర వ్యాఖ్యలు

మెగాస్టార్ చిరంజీవిని పదే పదే అవమానించడం టీడీపీ విధానమన్నది మరోసారి స్పష్టమైంది. 2024 ఎన్నికల ముందు గత్యంతరం లేక కుట్రపూరిత మౌనం వహించిన చంద్రబాబు, బాలకృష్ణ ప్రస్తుతం ఏరు దాటాక చిరంజీవిని బోడి మల్లన్నను చేశారు. అందుకే సందర్భం కాకపోయినా సరే బాలకృష్ణ శాసనసభ వేదికగా చిరంజీవిని అవమానిస్తూ వ్యాఖ్యలు చేశారు. మెగాస్టార్, కేంద్ర మాజీ మంత్రి అనే కనీస గౌరవం కూడా లేకుండా 'వాడెవడు..?' అంటూ దిగజారుడు వ్యాఖ్యలు చేశారు. ఈ శాసనసభ సమావేశాల్లో ఇప్పటివరకు మాట్లాడని బాలకృష్ణ గురువారం హఠాత్తుగా లేచి చిరంజీవిని అవమానించడం వెనుక టీడీపీ రాజకీయ వ్యూహం ఉన్నట్లు స్పష్టమవుతోంది. లేదంటే చర్చ సినిమా రంగం అభివృద్ధి అంశం వరకే పరిమితమై ఉండేది. సినిమా రంగంపై చర్చ కాదని, చిరంజీవిని మరోసారి అవమానించడమే తమ లక్ష్యమని బాలకృష్ణ ద్వారా టీడీపీ చాటి చెప్పింది.

గతంలోనూ చిరంజీవికి ఎన్నోసార్లు అవమానం

జనసేన, కాపు సామాజికవర్గంపై అనుచిత వ్యాఖ్యలు

అదే బాబు, బాలయ్య విధానం

చంద్రబాబు, బాలకృష్ణ గతంలో కూడా చాలాసార్లు చిరంజీవిని అవమానించారు. 2014-19లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో చిరంజీవిని అవమానించిన ఉదంతాన్ని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. ఓ కార్యక్రమంలో చంద్రబాబు, బాలకృష్ణ మొదటి వరుస కుర్చీల్లో కూర్చుని ఉండగా.. చిరంజీవి ఓ మూలన నిలబడే కార్యక్రమాన్ని వీక్షించిన దృశ్యాలు వైరల్‌గా మారాయి. మెగాస్టార్ చిరంజీవికి కనీసం కూర్చునేందుకు కుర్చీ కూడా ఇవ్వకుండా నిలబెట్టడం విభ్రాంతి కలిగించింది. ఇక గతంలో పలు బహిరంగ సభల్లో పీఆర్పీ, జనసేన పార్టీల కార్యకర్తలను, కాపు సామాజికవర్గాన్ని బాలకృష్ణ దూషిస్తూ మాట్లాడిన మాటలు కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. జనసేన పార్టీ కార్యకర్తలను ఓసారి 'అలగా జనం..' అని బాలకృష్ణ దూషించారు. మరోసారి 'సంకర జాతి... కొడుకులు..' అని కూడా పరుష పదజాలంతో దుర్భాషలాడిన వైనాన్ని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. చిరంజీవి మాతృమూర్తి గురించి కూడా టీడీపీ నేతలు, కార్యకర్తలు అవమానకరంగా వ్యాఖ్యలు చేశారు. తాజాగా చిరంజీవిని ఉద్దేశించి బాలకృష్ణ శాసనసభలో అవమానకరంగా మాట్లాడారు. ఇలా ప్రతిసారి... సందర్భం కాకపోయినా దాన్ని సృష్టించి మరీ చిరంజీవిని, ఆయన కుటుంబాన్ని అవమానించడం చంద్రబాబు, బాలకృష్ణతోపాటు యావత్ టీడీపీ అధికారిక రాజకీయ విధానంగా మారిందన్నది సుస్పష్టం.

మానసిక రోగిగా సర్టిఫికెట్ తెచ్చుకున్న బాలయ్య

- 2004లో ఇద్దరిపై రివాల్వర్‌తో కాల్పులు
- కేసు నుంచి తప్పించుకునేందుకే మెంటల్ సర్టిఫికెట్


బాలకృష్ణ మానసిక రోగే: వైద్యులు

బాలకృష్ణ మానసిక రోగి అని హైదరాబాద్ నిమ్స్, ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రి వైద్యులు నిర్ధారించినప్పుడు ప్రచురించిన కథనం

తాజా పరిణామాల నేపథ్యంలో బాలకృష్ణ మానసిక రోగి అనే విషయం మరోసారి సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. 2004లో హైదరాబాద్‌లో తన సన్నిహితులైన నిర్మాత బెల్లంకొండ సురేశ్, సిద్ధాంతి సత్యనారాయణ చౌదరిలపై ఆయన రివాల్వర్‌తో కాల్పులు జరిపారు. తన భార్య వసుంధర పేరుతో లైసెన్స్ ఉన్న రివాల్వర్‌తో తన నివాసంలోనే ఈ కాల్పులకు తెగబడ్డారు. అప్పట్లో ఆ కేసు నుంచి తప్పించుకునేందుకు బాలకృష్ణ అప్పటికప్పుడు నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. తరువాత ఆయన మానసిక్‌స్థితి సరిగా లేదని అప్పటి నిమ్స్ డైరెక్టర్ కాకర్ల సుబ్బారావు సర్టిఫికెట్ జారీ చేశారు. ఆయన ఎన్టీఆర్‌కు అత్యంత సన్నిహితుడు కావడం గమనార్హం. అమెరికాలో స్థిరపడ్డ కాకర్ల సుబ్బారావును ఆహ్వానించి హైదరాబాద్‌లోని నిమ్స్ డైరెక్టర్‌గా నియమించింది ఎన్టీ రామారావే. ఆ అనుబంధంతోనే బాలకృష్ణను కాల్పుల కేసు నుంచి తప్పించేందుకు మెంటల్ సర్టిఫికెట్ జారీ చేయడానికి ఆయన సహకరించారని పరిశీలకులు చెబుతున్నారు. తనకు ఇంతగా సహకరించిన కాకర్ల సుబ్బారావును సైతం తరువాత బాలకృష్ణ అవమానించారు. బసవతారకం ట్రస్ట్ నుంచి ఆయన్ను తొలగించారు. టీడీపీ అనుకూల చానల్ ఇంటర్వ్యూలో కాకర్ల సుబ్బారావు వెల్లడించిన అంశాల వీడియో క్లిప్పింగులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

అభ్యంతరం చెప్పని బాబు... వారించని డిప్యూటీ స్పీకర్

బాలయ్య వ్యాఖ్యలకు టీడీపీ కూటమి అధికారిక ముద్ర

ముందస్తు వ్యూహంతోనే చిరంజీవిని అవమానించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు యావత్ అధికార కూటమి తమ వ్యవహారశైలి ద్వారా స్పష్టం చేసింది. అందుకే బాలకృష్ణ వ్యాఖ్యలపై శాసనసభాపక్ష నేత హోదాలో చంద్రబాబు కనీసం అభ్యంతరం వ్యక్తం చేయలేదు. ఆయన సభలోనే ఉన్నప్పటికీ అసలు ఆ విషయమే పట్టనట్లుగా వ్యవహరించారు. ఇక చిరంజీవిని అవమానిస్తూ బాలకృష్ణ మాట్లాడుతుంటే యావత్ అధికార కూటమి సభ్యుల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా అడ్డు చెప్పలేదు. కొందరు టీడీపీ సభ్యులు ముసిముసిగా నవ్వుతూ కనిపించడం గమనార్హం. తద్వారా ఆ వ్యాఖ్యలను అధికార కూటమి సభ్యులు బహిరంగంగానే సమర్థించారు. ఇక స్పీకర్ స్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కూడా బాలకృష్ణ వ్యాఖ్యలను అడ్డుకునేందుకు, వారించేందుకు కనీసం ప్రయత్నించ లేదు. ఆయన మైక్‌ను కట్ చేయనూ లేదు. ఆ వ్యాఖ్యలు అభ్యంతరకరమని, సభలో లేనివారి గురించి మాట్లాడటం సరికాదని వారించలేదు. అంతేకాదు.. బాలకృష్ణ తన ప్రసంగం ముగించిన తరువాత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పందిస్తూ 'వెరీ గుడ్ సర్..' అని అభినందించడం గమనార్హం. అంటే చిరంజీవిని అవమానించడం టీడీపీ అధికారిక విధానమేనని శాసనసభ సాక్షిగా విస్పష్టంగా ప్రకటించారు.

సైకో కాబట్టే నీకు మెంటల్ సర్టిఫికెట్

సైకో కాబట్టే ఇంటికి వచ్చిన స్నేహితుడిపై కాల్పులు జరిపావు...


బాలకృష్ణపై వైఎస్సార్‌సీపీ నేతల ఫైర్

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

బాలకృష్ణకు సైకియాట్రి సమస్య ఉంది

అలాంటి వారు ఎదుటి వారిని ఏమైనా చేస్తారు.. లేదా వారే ఆత్మహత్య చేసుకోవడానికి వెనుకాడరు

ఓ చానల్ ఇంటర్వ్యూలో డాక్టర్ కాకర్ల సుబ్బారావు వెల్లడి



సాక్షి, అమరావతి: హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ గురువారం అసెంబ్లీ వేదికగా నోరు పారేసుకున్న నేపథ్యంలో ప్రముఖ రేడియాలజిస్ట్, హైదరాబాద్‌లోని నిమ్స్ (నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) మొట్టమొదటి డైరెక్టర్ డాక్టర్ కాకర్ల సుబ్బారావు కొన్నేళ్ల క్రితం ఓ న్యూస్ చానల్ ఇంటర్వ్యూలో బాలకృష్ణ మానసిక స్థితిపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. బాలకృష్ణ తన ఇంటికి వచ్చిన స్నేహితులిద్దరిపై రివాల్వర్‌తో కాల్పులు జరిపిన ఘటనలో తానే కాపాడానని కాకర్ల ఆ ఇంటర్వ్యూలో చెప్పారు. 'కాల్పులు జరిపిన విషయం నా దృష్టికి వచ్చింది. అలాంటి స్థితిలో ఉన్న వారు ఎదుటి వారిని ఏమైనా చేస్తారు.. లేదంటే వారే ఆత్మహత్య చేసుకోవడానికి కూడా వెనుకాడరని మా సైకియాట్రిస్టులు నాతో చెప్పారు. ఆ రోజు అలా నేను ఆయన్ను కాపాడాను. అది మేజర్ హెల్ప్. లేదంటే ఆయన పెద్ద నేరంలో ఇరుక్కునే వారన్నది నిజమే'అని గుర్తు చేసుకున్నారు. అయితే ఇంతగా సాయపడిన డాక్టర్ కాకర్లను చంద్రబాబు-బాలకృష్ణ కుటుంబం తీవ్రంగా అవమానించిందనే విషయాన్ని ఇంటర్వ్యూ చేస్తున్న జర్నలిస్ట్ గుర్తు చేశారు. అది నిజమేనని.. బాలకృష్ణకు బసవ తారకం ట్రస్ట్‌ను కట్టబెట్టాలనే ఆత్రంతో అలా చేశారన్నారు. అయినా ఇప్పుడు ఆ విషయాలన్నీ వదిలేద్దామని, తనకు ఎలాంటి కోపం లేదని చెప్పుకొచ్చారు. కాగా, విదేశాల్లో ప్రముఖ వైద్యునిగా సేవలందిస్తున్న డాక్టర్ కాకర్లను మాజీ సీఎం ఎన్టీ రామారావు నిమ్స్ తొలి డైరెక్టర్‌గా నియమించారు. అందువల్ల ఎన్టీఆర్ కుటుంబంపై కృతజ్ఞతతో కాకర్ల అప్పుడు ఆ సహాయం చేశారు.

సర్కారువారి మెట్రో

▶ మొదటి పేజీ తరువాయి

పంపగా ఎల్ అండ్ టీ యాజమాన్యం మాత్రం మెట్రో నిర్వహణ భారం, ఆర్థిక నష్టాల నేపథ్యంలో రెండో దశలో భాగం కాబోమని.. తొలి దశ నుంచి సైతం వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు గత నెలలోనే ప్రకటించింది. ఇదే విషయాన్ని సీఎంకు తాజా భేటీలో పునరుద్ఘాటించింది. 'మెట్రో'ను నడిపించడం తమ వల్ల కాదని.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టే రెండో దశలోని 2ఏ, 2 బీ ప్రాజెక్టులో భాగస్వామిగా చేరడం సాధ్యం కాదని ఎల్ అండ్ టీ సీఎండీ ఎస్.వి. సుబ్రమణ్యన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి స్పష్టం చేశారు. అయితే కనీసం మొదటి దశ, రెండో దశ మధ్య ఆపరేషనల్ ఇంటిగ్రేషన్, రెవెన్యూ, కాస్ట్ షేరింగ్ కోసం స్పష్టమైన ఒప్పందమైనా కుదుర్చుకోవాలని సీఎం కోరినప్పటికీ అందుకు ఎల్ అండ్ టీ సీఎండీ ససేమిరా అన్నారు. తాము పూర్తిగా రవాణా కార్యకలాపాల నిర్వహణ రంగం నుంచి బయటకు రావాలని నిర్ణయించుకున్నందున కొత్త ప్రాజెక్టులు, ఒప్పందాలు చేసుకోవట్లేదని ఎస్.వి. సుబ్రమణ్యన్ తేల్చిచెప్పారు. తమ సంస్థకు ఉన్న అప్పులు, ఈక్విటీ చెల్లిస్తే తొలిదశ ప్రాజెక్టును ప్రభుత్వానికి అప్పగించేందుకు సిద్ధమని ప్రతిపాదించారు. 2022 జూన్ 7న కుదుర్చుకున్న అదనపు రాయితీ ఒప్పందం ప్రకారం రూ. 3 వేల కోట్లు వడ్డీరహిత రుణంగా ప్రభుత్వం ఇస్తామన్న మొత్తంలో ఇంకా రూ. 2,100 కోట్లు అందాల్సి ఉందన్నారు. అలాగే రూ. 5,900 కోట్ల ఈక్విటీ విలువ కింద చెల్లించాలని కోరారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మెట్రో తొలిదశ ప్రాజెక్టును పూర్తిగా తీసుకోవడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా బదలాయింపు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావును ఆదేశించారు. ఈ సమావేశంలో పట్టణ రవాణా సలహాదారు ఎన్వీఎస్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎంఏ అండ్ యూడీ కార్యదర్శి కె. ఇలంబరితి, హెచ్ఎంఆర్ఎల్ ప్రిన్సిపల్ కార్యదర్శి సర్ఫరాజ్ అహ్మద్, సీఎంవో ముఖ్య కార్యదర్శి వి. శేషాద్రి, సీఎంవో కార్యదర్శి కె. మాణిక్యరాజ్, ఎల్‌టీఎంఆర్‌హెచ్ఎల్ ఎండీ అండ్ సీఈవో కె.వి.బి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎల్ అండ్ టీ సీఎండీ ఎస్.వి. సుబ్రమణ్యన్

అప్పుల భారం పెరగడంతో..

ఎల్ అండ్ టీ మెట్రో రైల్ తాజా వార్షిక నివేదిక ప్రకారం సంస్థకు కార్యకలాపాలు, ఇతర మార్గాల ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ. 1,108.54 కోట్ల ఆదాయం సమకూరింది. ఇది అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన రూ. 1,399.31 కోట్ల ఆదాయం కంటే 21 శాతం తక్కువ. అలాగే 2024-25లో పన్నుల చెల్లింపునకు ముందు రూ. 625.88 కోట్ల నష్టం నమోదవగా అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఈ నష్టం రూ. 555.04 కోట్లుగా నమోదైంది. మెట్రో రైల్ తొలి దశ ప్రాజెక్టు కోసం ఎల్ అండ్ టీ 2010 సెప్టెంబర్‌లో అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వంతో రాయితీ ఒప్పందం కుదుర్చుకొని 2011 మార్చిలో ప్రాజెక్టు ఫైనాన్షియల్ క్లోజర్‌ను పూర్తిచేసింది. తొలి దశ ప్రాజెక్టుకు ఎస్‌బీఐ ఆధ్వర్యంలోని 10 బ్యాంకుల కన్సార్షియం రుణం మంజూరు చేసింది. అయితే ప్రాజెక్టులో జాప్యంతో వ్యయ భారం పెరగడంతో తమకు రూ. 3,756 కోట్లను తిరిగి చెల్లించాలని ఎల్ అండ్ టీ మెట్రో రైల్ 2017 మార్చిలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. అయితే 2020 ఫిబ్రవరిలో మెట్రో తొలి దశ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే నాటికి ఎల్ అండ్ టీ మెట్రో రైల్‌పై ఆర్థిక భారం రూ. 5 వేల కోట్లకు పెరిగింది.

జల సంచాయ్ జన భాగీదారీ 1.0లో తెలంగాణ నంబర్ వన్

సాక్షి, హైదరాబాద్/ సాక్షి ప్రతినిధి, మంచిర్యాల : కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రకటించిన 'జల సంచాయ్ జన భాగీదారీ 1.0 ర్యాంకుల్లో వర్షపు నీటి సంరక్షణ పనుల్లో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానాన్ని సాధించింది. 2024-25లో రాష్ట్రవ్యాప్తంగా 5,20,362 వర్షపు నీటి సంరక్షణ పనులు చేపట్టిన తెలంగాణ...ఈ రంగంలో దేశంలోనే అత్యధిక పనులు నిర్వహించిన రాష్ట్రంగా నిలిచింది. చెక్‌డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, సోక్ పిట్స్, రూఫ్‌టాప్ రైన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్, బోర్‌వెల్ రీచార్జ్, చెక్‌డ్యామ్స్, సబ్-సర్ఫేస్ డైక్స్, ఫార్మ్ పాండ్స్, పర్కొలేషన్ ట్యాంకులు వంటి అనేక పనులను చేపట్టి విజయవంతంగా పూర్తిచేసింది. జల సంచాయ్ జన భాగీదారీ 1.0 లో దేశ వ్యాప్తంగా 67 జిల్లాలు ఎంపికవ్వగా...రాష్ట్రానికి చెందిన 8 జిల్లాలకు ప్రత్యేక గుర్తింపు లభించింది.

జిల్లాల పేరు	క్యాష్ రివార్డు
ఆదిలాబాద్, నల్లగొండ, మంచిర్యాల	రూ. 2 కోట్లు
వరంగల్, నిర్మల్, జనగాం	రూ. కోటి
భద్రాద్రి, మహబూబ్‌నగర్	రూ. 25 లక్షలు

నిర్వాసిత రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- మంత్రి పొంగులేటి
- గ్రీన్‌ఫీల్డ్ హైవేను పరిశీలించిన మంత్రి


అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి పొంగులేటి. పక్కన కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యేలు రాగమయి, రాందాస్ తదితరులు

పెనుబల్లి/కల్లూరు/వైరా: ఖమ్మం - దేవరపల్లి మధ్య నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం భూములు ఇచ్చిన రైతులకు సౌకర్యాలు కల్పించాలే తప్ప వారిని ఇబ్బంది పెట్టొద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. రహదారి నిర్మాణంలో భాగంగా అవసరమైన చోట సర్వీస్ రోడ్లు లేకపోవడం, చిన్న బ్రిడ్జిల నిర్మాణంతో ఇబ్బందులు ఎదురవుతాయని ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలోని పలు గ్రామాల రైతులు ఇటీవల నిరసన తెలిపారు. దీంతో సమస్యను ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన గురువారం కలెక్టర్ అనుదీప్, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు రాగమయి, రాందాస్, ఎన్‌హెచ్ఏఐ పీడీ దివ్యతో కలిసి హైవేను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పనులు పూర్తికాకుండానే అయినట్లు పేపర్లలో చూపించడం సరికాదన్నారు. నిర్మాణం పూర్తిచేసి, అన్ని సమస్యలను పరిష్కరించాకే సర్టిఫికెట్ జారీ చేయాలని అధికారులకు సూచించారు. లేనిపక్షంలో అందరూ ఇబ్బంది పడతారని మంత్రి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, మార్కెట్ల చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు. వైరా మండలం స్టేజీ పినపాక వద్ద హైవే, సర్వీస్ రోడ్డును సైతం మంత్రి పొంగులేటి పరిశీలించారు. ఖమ్మం నుంచి వేంసూరు వరకు రైతులకు ఇబ్బంది లేకుండా సర్వీసు రోడ్లు నిర్మించడంతో పాటు స్టేజీ పినపాక నుంచి కేజీ సిరిపురం వరకు రోడ్డును మరమ్మతు చేయించాలని అధికారులను ఆదేశించారు.

24 గంటల్లో చర్యలు తీసుకుంటాం

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, చెల్లింపుల విషయంలో అవినీతికి పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించబోమని, పేదవాడి నుంచి పైసా వసూలు చేసినా సహించబోమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఇందిరమ్మ నిర్మాణదారులు నిర్భయంగా 1800 599 5991 ఇందిరమ్మ కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేసిన 24 గంటల్లోపే దోషులపై చర్యలు తీసుకుంటామని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే పలువురు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ కార్యదర్శులపై వేటు పడిందని, రంగారెడ్డి జిల్లా మాజిద్‌పూర్ గ్రామ కార్యదర్శిపై విచారణకు ఆదేశించామన్నారు. నాగర్‌కర్నూలు జిల్లా తాండూరు మండలం సిర్సవాడ గ్రామానికి చెందిన ఏదుల భీమమ్మ అనే ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు చేపట్టిన ఇంటి నిర్మాణానికి అడ్డుపడుతూ, ఆమెను బెదిరించి డబ్బు వసూలు చేసినట్లు అందిన ఫిర్యాదుపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాండూరు మండలంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడిపై క్రిమినల్ కేసు నమోదు చేశామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు లబ్ధిదారుల నుంచి లంచం అడిగే ఇందిరమ్మ కమిటీ సభ్యులను తక్షణం కమిటీ నుంచి తొలగించి క్రిమినల్ కేసు నమోదు చేయాలని అధికారులను ఇప్పటికే ఆదేశించామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మంత్రి ఆరోపించారు.

● యూత్ సక్సెస్‌మంత్ర

సుందర్ పిచాయ్

ఆ ప్రభావం ఊరకే పోదు



● 'ఎప్పుడూ కంఫర్ట్ జోన్‌లో మాత్రమే ఉండాలి' అని కోరుకోకండి. మిమ్మల్ని భయపెట్టే, ఇబ్బంది పెట్టే పరిస్థితుల్లోనూ పనిచేయడానికి రెడీగా ఉండండి. 'యస్... ఇలాంటి పరిస్థితులలో కూడా నేను పనిచేయగలిగాను' అనుకున్నప్పుడు వచ్చే సంతోషం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.

● తెలివైన వ్యక్తులు, కష్టపడే వ్యక్తులతో పనిచేసినప్పుడు ఆ ప్రభావం ఊరకే పోదు. మిమ్మల్ని మీరు తీర్చిదిద్దుకోవడానికి, తెలివైన నిర్ణయాలు తీసుకోవడానికి ఆ అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుంది.

● ఎంత పెద్ద విజేతలకైనా విమర్శకులు ఉంటారు. వాటిలో నిర్మాణాత్మక విమర్శలనే స్వీకరించాలి.

● ఒక రంగంలో విజయం సాధించాలంటే పాషన్ ఒక్కటే సరిపోదు. దానికి తగిన నైపుణ్యం, అంకితభావం కావాలి. ● కెరీర్‌కు సంబంధించిన నిర్ణయాలలో మీ ఇష్టాయిష్టాలే కీలకం. ఒక్క ముక్కలో చెప్పాలంటే కెరీర్ ఎంపికకు సంబంధించి మీ మనసు చెప్పే మాట వినండి.

● మీరు చేస్తున్న పని మీకు సంతోషాన్ని ఇస్తే, ఆ సంతోషమే మీరు విజయాలు సాధించడానికి ఇంధనం అవుతుంది ● జీవనశైలికి సంబంధించిన ఉన్నతప్రమాణాలు, నేర్చుకోవాలనే ఉత్సాహం మిమ్మల్ని ముందుకు నడిపిస్తాయి ● మీరు కొత్తగా కెరీర్ మొదలు పెట్టారా? అయితే మీ కోసం సవాళ్లు ఎదురుచూస్తూ ఉండవచ్చు. ఆ సవాళ్లను అధిగమించే శక్తి మీలో ఉండాలంటే ఎప్పుడూ వెనక్కి తగ్గవద్దు. కొత్త విషయాలు నేర్చుకోవడం మరవద్దు.

English Idioms

రెడ్ లెటర్ డే

ముఖ్యమైన రోజు అని చెప్ప డానికి ఉపయోగించే మాట... రెడ్‌లెటర్ డే.
ఉదా: టుడే వాజ్ ఏ రెడ్-లెటర్ డే ఇన్ అవర్ హిస్టరీ

రీ ఇన్వెంట్ ది వీల్

'ఈ పని అనవసరం, వృథా' అని చెప్పే సందర్భంలో ఉపయోగించే మాట... రీ ఇన్వెంట్ ది వీల్.
ఉదా: యూ డోన్ట్ నీడ్ టు రీ ఇన్వెంట్ ది వీల్

సాల్ట్ ఆఫ్ ది ఎర్త్

ప్రజలు కష్టాల్లో ఉంటే సహాయం చేసే వ్యక్తి, మహనీయుడిగా గౌరవించే వ్యక్తికి సంబంధించి వాడే మాట... సాల్ట్ ఆఫ్ ది ఎర్త్
ఉదా: డొక్కా సీతమ్మ ఈజ్ ది సాల్ట్ ఆఫ్ ది ఎర్త్. షీ ఈజ్ ది ఫస్ట్ టు హెల్ప్ ఎనీవన్ ఇన్ ట్రబుల్

● స్ట్రాటజి

జాబ్ మార్కెట్‌లో విపరీతంగా పోటీ ఉండడం వల్ల ఉద్యోగం రావడం అంతా ఆషామాషీ విషయం కాదు. కాని కొందరికి మాత్రం ఇట్టే ఉద్యోగాలు వస్తాయి. అలాంటి వారిలో షారన్ మెల్జర్ ఒకరు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఉద్యోగాన్ని సొంతం చేసుకొని 'వావ్' అనిపించింది. తన విజయరహస్యం గురించి 'లింక్డ్ ఇన్'లో పంచుకుంది.

ఇలా చేస్తే... ఉద్యోగం మీదే!



➡ 'ఒక ఉద్యోగానికి మనం దరఖాస్తు చేసుకున్నామంటే ఈ ఉద్యోగం కచ్చితంగా నాదే' అనే ఆత్మవిశ్వాసంతో ఉండాలి అంటుంది షారన్ మెల్జర్.

➡ ఒక సోషల్ మీడియాలో కమ్యూనిటీ మేనేజర్ పోస్ట్‌కు దరఖాస్తు చేసుకుంది షారన్. దరఖాస్తు చేసుకున్న వారిని కొత్త ఎడ్యుకేషనల్ ప్రోగ్రామ్‌కు సంబంధించి కంటెంట్ స్ట్రాటజీని సబ్‌మిట్ చేయాల్సిందిగా కంపెనీ అడిగింది. చాలామంది బేసిక్ డాక్యుమెంట్‌ను సమర్పించారు. షారన్ మాత్రం రెండు అడుగులు ముందు వేసింది. అత్యంత వివరంగా, సృజనాత్మకంగా కంటెంట్ ప్లాన్ తయారుచేసింది. తన ఐడియాలకు సంబంధించి వీడియో ప్రెజెంటేషన్‌ను రూపొందించింది.

మిగిలిన రెజ్యూమ్‌లతో పోల్చితే షారన్ రెజ్యూమ్ ప్రత్యేకంగా కనిపించింది. ఆమెకు ఉద్యోగం వచ్చేలా చేసింది. 'ఎక్స్‌ట్రా ఎఫర్ట్ అనేది ఎప్పుడూ మంచిదే' అంటుంది షారన్.

యువర్స్

● యంగ్ టాలెంట్

అప్పు చేసి ఇ-రిక్షా కొన్నాడు సుమిత్ తండ్రి. ఆ అప్పు తీరకుండానే ఆయన మంచం పట్టాడు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనుకున్న సుమిత్‌కు ఇ-రిక్షాయే దిక్కు అయింది. దిక్సూచి అయింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌కు చెందిన 22 సంవత్సరాల సుమిత్ ప్రజాపతి ఇ-రిక్షాను సోషల్ మీడియా సెంటర్‌గా చేసుకొని కంటెంట్ క్రియేషన్ చేస్తున్నాడు...



ఇదిగో ఇ-రిక్షా సోషల్ మీడియా సెంటర్!

గ్యాస్‌స్టవ్ వెలిగించే క్రమంలో సుమిత్ తండ్రి అగ్నిప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదం వల్ల అతడు రిక్షా నడపలేని పరిస్థితి. మరోవైపు రిక్షా కోసం చేసిన అప్పులు. 'ఏంచేయాలి?' అని ఆలోచిస్తూనే 'ఏదో ఒకటి చేయాలి' అని గట్టిగా నిర్ణయించుకున్నాడు.

పేదరికం వల్ల చిన్నప్పుడు పొలం పనులు, కూలీ పనులు చేశాడు సుమిత్. కార్లు కడిగాడు. కూరగాయలు అమ్మాడు. తన పేదరికం వల్ల చదువు ఆగిపోకూడదని ఎన్నో పనులు చేశాడు. 'సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనేది నా కల. అయితే విధి నిర్ణయం మరోలా ఉంది' అంటాడు సుమిత్.

తండ్రికి ఆసరాగా ఉండడానికి ఒకరి దగ్గర ఉద్యోగంలో చేరాడు. చెప్పిన జీతంలో సగం జీతం కూడా రాకపోవడంతో ఆ ఉద్యోగం మానేయ్యడమే కాదు ఇక ఎప్పుడూ ఉద్యోగం చేయకూడదనుకున్నాడు. చాలామంది యువకులలాగే సుమిత్ సోషల్ మీడియాలో చురుగ్గా ఉండేవాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో కంటెంట్ క్రియేట్ చేసేవాడు.

తండ్రి ప్రమాదానికి గురి కావడంతో ఇ-రిక్షా నడపాలనుకున్నాడు సుమిత్. 'ఇ-రిక్షా, సోషల్ మీడియాను ఒకే చోట చేరిస్తే' అనే దిశలో ఆలోచించాడు. కార్లు, బైక్‌లపై కంటెంట్‌ను క్రియేట్ చేసేవారు ఉన్నారు. ఇ-రిక్షాపై ఎవరు చేయలేదు కాబట్టి కొత్తగా ఉంటుంది అనుకున్నాడు.

'నా రిక్షాను స్టార్ ఎందుకు చేయకూడదు అనుకున్నాను' నవ్వుతూ గతాన్ని గుర్తు తెచ్చుకున్నాడు సుమిత్. కంటెంట్ క్రియేటర్‌గా అతడి వైరల్ మూమెంట్ గురించి చెప్పుకోవాలంటే...తన కుటుంబ సభ్యులు ఒక పెళ్లి వేడుకలో పాల్గొనడానికి సంబంధించిన వీడియో వైరల్ అయింది. మిలియన్ వ్యూస్ వచ్చాయి.

మొదట చిన్న లక్ష్యాలు... ఆ తరువాత పెద్ద లక్ష్యాలు

'ఇక నా పని అయిపోయినట్లే' అని నేను ఎప్పుడూ నిరాశపడలేదు. నిలదొక్కుకోవడం కోసం ఎంత చిన్న పనైనా చేయాలనుకున్నాను. కూలి పనులు కూడా చేశాను. ఒకేసారి పెద్ద లక్ష్యాలు పెట్టుకోలేదు. చిన్న చిన్న లక్ష్యాలు పెట్టుకున్నాను. ఒకదాని తరువాత ఒకటి నెరవేర్చుకుంటూ వెళ్లాను. అప్పుల భారంతో మా సొంత ఇంటిని అమ్ముకోవాల్సి వచ్చింది. తిరిగి ఆ ఇంటిని కొనాలనేది నా కల.
- సుమిత్ ప్రజాపతి



'చక్కగా ఉద్యోగం చేసుకోకుండా ఈ వీడియోలు ఏమిటి! నిన్ను ఎవరూ పెద్దగా పట్టించుకోరు. వెక్కిరిస్తారు' అని తండ్రి అన్నాడు.


కొన్ని అనుభవాల తరువాత ఆయన మాటలు వాస్తవం అనే విషయం అర్థమైంది. 'ప్రజలు చిన్న చూపు చూడకుండా, అభిమానించేలా కంటెంట్ క్రియేషన్ చేయాలి' అనుకున్నాడు. నవ్వించడానికి ఒకప్పుడు ఏవేవో వీడియోలు చేసిన సుమిత్ ఆ తరువాత రూట్ మార్చాడు. వ్యక్తిత్వ వికాస వీడియోలు చేయడం మొదలు పెట్టాడు. వాటికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. బ్రాండ్‌లకు సంబంధించి రిక్షాలో ప్రమోషన్ వర్క్ కూడా చేస్తుంటాడు.

'ఏ పనీ చిన్నది కాదు. మనం చేసే ప్రతి పని పెద్దదే. గౌరవనీయమైనదే'... ఇలాంటి మాటలెన్నో తన వ్యక్తిత్వ వికాస వీడియోల్లో వినిపిస్తుంటాడు సుమిత్. తాజా విషయానికి వస్తే...తనకు వచ్చే ఆదాయంతో సుమిత్ కుటుంబ అప్పులన్నీ తీర్చాడు. చెల్లిని చదివిస్తున్నాడు. సుమిత్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 80,000 మంది ఫాలోవర్స్ ఉన్నారు.

● టెక్... టాక్

హువావే మేట్‌పాడ్ 12 ఎక్స్ 2025

సైజ్	:	12 అంగుళాలు
రిఫ్రెష్ రేట్	:	144 హెచ్‌జడ్
రిజల్యూషన్	:	2800X1840 పిక్సెల్స్
ర్యామ్	:	12 జీబి
స్టోరేజ్	:	256 జీబి
బ్యాటరీ	:	10,100 ఎంఏహెచ్ బ్యాటరీ
బరువు	:	555 గ్రా.
కలర్స్	:	గ్రీన్, వైట్



కామెట్ వచ్చేసింది



తమ కంపెనీ ఏఐ బ్రౌజర్ 'కామెట్' మన దేశంలోని ప్రో సబ్‌స్క్రైబర్‌లకు అందుబాటులోకి వచ్చిందని 'పర్‌ప్లెక్సిటీ' తెలియజేసింది. ప్రస్తుతం ఇది మాక్, విండోస్ డివైజ్‌లలో మాత్రమే అందుబాటులో ఉంది. రకరకాల పనులు, రిసెర్చ్ కోసం ఇంటర్నెట్‌పై ఆధారపడే యూజర్‌లకు న్యూ బ్రౌజర్ టార్గెట్. ఈ ఏఐ ఆధారిత బ్రౌజర్ ద్వారా అవసరమైన సమాచారాన్ని సులువుగా పొందవచ్చు. దీని ద్వారా యూజర్‌లు ప్రొడక్ట్స్ కొనవచ్చు, మీటింగ్ షెడ్యూల్ చేయవచ్చు, వెబ్‌పేజీని ఈమెయిల్‌లోకి మార్చి పంపవచ్చు.

రియల్‌మీ పి3 ఆల్ట్రా



డిస్‌ప్లే: 6.83 అంగుళాలు
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
మెమోరీ: 128జీబి 8జీబి ర్యామ్/256జీబి 8జీబి ర్యామ్/256 జీబి 12జీబి ర్యామ్/512 జీబి 12జీబి ర్యామ్
ఫ్రంట్ కెమెరా: 16 ఎంపీ
కనెక్టివిటీ: 5జీ
బ్యాటరీ: 6000 ఎంఏహెచ్

సాక్షి సినిమా

ట్రైలర్ రెడీ



● ప్రభాస్

ఫ్యాన్స్‌కు దసరా ట్రీట్ రెడీ చేస్తున్నారు హీరో ప్రభాస్. ఫ్యాంటసీ అండ్ హారర్ కామెడీ జానర్‌లో ప్రభాస్ నటిస్తున్న తొలి చిత్రం 'ది రాజాసాబ్'. ఈ చిత్రంలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధీ కుమార్ హీరోయిన్లుగా నటిస్తుండగా, సంజయ్ దత్ ఓ లీడ్ రోల్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో వేసిన ఓ సెట్‌లో ప్రభాస్ పరిచయ పాట చిత్రీకరణ జరిగింది. కాగా, ఈ సినిమా తదుపరి షెడ్యూల్ గ్రీస్ దేశంలో జరుగుతుందని, అక్కడ ప్రభాస్‌తో పాటు లీడ్ హీరోయిన్స్ పాల్గొనగా కొన్ని పాటల చిత్రీకరణ జరుగుతుందని తెలిసింది. ఇటీవలే ఈ చిత్రదర్శకుడు మారుతి అక్కడి లొకేషన్స్‌ను పరిశీలించి వచ్చారు. ఇక ఈ దసరా పండక్కి, 'ది రాజాసాబ్' సినిమా ట్రైలర్ విడుదల కానుందని తెలిసింది. ఈ ట్రైలర్ సెన్సార్ పనులు కూడా పూర్తయ్యాయని, నిడివి మూడు నిమిషాలకు పైనే ఉంటుందని సమాచారం. ఇలా ఈ దసరా పండక్కి ఫ్యాన్స్‌కి విజువల్ ట్రీట్ ఇవ్వనున్నారు ప్రభాస్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 9న రిలీజ్ కానుంది. ఈ సినిమాకు సంగీతం: తమన్.

మార్కో దర్శకుడితో..?



● అజిత్

'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాతో సూపర్ సక్సెస్ అందుకున్నారు తమిళ హీరో అజిత్. అయితే అజిత్ నెక్ట్స్ చిత్రంపై ఇంకా క్లారిటీ రాలేదు. కాగా, 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమా తీసిన అధిక్ రవిచంద్రన్‌తోనే అజిత్ మళ్లీ ఓ సినిమా చేయనున్నారనే టాక్ కోలీవుడ్‌లో వినిపించింది. అయితే మలయాళ యాక్షన్ బ్లాక్‌బస్టర్ మూవీ 'మార్కో' ఫేమ్ హనీఫ్ అదేని డైరెక్షన్‌లో అజిత్ హీరోగా ఓ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం రూపొందనుందనే టాక్ తెరపైకి వచ్చింది. ఈ సినిమాను 'దిల్' రాజు నిర్మించనున్నారని, అజిత్‌తో ఆల్రెడీ 'దిల్' రాజు సంప్రదింపులు జరుపుతున్నారని తెలిసింది. ఇక హనీఫ్‌తో నిర్మాతలు 'దిల్' రాజు, శిరీష్, సునీత తాటి ఓ హై బడ్జెట్ మల్టీస్టారర్ సినిమాను నిర్మించనున్నట్లుగా ఈ ఏడాది మార్చిలో ఓ అధికారిక ప్రకటన వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. మరి... ఈ మల్టీస్టారర్ సినిమాలో అజిత్ హీరోగా చేస్తారా? లేక అజిత్‌తో సోలో సినిమాను నిర్మించేందుకు 'దిల్' రాజు సన్నాహాలు చేస్తున్నారా? అనే అంశాలపై త్వరలోనే స్పష్టత రానుంది.

వచ్చే ఏడాది స్టార్ట్



● ధనుష్

ధనుష్ హీరోగా వెట్రిమారన్ దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ డ్రామా మూవీ 'వడ చెన్నై' (2018) ఘనవిజయం సాధించింది. ఈ చిత్రకథలో రెండో భాగానికి అవకాశం ఉందని వెట్రిమారన్ పలు సందర్భాల్లో పేర్కొన్నారు. అప్పట్నుంచి 'వడ చెన్నై 2' అప్‌డేట్ కోసం ధనుష్ అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఇటీవల ఓ సందర్భంలో వెట్రిమారన్ సీక్వెల్ ఉంటుందని స్పష్టం చేశారు. తాజాగా తన 'ఇడ్లీ కడై' సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ధనుష్ కూడా ఈ సీక్వెల్ గురించి మాట్లాడారు. ''వడ చెన్నై 2' షూటింగ్‌ని 2026లో ఆరంభిస్తాం. 2027లో గ్రాండ్‌గా విడుదల చేస్తాం'' అని ధనుష్ పేర్కొన్నారు. మరి... తొలి భాగంలో నటించిన ఆండ్రియా, సముద్రఖని, ఐశ్వర్యా రాజేశ్ సీక్వెల్‌లోనూ నటిస్తారా? అనేది తెలియాల్సి ఉంది.


గోట్ ఫైట్‌తో...



● యువన్, రిధాన్

మట్టి రేసింగ్ నేపథ్యంలో డా. ప్రగభల్ దర్శకత్వంలో రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'మడ్డీ' మంచి విజయం సాధించింది. ప్రగభల్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'జాకీ'. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను గురువారం విడుదల చేశారు. మధురైలో సాంప్రదాయంగా కొనసాగుతున్న గోట్ ఫైట్ చుట్టూ సాగే కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ''గోట్ ఫైట్స్ మాత్రమే కాదు... ఈ చిత్రంలో అద్భుతమైన భావోద్వేగాలు ఉన్నాయి. మధురై సంస్కృతీ సంప్రదాయాలను అర్థం చేసుకుని, ఈ సినిమా తీయాలనే ఆలోచనతో 2022 నుంచి ఆ ప్రాంతంలో ఉంటున్నాను. మేకల సంరక్షకులతో కొద్ది రోజులు సావాసం చేశాను. వారితో, గోట్స్‌తో అనుబంధం పెంచుకున్నాను'' అని ప్రగభల్ తెలిపారు. యువన్ కృష్ణ, రిధాన్ కృష్ణన్, అమ్ము అభిరామి, మధుసూదన్ రావు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఉదయకుమార్, సంగీతం: శక్తి బాలాజీ.

ఓం నమః శివాయ



● సుధీర్ బాబు

సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ మూవీ 'జటాధర'. ఈ ద్విభాషా (తెలుగు, హిందీ) చిత్రానికి వెంకట్ కల్యాణ్ – అభిషేక్ జైస్వాల్ దర్శకులు. సోనాక్షి సిన్హా, దివ్య ఖోస్లా, శిల్పా శిరోద్కర్, ఇంద్రకృష్ణ, రవిప్రకాశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పణలో ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, శిల్పా సింఘాల్, నిఖిల్ నందా నిర్మిస్తున్న ఈ చిత్రం నవంబరు 7న విడుదల కానుంది. గురువారం ఫస్ట్ ట్రాక్ 'సోల్ ఆఫ్ జటాధర'ను విడుదల చేశారు. ఈ ట్రాక్‌లో 'ఓం నమః శివాయ' అంటూ వినిపిస్తుంది. రాజీవ్ రాజ్ కంపోజ్ చేసి, పాడారు. ''మంచికి-చెడుకి, వెలుగుకి-చీకటికి, మానవ సంకల్పానికి-విధికి మధ్య జరిగే అద్భుతమైన పోరాటాన్ని 'జటాధర' చిత్రం చూపించబోతోంది. పౌరాణిక ఇతివృత్తాలు, సూపర్ విజువల్స్‌తో ఈ సినిమా ప్రేక్షకులకు మంచి అనుభూతినిచ్చేలా ఉంటుంది'' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: జీ మ్యూజిక్ కో.

సీక్వెల్‌కి గ్రీన్ సిగ్నల్



● కరీనా కపూర్

బాలీవుడ్ 'క్రూ'లోకి మళ్లీ తిరిగొచ్చారట హీరోయిన్ కరీనా కపూర్. టబు, కరీనా కపూర్, కృతీ సనన్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'క్రూ'. రాజేశ్ ఎ. కృష్ణన్ దర్శకత్వం వహించిన ఈ కామెడీ డ్రామా చిత్రం 2024లో విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రనిర్మాతల్లో ఒకరైన ఏక్తా కపూర్ 'క్రూ'కు సీక్వెల్‌ను ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఈ సన్నాహాల్లో భాగంగానే కరీనా కపూర్‌ను మేకర్స్ సంప్రదించగా ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. 'క్రూ' సినిమాలో మాదిరిగానే 'క్రూ 2'లోనూ ముగ్గురు హీరోయిన్లు ఉంటారట. కాకపోతే తొలి భాగంలో నటించిన టబు, కృతీ సనన్ రెండో భాగంలో ఉండరనే విషయంపై చర్చలు జరుగుతున్నాయని బాలీవుడ్ టాక్. ఈ ఇద్దరి స్థానంలో ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఇద్దరు కొత్త హీరోయిన్లు అయితే బాగుంటుందని మేకర్స్ అనుకుంటున్నారట. మరి... ఫైనల్‌గా 'క్రూ 2'లో కరీనాతో పాటు నటించే ఆ ఇద్దరు హీరోయిన్లు ఎవరు అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఎదురు చూడక తప్పదు.

ప్రకృతి ఎంత విచిత్రమైనదో...



● సుమంత్ ప్రభాస్, నిధీ ప్రదీప్

సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'గోదారి గట్టుపైన'. రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా సుభాష్ చంద్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నిధీ ప్రదీప్ కథానాయికగా పరిచయం కానున్నారు. ఈ చిత్రం ఫస్ట్ బ్రీజ్ వీడియోను విడుదల చేశారు. 'ఇదే సంగమం... ఇక్కడే గోదారి సముద్రంలో కలుస్తుంది. ప్రకృతి ఎంత విచిత్రమైనదో కదా. మంచి నీరు ఉప్పు నీరు వేరు వేరు తత్వాలు అయినప్పటికీ రెండూ ఒకటిగా కలిసిపోతున్నాయి. మనుషులు కూడా ఇలా భేదాభిప్రాయాలు లేకుండా ఒకటిగా కలిసిపోతే ఈ మత భేదాలు అనేవి ఉండవు కదా' అని సుమంత్ ప్రభాస్ చెప్పిన డైలాగ్స్ వీడియోలో ఉన్నాయి. ''హృదయాన్ని హత్తుకునే కథ, సహజమైన నటనతో 'గోదారి గట్టుపైన' ప్రేక్షకులకు మర్చిపోలేని అనుభూతి అందించేలా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.


ఓటీటీ

ఇది చూడొచ్చు

టూ మదర్స్... వన్ మిషన్

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం 'బన్ బటర్ జామ్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

వెయ్యి అబద్ధాలాడైనా ఓ పెళ్ళి చేయాలంటారు. ఈ నానుడినే బాగా వంటబట్టించుకుని వెయ్యి కాదు కానీ కొన్ని అబద్ధాలాడి తమ పిల్లలకు ఇద్దరు తల్లులు పెళ్ళి చేయించే అద్భుత తంతును తెర మీదకు తీసుకువచ్చారు తమిళ దర్శకుడు రాఘవ్ మిరదాత్. ఆ తంతు పేరే 'బన్ బటర్ జామ్'. అవడానికి ఇది తమిళ సినిమా అయినా ప్రైమ్ వీడియో వేదికగా తెలుగులోనూ లభ్యమవుతోంది. ఈ కథ మొత్తం మన ఇరుగు పొరుగిళ్ళలో జరుగుతున్నట్టే ఉంటుంది. సినిమా అంతా సరదాగా సాగిపోతుంది. అంతలా ఏముందో ఈ సినిమా కథలో ఓ లుక్కేద్దాం. ఉమ, లలిత అనే ఇద్దరు మహిళలు ఓ ఫంక్షన్‌లో అనుకోకుండా కలుస్తారు. ఆ పరిచయం వాళ్ళిద్దరి మధ్య అంతు లేని అనుబంధాన్ని ఏర్పరుస్తుంది. ఎంతలా అంటే తమ ఇద్దరు పిల్లలకు పెళ్ళి చేసి తామంతా కలిసి ఉండాలన్నంతగా కలిసిపోతారు ఇద్దరు తల్లులు. అదే ప్లాన్‌తో ఉమ వాళ్ళ కుటుంబం కూడా లలిత పక్కింట్లోకి వచ్చేస్తుంది.



చంద్రు, ఆద్య ఆ ఇద్దరి తల్లుల పిల్లలు. ఇందులో లలిత కొడుకైన చంద్రు ఆల్రెడీ తన క్లాస్‌మేట్‌తో రిలేషన్‌షిప్‌లో ఉంటాడు. అలాగే ఉమ కూతురైన ఆద్య కూడా ఇంకో అబ్బాయిని ప్రేమిస్తుంటుంది. తమ పిల్లలిద్దరినీ ఏకం చేసే రహస్య మిషన్ మొదలుపెడతారు ఇద్దరు తల్లులు. ఆల్రెడీ వేరేవాళ్ళతో ప్రేమలో ఉన్న తమ పిల్లలను ఒకటి చేసేందుకు ఆ తల్లులిద్దరూ పడే కష్టం అద్భుతం. మరి... వాళ్ళ కష్టం ఫలిస్తుందా? లేదా అన్నది మాత్రం బన్ బటర్ జామ్ తింటూ హాయిగా ఈ 'బన్ బటర్ జామ్'ని చూసేయొచ్చు. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులైన శరణ్య, దేవదర్శిని తల్లుల పాత్రలో నటించారు. మధ్య తరగతి కుటుంబాలలో సాగే సాధారణ సంభాషణలతో ఎంతో నేచురల్‌గా ఈ సినిమాని తీశారు దర్శకుడు. మస్ట్ వాచ్ ఫర్ ది వీకెండ్

- హరికృష్ణ ఇంటూరు

సాక్షి బిజినెస్
శుక్రవారం
26-9-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
556	166
81,160	24,891

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	22,336	▽	162
డోజోన్స్	45,922	▽	199
ఎఫ్‌టీఎస్ఈ 100	9,209	▽	41
డాక్స్	23,517	▽	149
షాంఘై	3,853	▽	1
నికాయ్	45,755	△	125

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		88.30	89.32
£	బ్రిటన్ పౌండ్		118.06	121.04
€	యూరో		102.96	105.77
¥	జపాన్ యెన్ (100)		59.28	60.80
AU$	ఆస్ట్రేలియా డాలర్		57.29	59.57
S$	సింగపూర్ డాలర్		66.37	70.01
SAR	సౌదీ రియాల్		22.65	24.15
UAE D	యూఏఈ దిర్హామ్		23.02	24.27
¥	చైనా యువాన్		11.50	13.32

వెండి.. మరో రికార్డ్

- రూ.1,000 పెరిగి రూ.1.40 లక్షలకు చేరిన ధర
- రూ.600 తగ్గిన బంగారం



న్యూఢిల్లీ: వెండి ధర గురువారం దేశీయంగా సరికొత్త జీవిత కాల గరిష్టాన్ని నమోదు చేసింది. కిలోకి రూ.1,000 పెరిగి రూ.1.40 లక్షలకు చేరింది. మరోవైపు కొన్ని రోజులుగా రికార్డుల బాటలో నడిచిన పసిడి (99.9 శాతం స్వచ్ఛత) 10 గ్రాములకు రూ.630 నష్టపోయింది. రూ.1,17,370 స్థాయి వద్ద ఉంది. అంతర్జాతీయ మార్కెట్లోనూ స్పాట్ మార్కెట్లో వెండి ధర ఔన్స్‌కు 2 శాతానికి పైనే పెరిగి 45 డాలర్లకు చేరుకుంది. దేశీయంగా ఎంసీఎక్స్ (ఫ్యూచర్స్) మార్కెట్లో డిసెంబర్ కాంట్రాక్టు వెండి ధర రూ.3,528 పెరిగి రూ.1,37,530 వద్ద కొత్త గరిష్టాన్ని నమోదు చేసింది. 10 గ్రా. బంగారం కాంట్రాక్టు ధర రూ.223 పెరిగి రూ.1,12,778కు చేరింది. రేట్ల తగ్గింపుపై ఫెడ్ సానుకూల వైఖరి, 2025లోనూ రేట్ల కోత ఉంటుందన్న అంచనాలు ధరల పెరుగుదలకు కారణమైనట్టు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ విభాగం వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది తెలిపారు. అంతర్జాతీయంగా అనిశ్చితులకుతోడు డాలర్‌పై ఆధారపడడం తగ్గించుకోవడం అన్నవి బంగారం, వెండిలో కొనుగోళ్లకు మద్దతునిస్తున్నట్టు చెప్పారు. అంతర్జాతీయంగా పసిడి ధర ఔన్స్‌కు 8 డాలర్ల నష్టంతో 3,760 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మహిళల నాయకత్వానికి జై..
ఎన్ఎస్ఈ ఇన్వెస్టర్లు @ 12 కోట్లు

భారత్‌లో సౌర వెలుగులు

- 27 వేల కిలోమీటర్ల బంజరు భూమిలో ప్యానెళ్ల ఏర్పాటుకు చాన్స్
- 3వేలకు పైగా గిగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చు: ఎన్ఐఎస్ఈ నివేదిక



న్యూఢిల్లీ: భారత్‌లో సౌర విద్యుదుత్పత్తికి గణనీయంగా అవకాశాలు ఉన్నాయని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ (ఎన్ఐఎస్ఈ) ఒక నివేదికలో పేర్కొంది. నిరుపయోగంగా ఉన్న 27,571 చ.కి.మీ. బంజరు భూముల్లో ప్యానెళ్లను ఏర్పాటు చేయడం (గ్రౌండ్ మౌంటెడ్ సోలార్) ద్వారా 3,343 జీడబ్ల్యూపీ మేర సోలార్ విద్యుదుత్పత్తి చేసే ఆస్కారం ఉంటుందని తెలిపింది. సముచిత స్థాయిలో సూర్యరశ్మి లభించినప్పుడు సౌర ప్యానెళ్లు గరిష్టంగా చేసే విద్యుదుత్పత్తిని జీడబ్ల్యూపీ (గిగావాట్స్ పీక్)గా వ్యవహరిస్తారు. 2014లో నిర్వహించిన అధ్యయనంలో 748.98 జీడబ్ల్యూపీ మేర గ్రౌండ్-మౌంటెడ్ సోలార్ పవర్‌కు అవకాశాలు ఉంటాయని అంచనా వేశారు. సోలార్ ప్రోడక్టులపై పరిశోధనలు నిర్వహించడం, అభివృద్ధి చేయడం, పరికరాల టెస్టింగ్..సర్టిఫికేషన్ మొదలైన వాటి కోసం ఏర్పాటైన ఎన్ఐఎస్ఈ, కేంద్ర పునరుత్పాదక శక్తి శాఖలో భాగంగా ఉంది. కేంద్ర నూతన, పునరుత్పాదక శక్తి శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఈ నివేదికను విడుదల చేశారు. ఇందులో పేర్కొన్న వివరాలను బట్టి చూస్తే ప్రస్తుతం అన్ని వనరుల స్థాపిత సామర్థ్యానికి ఎనిమిది రెట్లు అధికంగా విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు అవకాశం కనిపిస్తోందని ఆయన చెప్పారు. దేశంలో పుష్కలంగా సౌర వనరులు ఉన్నాయని పేర్కొన్నారు. చివరిసారిగా 2014లో అధ్యయనం నిర్వహించినప్పటి నుంచి సోలార్ పవర్ రంగంలో పరిస్థితులు చాలా మారిపోయాయని చెప్పారు. ఫొటోవొల్టెయిక్ సామర్థ్యాలు మెరుగుపడ్డాయని, వ్యయాలు గణనీయంగా తగ్గాయని మంత్రి చెప్పారు. 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజయేతర ఇంధన సామర్థ్యాన్ని సాధించాలని నిర్దేశించుకోగా దేశీ పరిశ్రమ దన్నుతో ఇప్పటికే సగం లక్ష్యాన్ని అధిగమించామని తెలిపారు. కేవలం కొన్ని రాష్ట్రాల్లోనే సౌర విద్యుత్తుకు అనువైన పరిస్థితులు ఉన్నాయన్న అపోహలను ఈ నివేదిక తొలగిస్తుందన్నారు.

అత్యధికంగా రాజస్తాన్‌లో అవకాశం..

ఎన్ఐఎస్ఈ తాజా నివేదిక ప్రకారం, రాజస్తాన్, గుజరాత్‌లోని ఎడారి ప్రాంతాలతో పాటు పలు రాష్ట్రాల్లో గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ పీవీల ఏర్పాటుకు గణనీయంగా అవకాశాలు ఉన్నాయి. రాజస్తాన్‌లో అత్యధికంగా 828.78 జీడబ్ల్యూపీ, ఆ తర్వాత మహారాష్ట్రలో 486.68 జీడబ్ల్యూపీ, మధ్యప్రదేశ్‌లో 318.97 జీడబ్ల్యూపీ, ఆంధ్రప్రదేశ్‌లో 299.31 జీడబ్ల్యూపీ, గుజరాత్‌లో 243.22 జీడబ్ల్యూపీ మేర సౌర విద్యుదుత్పత్తికి ఆస్కారం ఉంది. సుమారు 4,12,458.37 చ.కి.మీ. మేర బంజరు భూమి ఉండగా, అందులో సుమారు 6.69 శాతం స్థాయిలో 27,571.39 చ.కి.మీ. భూమిని ఇందుకు ఉపయోగించుకోవచ్చని నివేదిక తెలిపింది. ఏ రాష్ట్రంలోనైనా నిరుపయోగ భూమిలో 10 శాతానికి మించి సోలార్ అవసరాల కోసం వినియోగించరాదన్న నిబంధనలకు అనుగుణంగా ఇది ఉంటుందని పేర్కొంది.

నివేదికలో మరిన్ని విశేషాలు..

- ప్రాంతాలవారీగా చూస్తే దేశవ్యాప్తంగా మొత్తం గ్రౌండ్ మౌంటెడ్ సోలార్‌లో పశ్చిమ రాష్ట్రాల వాటా 45 శాతంగా ఉండొచ్చు. పశ్చిమ రాష్ట్రాల్లో అత్యధికంగా సూర్య రశ్మి సోకే, నిరుపయోగ భూమి చాలా ఎక్కువగా ఉండటం ఇందుకు కారణం. ఇక దక్షిణాది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, (299.31 జీడబ్ల్యూపీ), కర్ణాటక (223.28 జీడబ్ల్యూపీ), తమిళనాడు (204.77 జీడబ్ల్యూపీ), తెలంగాణ (140.45 జీడబ్ల్యూపీ సామర్థ్యం)లో కూడా ఒక మోస్తరు స్థాయిలో ఉన్న బంజరుభూములు ఉపయోగపడతాయి. నాగాలాండ్, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ లాంటి ఈశాన్య, హిమాలయ ప్రాంత రాష్ట్రాల్లో ఎక్కువగా సూర్యరశ్మి లేకపోవడం, కఠినతరమైన పర్వత ప్రాంతాలు, అత్యధికంగా అడవులు, ఎక్కువగా బంజరు భూములు అందుబాటులో లేకపోవడం వంటి అంశాల వల్ల గ్రౌండ్ మౌంటెడ్ సోలార్‌కు ఆస్కారం తక్కువగా ఉంటుంది.
- సానుకూల పునరుత్పాదక విద్యుత్ పాలసీలు, పర్యావరణ అనుకూల విద్యుదుత్పత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఈ ఏడాది జనవరిలో భారత్‌లో స్థాపిత సోలార్ సామర్థ్యం 100 గిగావాట్ల పైకి చేరింది. 2014లో ఇది కేవలం 2.82 గిగావాట్లుగా ఉండేది.

ఏఐ సొల్యూషన్స్, సర్వీసులపై లెనొవొ దృష్టి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్మార్ట్ ఏఐ (కృత్రిమ మేధ) ప్రయోజనాలను అందరికీ మరింతగా అందుబాటులోకి తేవాలని టెక్ దిగ్గజం లెనొవొ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా కేవలం పీసీలు మొబైల్స్‌లాంటి ఉత్పత్తులే కాకుండా ఏఐ ఆధారిత మౌలిక సర్వీసులు, సొల్యూషన్స్‌ను విస్తృతంగా అందిస్తున్నట్లు లెనొవొ ఇండియా ఎండీ అమిత్ లూథ్రా, ఈడీ రోహిత్ వెల్లడించారు. ఇతర ఆసియా పసిఫిక్ దేశాల్లోని సంస్థలు బ్యాక్-ఆఫీస్ అవసరాల కోసమే ఏఐని ఉపయోగిస్తుండగా, దేశీయంగా సేల్స్, మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్లు గణనీయంగా కృత్రిమ మేధను ఉపయోగిస్తున్నాయని చెప్పారు. భారత్‌లో ఇప్పటికే 53 శాతం సంస్థలు ఏఐ ఆధారిత పీసీలను వినియోగిస్తున్నట్లు చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్స్‌పై (సీఐవో) నిర్వహించిన తమ అధ్యయనంలో వెల్లడైందని హైదరాబాద్‌లో తమ ఏఐ పోర్ట్‌ఫోలియోను డిస్‌ప్లే చేసిన సందర్భంగా వివరించారు. ప్రస్తుతం దేశీయంగా పర్సనల్ కంప్యూటింగ్ ఉత్పత్తుల విభాగంలో రెండో స్థానంలో, ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ విభాగంలో మూడో స్థానంలో ఉన్నట్లు రోహిత్ చెప్పారు. భారత్‌లో 5 తయారీ ప్లాంట్లు, సుమారు 1,700 మంది సిబ్బంది ఉండగా, గత ఆర్థిక సంవత్సరం 3.4 బిలియన్ డాలర్ల ఆదాయం నమోదైందని ఆయన వివరించారు.

అయిదో రోజూ అదే పతనం

- సెన్సెక్స్ నష్టం 556 పాయింట్లు
- 25 వేల దిగువకు నిఫ్టీ



ముంబై: హెచ్1-బీ ఫీజు పెంపు ఆందోళనలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలతో స్టాక్ మార్కెట్ అయిదో రోజూ నష్టపోయింది. సెన్సెక్స్ 556 పాయింట్లు క్షీణించి 81,160 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 166 పాయింట్లు కోల్పోయి 25 వేల స్థాయి దిగువన 24,891 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్లలోని బలహీన సంకేతాలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి జీవితకాల కనిష్టానికి చేరుకోవడం అంశాలు మరింత ఒత్తిడి పెంచాయి. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు ట్రేడింగ్ గడిచే కొద్దీ మరింత నష్టాలు చవిచూశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 623 పాయింట్లు కోల్పోయి 81,093 వద్ద, నిఫ్టీ 179 పాయింట్లు నష్టపోయి 24,878 వద్ద కనిష్టాలు నమోదు చేశాయి. ఆసియాలో జపాన్ మినహా అన్ని దేశాల మార్కెట్లు నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు అరశాతం పతనమయ్యాయి. యూఎస్ స్టాక్ సూచీలు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- బీఎస్ఈలో రంగాల వారీగా ఇండెక్సుల్లో రియల్టీ 2%, విద్యుత్ 1.38%, ఐటీ 1.23%, యుటిలిటీస్ 1.21%, కన్జూమర్ డిస్క్రెషనరీ 1.41% పతనమయ్యాయి. స్మాల్ క్యాప్ సూచీ 0.75%, మిడ్‌క్యాప్ ఇండెక్సు 0,72% నష్టపోయాయి. నష్టాల మార్కెట్లోనూ టెలికమ్యూనికేషన్, మెటల్ షేర్లు రాణించాయి.
- కొత్త హెచ్-1బీ వీసా దరఖాస్తులపై అమెరికా ప్రభుత్వం లక్ష డాలర్ల పెంపుతో దేశీయ ఐటీ కంపెనీల షేర్లు నాలుగోరోజూ డీలా పడ్డాయి. ఇన్ఫోబీన్స్ 2.64%, టీసీఎస్ 2.50%, హెక్సావేర్ టెక్ 2%, హెచ్‌సీఎల్ టెక్ 1.31%, విప్రో 1.06%, ఇన్ఫోసిస్ 0.64%, టెక్ మహీంద్రా 0.61% పతనయ్యాయి.
- గడిచిన నాలుగు రోజుల్లో టెక్ మహీంద్రా షేరు 7% నష్టపోవడంతో రూ.10,729 కోట్ల మార్కెట్ క్యాప్ హరించుకుపోయింది. టీసీఎస్ (-6.6%) రూ.75,799 కోట్లు, విప్రో (-5.5%) రూ.14,799 కోట్లు, ఇన్ఫోసిస్(-3.6%) రూ.23,119 కోట్లు, హెచ్‌సీఎల్(-3%) రూ.11,940 కోట్ల మార్కెట్ విలువ కోల్పోయాయి. వెరసి ఈ 5 కంపెనీలకు 4 సెషన్లలో రూ.1.36 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది.
- ఐవాల్యూ ఇన్ఫోసొల్యూషన్స్ షేరు లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.299)తో పోలిస్తే 4.68% డిస్కౌంటుతో రూ.285 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 8.34% క్షీణించి రూ.274 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 6% నష్టపోయి రూ.282 వద్ద నిలిచింది.

హైదరాబాద్‌లో బీసీజీ కార్యాలయం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) భారత్‌లో తమ కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తమ కార్యాలయాన్ని ప్రారంభించింది. కంపెనీకి ఇప్పటికే ముంబై, ఢిల్లీ, బెంగళూరు, చెన్నైలో కార్యాలయాలు ఉండగా, ఇది అయిదోది. సంస్థ గత దశాబ్దకాలంగా ఏటా 20% వృద్ధి చెందుతున్నట్లు బీసీజీ ఇండియా హెడ్ రాహుల్ జైన్ తెలిపారు. దేశీయంగా వ్యాపార పరిస్థితులు వేగవంతంగా మారిపోతున్న నేపథ్యంలో కీలక పరిశ్రమలు, క్లయింట్లతో సంబంధాలను మరింత పటిష్టం చేసుకునేందుకు కొత్త ఆఫీసు తోడ్పడగలదని బీసీజీ ఇండియా హెడ్ రాహుల్ జైన్ తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్



టీమిండియా అజేయంగా ముగించేనా? నేడు శ్రీలంకతో 'సూపర్-4' మ్యాచ్

దుబాయ్: ఆసియాకప్ టి20 టోర్నీ 'సూపర్-4' దశలో భాగంగా నేడు శ్రీలంకతో భారత జట్టు ఆడనుంది. ఈ టోర్నీ ఆరంభం నుంచి అజేయంగా సాగుతున్న టీమిండియా... గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో... 'సూపర్-4' దశ రెండు మ్యాచ్‌ల్లో గెలిచి ఇప్పటికే ఫైనల్ బెర్తు ఖరారు చేసుకుంది. ఈ నేపథ్యంలో సూర్యకుమార్ బృందం తుది పోరుకు ముందు శ్రీలంకతో మ్యాచ్‌ను ప్రాక్టీస్‌గా వినియోగించుకోనుంది. ఈ టోర్నీలో ఇప్పటి వరకు భారత జట్టుకు గట్టి పోటీ ఎదురవలేదు. బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగుతుంటే ... బౌలింగ్‌లో కుల్దీప్, బుమ్రా రాణిస్తున్నారు. మిగిలిన వాళ్లు కూడా మంచి టచ్‌లో ఉండటంతో ప్రత్యర్థికి మరోసారి కష్టాలు తప్పకపోవచ్చు. గ్రూప్ దశలో మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన లంక... 'సూపర్-4' రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడి ఫైనల్‌కు దూరమైంది. రాత్రి 8 గంటలకు మొదలయ్యే ఈ మ్యాచ్‌ను సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

సూర్య... అలాంటి వ్యాఖ్యలొద్దు

- భారత కెప్టెన్‌కు ఐసీసీ సూచన
- నేడు బీసీసీఐ ఫిర్యాదుపై విచారణ



దుబాయ్: ప్రస్తుతం ఆసియా కప్ టి20 టోర్నీలో భారత్, పాకిస్తాన్ మ్యాచ్‌లు ఏకపక్షంగా జరుగుతున్నాయి. కానీ ఆరోపణలు, ఫిర్యాదులే పోటాపోటీగా సాగుతున్నాయి. 'షేక్‌హ్యాండ్' తిరస్కరణపై నలసల ఉడికిపోతున్న పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఇంకో అడుగు ముందుకేసి భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై ఫిర్యాదు చేసింది. లీగ్ దశలో పాక్‌పై గెలుపు అనంతరం విజయాన్ని పహల్గాంలో ఊచకోతకు గురైన బాధితులకు అంకితమిస్తున్నట్లు సూర్య వ్యాఖ్యానించాడు. క్రీడల్లో రాజకీయ ప్రభావిత అంశాల ప్రస్తావనపై పీసీబీ ఫిర్యాదు చేసింది. దీన్ని విచారించిన మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ ఇలాంటి వ్యాఖ్యలు మాట్లాడవద్దని భారత కెప్టెన్‌కు సూచించారు. అయితే బుధవారం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పాకిస్తాన్ క్రికెటర్లు హారిస్ రవూఫ్, సాహిబ్‌జాదా ఫర్హాన్‌లపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి ఇ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసింది. ఈ నెల 21న సూపర్-4 దశలో జరిగిన మ్యాచ్ సందర్భంగా రవూఫ్ తన చేతులతో భారత యుద్ధ విమానాలు కూలినట్లుగా సంజ్ఞలు చేశాడు. అప్పుడే మైదానంలోని భారత అభిమానులు కోహ్లి... కోహ్లి... అంటూ బిగ్గరగా అరిచారు. 2022లో జరిగిన టి20 ప్రపంచకప్‌లో రవూఫ్ బౌలింగ్‌ను చిత్తు చేస్తూ కోహ్లి మ్యాచ్ విన్నింగ్ సిక్స్‌లతో అలరించిన సందర్భాన్ని పాక్ బౌలర్‌కు గుర్తు చేశారు. ఓపెనర్ సాహిబ్‌జాదా తన అర్ధసెంచరీ పూర్తవగానే బ్యాట్‌ను గన్‌లా ఫైరింగ్ చేస్తూ రెచ్చగొట్టాడు. ఈ నేపథ్యంలోనే భారత బోర్డు ఐసీసీకి ఫిర్యాదు చేసింది. దీనిపై నేడు మ్యాచ్ రిఫరీ తన నిర్ణయాన్ని వెలువరించనున్నారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



భారత్ ప్రత్యర్థి పాక్

దాయాదుల మధ్యే 'ఆసియా కప్' పోరు

- కీలక మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించిన పాకిస్తాన్
- ఆదివారం టైటిల్ సమరం

దుబాయ్: 'చేతులు' కలుపుకోలేని దాయాదులే టైటిల్ కోసం తలపడేందుకు సిద్ధమయ్యారు. ఆసియా కప్ టి20 టోర్నీలో భారత్‌తో అమీతుమీకి పాకిస్తాన్ అర్హత సంపాదించింది. ఆదివారం ఈ తుది సమరం జరుగుతుంది. ఓవరాల్ 'ఆసియా' కప్ చరిత్రలో ఇరుజట్లు తొలిసారి ఫైనల్లో పోటీపడనున్నాయి. సెమీస్ కానీ సెమీస్‌ను తలపించిన సూపర్-4 మ్యాచ్‌లో పాకిస్తాన్ 11 పరుగులతో బంగ్లాదేశ్‌పై గెలిచింది. సాధారణంగా విధ్వంస రచన చేసే టి20 ఫార్మాట్‌ను ఈసారి బౌలర్లు శాసించారు. దీంతో 40 ఓవర్లలోనే 17 వికెట్లు కూలాయి. ముందుగా పాకిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. మొహమ్మద్ హారిస్ (23 బంతుల్లో 31; 2 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే కాస్త మెరుగ్గా ఆడాడు. బంగ్లా బౌలర్లు తస్కిన్ అహ్మద్ 3, మెహదీ హసన్, రిషాద్ హొస్సేన్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 124 పరుగులే చేయగలిగింది. షమీమ్ హొస్సేన్ (25 బంతుల్లో 30; 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు. షాహీన్ అఫ్రిది, హారిస్ రవూఫ్ చెరో 3 వికెట్లు తీయగా, సయీమ్ అయూబ్‌కు 2 వికెట్లు దక్కాయి.

బ్యాటింగ్‌లో తడబడి... బౌలింగ్‌తో గట్టెక్కి

పాకిస్తాన్ బ్యాటింగ్‌లో తడబడింది. టాపార్డర్ బ్యాటర్లు ఫర్హాన్ (4), ఫఖర్ జమాన్ (13), సయీమ్ అయూబ్ (0) చేతులెత్తేశారు. తర్వాత తలత్ (3) కూడా వారిని అనుసరించగా, కెప్టెన్ సల్మాన్ ఆగా (23 బంతుల్లో 19; 2 ఫోర్లు), మొహమ్మద్ హారిస్ మినహా ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేకపోయారు. నవాజ్ (15 బంతుల్లో 25; 1 ఫోర్, 2 సిక్స్‌లు), షాహీన్ అఫ్రిది (13 బంతుల్లో 19; 2 సిక్స్‌లు) 20 ఓవర్ల కోటా ఆడేందుకు దోహదపడ్డారు. బంగ్లా బౌలర్లు పాక్‌ను ఎలా దెబ్బకొట్టారో అదే బౌలింగ్ ఆయుధంతో పాకిస్తాన్ కూడా బంగ్లాను వణికించింది. షాహీన్ అఫ్రిది ఓపెనర్ పర్వేజ్ హొస్సేన్ (0)ను... కాసేపటికి వన్‌డౌన్ బ్యాటర్ తౌహిద్ హృదయ్ (5)ని అవుట్ చేశాడు. స్వల్ప వ్యవధిలో మరో ఓపెనర్ సైఫ్ హసన్ (18)ను రవూఫ్, మెహదీ హసన్ (11)ను నవాజ్ అవుట్ పెవిలియన్ చేర్చడంతో 44 పరుగులకే టాప్-4 వికెట్లను కోల్పోయింది. షమీమ్ హొస్సేన్ (25 బంతుల్లో 30; 2 సిక్స్‌లు) ఆశలు రేపినా... షాహీన్ అఫ్రిది నిప్పులు చెరిగే బౌలింగ్‌తో తుంచేశాడు. కెప్టెన్ జాకిర్ అలీ (5), తంజిమ్ హసన్ (10), తస్కిన్ అహ్మద్ (4)లు కూడా పాక్ బౌలర్లకు తలవంచడంతో వందలోపే (97/8) ఎనిమిది వికెట్లను కోల్పోయి పరాజయానికి సిద్ధమైంది.

కరుణ్ నాయర్‌పై వేటు

- అభిమన్యు ఈశ్వరన్‌కూ దక్కని చోటు
- దేవదత్ పడిక్కల్‌కు పిలుపు
- నితీశ్ కుమార్ రెడ్డి పునరాగమనం
- వైస్ కెప్టెన్‌గా రవీంద్ర జడేజా
- వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌కు భారత జట్టు ప్రకటన



కరుణ్ నాయర్

దుబాయ్: ఇంగ్లండ్ పర్యటనలో మూడు టెస్టులకే పరిమితమైన భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా... స్వదేశంలో వెస్టిండీస్‌తో జరగనున్న రెండు మ్యాచ్‌లకూ అందుబాటులో ఉండనున్నాడు. 2025-27 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో భాగంగా అక్టోబర్ 2 నుంచి టీమిండియా... వెస్టిండీస్‌తో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడనుంది. దీని కోసం అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ గురువారం 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఎలాంటి సంచలనాలకు తావివ్వకుండా... అంతా ఊహించినట్లే జట్టు ఎంపిక సాగింది. దేశవాళీల్లో రాణించి ఇంగ్లండ్ టూర్‌కు ఎంపికైన సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్‌ను ఈ సిరీస్‌కు ఎంపిక చేయలేదు. వచ్చిన అవకాశాలను వినియోగించుకోలేకపోవడంతో అతడిని జట్టు నుంచి తప్పించి దేవదత్ పడిక్కల్‌కు అవకాశమిచ్చారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని 25 ఏళ్ల పడిక్కల్‌ను ఎంపిక చేశారు. ఇంగ్లండ్ పర్యటనలో 9 ఇన్నింగ్స్‌ల్లో కరుణ్ నాయర్ ఒక్క అర్ధశతకం మాత్రమే చేసి నిరాశ పరిచాడు. రెగ్యులర్ వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ గైర్హాజరీలో రవీంద్ర జడేజాకు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. రిజర్వ్ ఓపెనర్, బెంగాల్ ఆటగాడు అభిమన్యు ఈశ్వరన్‌ను ఇక ఎంపిక చేయబోమని సెలెక్టర్లు సంకేతాలు పంపారు. గత మూడు నాలుగేళ్లుగా భారత జట్టుతో కలిసి పయనిస్తున్న ఓపెనర్ ఈశ్వరన్‌కు ఇక అవకాశాలు రావడం కష్టమే అని అగార్కర్ వెల్లడించాడు. వచ్చే ఏడాది కాలంలో భారత జట్టు విదేశాల్లో టెస్టు మ్యాచ్‌లు ఆడేది లేదు. స్వదేశంలో మ్యాచ్‌లకు ఓపెనర్లతో పాటు రిజర్వ్‌గా నారాయణ్ జగదీశన్ అందుబాటులో ఉన్నాడు. దీనిపై అగార్కర్ మాట్లాడుతూ... 'సాధారణంగా విదేశీ పర్యటనలకు 16, 17 మందితో జట్టును ఎంపిక చేస్తారు. అలాంటి సమయంలో రిజర్వ్ ఓపెనర్ అవసరం ఉంటుంది. ప్రస్తుతం కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ చక్కగా ఆడుతున్నారు. ఈ సమయంలో మూడో ఓపెనర్‌గా ఈశ్వరన్‌ను తీసుకొని అతడిని బెంచ్ మీద కూర్చోబెట్టాల్సిన అవసరం లేదు' అని అన్నాడు. గాయం నుంచి కోలుకున్న ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి జట్టులోకి పునరాగమనం చేశాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్ వరకు పంత్ పూర్తి ఫిట్‌నెస్ సాధించే అవకాశాలున్నాయని అగార్కర్ తెలిపాడు.

షమీపై శీతకన్ను

సీనియర్ బౌలర్ మొహమ్మద్ షమీ విషయంలో సెలెక్షన్ కమిటీ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. గాయం కారణంగా మైదానానికి దూరమైన అతడిని... ఇంగ్లండ్ పర్యటన సమయంలోనే జట్టులోకి తీసుకుంటారనుకుంటే... అప్పటికి అతడు పూర్తి ఫిట్‌నెస్ సాధించలేదని పక్కన పెట్టారు. ఇక ఈ సిరీస్‌కైనా అతడు జట్టులో చోటు దక్కించుకుంటాడనుకుంటే అదీ సాధ్యపడలేదు. దీనిపై స్పందించిన చీఫ్ సెలెక్టర్ అగార్కర్... 'అతడి అంశంపై అప్‌డేట్ లేదు' అని ముక్తసరిగా జవాబిచ్చాడు. అతడు ఇటీవలి కాలంలో ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేదని... గత రెండు మూడేళ్లలో బెంగాల్ తరపున ఒకటి, దులీప్ ట్రోఫీలో ఒక మ్యాచ్ ఆడినట్లున్నాడని అగార్కర్ అన్నాడు.

వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌కు భారత జట్టు: శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురేల్ (వికెట్ కీపర్), జడేజా, వాషింగ్టన్ సుందర్, బుమ్రా, అక్షర్, నితీశ్ రెడ్డి, జగదీశన్ (వికెట్ కీపర్), సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్.



ఈశ్వరన్



నితీశ్

"ఇంగ్లండ్ పర్యటన సందర్భంగా కరుణ్ నాయర్ నుంచి ఇంకా ఎక్కువ ఆశించాం. కానీ అతడు అంచనాలను అందుకోలేకపోయాడు. పడిక్కల్ ఇప్పటికే నిరూపించుకున్నాడు. పోటీలో అతడు ముందున్నాడు. మూడో స్థానంలో సాయి సుదర్శన్ చక్కటి భరోసా కల్పించాడు. అతడికి మరిన్ని అవకాశాలిస్తాం. వెస్టిండీస్‌తో రెండు మ్యాచ్‌లకు ఇదే జట్టు. ఇంగ్లండ్‌తో చివరి టెస్టు ఆడని బుమ్రాకు ఆ తర్వాత కూడా తగినంత విశ్రాంతి లభించింది. దీంతో అతడు రెండు టెస్టులకు అందుబాటులో ఉంటాడు.

-అజిత్ అగార్కర్, చీఫ్ సెలెక్టర్

ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా రెండో దశకు వెబ్ ఆప్షన్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశానికి రెండో దశ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొదటి దశ కౌన్సెలింగ్‌లో మిగిలిపోయిన సీట్లతోపాటు హైదరాబాద్‌లోని నోవా మెడికల్ కాలేజీలో పెరిగిన 50 సీట్లకు గురువారం నుంచి వెబ్ ఆప్షన్లకు అవకాశమిచ్చారు. ఈనెల 27 మధ్యాహ్నం 2 గంటల వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. మొదటి దశలో సీట్లు పొందిన తరువాత జాయిన్ కాని అభ్యర్థులకు రెండో దశలో అవకాశం ఉండదు. అలాగే మొదటి దశలో వెబ్ ఆప్షన్స్ నమోదు చేయని అభ్యర్థులకు రెండో దశలో ఆప్షన్స్‌కు అవకాశం లేదు. రెండో దశలో స్లైడింగ్ చేసుకునే అభ్యర్థులకు మళ్లీ వర్సిటీ ఫీజు అవసరం లేదని విశ్వవిద్యాలయం స్పష్టం చేసింది. మొదటి దశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన అభ్యర్థుల్లో 40 మంది కళాశాలల్లో చేరలేదు. గాంధీ, ఉస్మానియా, కాకతీయలో సీట్లు పొందిన అభ్యర్థులు కూడా ఈ జాబితాలో ఉండటం గమనార్హం.

స్థానికత ఆధారంగా బదిలీలను పునఃసమీక్షించాలి

సొసైటీ కార్యదర్శి కృష్ణఆదిత్యకు ఎమ్మెల్సీ కొమరయ్య వినతి

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ గురుకుల సొసైటీలో జీఓ 317 ద్వారా నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేయాలని బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి కృష్ణ ఆదిత్యను కలిసి ఎస్సీ గురుకుల ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. జీవో 317 ద్వారా అన్యాయానికి గురైన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, ఇతర జోన్లకు బదిలీ అయిన ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా సొంత ప్రాంతాలకు కేటాయించాలని, గురుకుల ఉపాధ్యాయులకు సమాన అవకాశాలు కల్పిస్తూ, సర్వీస్ అంశాల్లో అనుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులందరికీ జీతాలు, గురుకులాలకు డైట్ చార్జీలు, బిల్డింగ్ రెంట్స్ వంటి పెండింగ్ బకాయిలు వేగంగా విడుదల చేయాలన్నారు. ఈ అంశాలపై సొసైటీ కార్యదర్శి కృష్ణ ఆదిత్య స్పందిస్తూ ప్రతి ఉద్యోగికి తప్పనిసరిగా ఒకటో తేదీన వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డైట్ చార్జీలు, బిల్డింగ్ అద్దెలు వంటి పెండింగ్ క్లియరెన్స్ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని, సర్వీస్ అంశాల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగులందరికీ అనుకూలమైన వాతావరణం ఉంటుందని హామీ ఇచ్చారు.

ఇక గ్రూప్-2, గ్రూప్-3 నియామకాలు!

గ్రూప్-1 తుది జాబితా ప్రకటన పూర్తి... నియామక పత్రాల జారీ వేగవంతం

అతి త్వరలో గ్రూప్-2 ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల తుది జాబితా

వెనువెంటనే గ్రూప్-3 ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

వేగవంతంగా ఉద్యోగ నియామకాలు పూర్తి చేసేలా టీజీపీఎస్సీ కసరత్తు



సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల తుది జాబితా విడుదల కావడం.. ఒకట్రెండు రోజుల్లో నియామక పత్రాలు జారీ చేయనున్న నేపథ్యంలో గ్రూప్-2, గ్రూప్-3 ఉద్యోగ నియామకాల ప్రక్రియకు కూడా ముందడుగు పడినట్టయ్యింది. ఉద్యోగ నియామకాల్లో అవరోహణ విధానాన్ని అనుసరించాలనే ఉద్దేశంతో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ముందుగా గ్రూప్-1 ఉద్యోగ నియామకాలు పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే గ్రూప్-2, అనంతరం గ్రూప్-3 ఉద్యోగ నియామకాలు చేపట్టాలని నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాలు విడుదల చేసినా, నియామకాలు చేపట్టలేదు. తాజాగా గ్రూప్-1 నియామకాలకు న్యాయపరమైన చిక్కులు దాదాపు వైదొలగడంతో అర్హుల తుదిజాబితా కమిషన్ విడుదల చేసింది. మొత్తం 563 ఖాళీలకు గాను 562 ఉద్యోగాలు భర్తీ కాగా.. ఒక పోస్టును హైకోర్టు ఆదేశాలతో విత్‌హెల్డ్‌లో పెట్టారు. పోస్టు కోడ్‌ల వారీగా గ్రూప్-1 ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల జాబితాను బుధవారం అర్ధరాత్రి విడుదల చేయగా.. దసరా పండుగలోపు ఆయా అభ్యర్థులకు నియామక పత్రాలను సైతం అందించనుంది.

ముందుగా గ్రూప్-2...

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 783 గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి సంబంధించి ప్రాథమిక జాబితాను ఇప్పటికే ప్రకటించిన టీజీపీఎస్సీ, అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కూడా దాదాపు పూర్తి చేసింది. వివిధ కేటగిరీల్లో అభ్యర్థుల కొరతను సైతం అధిగమించేందుకు అర్హులైన మెరిట్ అభ్యర్థులను తిరిగి విడుదల చేస్తూ వారి ధ్రువపత్రాలను సైతం పరిశీలించింది. పరిశీలన ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో వాటిని విశ్లేషించుకున్న తర్వాత తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రత్యేక సమావేశం నిర్వహించి తుది అర్హుల జాబితాను విడుదల చేయనుంది. అతి త్వరలో తుది జాబితా విడుదల చేయనున్నట్టు టీజీపీఎస్సీ వర్గాలు చెబుతున్నాయి.

- ఆ తర్వాత గ్రూప్-3 కేటగిరీలోని 1,388 ఖాళీలకు సంబంధించి అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభించనుంది. గ్రూప్-3 కేటగిరీలోని ఉద్యోగాలకు ప్రాథమికంగా అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను టీజీపీఎస్సీ ఆర్నెల్ల క్రితమే విడుదల చేసింది. అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు తేదీలు సైతం ప్రకటించగా.. గ్రూప్-1 ఫలితాలపై హైకోర్టులో కేసు నమోదు కావడంతో పరిశీలన ప్రక్రియకు బ్రేక్ వేసింది. ప్రస్తుతం గ్రూప్-1 అంశం కొలిక్కి రావడంతో గ్రూప్-3 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు సైతం టీజీపీఎస్సీ అతి త్వరలో తేదీలను ప్రకటించనుంది. రెండు వారాల పాటు పరిశీలన నిర్వహించాల్సి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అవసరమైతే కొంత సమయం తీసుకొని వేగవంతంగా పరిశీలన ప్రక్రియను పూర్తి చేస్తారని తెలుస్తోంది. వచ్చే నెలాఖరుకల్లా గ్రూప్-3 తుది జాబితా సైతం వెలువడే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం.

భూభారతి ఆపరేటర్ల ఏజెన్సీ మార్పు

టెర్రాసిస్ నుంచి టీజీటీఎస్‌కు బాధ్యతలు

ఇకపై ప్రతినెలా వేతనాలు అందేలా ఏర్పాట్లు

భూపరిపాలన ప్రధాన కమిషనర్ ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూభారతి ఆపరేటర్లు (గతంలో ధరణి ఆపరేటర్లు)గా పనిచేస్తున్న వారి నిర్వహణ బాధ్యతలను టెర్రాసిస్ సంస్థ నుంచి తెలంగాణ టెక్నలాజికల్ సర్వీసెస్ (టీజీటీఎస్)కు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు భూపరిపాలన ప్రధాన కమిషనర్ డి.ఎస్.లోకేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ (ఆపరేటర్లు) కేడర్ స్ట్రెంగ్త్‌ను కూడా ఖరారు చేశారు. రాష్ట్రంలో హైదరాబాద్ జిల్లా మినహా మిగిలిన జిల్లాల్లోని 605 మండలాలకు గాను 605 మంది, జిల్లాల్లో కోఆర్డినేటర్లుగా, సీసీఎల్ఏ కార్యాలయంలో కూడా పనిచేసేందుకు గాను మరో 31మంది కలిపి మొత్తం 636 మందిని ఏజెన్సీ (టీజీటీఎస్) ద్వారా నియమించుకునేందుకు అనుమతి కల్పించారు. ఈ ఏజెన్సీకి ప్రభుత్వం చెల్లించే కమిషన్‌తో సంబంధం లేకుండా ఆపరేటర్లకు నెలకు రూ.19,500 వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, టీడీఎస్ మినహాయించుకుని రూ.17,404 నికర వేతనంగా ప్రతి నెలా ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, ఈ వేతనాల చెల్లింపులో జాప్యం జరగకుండా ఏజెన్సీకి చెల్లించే కమిషన్లతో సంబంధం లేకుండా నిర్వహణ పద్దు (నాన్‌ప్లాన్ బడ్జెట్) కింద చెల్లించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో భూభారతి ఆపరేటర్ల ఏజెన్సీ మారడంతో పాటు వారికి ఇక ప్రతినెలా వేతనం అందనుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. దసరా పండుగకు ముందు ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించినందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీసీఎల్ఏ లోకేశ్‌కుమార్‌లకు గురువారం ఆయన ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. అలాగే భూభారతి ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కొనగాల మహేశ్ వేరొక ప్రకటనలో సీఎం, మంత్రులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టభద్రుల వారసులకు క్లరికల్ గ్రేడ్-3 పోస్టులు

సింగరేణి యాజమాన్యం ఆమోదం

సాక్షి, హైదరాబాద్/కొత్తగూడెం అర్బన్: గని ప్రమాదాల్లో మరణించిన ఉద్యోగుల వారసులకు ఇచ్చే కారుణ్య నియామకాల్లో.. పట్టభద్రులైన అభ్యర్థులకు క్లరికల్ గ్రేడ్-3 పోస్టులను ఇవ్వడానికి సింగరేణి యాజమాన్యం అంగీకరించింది. ఈ విషయమై గురువారం హైదరాబాద్‌లోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో గుర్తింపు కార్మిక సంఘానికి, యాజమాన్యానికి మధ్య ఒప్పందం కుదిరింది. గతంలో ఈ విద్యార్హత గలవారు జనరల్ అసిస్టెంట్‌గా మాత్రమే పనిచేసే అవకాశం దక్కేది. 2009లో జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం టెక్నికల్ డిగ్రీలైన మైనింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమా(మైనింగ్/మెకానికల్/ఎలక్ట్రికల్), ఐటీఐ (ఎలక్ట్రికల్/ఫిట్టర్/వెల్డర్) కోర్సులు పూర్తి చేసిన వారి విద్యార్హతకు తగిన ఉద్యోగాలు కల్పించడానికి యాజమాన్యం అంగీకరించింది. వీరితో పాటు ఇతర డిగ్రీలున్న అభ్యర్థులను క్లరికల్ గ్రేడ్-3 పోస్టులో నియమించాలని గుర్తింపు కార్మిక సంఘమైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ చేసిన విజ్ఞప్తిపై జూన్ 27న జరిగిన డైరెక్టర్ (పా) స్థాయి సమావేశంలో చర్చించారు. కాగా, యూనియన్ ప్రతినిధులు, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో గురువారం మరోమారు చర్చలు జరగగా.. తాజా ఒప్పందం కుదిరింది.

సీఎం చేతుల మీదుగా.. గ్రూప్-1 అభ్యర్థులకు నియామక పత్రాలు

ఈనెల 27న శిల్పాకళావేదికలో కార్యక్రమం: సీఎస్ రామకృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 ద్వారా ఎంపికైన 563 మంది అభ్యర్థులకు ఈనెల 27న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. శిల్పాకళావేదికలో శనివారం సాయంత్రం ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని, మంత్రులను కూడా ఆహ్వానిస్తున్నామని సీఎస్ వెల్లడించారు. కార్యక్రమ ఏర్పాట్లపై గురువారం సంబంధిత ఉన్నతాధికారులతో సీఎస్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన రేపటిలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నియామకాల్లో అత్యధికంగా, రెవెన్యూ, హోం, పంచాయతీరాజ్ శాఖలకు చెందినవారు ఉన్నందున, ఆయా శాఖల కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయా లని సూచించారు.

ఎక్సైజ్ శాఖకు 30 మంది కేటాయింపు

తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు గ్రూప్- 1 నుంచి 30 మంది ఎంపికయ్యారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లుగా ఎంపికైన 30 మంది ఉద్యోగుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం గురువారం అబ్కారీ భవన్ సమావేశ మందిరంలో జరిగింది.

కోరుకున్నది సాధించా: కొమ్మిరెడ్డి లక్ష్మీదీపిక



కాప్రా: టీజీపీఎస్సీ గ్రూప్- 1లో నంబర్ వన్ ర్యాంకు సాధించిన కొమ్మిరెడ్డి లక్ష్మీదీపిక ఆర్డీఓ పోస్టును ఎంచుకుంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సఫీల్‌గూడకు చెందిన లక్ష్మి దీపిక గ్రూప్-1 మెయిన్స్‌లో మొత్తం 900 మార్కులకు 550 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. మల్టీజోన్-2లో కూడా ప్రథమ స్థానం సంపాదించింది. మల్టీజోన్-2లో 304 పోస్టులకు టీజీపీఎస్సీ ఎంపిక చేసిన అభ్యర్థుల్లో టాపర్‌గా నిలిచిన దీపిక ఆర్డీఓ పోస్టును ఎంచుకున్నారు. 2013లో 113 ర్యాంక్ సాధించి ఉస్మానియా మెడికల్ కాలేజీ నుంచి మెడిసిన్ పూర్తి చేశారు దీపిక. గ్రూప్-1 కోసం ఇంట్లోనే సిద్ధమయ్యారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ముందే పోస్టుల ఎంపిక ఉంటుందని, అందులో తాను ఆర్డీఓ పోస్టును ఎంపిక చేసుకున్నట్లు లక్ష్మీదీపిక తెలిపారు.

తండ్రి ఏసీపీ.. తనయుడు డీఎస్పీ

డీఎస్పీ కానున్న శంతన్‌కుమార్‌రెడ్డి



చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గం చైతన్య పురి కమలానగర్‌కు చెందిన బసిరెడ్డి శంతన్‌కుమార్ రెడ్డి గ్రూప్-1లో 30వ ర్యాంక్ సాధించి డీఎస్పీగా ఎంపికయ్యాడు. శంతన్‌కుమార్ తండ్రి రవీందర్‌రెడ్డి రాచకొండ కమిషనరేట్ పరిధిలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్నాడు. వీరి స్వస్థలం నల్లగొండ జిల్లా హాలియా మండలం రామడుగు. శంతన్ డీఎస్పీగా ఎంపికవటంపై ఆయన తండ్రి , తల్లి గీత, సోదరి కృతిక సంతోషం వ్యక్తంచేశారు.


డీఎస్పీ కావాలనేది నా కల: డీఎస్పీ ఉద్యోగం సాధించాలనేది తన కల అని శంతన్‌కుమార్ తెలిపాడు. '2020లో సూరత్ ఎన్ఐటీలో బీటెక్ పూర్తి చేశా. రెండున్నర సంవత్సరాలకు పైగా గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నాను. నలుగురు స్నేహితులతో కలిసి అశోక్‌నగర్‌లో ఫ్లాట్‌లో ఉంటూ చదువుకున్నా. ఎక్కడా కోచింగ్ తీసుకోలేదు. సొంతంగానే రోజుకు ఆరుగంటలు ప్రిపేర్ అయ్యా. పరీక్షకు ముందు మాత్రం రోజుకు 12 గంటలు చదివా. యూపీఎస్సీ కన్నా టీజీపీఎస్సీలో జాబ్ రావాలని భావించాను' అని వివరించాడు.

మున్సిపల్ కమిషనర్‌గా పేదలకు సేవలందిస్తా


గ్రూప్-1 విజేత చిట్ల అక్షితరెడ్డి



నాగోల్: టీజీపీఎస్సీ గ్రూప్- 1 ఫలితాల్లో ర్యాంకు సాధించిన నాగోల్ బండ్లగూడ రాజీవ్ స్వగృహకు చెందిన చిట్ల అక్షితరెడ్డి గ్రేడ్-1 మున్సిపల్ కమిషనర్‌గా ఎంపికయ్యారు. పేదలకు దగ్గర నుంచి సేవ చేసే అవకాశం తనకు వచ్చిందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. 'మాది జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం నెల్లుట్ల గ్రామం. నాన్న చిట్ల రాజేందర్‌రెడ్డి. ఆయన జనగామలోని ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. నేను నర్సరీ నుంచి 10వ తరగతి వరకు జనగామలోని ఏకశిల హైస్కూల్‌లో చదువుకున్నాను. ఇంటర్ హైదరాబాద్‌లోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో చదివా. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ ఫిజిక్స్ పూర్తి చేశా. నాన్న రాజేందర్‌రెడ్డి, భర్త విక్రమ్ ప్రోత్సాహంతోనే గ్రూప్- 1లో విజయం సాధించా' అని అక్షితరెడ్డి తెలిపారు.







Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

ఎములాడలో ఏడొద్దులకే 'సద్దులు'



రాజన్న ఆలయ ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు మహిళలు (ఫైల్)

- పల్లెల్లో దసరాకు ముందు రోజు..
- రుద్రంగి, కథలాపూర్, మేడిపల్లి మండలాల్లో దసరా తర్వాత..
- నియోజకవర్గంలో మూడుసార్లు బతుకమ్మ వేడుకలు
- వేములవాడలో రూ.20 లక్షలతో ఏర్పాట్లు
- 27న సద్దుల బతుకమ్మ వేడుకలు

వేములవాడ: తెలంగాణ ఆడపడుచులు అత్యంత ఇష్టంగా జరుపుకొనే పండుగ బతుకమ్మ. పితృ అమావాస్యతో మొదలయ్యే వేడుకలు తొమ్మిది రోజులపాటు కొనసాగుతాయి. తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మతో వేడుకలు ముగుస్తాయి. కానీ వేములవాడ పట్టణంలో మాత్రం ఏడు రోజుల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. చుట్టుపక్కల పల్లెల్లో దసరాకు ముందు రోజు, రుద్రంగి, కథలాపూర్, మేడిపల్లి మండలాల్లో మాత్రం దసరా తర్వాత రోజు జరుపుకొంటారు. ఇలా నియోజకవర్గంలోని ఆడబిడ్డలు మూడు రోజులపాటు.. సద్దుల బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా జరుపుకొంటారు.

ఏడు రోజులకే..

వేములవాడలో ఏడు రోజుల్లోనే సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకోవడం సనాతనంగా వస్తోందని రాజన్న ఆలయ ప్రధానార్చకుడు శరత్‌శర్మ చెబుతున్నారు. సప్తమాతృకలను పూజించడం వల్లే ఏడు రోజుల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. సప్తమాతృకలు అంటే.. బ్రహ్మి, మహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, చాముండ, ఇంద్రాణిలను పూజిస్తుంటాం. అష్టమం, నవమం, దశమం కూడా ఉంటాయి. పీఠానికి రాజరాజేశ్వరీదేవి, తర్వాత బాలత్రిపుర సుందరీదేవీ, మహిషాసుర మర్దిని అమ్మవార్లు ఉంటారు. అష్టమం, నవమం, దశమం చేయకుండా కేవలం సప్తమాతృకా పూజ మాత్రమే కాబట్టి.. ఏడు రోజుల్లో జరుపుకోవడం వేములవాడలో ఆనవాయితీగా వస్తోందని ఇక్కడి అర్చకులు చెబుతున్నారు. ఇందులో రాజరాజేశ్వరిదేవిని 'వారాహిని' అని కూడా పిలుస్తారని పేర్కొన్నారు. అందుకే వేములవాడలో ఏడు రోజులకు సద్దుల బతుకమ్మ నిర్వహించుకుంటామని వివరించారు. ఈనెల 27న వేములవాడలో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవాలని సూచిస్తున్నారు.

పల్లెల్లో తొమ్మిది రోజులకు..

వేములవాడ పట్టణంతో పాటు శివారులోని కొన్ని గ్రామాలను మినహాయించి మండలంలోని అన్ని గ్రామాలు, కోనరావుపేట, చందుర్తి, బోయినపల్లి మండలాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు తొమ్మిది రోజుల్లో నిర్వహించుకుంటుంటారు. సద్దుల బతుకమ్మ తర్వాత దసరా పండుగ జరుపుకొంటుంటారు.

దసరా తర్వాత బతుకమ్మ వేడుకలు

వేములవాడ నియోజకవర్గంలోని రుద్రంగి, కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల్లో దసరా తర్వాత సద్దుల బతుకమ్మ జరుపుకొంటుంటారు. ఇక్కడ జరిగే ఉత్సవాలకు సైతం ఈ ప్రాంతానికి చెందిన ఆడబిడ్డలు పెళ్లయి.. అత్తగారింటికి వెళ్లినా పుట్టింటికి వచ్చి సద్దుల వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కుతుంది.

మూడుచోట్ల బతుకమ్మ అవకాశం

వేములవాడ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన ఆడపడుచులకు మూడుచోట్ల సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కుతుంది. వేములవాడలో ఏడు రోజుల్లో జరిగే సద్దుల బతుకమ్మకు చుట్టుపక్కల గ్రామాల్లోని బంధువులు సైతం హాజరవుతుంటారు. సమీప పల్లెల్లో తొమ్మిది రోజుల్లో జరిగే వేడుకలకు పట్టణ ప్రజలు పల్లెల్లోని బంధువుల ఇళ్లకు వెళ్తుంటారు. దసరా తర్వాత జరిగే రుద్రంగి, కథలాపూర్, మేడిపల్లి, భీమారం గ్రామాల్లోని తల్లిగారింటికి సైతం వెళ్లి బతుకమ్మ వేడుకల్లో సంబురంగా పాల్గొని వస్తుంటారు. ఇలా ఈ ప్రాంతానికి చెందిన మహిళలు మూడు చోట్ల.. మూడు రోజులు సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటుంటారు.

27న సద్దుల బతుకమ్మ వేడుకలు

మూలవాగులో బతుకమ్మ తెప్ప, ధర్మగుండంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెప్పలో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు మున్సిపల్, ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని 94 ప్రాంతాల్లోని కూడళ్లలో దీపాలను ఏర్పాటు చేశారు. రూ.20 లక్షలు వెచ్చించి ఈనెల 27న నిమజ్జనం చేసేందుకు మూలవాగులో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు మేనేజర్ సంపత్‌రెడ్డి తెలిపారు.



మూలవాగులో బతుకమ్మ నిమజ్జనోత్సవంలో మహిళలు (ఫైల్)

మూడుచోట్ల పాల్గొనే అవకాశం



సద్దుల బతుకమ్మ వేడుకలకు మేము వేములవాడలో 7 రోజులకు, 9 రోజుల్లో పల్లెటూళ్లలో నా చిన్నప్పుడు లింగంపల్లిలో అమ్మమ్మ ఇంటికి వెళ్లేవాళ్లం. దసరా ఉత్సవాల తర్వాత రుద్రంగిలోని మా అత్తారింటిలో జరిగే వేడుకల్లో పాల్గొంటాను. ఇలా మూడుచోట్ల సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే అవకాశం నాకు దక్కుతుంది.

– ఆది వనజ, (ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సతీమణి), వేములవాడ


మరిచిపోలేని అనుభూతి



సద్దుల బతుకమ్మ వేడుకలంటేనే చాలా ఇష్టంగా జరుపుకొంటాం. ఈసారి పండుగకు నాకు వేములవాడ ఆడపడుచులతో కలిసి పాల్గొనే అవకాశం దక్కింది. ఇది మరిచిపోలేని అనుభూతి. ఇక్కడ సద్దులు ముగియగానే.. తొమ్మిది రోజులకు మా ఇంట్లో జరుపుకొంటాం.

– ఎల్.రమాదేవి, ఈవో, రాజన్న ఆలయం, వేములవాడ

సప్తమాత్రులను పూజించడంతోనే..



సప్తమాతృకలు.. బ్రహ్మి, మహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, చాముండ, ఇంద్రాణిలను పూజిస్తుంటాం. పీఠానికి రాజరాజేశ్వరీదేవి, తర్వాత బాల త్రిపుర సుందరీదేవీ, మహిషాసుర మర్ధని అమ్మవార్లు ఉంటారు. అష్టమం, నవమం, దశమం చేయకుండా కేవలం సప్తమాతృక పూజా మాత్రమే కాబట్టి ఏడు రోజుల్లో జరుపుకోవడం వేములవాడలో వస్తున్న ఆనవాయితీ.

– చంద్రగిరి శరత్‌శర్మ, ఆలయ ప్రధానార్చకుడు

పుట్టినిల్లు... మెట్టినిల్లు



సద్దుల బతుకమ్మ వేడుకలు మెట్టినిల్లు వేములవాడలో ఏడు రోజులకు, పుట్టినిల్లు సిరిసిల్లలో తొమ్మిది రోజులకు జరిగే వేడుకల్లో పాల్గొంటాను. మెట్టినింట్లో జరిగే ఈ ఉత్సవం ఏడు రోజుల్లో అత్యంత వైభవంగా జరుపుకొంటాం. ఆలయ ప్రాంగణంలో ఏటా కోలాటాలతో సంబరాలు జరుపుకొంటాం.

– కట్కం సునీత, వేములవాడ

పండిట్ దీన్‌దయాళ్‌కు బీజేపీ నివాళి



సాక్షి, హైదరాబాద్: బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా.. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. పండిట్ దీన్ దయాళ్ అంత్యోదయ ద్వారా సామాజిక న్యాయానికి ఒక కొత్త దిశను సూచించారన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ తివారి (సంస్థాగత), డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు, మాజీ ఎంపీ బీబీ పాటిల్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి పాల్గొన్నారు. కాగా, కర్ణాటకలోని ఉడిపిలో నిర్వహించిన దీన్‌దయాళ్ జయంతి ఉత్సవాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

గ్రూప్‌-1పై తీర్పును స్వాగతిస్తున్నాం

ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్



సాక్షి, హైదరాబాద్: గ్రూప్‌-1పై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను స్వాగతిస్తున్నట్లు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పేర్కొన్నారు. సీఎల్పీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రూప్ అభ్యర్థులు, వారి తల్లిదండ్రులను బీఆర్ఎస్ నేతలు మానసిక క్షోభకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని రోడ్లపైకి తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. గతంలో పేపర్లు లీక్ చేసి, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు మళ్లీ నిరుద్యోగులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకొనే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నిరుద్యోగులకు రావాల్సిన నోటిఫికేషన్ల విషయంలో ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల నేపథ్యంలో నోటిఫికేషన్లు ఆలస్యం అవుతున్నాయని స్పష్టం చేశారు.

గాంధీభవన్‌లో ప్రపంచ ఫార్మసీ దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ ఫార్మసీ దినోత్సవాన్ని గురువారం గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ డాక్టర్ సెల్ చైర్మన్ డాక్టర్ రాజీవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫార్మసీ రంగానికి చెందిన నిపుణులు, ఫార్మసిస్టులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.రాజీవ్ మాట్లాడుతూ ఫార్మసిస్టులు కేవలం మందులు ఇచ్చేవారు మాత్రమే కాదని, ఆరోగ్యరంగంలో వారు కీలకపాత్ర పోషిస్తారని అన్నారు. మందుల వినియోగంపై అవగాహన కల్పించడం, దుష్ప్రభావాలపై హెచ్చరించడం వంటి బాధ్యతలు ఫార్మసిస్టులపై ఉన్నాయని, వారి సేవలు మరింత గుర్తింపు పొందాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వైద్య శాస్త్రంతోపాటు అంతే స్థాయిలో ఫార్మసీ రంగం కూడా విస్తరిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే వైద్యరంగంలోనే 8 వేలకు పైగా పోస్టులు భర్తీ చేశామని అన్నారు.

అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయండి

కేంద్రానికి రాష్ట్ర బార్ కౌన్సిల్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: వృత్తిపరంగా తీవ్ర దాడులను ఎదుర్కొంటున్న న్యాయవాదులకు రక్షణ కోసం అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర బార్ కౌన్సిల్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖకు గురువారం లేఖ రాసింది. న్యాయవాదుల రక్షణ బిల్లుతోపాటు వైద్య బీమా, పదవీ విరమణ ప్రయోజనం, జూనియర్ న్యాయవాదులకు స్టైపెండ్ ఇవ్వాలని కోరింది. కౌన్సిల్‌లో 59వేల మంది న్యాయవాదులు ప్రాక్టీస్ చేస్తున్నారని తెలిపింది. ఈమేరకు బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ సునీల్‌గౌడ్ న్యాయ శాఖతోపాటు కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్‌కు వినతిపత్రం సమర్పించారు. 2021లో గట్టు వామన్‌రావు, ఆయన భార్య నాగమణి హత్య సహా యుగేందర్, బద్దం నరసింహారెడ్డి, సురేశ్, తన్నీరు మహేశ్వరం, శ్రీకాంత్, అనిల్‌కుమార్‌పై జరిగిన తీవ్ర దాడులను ప్రస్తావించారు. వృత్తిపరమైన విధుల్లో అవతలి పక్షం నుంచి బెదిరింపులు, దాడులు న్యాయవాదులను భయాందోళనకు గురిచేస్తున్నాయన్నారు. రక్షణ బిల్లును వెంటనే ప్రవేశపెట్టాలని కోరారు. దేశవ్యాప్తంగా 25 లక్షల మంది న్యాయవాదులు ఉన్నారని, ఇతర నిపుణుల్లాగా వీరికి కూడా వైద్య బీమా, జీవిత బీమా ఇతర ప్రయోజనాలు వర్తింపజేయాలని కోరారు.

గిరిజన, ఆదివాసీ భవనాలకు రూ.16.5 కోట్లు



అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: గిరిజన, ఆదివాసీ భవనాల నిర్మాణాలు, మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ. 16.5 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 6 చోట్ల కొత్తగా గిరిజన, ఆదివాసీ భవనాల నిర్మాణంతో పాటు ఇప్పటికే నిర్మించిన 9 భవనాలకు అదనపు సౌకర్యాలు కల్పించేందుకు ఈ నిధులు ఖర్చు చేయనుంది. ఈ నిధులతో చేపట్టనున్న పనులకు గిరిజన సంక్షేమ శాఖ ఆమోదం తెలిపినట్లు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు, ఆదివాసీ వర్గాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచారని గుర్తు చేశారు. ఇప్పుడు అదేబాటలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటూ, అభివృద్ధి పనులు చేపడుతోందని వివరించారు.

రైతుల అభ్యున్నతికి దేవీలాల్ విశేష కృషి

ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: మాజీ ఉప ప్రధాని చౌదరి దేవీలాల్ రైతుల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. హరియాణాలో గురువారం జరిగిన దేవీలాల్ 112 జయంతి కార్యక్రమంలో కవిత నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేవీలాల్‌ను ఉత్తర భారతీయులే కాదు.. దక్షిణాది రాష్ట్రాల్లోని ప్రతి రైతు ప్రేమిస్తాడని కొనియాడారు.

వెంకట్‌గౌడ్ మరణంపై కేసీఆర్ సంతాపం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సామాజిక చారిత్రక సాహితీవేత్త, రచయిత కొంపెల్లి వెంకట్ గౌడ్ మరణంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను రికార్డు చేసి వెలుగులోకి తెచ్చి, బీసీల రాజకీయ చైతన్యం కోసం పాటుపడిన ఘనత వెంకట్‌కు చెందుతుందని కొనియాడారు. తెలంగాణవాదిగా, బహుజన వర్గాల అభ్యున్నతిని కాంక్షిస్తూ పలు రచనలు చేసిన వెంకట్ గౌడ్ అకాల మృతి తెలంగాణ సాహితీ లోకానికి తీరనిలోటని విచారం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు.



గురువారం చలో సెక్రటేరియట్ ముట్టడికి ప్రయత్నించిన అంగన్వాడీ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు



సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో మంత్రి సీతక్క తదితరులు

రాష్ట్రంలో కేంద్రం చేపట్టనున్న ప్రాజెక్టులివే

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసిన తర్వాత రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే వివిధ ప్రాజెక్టుల వివరాలను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు.

- రూ.163.41కోట్లతో ఎన్‌హెచ్‌-353సీ పై సిరోంచ (మహారాష్ట్ర) నుంచి మహాదేవ్‌పూర్ సెక్షన్ వరకు ఉన్న 17 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ
- రూ.690 కోట్లతో ఎన్‌హెచ్‌-930పీ పై గొరెల్లి నుంచి వలిగొండ వరకు దాదాపు 42 కిలోమీటర్ల మేర విస్తరణ
- రూ. 516 కోట్లతో త్వరలోనే ఎన్‌హెచ్‌-565 నకిరేకల్ నుంచి నాగార్జునసాగర్ మధ్యలో 14 కిలోమీటర్ల మేర 4 లేన్ బైపాస్ పనులు
- రూ.1082.56 కోట్లతో త్వరలో ఎన్‌హెచ్‌-167ఓ పై కృష్ణానదిపై ఆంధ్రా, తెలంగాణ సరిహద్దుల్లో.. సోమశిల వద్ద 1.1 కిలోమీటర్ల మేర ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణం
- రూ.436.92 కోట్లతో ఎన్‌హెచ్‌-167ఓపై 13.4 కిలోమీటర్ల మేర.. ఈ ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్‌కు సంబంధించిన అప్రోచ్ రోడ్ల విస్తరణ పనులు
- రూ.674.92 కోట్లతో ఎన్‌హెచ్‌-930పీపై వరంగల్ జిల్లా తొర్రూరు నుంచి నెహ్రూ నగర్ వరకు దాదాపు 69.1 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు
- ఎన్‌హెచ్‌-930పీ పై నెహ్రూనగర్ నుంచి కొత్తగూడెం వరకు దాదాపు 52.1 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులకు రూ.826.71 కోట్లతో ప్రాజెక్టు మంజూరు
- ఎన్‌హెచ్‌-353సీ పై సిరోంచ (మహారాష్ట్ర) నుంచి ఆత్మకూరు వరకు దాదాపు 41.3 కిలోమీటర్ల మేర రోడ్డును నాలుగు లేన్లకు విస్తరించే పనులకు రూ.662.67 కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టుకు సంబంధించి టెండర్లు తుది దశకు చేరుకున్నాయి
- ఎన్‌హెచ్‌-63పై మహారాష్ట్ర సరిహద్దుల నుంచి బోధన్ వరకు దాదాపు 4.5 కిలోమీటర్ల మేర రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు రూ.4.97 కోట్ల విలువైన ప్రాజెక్టు టెండర్ స్టేజ్‌లో ఉంది
- ఎన్‌హెచ్‌-365పై నకిరేకల్ నుంచి తానంచర్ల (ఆంధ్రప్రదేశ్) వరకు దాదాపు 28.67 కిలోమీటర్ల మేర రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు రూ.18.72 కోట్ల విలువైన ప్రాజెక్టుకు పనులు ప్రారంభం కానున్నాయి
- ఎన్‌హెచ్‌-61పై నిర్మల్ నుంచి ఖానాపూర్ వరకు దాదాపు 3.24 కిలోమీటర్ల మేర రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు రూ.14.53 కోట్ల విలువైన ప్రాజెక్టు మంజూరైంది.
- ఎన్‌హెచ్‌-930పీ పై మహబూబాబాద్ నుంచి నెల్లికుదురు, తొర్రూరు నుంచి నెల్లికుదురు వరకు, తొర్రూరు నుంచి వలిగొండ వరకు, మహబూబాబాద్ నుంచి ఎల్లందు వరకు, గొరెల్లి నుంచి కొత్తగూడెం రోడ్డు వరకు దాదాపు 21.5 కిలోమీటర్ల మేర రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు రూ.29.61 కోట్ల విలువైన ప్రాజెక్టుకు పనులు ప్రారంభం కానున్నాయి
- ఎన్‌హెచ్‌-161బీబీ పై బోధన్‌-బాసర-భైంసా సెక్షన్‌లో దాదాపు 11.2 కిలోమీటర్ల మేర రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు రూ.16.45 కోట్ల విలువైన ప్రాజెక్టుకు టెండర్లకు ఆహ్వానం
- రూ.4.9 కోట్లతో ఎన్‌హెచ్‌-565పై నకిరేకల్ నుంచి నాగార్జునసాగర్ వరకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం
- రూ.2,338 కోట్లతో ఎన్‌హెచ్‌-63పై జగిత్యాల నుంచి మంచిర్యాల వరకు 63.60 కిలోమీటర్ల మేర రోడ్డును నాలుగు లేన్లకు విస్తరించడం
- రూ.2,548 కోట్లతో ఎన్‌హెచ్‌-63పై జగిత్యాల నుంచి మంచిర్యాల వరకు 66.295 కిలోమీటర్ల మేర రోడ్డును నాలుగు లేన్లకు విస్తరించే పనులు
- రూ.2,484 కోట్లతో ఎన్‌హెచ్‌-563పై జగిత్యాల నుంచి కరీంనగర్ వరకు 58.60 కిలోమీటర్ల మేర రోడ్డును నాలుగు లేన్లకు విస్తరించే పనులు
- రూ.2662 కోట్లతో హైదరాబాద్‌-పనాజీ ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా ఎన్‌హెచ్‌-167పై గూడెబెల్లూరు (పాలమూరు యూనివర్సిటీ దగ్గర) నుంచి మరికల్ వరకు 80.01 కిలోమీటర్ల మేర రోడ్డును నాలుగు లేన్లకు విస్తరణ పనులు ఈ సంవత్సరం ప్రారంభం
- హైదరాబాద్‌-పనాజీ ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా హసన్‌పూర్ (కర్ణాటక)/ కడూరు (పాలమూరు) వరకు 10.36 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మించేందుకు రూ.344 కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టు పనులు ఈ సంవత్సరం ప్రారంభం కానున్నాయి
- హైదరాబాద్ ఉత్తరాన గిర్మాపూర్ (మేడ్చల్ జిల్లా) నుంచి తంగడపల్లి వరకు నాలుగు లేన్లతో 161.518 కిలోమీటర్లతో గ్రీన్ ఫీల్డ్ రీజినల్ ఎక్స్‌ప్రెస్‌వేను రూ.13957 కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టుకు బిడ్‌లను ఆహ్వానించారు.
- ఎన్‌హెచ్‌-44పై ఆరు లేన్లతో కామారెడ్డి జిల్లా సీఎంసీ జంక్షన్ వద్ద అండర్ పాస్, సదాశివనగర్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి (మొత్తం 3.18 కిలోమీటర్లు) రూ.53.80 కోట్ల విలువైన ప్రాజెక్టుకు సంబంధించి బిడ్లను అధికారులు విశ్లేషిస్తున్నారు
- రూ.26.76 కోట్లతో త్వరలో ఎన్‌హెచ్‌-163పై హైదరాబాద్‌-యాదగిరిగుట్ట సెక్షన్‌లో ఆరు లేన్లతో ఒక కిలోమీటరు మేర అండర్ పాస్ నిర్మాణం

శాసన వ్యవస్థ నుంచి వచ్చే బిల్లులపై దయ ఉంచండి

ఆర్థిక మంత్రికి స్పీకర్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: 'ఆర్థిక వ్యవస్థ చాలా ఇబ్బందుల్లో ఉంది..కానీ, మా శాసన వ్యవస్థ నుంచి వచ్చే బిల్లులపైనా, మాపైనా దయ ఉంచండి' అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కి స్పీకర్ అయ్యన్నపాత్రుడు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ వద్ద మీడియా భవనాన్ని ప్రారంభించిన అనంతరం గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.5 కోట్లు ఖర్చయ్యే భవనాన్ని రూ.3.5 కోట్లతో మంత్రి నారాయణ, ఆర్థిక మంత్రి కేశవ్ పూర్తి చేశారని ఆయన చెప్పారు. మీడియా పాయింట్, క్యాంటిన్, విప్‌ల కోసం 16 చాంబర్లు ఈ భవనంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మీడియా ప్రతినిధులకు కూర్చోవడానికి కుర్చీలు, రాసుకోవడానికి బల్లలు ఏర్పాటు చేస్తామన్నారు. కొత్తగా కడుతున్న అసెంబ్లీకి త్వరలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను తీసుకుని వెళ్లి చూపించి, వారి సలహాలు తీసుకుంటామని మంత్రి నారాయణ చెప్పారు.

జల విద్యుత్ ముఖ్య పాత్ర పోషిస్తోంది

సాక్షి, అమరావతి: విద్యుత్ డిమాండ్‌ను అందుకోవడంలో జల విద్యుత్ ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితిపై ట్రాన్స్‌కో, జెన్‌కో యాజమాన్యాలతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది జూలై నుంచి రోజుకు సగటున 15.5 మిలియన్ యూనిట్ల జల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందన్నారు. శ్రీశైలం కుడిగట్టు నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ జెన్‌కో మొత్తం ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తోందన్నారు.

పనిగంటలు పెంపుపై ప్రజాసంఘాల నిరసన

సాక్షి, అమరావతి: పనిగంటలు పెంచాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పలు ప్రజా సంఘాలు అక్టోబర్ 7న సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ రైతు, కౌలురైతుల సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త నిరసన చేపట్టనున్నాయి. ఆయా సంఘాల సంయుక్త సమావేశం విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో రైతు సంఘం కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. ఇందులో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ..నిరసనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అధికారులకు వినతిపత్రాలు అందిస్తామని చెప్పారు.

ఇదీ అప్పటి సీఎం వైఎస్ జగన్ మాట

'రాష్ట్రంలో చిన్న పిల్లలు ఎవరూ ఖరీదైన వైద్యం అందక మృతి చెందకూడదు. తన బిడ్డను అనారోగ్యం నుంచి కాపాడుకోలేకపోయాను అన్న బాధ ఏ తల్లి పడకూడదు. భావితరాల యువతను ఆరోగ్యంగా అందించే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుంది. ఖరీదైన వైద్యం ఉచితంగా అందించే బాధ్యత తీసుకుంటున్నాం. ఎంత ఖర్చైనా , ఎలాంటి వ్యాధి అయినా సరే పిల్లలను రక్షించుకోవడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాధ్యత. అనారోగ్య సమస్యతో ఏ ఒక్కరూ పొరుగు రాష్ట్రాలకు వెళ్లకుండా ప్రపంచ స్థాయి వైద్య ప్రమాణాలతో చిన్నపిల్లల కోసం శ్రీ పద్మావతి చిన్నపిల్లల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మిస్తున్నాం. రెండేళ్లలో ఈ ఆసుపత్రి ప్రారంభించుకొని పిల్లలకు పునర్జన్మను ప్రసాదించే దేవాలయంగా కొనసాగుతుంది' అని నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉద్ఘాటించారు.

చిన్నపిల్లల ఆసుపత్రికి గ్రహణం

- మల్టీ సూపర్ స్పెషాలిటీపై చిన్నచూపు
- నిధులు విడుదల చేయకుండా వేధింపులు
- వైఎస్ జగన్ మానసపుత్రికని ఆసుపత్రిపై అక్కసు
- నెలల తరబడి సాగదీస్తున్న భవన నిర్మాణ పనులు
- 2024 జూలైలో ప్రారంభించాలని సంకల్పించిన నాటి ప్రభుత్వం
- పనులు పూర్తి చేసేందుకు మీనమేషాలు లెక్కిస్తున్న టీటీడీ

జగన్‌పై కక్ష.. చిన్నారులకు శిక్ష

తిరుపతి తుడా : తీవ్రమైన అనారోగ్య సమస్యల నుంచి చిన్నపిల్లలను కాపాడి ఆరోగ్యవంతమైన భావితరాన్ని ఆవిష్కరించేందుకు తిరుపతి లో శ్రీవారి పాదాల చెంత అలిపిరి సమీపంలో శ్రీ పద్మావతి చిన్నపిల్లల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని స్థాపించాలని నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పించారు. రాష్ట్రంలో చిన్న పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యాన్ని అందించే ఆసుపత్రి ఇప్పటి వరకు లేదు. ఆ లోటును అధిగమిస్తూ మొత్తం 15 రకాల ప్రత్యేక విభాగాల సామర్థ్యంతో అత్యాధునిక వైద్య సేవలను అందించాలని భావించారు. ఈ ఆసుపత్రి తన మానస పుత్రికగా ప్రకటిస్తూ 2022 మే 5వ తేదీన శ్రీవారి పాదాల చెంత అలిపిరి సమీపంలో భూమి పూజ చేశారు. రెండేళ్ల లో భవన నిర్మాణాలు పనులు పూర్తి చేసుకుని, వైద్య పరికరాలు కొనుగోలు, సిబ్బంది నియామకం ప్రక్రియ పూర్తి కావాలని టీటీడీ అధికారులను ఆదేశించారు. ఇందుకు తగ్గట్టే 2024 జూలైలో ఆసుపత్రిని ప్రారంభించేలా టీటీడీ సైతం యుద్ధ ప్రాతిపదికన పనులను దాదాపుగా పూర్తి చేసింది.

కార్డియాక్ సెంటర్‌తోనే ప్రేరణ

అభం శుభం తెలియని పసిపిల్లలు గుండె సమస్యతో బాధపడుతూ మృత్యువాత పడుతున్న విషయాన్ని గుర్తించిన నాటి సీఎం వైఎస్ జగన్ తిరుపతిలో శ్రీ పద్మావతి చిన్నపిల్లల కార్డియాక్ కేర్ సెంటర్‌ను 2022లో ప్రారంభించారు. ఈ ఆసుపత్రి అనతి కాలంలోనే ప్రాచుర్యం పొందింది. వేల మందికి గుండె సంబంధిత సమస్యలను పరిష్కరించి పిల్లల పాలిట సంజీవినిగా మారింది. ఇప్పటి వరకు 20 మందికి గుండె మార్పిడి చికిత్సలను విజయవంతంగా అందించింది. పొరుగు రాష్ట్రాల నుంచి కాక బంగ్లాదేశ్ నుంచి సైతం వచ్చి ఇక్కడ గుండె సంబంధిత వైద్య సేవలను ఉచితంగా పొందారు. ఈ ఆసుపత్రి పురుడు పోసుకున్న అనతి కాలంలోనే సత్ఫలితాలు వచ్చాయి. ఇదే ప్రేరణతో చిన్న పిల్లలకు గుండె సంబంధిత వైద్యమే కాదు మొత్తం 15 రకాల ప్రత్యేక విభాగాలతో ప్రపంచ స్థాయి వైద్య ప్రమాణాలతో సూపర్ స్పెషాలిటీ వైద్యం అవసరమని భావించారు. ఈ బాధ్యతను టీటీడీకి అప్పగించారు. చక చకా అనుమతులు పొంది 2022 మే 5వ తేదీన ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ చేశారు.

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తిరుపతిలో గుండె చికిత్సల కోసం ప్రారంభించిన చిన్నపిల్లల ఆసుపత్రి .. నేడు నిధులు లేక ఆగిపోయిన దృశ్యం



15 విభాగాలతో ...

చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని 15 విభాగాలతో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలానే అవయవ మార్పిడి, ఇతర అత్యవసర వైద్య సేవల కోసం భవనంపై హెలీప్యాడ్‌ను నిర్మించాలని, ఆ దిశగా డిజైన్ చేశారు. ఈ ఆసుపత్రిలో చిన్నపిల్లల కార్డియాలజీ, న్యూరాలజీ ,న్యూరో సర్జరీ, పల్మనాలజీ, ఆర్థో, అంకాలజీ వంటి మొత్తం 15 ప్రత్యేక విభాగాలను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టారు. అత్యాధునిక ఐసీయూ, ఆర్‌ఐసీయూ, 8 ఆపరేషన్ థియేటర్లు, ఎంఆర్‌ఐ, సిటీ యంత్రాలు, ఆధునిక ల్యాబ్ ఉండేలా ప్రణాళికలు చేశారు.

నిధులు మంజూరు కాకుండా అడ్డుపడి..

ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా ప్రారంభించారు. అంతే వేగంగా పనులు చకచకా సాగిపోయాయి. అంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన నిధులతో 2024 చివర వరకు పనులు కొనసాగాయి. టీటీడీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టింది. టీటీడీలో నిర్మిస్తున్న పలు భవనాలను సందర్శించింది. ఈ క్రమంలో చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవనాన్ని సందర్శిస్తూ టీటీడీకి ఇంత భారం అవసరమా అంటూ పాలకవర్గంలోని ఓ ముఖ్యమైన వ్యక్తి తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే కొంత మంది బోర్డు సభ్యులు కలగజేసుకొని చిన్న పిల్లల వైద్యం కోసం టీటీడీ ఖర్చు చేయడం ఏ మాత్రం తప్పు కాదని, పనులు పూర్తి చేయకపోతే చెడ్డపేరు వస్తుందని ఆ వ్యక్తికి సూచించారు. భవన నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఈ సమయంలో ఆసుపత్రిని అర్ధాంతరంగా వదిలేస్తే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకత తప్పదని ఒకరిద్దరు బోర్డు సభ్యులు హెచ్చరించారు. ఆ ముఖ్యమైన వ్యక్తి అయిష్టంగానే అంగీకరించినా ఆపై తన వక్రబుద్ధిని ప్రదర్శించారు. ఆసుపత్రి నిర్మాణానికి ఎక్కువ నిధులు కేటాయించారంటూ నిధులు మంజూరు కాకుండా అడ్డు పడ్డారు. గడిచిన ఏడెనిమిది నెలలుగా నిధులు మంజూరు చేయకుండా చక్రం తిప్పారు. దీంతో పనులను అర్ధాంతరంగా ఆగిపోయాయి.

ఆసుపత్రి పేరు	శ్రీ పద్మావతి చిన్నపిల్లల మల్టీ సూపర్ స్పెషాలిటీ
నిర్వహణ బాధ్యత	టీటీడీ
వైద్య సేవలు	పూర్తిగా ఉచితం
ఆసుపత్రి నిర్మాణ వ్యయం	రూ.320 కోట్లు
ఆస్పత్రి విస్తీర్ణం	4 లక్షల 11 వేల 325 చదరపు అడుగులు
అంతస్తులు	ఆరు
బెడ్ల సామర్థ్యం	350
ఆసుపత్రిలో విభాగాలు	మొత్తం 15
ఆసుపత్రి ప్రత్యేకత	అత్యవసర వైద్య సేవలు కోసం భవనంపైనే హెలిప్యాడ్ నిర్మాణం

పాలక మండలిలో భిన్నాభిప్రాయాలు

ఈ ఆస్పత్రి పూర్తి చేసే విషయంలో టీటీడీ పాలక మండలి వేర్వేరు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. పాలకవర్గ అధిపతిగా ఉన్న వ్యక్తితో పాటు మరో నలుగురు ఆస్పత్రి పట్ల వ్యతిరేకతతో ఉన్నట్లు సమాచారం. కోట్లాది రూపాయల భారం టీటీడీ ఎందుకు భరించాలంటూ ఆ ఐదుగురు ఆసుపత్రిని వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే ఆసుపత్రి నిర్మాణంలో అవకతవకలు జరిగాయంటూ బురదజల్లి ఆసుపత్రిని అడ్డుకుందామంటూ చర్చించినట్లు తెలుస్తోంది. అయితే ఎక్కువ మంది బోర్డు సభ్యులు వైద్యం కోసం టీటీడీ ఎంత ఖర్చు పెట్టినా తప్పేమీ లేదని, ముఖ్యంగా చిన్న పిల్లలకు సంబంధించిన ఆసుపత్రి కాబట్టి వెంటనే నిధులు మంజూరు చేసి పనులు పునః ప్రారంభించేలా చొరవ తీసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందంటూ కుండలు బద్దలు కొడుతున్నారు. అయినా ఆ వ్యక్తి మనసు కరగకపోవడంపై బోర్డు సభ్యులు అసంతప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆసుపత్రిని పూర్తి చేయకపోతే కూటమి ప్రభుత్వానికి ప్రజా వ్యతిరేకత తప్పదని, దేవుడితో సమానమైన చిన్న పిల్లల విషయంలో మీనమేషాలు లెక్కించడం మంచిది కాదని జిల్లాకు చెందిన కొంతమంది టీటీడీ బోర్డు సభ్యులు తెగేసి చెప్పినా ఆ వ్యక్తి మాత్రం వినీ విననట్లు వదిలేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. చిన్నపిల్లల ఆసుపత్రి విషయంలో ఇంతలా పట్టుబట్టడం మంచిది కాదని టీటీడీ అధికారులు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్ జగన్‌కు పేరొస్తుందనే..

నాటి సీఎం వైఎస్ జగన్ తన మానస పుత్రికగా ప్రకటించి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని పట్టాలెక్కించారు. రాష్ట్రంలో ఎక్కడైనా విధంగా ప్రపంచ స్థాయి వైద్య ప్రమాణాలతో ఈ ఆసుపత్రిని ప్రారంభిస్తే వైఎస్ జగన్‌కు పేరొస్తుందనే అక్కసుతోనే పనులను కొనసాగించకుండా నేటి ప్రభుత్వంలోని కూటమి నేతలు అడ్డుకట్ట వేశారు. ఆసుపత్రిని పూర్తి చేయకుండా కాకమ్మ కథలు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. నిధులు మంజూరు చేయకుండా పనులను కొనసాగకుండా టీటీడీ బోర్డులోని ముఖ్యమైన వ్యక్తి అడుగడుగునా అడ్డుపడుతున్నట్లు తెలుస్తోంది. ఏడాది క్రితమే ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకు రావాల్సి ఉండగా మరో రెండేళ్ల పాటు సాగదీసి ఆపై నిర్ణయం తీసుకునేందుకు కుట్రలు పన్నుతున్నట్లు తెలుస్తోంది.

ఫేజ్-1 ఫిషింగ్ హార్బర్ల పనులు అధికశాతం పూర్తి

శాసనసభ ప్రశ్నోత్తరాల్లో మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఫేజ్-1 కింద నిర్మాణంలో ఉన్న ఫిషింగ్ హార్బర్ల పనులు అధిక శాతం పూర్తయినట్లు పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన శాఖ.. ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. శాసనసభలో గురువారం ప్రశ్నోత్తరాల్లో సభ్యులడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. జువ్వలదిన్నె 97 శాతం, నిజాంపట్నం 81 శాతం, మచిలీపట్నం 70 శాతం, ఉప్పాడ 23 శాతం పనులు కాగా.. మిగిలిన వాటిని పూర్తిచేసి త్వరలో ప్రారంభంలోకి తీసుకొస్తామన్నారు. ఫేజ్-2 కింద మరో ఆరు ఫిషింగ్ హార్బర్లను కేంద్రం కేటాయించిందన్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.365 కోట్లు కేటాయించగా ఆయా ప్రాంతాల్లో అంతమొత్తం ఖర్చుచేసినా పెద్దగా ఆదాయాలు వచ్చే అవకాశం లేకపోవడంతో బుడగట్లపాలెంలో రూ.126 కోట్ల అంచనాతో డీపీఆర్ సిద్ధంచేశామన్నారు. త్వరలో టెండర్లు పిలుస్తామని మంత్రి చెప్పారు.

మహిళాభివృద్ధిలో కుట్టుమిషన్ల దగ్గరే ఆగిపోయాం..

సాంకేతికతలో మార్పులొస్తుంటే మహిళాభివృద్ధిలో కుట్టు మిషన్ల దగ్గరే ఆగిపోయామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విమర్శించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత జవాబుకు స్పందించారు. మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చినప్పటికీ ఉపాధి లభించడంలేదని ఎద్దేవా చేశారు. శిక్షణా కేంద్రాల్లో సరైన మెటీరియల్, మిషన్లు ఇవ్వట్లేదని మహిళలు ఆందోళన వ్యక్తంచేస్తున్నట్లు చెప్పారు. తాగునీరు లేక, వాష్‌రూమ్స్ సౌకర్యం కల్పించకపోవడంతో శిక్షణ కేంద్రాల్లో మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు.

రాష్ట్రంలో పింఛన్లు 63.71 లక్షలే..

రాష్ట్రంలో ఈ జూన్ నాటికి 63,71,342 పింఛన్లను మాత్రమే అందిస్తున్నట్లు ప్రభుత్వం రాతపూర్వకంగా సమాధానం ఇచ్చింది. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నకు సంబంధిత మంత్రి స్వయంగా ప్రకటన చేయకుండా లిఖితపూర్వకంగా బదులిచ్చారు. 2024 జూన్ నాటికి 65,18,496 పింఛన్లు ఉంటే 2025 జూలై నాటికి 63,71,342 పింఛన్లు ఉన్నట్లు అందులో పేర్కొన్నారు. దీంతో 1,47,154 పింఛన్లు తొలగించినట్లు పరోక్షంగా అంగీకరించినట్లయింది. అయితే, ఈ ఏడాదిలో 1.58 లక్షల కొత్త పింఛన్లు ఇచ్చినట్లు చెప్పడం గమనార్హం. ఇక నిరుద్యోగ యువతకు ఆర్థిక సాయంపై అడిగిన మరో ప్రశ్నకు సైతం ఎలాంటి సాయం అందించట్లేదని రాతపూర్వకంగానే ప్రభుత్వం తెలిపింది.

పది ప్రశ్నల్లో ఐదింటికే సమాధానాలు..

శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో గురువారం పది ప్రశ్నల లిస్టు ఉంటే కేవలం ఐదు ప్రశ్నలకు మాత్రమే మంత్రుల ద్వారా సమాధానం లభించింది. మూడు ప్రశ్నలకు ఆయా శాఖల మంత్రులు అందుబాటులో లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు సభాపతి ప్రకటించారు.

సమాచార కమిషనర్ల ఎంపికకు స్క్రీనింగ్ కమిటీ

ఉత్తర్వులు జారీ చేసిన సాధారణ పరిపాలన శాఖ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్, సమాచార కమిషనర్ల ఎంపికకు అధికారులతో స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేస్తూ సాధారణ పరిపాలన శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ కమిటీకి చైర్మన్‌గా, న్యాయ శాఖ కార్యదర్శి సభ్యునిగా, సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్య కార్యదర్శి సభ్య కన్వీనర్‌గా ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రధాన సమాచార కమిషన్‌కు, సమాచార కమిషనర్ల పదవులకు వచ్చిన దరఖాస్తులను స్క్రీనింగ్ కమిటీ వడపోసి పేర్ల సంక్షిప్త జాబితాను రూపొందించాలి. ఆ జాబితా సిఫార్సులను ముఖ్యమంత్రి నేతృత్వంలోని కమిటీకి పంపించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

ఆధరణ ఏది?

రైతులకు ఫలితం ఇవ్వని అరటి
చెట్లపైనే కాయలు ధర లేక వెతలు
టన్ను రూ.5000కు పడిపోయిన ధైనం

సాక్షి రాయచోటి : పండ్ల తోటల రైతులు పతనమవుతున్నారు. కూటమి సర్కార్ పట్టించుకోకపోతే అన్నదాత నష్టాల ఊబిలోకి వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది. మొన్నటికి మొన్న టమాట, అంతకు ముందు మామిడి, పది రోజుల కిందట బొప్పాయి ధరలు పతనం కావడంతో తల్లడిల్లిన అన్నదాతకు గోరుచుట్టుపై రోకలి పోటులా అరటి ధరలు గణనీయంగా తగ్గిపోయాయి. వారం, పదిరోజుల ముందు వరకు రూ. 15-18 వేలు పలికిన టన్ను అరటి ఒక్కసారిగా రూ. 5-7 వేలలోపు పడిపోవడంతో రైతు కుదేలవుతున్నాడు. వ్యాపారుల తీరుపై భగ్గుమంటున్నారు. అయితే ఇతర రాష్ట్రాల్లో వర్షాలు పడుతుండడం, ఇతర అనేకకారణాలతోనే ధరలు తగ్గినట్లు ఉద్యానశాఖ అంచనా వేస్తోంది.

ఎంత కష్టం

పండ్ల తోటల రైతు పరిస్థితి చూస్తే అయ్యోపాపం అనిపించక మానదు. ప్రకృతి ప్రతిసారి ఏదో ఒక రూపంలో పంటలను దెబ్బతీస్తూనే ఉంది. గతంలోనూ పెనుగాలుల బీభత్సంతో అరటి, మామిడి, బొప్పాయి తోటలు నేలకూలాయి. ఈసారి దిగుబడులు ఆశాజనకంగా కనిపిస్తున్నా ధరలు లేకపోవడం చూసి రైతులు లబోదిబోమంటున్నారు.



రవాణాకు సిద్ధం చేసిన అరటి గెలలు

గతంలో వైఎస్సార్ సీపీ హయాంలో మంచి ధరతో అమ్ముకుంటూ వచ్చారు. ఎప్పుడూ ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదురు కాలేదు.

అరటిలో అనేక రకాల సాగు

అన్నమయ్య జిల్లాలో అరటి పంట రైల్వేకోడూరు, రాజంపేటతోపాటు ఇతర ప్రాంతాల్లో విస్తారంగా సాగు చేస్తారు. ప్రధానంగా సుగంధాలు, టిష్యూ కల్చర్, చక్కెర కేళి, అమృత పాణి, జీ9, ఏలకలు, రెడ్ బనానా సాగు చేస్తున్నారు. జిల్లాలో 13 వేల ఎకరాలకు పైగా సాగులో ఉంది. అనేక రకాల ప్రకృతి ఒడిదుడుకులు....తెగుళ్ల, చీడపీడలను తట్టుకుని పంట చేతికి వచ్చిన తర్వాత ధర తగ్గించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. అరటి ధర ఒక్కసారిగా పతనం కావడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. గతంలోనూ ఒక్కసారిగా బొప్పాయి ధరలను వ్యాపారులు భారీగా తగ్గించారు. అయితే తర్వాత ప్రభుత్వం జోక్యం చేసుకోవడంతో సమస్య కొంత సద్దుమణిగింది. ఈలోపే మళ్లీ అరటి ధరలు ఒక్కసారిగా టన్ను రూ. 5-7 వేల మధ్యకు రావడంపై ఏం జరిగిందన్నది అర్థం కావడం లేదు. ఇక్కడి అరటి ఎక్కువగా హైదరాబాద్, చెన్నై, విజయవాడ ప్రాంతాలకు వెళుతుంటుంది. ఇటీవలి కాలం వరకు ధరలు బాగున్నా ఇప్పుడు పడిపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే 40 శాతంకు పైగా దిగుబడులు రైతులు అమ్ముకున్నట్లు ఉద్యానశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా అరటి రైతు పరిస్థితి చూస్తే ధర లేక..కాయలు కోయలేక..ఏం చేయాలో అర్థం కాక అల్లాడి పోతున్నాడు.

విజయదశమికి పెరిగే అవకాశం

జిల్లాలో అరటికి సంబంధించి ఇప్పటికే 1.10 లక్షల టన్నులు విక్రయాలు జరిగాయి. ప్రస్తుతం రెండో క్రాప్‌కు సంబంధించి 70-75 వేల టన్నులు మాత్రమే ఉంటాయి. జూన్, జులై, ఆగస్టుల్లో మంచి ధరలు వచ్చాయి. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో వర్షాలు పడుతుండడం, ఇతర కారణాలతో కొంతమేర తగ్గాయి. విజయదశమి పండుగ నేపథ్యంలో ధరలు పెరిగే అవకాశం ఉంది.

– సుభాషిణి,
జిల్లా ఉద్యానశాఖ అధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా

తీవ్రంగా నష్టపోయాం



ఆదాయం బాగుంటుందని ఈ ఏడాది 5 ఎకరాల్లో అరటి సాగు చేశాను. మొదట్లో రేటు బాగా ఉన్న కాయలు కోతకు వచ్చే సమయానికి ఒక్కసారిగా ధరలు పడిపోయాయి. కాయలు కొట్టేందుకు వ్యాపారులు కూడా రాకపోవడంతో పొలంలోనే అరటికాయలు మాగిపోవడంతో తీవ్రంగా నష్టపోయాం. పెట్టుబడి కూలీల ఖర్చులు కూడా రాలేదు.

– టంగుటూరి రాజశేఖర్ రెడ్డి, పున్నాటివారిపల్లె, ఓబులవారిపల్లె

కోలుకోలేని స్థితిలో ఉన్నాం



అరటి ధరలు భారీగా పతనం కావడంతో కోలుకోలేని స్థితిలో ఉన్నాం. ఇప్పటికే నష్టాల్లో ఉన్న తాము గట్టెక్కుతామని భావించి అరటి సాగు చేశాం. తీరా పంట చేతికొచ్చే తరుణంలో ధరలు దారుణంగా పతనమయ్యాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తే పెట్టుబడులు సైతం చేతికి వచ్చే పరిస్థితులు లేవు. అందువల్ల పంటను కోయడానికి కూడా సాహసించడం లేదు.

– టి.ప్రభాకర్‌రెడ్డి, రైతు, అనంతపల్లి, పుల్లంపేట మండలం

ఒడ్డున ఆగిన బతుకు పడవలు

ఆశాజనకంగా లేని వేట



హార్బర్‌లో బోట్లు

తగ్గిన చేపల లభ్యత.. హార్బర్‌కే పరిమితమైన బోట్లు
వలసపోతున్న మత్స్యకారులు.. ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి

సముద్రమే జీవనాధారంగా బతికే గంగపుత్రుల జీవితాలు.. ఇప్పుడు అలల తాకిడికి కొట్టుకుపోతున్నాయి. ఎన్నో ఆశలతో ప్రారంభమైన వేట సీజన్.. వారి ఆశలను ఆవిరి చేస్తూ కన్నీటి గాథగా మారుతోంది. లక్షలు పెట్టుబడిగా పెట్టి సముద్రంలోకి వెళ్తే, కనీసం డీజిల్ ఖర్చులు కూడా రాక, బోట్లను ఒడ్డుకే కట్టేసి నిస్సహాయంగా చూస్తున్నారు. విశాఖ ఫిషింగ్ హార్బర్.. ఒకప్పుడు వేలాది బోట్ల రాకపోకలతో, మత్స్యకారుల కోలాహలంతో సందడిగా ఉండేది. కానీ ఇప్పుడు 80 శాతానికి పైగా బోట్లు లంగరేసుకుని నిశ్శబ్దంగా రోదిస్తున్నాయి.

– మహారాణిపేట

తూర్పు తీరంలో మత్స్యకారుల బతుకుచిత్రం ఆందోళనకరంగా మారింది. వేట సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడిచినా, వారి వలలకు ఆశించిన సంపద చిక్కడం లేదు. వేటకు వెళ్తే లక్షల్లో ఖర్చు, తిరిగి వస్తే కనీసం పెట్టిన పెట్టుబడి కూడా దక్కని దుస్థితి. దీంతో విశాఖ ఫిషింగ్ హార్బర్‌లోని 643 బోట్లకు గాను కేవలం 150 బోట్లు మాత్రమే నామమాత్రంగా వేటకు వెళ్తున్నాయి. సుమారు 80 శాతానికి పైగా మరబోట్లు ఒడ్డుకే పరిమితమై, అప్రకటిత వేట విరామాన్ని పాటిస్తున్నాయి. ఉపాధి లేక ఎందరో మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలసపోతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

ఆరంభ శూరత్వమే..

విశాఖ చేపల రేవు తూర్పు తీరానికి కేంద్రంగా ఉంది. జూన్ 15న వేట నిషేధం ముగిసినప్పుడు మత్స్యకారులు ఎన్నో ఆశలతో సముద్రంలోకి అడుగుపెట్టారు. తొలి రెండు నెలలు చేపలు, రొయ్యల దిగుబడి జోరుగా సాగడంతో ఈ సీజన్ తమను ఆదుకుంటుందని భావించారు. కానీ ఆగస్టు నుంచి పరిస్థితి తలకిందులైంది. చేపల లభ్యత క్రమంగా తగ్గుతూ వచ్చి, సెప్టెంబర్ నాటికి పూర్తిగా పడిపోయింది. దీంతో వేట గిట్టుబాటు కాక.. యజమానులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. 15 రోజుల వేటకు సుమారు రూ. 3.5 లక్షలు ఖర్చవుతుంటే, కనీస ఆదాయం కూడా రాకపోవడంతో బోట్లను హార్బర్‌లోనే నిలిపివేయడమే శ్రేయస్కరమని భావిస్తున్నారు. కాగా.. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు కోట్లాది రూపాయల విలువ చేసే మత్స్య దిగుబడులు వచ్చాయని మత్స్య పరిశ్రమ వర్గాలు చెబుతుంటే.. సుమారు 40 శాతం మేర తగ్గిపోయాయని వ్యాపారులు అంటున్నారు.

ట్యూనా వేటదీ అదే కథ

అధిక ధర పలికే ట్యూనా చేపల లభ్యత కూడా అంతంతమాత్రంగానే ఉంది. 70 నుంచి 100 వరకు బోట్లు ట్యూనా కోసం వెళ్లినా, ఆశించిన ఫలితం దక్కడం లేదు. నాణ్యమైన గ్రేడ్-1 ట్యూనా చేపలు దొరికినా, వాటిని 48 గంటల్లోపు ఎగుమతి చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు విశాఖ హార్బర్‌లో లేవు. దీంతో చేతికొచ్చిన అవకాశాన్ని కూడా జారవిడుచుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కాగా.. జిల్లాలో 32 మత్స్యకార గ్రామాలు, సుమారు 1.5 లక్షల జనాభా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇప్పుడు వేట సంక్షోభంలో కూరుకుపోవడంతో వేలాది కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

కారణాలెన్నో.. కష్టాలెన్నో..

మత్స్య సంపద తగ్గడానికి ప్రధాన కారణం సముద్ర వాతావరణంలో వస్తున్న మార్పులేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సముద్ర ఉపరితలం వేడెక్కడంతో చేపలు, రొయ్యలు చల్లదనం కోసం లోతైన ప్రాంతాలకు వెళ్లిపోతున్నాయి. అంత లోతుకు వెళ్లి వేటాడే సాంకేతికత, వనరులు సాధారణ మత్స్యకారులకు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. దీనికి తోడు, పరిశ్రమల నుంచి వెలువడే రసాయన వ్యర్థాలు సముద్రంలో కలవడం వల్ల కాలుష్యం పెరిగిపోయి, మత్స్య సంపద నశించిపోతోందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీజిల్ భారం పెరిగిపోవడంతో వేట గిట్టుబాటు కావడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



ప్రభుత్వం తక్షణమే స్పందించి మత్స్యకారులను ఆదుకోవాలి. పెరిగిన డీజిల్ ధరలు, తగ్గిన వేటతో గంగపుత్రుల బతుకులు కష్టాల్లో ఉన్నాయి. పెట్టుబడి కూడా తిరిగి రాక అప్పుల పాలవుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి, మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలి.

– వాసుపల్లి జానకీరామ్,
వైఎస్సార్ సీపీ నాయకుడు

మత్స్య పరిశ్రమను కాపాడండి



మత్స్య పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో ఉంది. ఇది కేవలం మత్స్యకారుల సమస్య కాదు, మొత్తం పరిశ్రమ భవిష్యత్తు ప్రశ్నార్థకంలో పడింది. గత ఏడాది కూడా ఇదే పరిస్థితి. ప్రభుత్వం దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి సారించి, గిట్టుబాటు ధరలు కల్పించి, పరిశ్రమకు చేయూతనివ్వాలి. లేకపోతే ఈ వృత్తి కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

– సూరాడ సత్యనారాయణ(సత్తిబాబు),
ఉపాధ్యక్షులు, వైశాఖి మరపడవల సంఘం

సాక్షి సినిమా

గ్యాప్ ఇవ్వలా... వచ్చింది!



కాజల్ · తమన్నా · సమంత · శ్రుతీహాసన్ · రకుల్ ప్రీత్‌సింగ్



నిత్యామీనన్ · సాయిపల్లవి · కృతీ శెట్టి

'ఏంట్రోయ్ గ్యాప్ ఇచ్చావ్..' (మురళీ శర్మ), 'ఇవ్వలా... వచ్చింది...' (అల్లు అర్జున్) అనే డైలాగులు 'అల వైకుంఠపురములో...' సినిమాలో బాగా పాపులర్ అయ్యాయి. కొందరు కథానాయికల కెరీర్ విషయంలో ఈ డైలాగులు కరెక్టుగా సరిపోయాయనిపిస్తోంది. తెలుగులో ఒకప్పుడు వరుస సినిమాలు, ఫుల్ క్రేజ్‌తో బిజీ బిజీగా దూసుకెళ్లిన పలువురు హీరోయిన్లకు ప్రస్తుతం టాలీవుడ్‌లో గ్యాప్ వచ్చింది. అయితే ఆ గ్యాప్ కావాలని ఇచ్చింది కాదు... ఇతర భాషల్లో పలు ప్రాజెక్టులతో బిజీగా ఉండటం, ఇక్కడ సరైన కథ, పాత్ర కుదరకపోవడం కూడా ఈ గ్యాప్‌కి కారణం అని చెప్పొచ్చు. తమ అభిమాన హీరోయిన్ల సినిమా ఎప్పుడొస్తుందా అని టాలీవుడ్ ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. తెలుగులో గ్యాప్ వచ్చిన కథానాయికలెవరో ఓ లుక్కేద్దాం.

పచ్చజెండా ఊపుతారా?

తెలుగు చిత్ర పరిశ్రమలో దాదాపు రెండు దశాబ్దాల ప్రయాణం కాజల్ అగర్వాల్‌ది. తేజ దర్శకత్వంలో కల్యాణ్ రామ్ హీరోగా నటించిన 'లక్ష్మీ కళ్యాణం' చిత్రంతో టాలీవుడ్‌కి హీరోయిన్‌గా పరిచయమయ్యారామె. 2007 ఫిబ్రవరి 15న ఈ సినిమా విడుదలైంది. ఆ తర్వాత కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'చందమామ' చిత్రంలో నటించారు కాజల్. ఆ సినిమా సూపర్ హిట్ కావడంతో కాజల్‌కి వరుస అవకాశాలు వచ్చాయి. 'ఆర్య 2, మగధీర, గోవిందుడు అందరివాడేలే, డార్లింగ్, మిస్టర్ పర్‌ఫెక్ట్, బిజినెస్ మేన్, బ్రహ్మోత్సవం, బృందావనం, టెంపర్, బాద్ షా, వీర, నేనే రాజు నేనే మంత్రి, సీత, ఖైదీ నంబర్ 150, భగవంత్ కేసరి'... ఇలా తెలుగులో వరుసగా సినిమాలు చేశారు కాజల్. స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన ఈ బ్యూటీకి తెలుగులో గ్యాప్ వస్తోంది. 'భగవంత్ కేసరి' సినిమా తర్వాత ఆమె లీడ్ రోల్‌లో నటించిన లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ 'సత్యభామ' 2024 జూన్ 7న విడుదలైంది. ఆ చిత్రం తర్వాత తెలుగులో అటు హీరోయిన్‌గా కానీ ఇటు లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ కానీ చేయలేదు కాజల్. అయితే మంచు విష్ణు హీరోగా రూపొందిన 'కన్నప్ప' చిత్రంలో పార్వతీ దేవి పాత్రలో కనిపించారామె. జూన్ 27న ఈ సినిమా విడుదలైంది. ప్రస్తుతం టాలీవుడ్‌లో ఆమె చేతిలో ఏ సినిమా లేనప్పటికీ తమిళ్, హిందీ సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నారు. మరి... టాలీవుడ్‌కి ఆమె పచ్చ జెండా ఊపుతారా? వేచి చూడాలి.

కొత్త కబురు ఎప్పుడు?

ఓ వైపు హీరోయిన్‌గా, మరోవైపు లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేస్తూ బిజీ బిజీగా దూసుకెళుతున్నారు తమన్నా. అంతేకాదు... ప్రత్యేక పాటల్లోనూ సందడి చేసి, అభిమానులను అలరిస్తుంటారామె. తెలుగులో ఆమె లీడ్ రోల్‌లో నటించిన 'ఓదెల 2' సినిమా ఈ ఏడాది ఏప్రిల్ 17న విడుదలైంది. ఆ సినిమా విడుదలై దాదాపు ఆర్నెల్లు కావస్తున్నా ఆమె మరో తెలుగు చిత్రానికి పచ్చజెండా ఊప లేదు. ఒకప్పుడు తెలుగులో వరుస సినిమాలతో స్టార్ హీరోయిన్లలో ఒకరిగా దూసుకెళ్లిన ఈ బ్యూటీకి ప్రస్తుతం మాత్రం గ్యాప్ వస్తోంది. ఆ మాటకొస్తే చిరంజీవి హీరోగా నటించిన 'భోళా శంకర్' (2023) చిత్రం తర్వాత ఆమె నటించిన ఒకే ఒక్క తెలుగు చిత్రం 'ఓదెల 2'. అంటే... ఈ రెండేళ్లలో ఆమె కేవలం రెండు తెలుగు సినిమాల్లో మాత్రమే నటించారు. ఈ మిల్కీ బ్యూటీకి టాలీవుడ్‌లో గ్యాప్ వస్తున్నప్పటికీ బాలీవుడ్‌లో మాత్రం వరుస సినిమాలు చేస్తూ ఫుల్ స్వింగ్‌లో ఉన్నారు. ప్రస్తుతం ఆమె 'రోమియో, రేంజర్, వి వన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' సినిమాలతో పాటు రోహిత్ శెట్టి చిత్రంలో నటిస్తున్నారు. ఈ నాలుగు సినిమాల్లో 'వి వన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తున్నారామె. అరుణభ్ కుమార్, దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సిద్ధార్థ్ మల్హోత్రా కీలక పాత్ర పోషిస్తున్నారు. మైథలాజికల్ హారర్, థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని బాలాజీ మోషన్ పిక్చర్స్, ది వైరల్ ఫీవర్ మోషన్ పిక్చర్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఈ సినిమా 2026 మే 15న విడుదల కానుంది. మరి... తమన్నా తెలుగుకి సంబంధించి కొత్త కబురు ఎప్పుడు వినిపిస్తారు? అన్నది వేచి చూడాలి.

రెండేళ్లు దాటినా...

తెలుగు చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగారు సమంత. పవన్ కల్యాణ్, మహేశ్‌బాబు, ఎన్టీఆర్, అల్లు అర్జున్, రామ్‌చరణ్, నాగచైతన్య, నాని, నితిన్, విజయ్ దేవరకొండ... ఇలా పలువురు హీరోలకి జోడీగా నటించారామె. అంతేకాదు.. తెలుగులో 'యశోద, శాకుంతలం' వంటి లేడీ ఓరియంటెడ్ చిత్రాల్లోనూ తనదైన నటనతో ఆకట్టుకున్నారు. విజయ్ దేవరకొండ సరసన హీరోయిన్‌గా నటించిన 'ఖుషి' (2023) చిత్రం తర్వాత సమంత మరో తెలుగు చిత్రంలో నటించలేదు. కాగా ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌ని స్థాపించి, సమంత నిర్మించిన తొలి చిత్రం 'శుభం'. ఈ ఏడాది మే 9న రిలీజ్ అయిన ఈ సినిమా మంచి విజయం సాధించి, నిర్మాతగా సమంతకు మంచి పేరు, లాభాలు తెచ్చిపెట్టింది. ఈ చిత్రంలో ఆమె అతిథి పాత్రలో కనిపించారు. ఇక 'ఖుషి' సినిమా 2023 సెప్టెంబరు 1న విడుదలై, హిట్‌గా నిలిచింది. ఈ మూవీ రిలీజై రెండేళ్లు దాటిపోయినా ఇప్పటికీ తెలుగులో మరో సినిమాకి పచ్చజెండా ఊపలేదు సమంత. అయితే తన సొంత ప్రొడక్షన్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించనున్న 'మా ఇంటి బంగారం' అనే లేడీ ఓరియంటెడ్ మూవీలో నటించనున్నట్లు ప్రకటించారు సమంత. అంతేకాదు... తన బర్త్ డే సందర్భంగా ఈ చిత్రం పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. అయితే ఈ సినిమా గురించి ఆ తర్వాత ఎలాంటి అప్‌డేట్ రాలేదు. ఇదిలా ఉంటే... సమంత ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' అనే హిందీ వెబ్ సిరీస్‌లో నటిస్తున్నారు.

నో అప్‌డేట్

టాలీవుడ్‌లో శ్రుతీహాసన్‌ది దాదాపు పదిహేనేళ్ల ప్రయాణం. దర్శకుడు కె. రాఘవేంద్ర రావు తనయుడు కె. ప్రకాశ్ తెరకెక్కించిన చిత్రం 'అనగనగా ఒక ధీరుడు' ద్వారా తెలుగుకి పరిచయం అయ్యారు శ్రుతీహాసన్. 2011 జనవరి 14న విడుదలైంది ఈ చిత్రం. ఆ తర్వాత 'ఓ మై ఫ్రెండ్' సినిమాలో నటించారు శ్రుతి. అయితే ఈ రెండు సినిమాలు పరాజయం కావడంతో ఆమెపై ఐరన్ లెగ్ అనే ముద్ర పడింది. ఆ తర్వాత పలు హిట్ చిత్రాల్లో నటించడంతో ఐరన్ లెగ్ అన్నవాళ్లే గోల్డెన్ లెగ్ అన్నారు. 'బలుపు, రామయ్యా వస్తావయ్యా, ఎవడు, రేసుగుర్రం, ఆగడు, శ్రీమంతుడు, ప్రేమమ్, కాటమరాయుడు, క్రాక్, వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, సలార్ పార్ట్ 1: సీజ్‌ఫైర్' వంటి సినిమాల్లో నటించి, ప్రేక్షకుల మెప్పు పొందారు శ్రుతీహాసన్. ప్రభాస్ హీరోగా నటించిన 'సలార్ పార్ట్ 1: సీజ్‌ఫైర్' చిత్రం 2023 డిసెంబరు 22న విడుదలైంది. ఆ సినిమా హిట్ అయినప్పటికీ ఆ తర్వాత శ్రుతీహాసన్ నటించనున్న మరో తెలుగు చిత్రంపై ఇప్పటికీ ఎలాంటి అప్‌డేట్ లేదు. 'సలార్' విడుదలై దాదాపు రెండేళ్లు కావస్తున్నా ఆమె నుంచి మరో తెలుగు సినిమా అనౌన్స్‌మెంట్ లేదు. అయితే 'సలార్ పార్ట్ 1: సీజ్‌ఫైర్'కి సీక్వెల్‌గా రూపొందనున్న 'సలార్ పార్ట్ 2: శౌర్యాంగ పర్వం'లో ఆమె పాత్ర ఉంటుందని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. తెలుగులో సినిమాలేవీ లేకున్నప్పటికీ తమిళ చిత్రాలు చేస్తున్నారు శ్రుతి. మరి... ఆమె నుంచి టాలీవుడ్‌లో కొత్త చిత్రం అప్‌డేట్ ఎప్పుడొస్తుందో చూడాలి.

మూడేళ్లు అయినప్పటికీ...

తెలుగు చిత్ర పరిశ్రమలో 'అలా మొదలైంది' చిత్రంతో ఆరంభమైంది మలయాళ కుట్టి నిత్యామీనన్ కెరీర్. నాని హీరోగా నందినీ రెడ్డి దర్శకత్వం వహించిన 'అలా మొదలైంది' చిత్రం 2011 జనవరి 21న విడుదలై, ఘన విజయం సాధించింది. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు నిత్య. ఆ తర్వాత తెలుగు-తమిళ ద్విభాషా చిత్రం '180'లో నటించారామె. అనంతరం పలు తమిళ, కన్నడ, మలయాళ చిత్రాల్లో నటించిన ఈ బ్యూటీ తెలుగులో నితిన్ హీరోగా నటించిన 'ఇష్క్' మూవీలో నటించి, మరో హిట్ అందుకున్నారు. ఆ తర్వాత 'ఒక్కడినే, జబర్‌దస్త్, గుండెజారి గల్లంతయ్యిందే, మళ్ళీ మళ్ళీ ఇది రాని రోజు, సన్నాఫ్ సత్యమూర్తి, ఒక్క అమ్మాయి తప్ప, జనతా గ్యారేజ్, భీమ్లా నాయక్' వంటి తెలుగు సినిమాల్లో తనదైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారామె. అయితే 'భీమ్లా నాయక్' చిత్రం రిలీజై మూడేళ్లు దాటిపోయినప్పటికీ మరో తెలుగు చిత్రంలో నటించలేదు నిత్య. ఆ సినిమా తర్వాత వరుసగా మలయాళ, తమిళ చిత్రాలకే పరిమితం అయ్యారామె. విజయ్ సేతుపతి-నిత్యామీనన్ జంటగా నటించిన తమిళ చిత్రం 'తలైవన్ తలైవి'. ఈ చిత్రం తెలుగులో 'సార్.. మేడమ్' పేరుతో విడుదలైంది. ఈ మూవీ ప్రమోషన్స్ కోసం హైదరాబాద్ వచ్చిన నిత్య తెలుగులో గ్యాప్ రావడంపై స్పందిస్తూ.. ''తెలుగు ప్రేక్షకులు నాపై చూపించిన ప్రేమ, అభిమానం మరచిపోలేను. తెలుగులో నేను కావాలని గ్యాప్ ఇవ్వలేదు... వచ్చిందంతే. సరైన కథ, పాత్ర కుదిరితే నటించడానికి ఎప్పుడూ సిద్ధమే'' అన్నారు. మరి రచయితలు, దర్శకులు ఆమెను దృష్టిలో పెట్టుకుని సరైన పాత్రలు రాస్తారేమో చూడాలి. ఏది ఏమైనప్పటికీ నిత్యామీనన్ తెలుగులో నటించే కొత్త సినిమా ప్రకటన కోసం వేచి చూడక తప్పదు.

రెండేళ్లయినా....

టాలీవుడ్‌కి కెరటంలా దూసుకొచ్చారు రకుల్ ప్రీత్ సింగ్. 2011 ఆగస్టు 26న విడుదలైన 'కెరటం' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలో కథానాయికగా ఎంట్రీ ఇచ్చారు రకుల్. ఆ చిత్రం తర్వాత తెలుగులో రెండేళ్ల గ్యాప్ వచ్చింది ఆమెకి. ఈ గ్యాప్‌లో తమిళంలో మూడు సినిమాలు చేసిన ఈ బ్యూటీ 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' చిత్రంతో తిరిగి టాలీవుడ్‌కి వచ్చారు. సందీప్ కిషన్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2013 నవంబరు 29న విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. ఆ తర్వాత తెలుగులో వరుస అవకాశాలు సొంతం చేసుకున్నారీ బ్యూటీ. 'లౌక్యం, కరెంట్ తీగ, పండగ చేస్కో, కిక్ 2, బ్రూస్‌లీ, నాన్నకు ప్రేమతో, సరైనోడు, ధృవ, రారండోయ్ వేడుక చూద్దాం, జయ జానకి నాయకి, స్పైడర్, మన్మథుడు 2, చెక్, కొండ పొలం, బూ' వంటి సినిమాల్లో నటించి, ప్రేక్షకులను అలరించారు రకుల్. 'బూ' చిత్రం 2023 మే 27న తెలుగు, తమిళ భాషల్లో విడుదలైంది. ఈ చిత్రం విడుదలై రెండేళ్లు దాటిపోయినప్పటికీ ఆమె నటించనున్న మరో తెలుగు సినిమాపై ఇప్పటివరకూ ఎలాంటి ప్రకటన లేదు. తెలుగులో రకుల్‌కి గ్యాప్ వచ్చినప్పటికీ తమిళ, హిందీ సినిమాలు చేస్తున్నారు. మరి... రకుల్ ప్రీత్‌సింగ్ తెలుగులో కొత్త సినిమా ప్రకటన ఎప్పుడు? అంటే కాలమే సమాధానం చెప్పాలి.

గ్రీన్ సిగ్నల్ ఇస్తారా?

'అమ్మాయిలు కాదు... అమ్మాయి... భానుమతి... ఒక్కటే పీస్... రెండు కులాలు... రెండు మతాలు... హైబ్రీడ్ పిల్ల' అంటూ తెలుగు ప్రేక్షకులను ఫిదా చేశారు సాయిపల్లవి. వరుణ్ తేజ్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన 'ఫిదా' సినిమాతో తెలుగుకి హీరోయిన్‌గా పరిచయం అయ్యారామె. తొలి చిత్రంతోనే తనదైన నటన, డ్యాన్సులతో ప్రేక్షకులను ఫిదా చేసిన ఈ బ్యూటీ ఆ తర్వాత 'మిడిల్ క్లాస్ అబ్బాయ్, పడి పడి లేచె మనసు, లవ్ స్టోరీ, శ్యామ్ సింగరాయ్, విరాట పర్వం, తండేల్' వంటి సినిమాల్లో నటించి, ఆడియన్స్‌ని అలరించారు. నాగ చైతన్య హీరోగా చందు మొండేటి దర్శకత్వం వహించిన చిత్రం 'తండేల్'. ఈ ఏడాది ఫిబ్రవరి 7న విడుదలైన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ప్రత్యేకించి సాయిపల్లవి, నాగచైతన్య నటన విమర్శకుల ప్రశంసలు అందుకుంది. సాధారణంగా ఓ సినిమా హిట్ అయిందంటే హీరో, హీరోయిన్లకు, డైరెక్టర్స్‌కి వరుస అవకాశాలు వస్తుంటాయి. 'తండేల్' వంటి సూపర్ హిట్ మూవీ తర్వాత తెలుగులో మరో కొత్త సినిమా ఏదీ అంగీకరించలేదు సాయిపల్లవి. అయితే తెలుగు, తమిళ, మలయాళ చిత్ర పరిశ్రమల్లో నటించిన ఆమె 'మేరే రాహో' అనే చిత్రం ద్వారా తొలిసారి హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. అలాగే రణ్‌బీర్ కపూర్ రాముడిగా రూపొందుతోన్న 'రామాయణ : పార్ట్ 1, పార్ట్ 2' సినిమాల్లో సీతగా నటిస్తున్నారు. ఈ సినిమాలు ఎంతో ప్రతిష్ఠాత్మకమైనవి కావడంతో ప్రస్తుతం పూర్తిగా బాలీవుడ్‌కే పరిమితం అయ్యారామె. మరి... సాయి పల్లవి తెలుగులో కొత్త సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? వెయిట్ అండ్ సీ.

ఏడాది దాటిపోయినా...

తెలుగు ప్రేక్షకుల మనసుల్లో బేబమ్మగా అభిమానం సొంతం చేసుకున్నారు కృతీ శెట్టి. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించిన 'ఉప్పెన' సినిమాతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చారామె. వైష్ణవ్ తేజ్ హీరోగా నటించిన ఈ సినిమా 2021 ఫిబ్రవరి 12న విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఆ సినిమా తర్వాత 'శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు, కస్టడీ, ది వారియర్, మాచర్ల నియోజకవర్గం, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి, మనమే' వంటి చిత్రాల్లో యువ హీరోలకి జోడీగా నటించారు కృతీ శెట్టి. 'మనమే' సినిమా 2024 జూన్ 7న రిలీజైంది. ఆ సినిమా విడుదలై ఏడాది దాటిపోయినా టాలీవుడ్‌లో ఇప్పటికీ మరో సినిమాకి పచ్చజెండా ఊపలేదు కృతి. అయితే తెలుగులో ఒక్క సినిమా చేతిలో లేకపోయినా తమిళ చిత్ర పరిశ్రమలో మాత్రం బిజీ బిజీగా ఉన్నారు ఈ బేబమ్మ. 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ, వా వాతియార్, జెనీ' వంటి సినిమాల్లో నటిస్తున్నారీ బ్యూటీ. మరి... కృతీ శెట్టి తెలుగులో కొత్త సినిమాకి ఎప్పుడు పచ్చజెండా ఊపుతారు? అన్నది వేచి చూడాలి.

పైన పేర్కొన్న కథానాయికలే కాదు... అంజలి, డింపుల్ హయతి, శ్రద్ధా శ్రీనాథ్, రీతూ వర్మ వంటి మరి కొందరు హీరోయిన్లకు కూడా తెలుగులో గ్యాప్ వచ్చింది. వారు నటించనున్న తర్వాతి తెలుగు సినిమాలపై ఇప్పటి వరకూ ఎలాంటి అప్‌డేట్ లేదు. మరి... వీరి నుంచి కొత్త కబురు ఎప్పుడొస్తుందో వేచి చూడాలి.

– దేరంగుల జగన్ మోహన్



నాకు పిల్లలు కావాలి

– సల్మాన్ ఖాన్

ఆరు పదుల వయసుకు దగ్గర పడుతున్నారు సల్మాన్ ఖాన్. కానీ సల్మాన్ ఖాన్ ఇంకా పెళ్లి చేసుకోలేదు. ఫలానా హీరోయిన్‌తో ప్రేమలో ఉన్నారని, ఫలానా అమ్మాయితో సల్మాన్ పెళ్లి అని చాలా వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. కానీ సల్మాన్ మాత్రం ఏ అమ్మాయితోనూ ఏడడుగులు వేయలేదు. అయితే భవిష్యత్‌లో మాత్రం తనకు పిల్లలు కావాలని చెబుతున్నారు సల్మాన్ ఖాన్. 'టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్ షో'లో ఆమిర్ ఖాన్‌తో కలిసి సల్మాన్ ఖాన్ పాల్గొన్నారు. ఈ షోలో సల్మాన్ ఖాన్ పెళ్లి, ప్రేమ అంశాల ప్రస్తావనను తీసుకువచ్చారు ట్వింకిల్. గతంలో కాఫీ విత్ కరణ్ షోలో సల్మాన్ ఖాన్ తనను తాను నవమన్మథుడిగా చెప్పుకున్నారు. ఈ విషయాన్ని ట్వింకిల్ ప్రస్తావిస్తూ, సల్మాన్‌కు డజనుమంది పిల్లలు ఉండి ఉండొచ్చని, వాళ్ల గురించి మనకు తెలియదని, ఈ విషయం సల్మాన్‌కు కూడా తెలియదన్నట్లుగా కాస్త చమత్కారంగా మాట్లాడారు. ఈ విషయంపై స్పందిస్తూ– ''నాకు పిల్లలు ఉంటే నీకు తెలియకుండా ఉంటుందా? ఒకవేళ నాకు పిల్లలు ఉంటే మీ ముందుకు తీసుకురాకుండా ఉంటానా?'' అని పేర్కొన్నారు సల్మాన్. ఆ తర్వాత పిల్లల్ని దత్తత తీసుకునే చాన్స్ ఏమైనా ఉందా? అని సల్మాన్‌ను ట్వింకిల్ ప్రశ్నించగా, ''దత్తత తీసుకునే ఆలోచన అయితే లేదు. కచ్చితంగా ఒక బిడ్డ అయితే ఉంటుంది. అది ఎప్పుడైనా జరగొచ్చు. భవిష్యత్‌లో ఏం జరుగుతుందో ఊహించి చెప్పలేం. అంతా దేవుడి దయ. నాకు పిల్లలు పుడితే వారి ఆలనా పాలనా చూసుకునేందుకు నా కుటుంబం ఉంది. అయాన్ (సల్మాన్ మేనల్లుడు), అలీజ్ (మేనకోడలు)లు ఉన్నారు. వీరు పెద్దవాళ్లు అయ్యారు. అంతా ఇంట్లో వాళ్లే చూసుకుంటారు'' అని చెప్పుకొచ్చారు సల్మాన్ ఖాన్. ఇక ప్రస్తుతం 'బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్' చిత్రం షూటింగ్‌తో సల్మాన్ ఖాన్ బిజీగా ఉన్నారు.



హాలీవుడ్ హిట్ ఫ్రాంఛైజీ 'అవతార్' నుంచి రానున్న తాజా చిత్రం 'అవతార్ 3: ఫైర్ అండ్ యాష్'. సామ్ వర్తింగ్టన్, జో సల్దానా, సిగౌర్నీ వీవర్, స్టీఫెన్ లాంగ్, ఊనా చాప్లిన్, క్లిఫ్ కర్టిస్ ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషించారు. జేమ్స్ కామెరూన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం డిసెంబరు 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా 'అవతార్ 3' కొత్త పోస్టర్, ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. అలాగే 'అవతార్ 2: ద వే ఆఫ్ వాటర్'ను అక్టోబరు 3న రీ – రిలీజ్ చేస్తున్న ట్లుగా కూడా పేర్కొంది 'అవతార్' టీమ్.



అనంతిక

ప్రేమ కథకు సై

క్యూట్‌గా కనిపించే అనంతికా సనీల్‌కుమార్‌లో మరో కోణం ఉంది. ఈ బ్యూటీకి మార్షల్ ఆర్ట్స్ వచ్చు... కరాటే కూడా తెలుసు. '8 వసంతాలు' సినిమాలో నటనా నైపుణ్యంతో పాటు తన మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాన్ని కూడా చూపించారు అనంతిక. మరి... ఈ సినిమా తర్వాత ఈ మలయాళ కుట్టి తెలుగులో ఏ సినిమా కమిట్ అయ్యారంటే... దర్శకుడు సందీప్ రెడ్డి వంగాకి చెందిన భద్రకాళి పిక్చర్స్ బేనర్ నిర్మించనున్న సినిమా అని సమాచారం. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలోని ప్రేమకథతో ఈ సినిమా రూపొందనుందని తెలిసింది. నూతన దర్శకుడు వేణు ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారని, 'మేం ఫేమస్' చిత్రంతో పాపులర్ అయిన సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తారని టాక్. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ప్రస్తుతం ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి దర్శకత్వంలో 'స్పిరిట్' సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం షూటింగ్ త్వరలో ఆరంభం కానుంది.

బిజినెస్ రీల్

అమెజాన్‌లో జీఎస్‌టీ బచత్ ఉత్సవ్



బెంగళూరు: 'గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్'లో భాగంగా అమెజాన్ 'గ్రేట్ సేవింగ్స్ సెలబ్రేషన్ జీఎస్‌టీ బచత్ ఉత్సవ్'కు శ్రీకారం చుట్టింది. ఈ ఉత్సవ్‌లో నెటిజన్లు 50 నుంచి 80 % డిస్కౌంట్‌తో ఆధునిక ఎలక్ట్రానిక్స్ వస్తువులు, ఫ్యాషన్, బ్యూటీ, గృహోపకరణాలు, హెల్త్‌కేర్, నిత్యావసరాలను జీఎస్‌టీ తగ్గింపు ధరలతో కొనుగోలు చేయొచ్చు. లక్షకు పైగా ఉత్పత్తులు అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి. అమెజాన్ పే లేటర్ ద్వారా నో కాస్ట్ ఈఎంఐ సౌకర్యం ఉంది. ప్రైమ్ సభ్యులకు గరిష్ఠంగా 5% వరకు ఖచ్చితమైన క్యాష్‌బ్యాక్ లభించనుంది. ఎస్‌బీఐ క్రెడిట్, డెబిట్ కార్డులపై 10% డిస్కౌంట్, అమెజాన్ పే, ఐసీఐసీఐ క్రెడిట్ కార్డులపై అపరిమిత క్యాష్‌బాక్ పొందవచ్చు.

ఇంటి వద్దకే ఫారెక్స్ కార్డ్‌లు

బ్లింకిట్‌తో థామస్‌కుక్ ఒప్పందం



ముంబై: క్విక్ కామర్స్ సంస్థ బ్లింకిట్‌తో పర్యాటక సేవల సంస్థ థామస్‌కుక్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. 'బోర్డర్‌లెస్ మల్టీకరెన్సీ' కార్డులను నిమిషాల వ్యవధిలో కస్టమర్ల వద్దకే డెలివరీ చేసేందుకు ఈ భాగస్వామ్యం వీలు కల్పించనుంది. ఢిల్లీ, బెంగళూరు, ముంబైలో ఈ సేవలు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయని, దశల వారీగా ఇతర కీలక మార్కెట్లలోనూ ఇదే మాదిరి విక్రయాలు చేపట్టనున్నట్టు థామస్‌కుక్ తెలిపింది. అన్ని విభాగాల్లోనూ క్విక్‌కామర్స్ కస్టమర్ల అనుభవాన్ని మార్చేస్తోందని, విదేశీ కరెన్సీ మారకం కార్డులకు సంబంధించి క్విక్ కామర్స్‌తో అనుసంధానం కావడాన్ని మంచి అవకాశంగా చూస్తున్నట్టు థామస్‌కుక్ (ఇండియా) ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ దీపేష్‌వర్మ తెలిపారు.

ఎస్‌బీఐ కార్డ్, ఇండిగో కో-బ్రాండెడ్ కార్డు



ముంబై: ఎస్‌బీఐ కార్డ్, దేశీ విమానయాన దిగ్గజం ఇండిగో కలిసి కొత్తగా కో-బ్రాండెడ్ ప్రీమియం క్రెడిట్ కార్డును ప్రవేశపెట్టాయి. ఇండిగో ఎస్‌బీఐ కార్డ్, ఇండిగో ఎస్‌బీఐ కార్డ్ ఎలీట్ పేరిట రెండు వేరియంట్లలో ఇవి లభిస్తాయి. ఈ కార్డ్‌హోల్డర్లు ఇండిగో వ్యవస్థలో చేసే ఖర్చులపై, హోటళ్లు, ట్రావెల్ బుకింగ్స్ మొదలైన వాటిపై ప్రత్యేక రివార్డులు పొందవచ్చు. తరచుగా ప్రయాణాలు చేసే వారికి అదనపు ప్రయోజనాలను కల్పించేలా దీన్ని రూపొందించినట్లు ఇరు సంస్థలు తెలిపాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-9-2025	
విశాఖ	530-00
చిత్తూరు	578-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	403.65	2.07
HEROMOTOCO	5,356.50	1.51
HINDALCO	747	0.8
ONGC	239.7	0.49
AXISBANK	1,163.00	0.35

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	4,720.00	-3.61
POWERGRID	284.2	-3.1
TATAMOTORS	664.9	-2.64
TCS	2,958.00	-2.55
ASIANPAINT	2,404.00	-2.17

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,189
ఎన్ఎస్ఈ	1,00,236
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,83,443
ఎఫ్ఐఐ	- 1,426
డీఐఐ	+ 1,212

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	64.67 (రాత్రి 11.30కు)	$ 64.99 (క్రితం ముగింపు)
బ్రెంట్	69.32 (రాత్రి 11.30కు)	$ 69.31 (క్రితం ముగింపు)

మహిళల నాయకత్వానికి జై..



- దేశీ సంస్థల్లో మహిళలకు పెరుగుతున్న ప్రాధాన్యం
- నాయకత్వ హోదాలో 20 శాతానికి చేరిన ప్రాతినిధ్యం
- అవతార్, సెరామౌంట్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారతీయ కంపెనీల్లో నాయకత్వ హోదాల్లో మహిళలకు ప్రాధాన్యం పెరుగుతోంది. తాజాగా మొత్తం కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లలో వారి ప్రాతినిధ్యం 20 శాతానికి చేరింది. భారత్‌లో మహిళలు ఉద్యోగం చేసేందుకు అత్యుత్తమ కంపెనీలపై వర్క్‌ప్లేస్ కల్చర్ కన్సల్టింగ్ సంస్థ అవతార్, టాలెంట్ సర్వీసెస్ సంస్థ సెరామౌంట్ నిర్వహించిన 10వ విడత అధ్యయనంలో ఇది వెల్లడైంది. దీని ప్రకారం అత్యుత్తమ కంపెనీల్లో మహిళల ఉద్యోగుల వాటా 35.7 శాతం స్థాయిలో స్థిరంగా ఉంది. మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడంలో ప్రొఫెషనల్ సర్వీసుల రంగం (44.6 శాతం) ముందంజలో ఉంది. ఐటీఈఎస్ (41.7 శాతం), ఫార్మా (25 శాతం), ఎఫ్ఎంసీజీ (23 శాతం), తయారీ (12 శాతం) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. మహిళల అట్రిషన్ రేటు (ఉద్యోగం నుంచి తప్పుకోవడం) పురుషులతో దాదాపు సమానంగా 20 శాతం స్థాయిలో ఉంది. మెరుగైన ఉద్యోగావకాశాలు దక్కించుకోవడమే మహిళలు, పురుషుల అట్రిషన్‌కి ప్రధాన కారణంగా ఉంటోంది. అయితే, మహిళల విషయానికొస్తే పిల్లల సంరక్షణకంటే ఎక్కువగా ఆరోగ్యపరమైన సమస్యలే ఉద్యోగం నుంచి తప్పుకోవడానికి మరో కీలక కారణంగా నిలుస్తోంది. 2016లో కంపెనీల్లో మహిళల ప్రాతినిధ్యం సగటున 25 శాతంగా ఉండగా ప్రస్తుతం 35.7 శాతానికి పెరగడం, నాయకత్వ హోదాల్లో మహిళల వాటా 13 శాతం నుంచి 20 శాతానికి చేరడం మంచి పరిణామమని అవతార్ వ్యవస్థాపకురాలు సౌందర్య రాజేశ్ తెలిపారు. ఈ అధ్యయనానికి దేశవ్యాప్తంగా 365 కంపెనీల నుంచి దరఖాస్తులు రాగా 125 కంపెనీలకు జాబితాలో చోటు దక్కింది. ఆటోమోటివ్, కెమికల్స్, బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్), మీడియా, ఫార్మా తదితర రంగ సంస్థల నుంచి దరఖాస్తులు వచ్చాయి.

మహిళలకు టాప్ 10 బెస్ట్ కంపెనీలు..

మహిళలకు టాప్ 10 కంపెనీల జాబితాలో యాక్సెంచర్ సొల్యూషన్స్, ఏఎక్స్ఏ ఎక్స్ఎల్ ఇండియా బిజినెస్ సర్వీసెస్, కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ వేదాంత, ఈవై, కేపీఎంజీ ఇండియా, మాస్టర్‌కార్డ్, ఆప్టమ్ గ్లోబల్ సొల్యూషన్స్ ఇండియా, ప్రాక్టర్ అండ్ గ్యాంబుల్ ఇండియా, టెక్ మహీంద్రా, విప్రో సంస్థలు (అక్షర క్రమంలో) ఉన్నాయి.

ఎన్ఎస్ఈ ఇన్వెస్టర్లు @12 కోట్లు

ప్రతీ నలుగురిలో ఒకరు మహిళ



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ(ఎన్ఎస్ఈ) యూనిక్ ఇన్వెస్టర్ల సంఖ్య తాజాగా 12 కోట్లను అధిగమించింది. గత 8 నెలల్లోనే కోటిమంది జత కలిసినట్లు ఎన్ఎస్ఈ వెల్లడించింది. కాగా.. ప్రతీ నలుగురిలో ఒకరు మహిళా ఇన్వెస్టర్ అని పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో తొలిసారిగా ఎన్ఎస్ఈ ఇన్వెస్టర్ల సంఖ్య 11 కోట్లను దాటింది. నిజానికి ఎన్ఎస్ఈ కార్యకలాపాలు ప్రారంభమైన 14ఏళ్ల తదుపరి ఇన్వెస్టర్ల సంఖ్య కోటికి చేరింది. తదుపరి కోటిమంది ఏడేళ్లలో జత కలవగా.. ఆపై మూడున్నరేళ్లలోనే ఈ సంఖ్యకు మరో కోటి జమయ్యింది. ఈ బాటలో ఆపై.. ఏడాదికి అటూఇటుగా మరో కోటిమంది జత కలిసినట్లు ఎన్ఎస్ఈ వివరించింది. వెరసి ఎన్ఎస్ఈ ఆవిర్భవించిన 25ఏళ్లకు అంటే 2021 మార్చికల్లా ఇన్వెస్టర్ల సంఖ్య 4 కోట్ల మైలురాయిని తాకింది. ఆపై వేగం పెరిగి 6-7 నెలల్లోనే మరో కోటి మంది ఇన్వెస్టర్లు తోడయ్యారు. ఈ స్పీడుకు ప్రధానంగా డిజిటైజేషన్, ఫిన్‌టెక్ సేవల అందుబాటు, మధ్యతరగతి పెరగడం, ప్రభుత్వ పాలసీల మద్దతు సహకరించాయి. 2025 సెప్టెంబర్ 23కల్లా ఎన్ఎస్ఈలో రిజిస్టరైన ఇన్వెస్టర్ల సంఖ్య 23.5 కోట్లకు చేరింది. అన్ని రకాల క్లయింట్ రిజిస్ట్రేషన్లతో కలిపి ఈ సంఖ్యకాగా.. క్లయింట్లు ఒక సభ్యునికంటే అధికంగా కూడా రిజిస్టరయ్యేందుకు వీలుంది. రిజిస్టర్డ్ ఇన్వెస్టర్లలో 12 కోట్లమంది సగటు వయసు 33 ఏళ్లుకాగా.. 1.9 కోట్లమంది ఇన్వెస్టర్లతో మహారాష్ట్ర ప్రథమ స్థానంలో నిలుస్తోంది. 1.4 కోట్లమంది రిజిస్టర్డ్ ఇన్వెస్టర్లరీత్యా ఉత్తరప్రదేశ్ రెండో ర్యాంకును పొందగా, 1.03 కోట్లతో గుజరాత్ తదుపరి స్థానాన్ని ఆక్రమించింది.

స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు 39% అప్

- ఆగస్టులో అమెరికాకు 148 శాతం వృద్ధి
- ఐసీఈఏ వెల్లడి



న్యూఢిల్లీ: భారత్ నుంచి ఆగస్టులో స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు 1.53 బిలియన్ డాలర్ల స్థాయికి చేరాయి. గతేడాది ఆగస్టుతో పోలిస్తే 39 శాతం పెరిగాయి. అటు అమెరికాకు ఎగుమతులు రెట్టింపై ఏకంగా 148 శాతం మేర ఎగిశాయి. ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం తొలి అయిదు నెలల్లో అమెరికాకు స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు దాదాపు మూడు రెట్లు పెరిగాయి. 2.88 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి 8.43 బిలియన్ డాలర్లకు ఎగిశాయి. 2025 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద 10.56 బిలియన్ డాలర్ల స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు నమోదు కాగా, ఈ ఏడాది ఏప్రిల్-ఆగస్టు మధ్య కేవలం అయిదు నెలల వ్యవధిలోనే అందులో 80 శాతం ఎగుమతులను సాధించినట్లు ఐసీఈఏ తెలిపింది. 'అందరూ చెబుతున్న దానికి భిన్నంగా ఆగస్టులో స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు 39 శాతం పెరిగాయి. 2024 ఆగస్టులో ఇవి 1.09 బిలియన్ డాలర్లుగా ఉండగా తాజా ఆగస్టులో 1.53 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక అమెరికాకు ఎగుమతులు 148 శాతం ఎగిశాయి. 388 మిలియన్ డాలర్ల నుంచి 965 మిలియన్ డాలర్లకు చేరాయి' అని పేర్కొంది. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తయారీ సంస్థల సమాఖ్య అయిన ఐసీఈఏ తరచుగా ఉత్పత్తి, ఎగుమతుల డేటాను ప్రచురిస్తుంది. కొన్ని వర్గాలు తమ వాదనలకు మద్దతునిచ్చే డేటాను తీసుకుని స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు తగ్గాయనే తప్పుడు అభిప్రాయానికి రావడం సరికాదని ఐసీఈఏ పేర్కొంది. అతి పెద్ద మార్కెట్ అయిన అమెరికాకు భారత స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు మే నెలలో 2.29 బిలియన్ డాలర్లుగా ఉండగా, ఆగస్టులో 964.8 మిలియన్ డాలర్లకు (సుమారు 58 శాతం తగ్గుదల) పడిపోయినట్లు మేధావుల సంఘం జీటీఆర్ఐ వెల్లడించిన నేపథ్యంలో ఐసీఈఏ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఈసారి ట్రెండ్‌కి భిన్నం..

సాధారణంగా ఆగస్టు, సెప్టెంబర్ ప్రథమార్ధంలో స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు నెమ్మదిస్తాయని, కానీ ఈసారి ట్రెండ్‌కి భిన్నమైన ధోరణి కనిపించిందని ఐసీఈఏ తెలిపింది. పండుగల సీజన్‌కి సరిగ్గా ముందు సెప్టెంబర్ ఆఖర్లోను, అక్టోబర్‌లోను కంపెనీలు కొత్త మోడల్స్‌ను ఆవిష్కరిస్తుంటాయని, వాటిని దృష్టిలో ఉంచుకుని కొనుగోలుదారులు ఆగస్టులో స్మార్ట్‌ఫోన్ల కొనుగోళ్లను తగ్గించుకుంటారని వివరించింది. దీనితో ఎగుమతులు కూడా తగ్గిపోతుంటాయని పేర్కొంది. పాత మోడల్స్‌ను కొందామనుకునే వారు కూడా కొత్త మోడల్స్ వచ్చే వరకు నిరీక్షిస్తారని, కొత్తవి వస్తే పాత వాటిపై మరింతగా డిస్కౌంట్లు వస్తాయనే ఆలోచనే ఇందుకు కారణమని ఐసీఈఏ పేర్కొంది. దీని ఫలితంగా పాత మోడల్స్ ఎగుమతులు కూడా తగ్గుతాయని, అక్టోబర్‌లో మళ్లీ పుంజుకుంటాయని వివరించింది. ఇక, కొత్త మోడల్స్ కోసం ఆగస్టు, సెప్టెంబర్ తొలినాళ్లలో ప్లాంట్లు, యంత్రాలను సిద్ధం చేసుకోవడంపై కంపెనీలు దృష్టి పెట్టడం వల్ల ఉత్పత్తి, అలాగే ఎగుమతులు కూడా నెమ్మదిస్తాయని ఐసీఈఏ పేర్కొంది. దీపావళి, ఇతరత్రా పండగల తేదీలను బట్టి దేశీయంగా డిమాండ్‌కి తగ్గట్లు సరఫరా చేసేందుకు వీలుగా ఉత్పత్తులను మళ్లించడం వల్ల అక్టోబర్ మధ్య వరకు ఎగుమతులు కాస్త తగ్గుతాయని వివరించింది. దీపావళి తర్వాత మాత్రం పాశ్చాత్య దేశాల్లో థాంక్స్‌గివింగ్ హాలిడేలు, బ్లాక్ ఫ్రైడే, క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా అంతర్జాతీయంగా అన్ని మోడల్స్‌కి డిమాండ్ పెరుగుతుంది కాబట్టి ఎగుమతులు కూడా పుంజుకుంటాయని ఐసీఈఏ తెలిపింది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాన్ని (పీఎల్ఐ) ప్రవేశపెట్టాక గత అయిదేళ్ల నుంచి దేశీయంగా స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్ అత్యంత మెరుగ్గా రాణిస్తున్న ఎగుమతి పరిశ్రమగా నిలుస్తున్నట్లు వివరించింది.



అనిశ్చితిలోనూ పటిష్టంగా భారత్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా అనిశ్చితి వల్ల పలు దేశాలు సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ భారత్ పటిష్టంగా ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. యువ జనాభా, దేశీయంగా డిమాండ్ మెరుగ్గా ఉండటం, స్థిరమైన ఆర్థిక విధానాలు ఎకానమీ వృద్ధికి దోహదపడుతున్నాయని చెప్పారు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 91వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆమె ఈ విషయాలు వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత్ 7.8 శాతం వృద్ధి సాధించిందని, ఎస్అండ్‌పీలాంటి రేటింగ్ ఏజెన్సీలు కూడా దేశ రేటింగ్‌ను పెంచాయని మంత్రి చెప్పారు. భారత్‌పై ప్రపంచానికి గల నమ్మకానికి ఇది నిదర్శనమని వివరించారు. వృద్ధి సాధనలో కీలక పాత్ర పోషించే బ్యాంకులు, కస్టమర్ల నమ్మకాన్ని చూరగొనడం, ఫిర్యాదులను సత్వరం పరిష్కరించడంపై మరింతగా దృష్టి పెట్టాలని సూచించారు.

మారుతీ కార్లకు దసరా కళ..

నవరాత్రుల్లో ఇప్పటివరకు 75 వేల కార్ల విక్రయం



న్యూఢిల్లీ: అటు జీఎస్‌టీ రేట్ల తగ్గింపు, ఇటు దసరా నవరాత్రులు ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియాకి బాగా కలిసొచ్చాయి. నవరాత్రులు ప్రారంభమైనప్పటి నుంచి గురువారం సాయంత్రం 6 గంటల వరకు కంపెనీ 75,000 పైచిలుకు వాహనాలను విక్రయించింది. చిన్న కార్లలో కొన్ని వేరియంట్ల డెలివరీ కోసం నిరీక్షించే పరిస్థితి కూడా నెలకొందని సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు. ప్రస్తుతం రోజుకు 80,000 పైచిలుకు ఎంక్వైరీలు వస్తున్నాయని, ఇది సాధారణంగా వచ్చే 40,000-45,000 ఎంక్వైరీలకు రెట్టింపని వివరించారు. రోజుకు సుమారు 18,000 బుకింగ్స్ నమోదవుతున్నాయన్నారు. 'నవరాత్రులు ప్రారంభమయ్యాక గురువారం సాయంత్రం 6 గం.ల సమయానికి 75,000 వాహన విక్రయాలు నమోదయ్యాయి. రోజు ముగిసే సరికి ఇది 80,000 యూనిట్లకు పెరుగుతుందని భావిస్తున్నాం' అని పార్థో బెనర్జీ తెలిపారు. పండుగ సీజన్‌లో చిన్న కార్లపై గణనీయంగా ఆసక్తి నెలకొందని ఆయన చెప్పారు. ఎంట్రీ లెవెల్ కార్ల సెగ్మెంట్‌లో దేశవ్యాప్తంగా బుకింగ్స్ 50 శాతం పెరిగాయని పేర్కొన్నారు. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు కోసం కొనుగోలుదారులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారని, అప్‌గ్రేడ్ కావడానికి ఇదే సరైన సమయమని బెనర్జీ వివరించారు. ఉత్పత్తిని ఒక్కసారిగా పెంచడానికి లేనందున బ్రెజా, డిజైర్, బాలెనో లాంటి కార్లలో కొన్ని వేరియంట్లను నాలుగైదు రోజుల తర్వాత సత్వరం సరఫరా చేసే అవకాశం ఉండదన్నారు.

ఐపీవో స్ట్రీట్

అడ్వాన్స్ ఆగ్రోలైఫ్ @రూ. 95-100

ఈ నెల30- అక్టోబర్ 3 మధ్య ఐపీవో



న్యూఢిల్లీ: సస్యరక్షణ కంపెనీ అడ్వాన్స్ ఆగ్రోలైఫ్ పబ్లిక్ ఇష్యూకి రూ. 95-100 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 30న ప్రారంభంకానున్న ఇష్యూ అక్టోబర్ 3న ముగియనుంది. దీనిలో భాగంగా రూ. 193 కోట్ల విలువైన 1.93 కోట్ల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. తద్వారా రూ. 193 కోట్లు సమకూర్చుకోనుంది. ఐపీవో నిధుల్లో రూ. 135 కోట్లు వర్కింగ్ క్యాపిటల్‌కు, మిగిలిన నిధులు సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. కంపెనీ ప్రధానంగా పంటలను పూర్తి స్థాయిలో సంరక్షించే ఆగ్రోకెమికల్ ప్రొడక్టులను తయారు చేస్తోంది. ఉత్పత్తులలో ఇన్‌సెక్టిసైడ్స్, హెర్బిసైడ్స్, ఫంగిసైడ్స్‌తోపాటు.. మొక్కల పెరుగుదలకు దోహదపడే ఇతర ఉత్పత్తులను రూపొందిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) రూ. 502 కోట్ల ఆదాయం, రూ. 26 కోట్ల నికర లాభం ఆర్జించింది.

ఫైనాన్స్‌బుద్ధకు ఎన్ఎస్ఈ ఓకే

ఎమర్జ్ ప్లాట్‌ఫామ్ ద్వారా లిస్టింగ్



న్యూఢిల్లీ: సుప్రసిద్ధ క్రికెటర్ ఎంఎస్ ధోని, ఇన్వెస్టర్ ఆశిష్ కచోలియా, క్యామ్స్ వ్యవస్థాపకుడు వి.శంకర్‌కు పెట్టుబడులున్న ఫిన్‌బడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ తాజాగా సూత్రప్రాయ అంగీకారాన్ని తెలియజేసింది. ఫైనాన్స్ బుద్ధ బ్రాండుతో రుణ సౌకర్యాలకు దారిచూపే కంపెనీ.. ఎస్ఎంఈ విభాగంలో నిధుల సమీకరణ చేపట్టనుంది. తద్వారా ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఈ ఫిజిటల్ రుణాల సంస్థ లిస్టికానుంది. ఐపీవోలో భాగంగా రూ. 10 ముఖ విలువగల 50.48 లక్షల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఇష్యూ నిధులను వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, అనుబంధ సంస్థ ఎల్‌టీసీవీ క్రెడిట్‌లో పెట్టుబడులు, బిజినెస్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్ కార్యకలాపాలతోపాటు.. రుణ చెల్లింపులకు వినియోగించనుంది. ఫిన్‌బడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌ను 2012లో వివేక్ భాటియా, పార్థ్ పాండే, పరాగ్ అగర్వాల్ ఏర్పాటు చేశారు.

డిజిటల్ చెల్లింపులకు కొత్త మార్గదర్శకాలు

టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్‌కు మరెన్నో మార్గాలు



ముంబై: డిజిటల్ చెల్లింపులకు సంబంధించి టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ (2ఎఫ్ఏ) కింద ఎస్ఎంఎస్ ఆధారిత ఓటీపీకి అదనంగా మరిన్ని మార్గాలకు ఆర్‌బీఐ అవకాశం కల్పించింది. పాస్‌వర్డ్, ఎస్ఎంఎస్ ఆధారిత ఓటీపీ, పాస్‌ఫ్రేజ్, పిన్, కార్డ్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ టోకెన్, ఫింగర్‌ప్రింట్ లేదా ఇతర బయోమెట్రిక్స్ (ఆధార్ ఆధారిత) అథెంటికేషన్‌కు వీలు కల్పించింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. 2ఎఫ్ఏ తప్పనిసరి అంటూ, ఇకపైనా ఎస్ఎంఎస్ ఓటీపీని వినియోగించుకోవచ్చని స్పష్టం చేసింది. ఎస్ఎంఎస్ ఓటీపీకి అదనంగా ఇతర ప్రత్యామ్నాయ అథెంటికేషన్ కోసం చెల్లింపుల వ్యవస్థలను అప్‌గ్రేడేషన్ చేసుకోవాలంటూ 2024 ఫిబ్రవరిలోనే ఆర్‌బీఐ కోరడం గమనార్హం.

పాలీక్యాబ్‌లో షేర్ల విక్రయం

1.55% వాటా విలువ రూ. 1,740 కోట్లు



న్యూఢిల్లీ: ప్రమోటర్లుసహా ఏడుగురు వ్యక్తులు ఎలక్ట్రికల్ ప్రొడక్టుల కంపెనీ పాలీక్యాబ్ ఇండియాలో ఉమ్మడిగా 1.55 శాతం వాటా విక్రయించారు. ఎన్ఎస్ఈలో ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 7,458 ధరలో 23.32 లక్షల షేర్లు అమ్మివేశారు. వీటి విలువ దాదాపు రూ. 1,740 కోట్లుకాగా.. జేపీ మోర్గాన్, మోర్గాన్ స్టాన్లీ ఏషియా సింగపూర్, సొసైటీ జనరాలి, హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్, కొటక్ మహీంద్రా లైఫ్, టాటా ఎంఎఫ్ తదితరాలు షేర్లను కొనుగోలు చేశాయి. బల్క్ డీల్ వివరాల ప్రకారం ఆరుగురు ప్రమోటర్లతోపాటు కంపెనీలో కమోడిటీస్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అనిల్ హరిరామ్ హరియానీ సైతం పాలీక్యాబ్ షేర్లను విక్రయించారు.

ఎన్ఎస్ఈలో పాలీక్యాబ్ షేరు 2 శాతం క్షీణించి రూ. 7,385 వద్ద ముగిసింది.

ఐటీ మార్జిన్లపై హెచ్1బీ ప్రభావం స్వల్పమే

- 0.20 శాతం వరకు మాత్రమే ఉండొచ్చు
- వీసాలపై ఆధారపడటం తగ్గించుకోవడమే కారణం
- క్రిసిల్ ఇంటెలిజెన్స్ నివేదిక



న్యూఢిల్లీ: హెచ్1బీ వీసా ఫీజులను భారీగా పెంచినప్పటికీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారతీయ ఐటీ కంపెనీల లాభాల మార్జిన్లపై 0.10 శాతం నుంచి 0.20 శాతం మాత్రమే ప్రభావం ఉంటుందని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ ఇంటెలిజెన్స్ తెలిపింది. 2018 నుంచి మన ఐటీ కంపెనీలు ఈ వీసాలపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించుకోవడమే ఇందుకు కారణమని వివరించింది. గత ఆర్థిక సంవత్సరంలో 22 శాతం నిర్వహణ మార్జిన్లను సాధించిన ఈ కంపెనీలు, పెరిగిన వ్యయాల భారాన్ని క్లయింట్లకు బదలాయించే అవకాశం ఉందని క్రిసిల్ వివరించింది. మన ఐటీ కంపెనీలు తమ క్లయింట్లకు సమీపంలో కార్యాలయాలు తెరవడం, అమెరికాలో స్థానికులను నియమించుకోవడంలాంటి చర్యలతో హెచ్1బీ వీసాలపై ఆధారపడటాన్ని తగ్గించుకున్నాయని పేర్కొంది. 2018లో వీసాలను తిరస్కరించే రేటు 24 శాతంగా ఉండగా 2024లో ఇది మూడు శాతానికి తగ్గినప్పటికీ, భారతీయ ఐటీ కంపెనీలు ముందుజాగ్రత్తగా ఇదే ధోరణిని కొనసాగిస్తున్నాయని క్రిసిల్ తెలిపింది. అమెరికా గణాంకాల ప్రకారం టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లాంటి కంపెనీల్లో హెచ్1బీ వీసాలపై పని చేస్తున్న భారతీయ ఉద్యోగుల సంఖ్య 2017-2025 మధ్య కాలంలో 34,507 నుంచి 17,997కి తగ్గిందని క్రిసిల్ వివరించింది.

ఈసారి 2-4 శాతం ఆదాయ వృద్ధి ..

భారతీయ ఐటీ సేవల పరిశ్రమ ఆదాయం గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి 2-4 శాతం మేర పెరిగి సుమారు 143-145 బిలియన్ డాలర్ల స్థాయికి చేరొచ్చని క్రిసిల్ ఇంటెలిజెన్స్ అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి వృద్ధి ఒక మోస్తరు స్థాయికి పరిమితం కావచ్చని వివరించింది. 2023 అక్టోబర్-2024 సెప్టెంబర్ మధ్యకాలంలో టాప్ నాలుగు ఐటీ కంపెనీలకు 34,507 హెచ్1బీ వీసాలు లభించినట్లు తెలిపింది. వీటిలో 64 శాతం వీసాలు ప్రస్తుతమున్న ఉద్యోగులను కొనసాగించేందుకు ఉద్దేశించినవి కాగా, మిగతా 35 శాతం వీసాలు కొత్త పంపించే ఉద్యోగుల కోసం ఉద్దేశించినవి. వీసా ఫీజులను పెంచిన నేపథ్యంలో కొత్తగా పంపించే ఉద్యోగులకు సంబంధించిన వీసాల పరిమాణం మధ్యకాలికంగా తగ్గే అవకాశం ఉంది. వీసా ఫీజులు 2,000-5,000 డాలర్ల స్థాయిలో ఉన్నప్పుడు ఉద్యోగిపై చేసే మొత్తం వ్యయాల్లో వాటి వాటా 0.02-0.05 శాతంగా ఉండేది. ఒకవేళ కొత్తగా పంపించే ఉద్యోగులకు సంబంధించిన వీసాల పరిమాణం గతంలోలాగే స్థిరంగా ఉన్న పక్షంలో కొత్త ఫీజుల విధానం వల్ల ఉద్యోగిపై చేసే మొత్తం ఖర్చులో వీసాపరమైన వ్యయాల వాటా 1 శాతానికి పెరుగుతుంది. వీసా ఫీజు పెంపు పరిణామాల వల్ల మధ్యకాలికంగా భారత్‌లోకి రెమిటెన్సులతో పాటు, వాటిలో అమెరికా వాటా కూడా తగ్గే అవకాశం ఉంది. అంతేగాకుండా ఆఫ్‌షోరింగ్ సైతం వేగవంతం కావచ్చు. ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లాలనుకునే విద్యార్థులు పునరాలోచనలో పడొచ్చు.



క్లీన్‌స్వీప్...

- భారత షూటర్లకే స్వర్ణ, రజత, కాంస్యాలు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) జూనియర్ ప్రపంచకప్ టోర్నమెంట్‌ను భారత షూటర్లు ఘనంగా ప్రారంభించారు. తొలి రోజు భారత షూటర్లు మొత్తం ఐదు పతకాలను సొంతం చేసుకున్నారు. జూనియర్ మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. టాప్–3లో భారత షూటర్లే నిలిచి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. అనుష్క ఠాకూర్ పసిడి పతకం నెగ్గగా... అన్నిక రజత పతకాన్ని, ఆద్య అగర్వాల్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. అనుష్క 621.6 పాయింట్లతో అగ్రస్థానంలో, అన్నిక 619.2 పాయింట్లతో రెండో స్థానంలో, ఆద్య 615.9 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచారు. భారత్‌కే చెందిన సానియా 610.9 పాయింట్లతో ఎనిమిదో స్థానాన్ని దక్కించుకోగా... నిమ్రత్ కౌర్ 604.3 పాయింట్లతో తొమ్మిదో స్థానాన్ని సంపాదించింది. మరోవైపు


పతకాలతో దీపేంద్ర, కామిల్, రోహిత్

జూనియర్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో భారత్‌కు రెండు పతకాలు లభించాయి. దీపేంద్ర సింగ్ షెకావత్ 617.9 పాయింట్లతో రజత పతకం నెగ్గగా... రోహిత్ కన్యాన్ 616.3 పాయింట్లతో కాంస్య పతకాన్ని సాధించాడు. స్వతంత్ర అథ్లెట్‌గా పోటీపడ్డ రష్యా షూటర్ కామిల్ నురిఖెమెతోవ్ 618.9 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నాడు.

విజయానికి 243 పరుగుల దూరంలో...


కేఎల్ రాహుల్

- భారత్ 'ఎ' లక్ష్యం 412
- ప్రస్తుతం 169/2
- రాణించిన కేఎల్ రాహుల్
- ఆసీస్ 'ఎ'తో రెండో అనధికారిక టెస్టు

లక్నో: భారత్, ఆస్ట్రేలియా 'ఎ' జట్ల మధ్య జరుగుతున్న రెండో అనధికారిక టెస్టు రసవత్తర ముగింపునకు చేరింది. మూడో రోజు ఆటలో ప్రత్యర్థిని 190 పరుగుల్లోపే ఆలౌట్ చేసిన భారత్ 'ఎ' జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 41 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. అయినా ఇంకా విజయానికి 243 పరుగుల దూరంలో ఉంది. చేతిలో 8 వికెట్లున్నాయి. మూడో రోజు ఆటలో ఇరుజట్లవి కలిపి 9 వికెట్లు కూలాయి. ముందుగా ఓవర్‌నైట్ స్కోరు 16/3తో గురువారం ఆట కొనసాగించిన ఆసీస్ 'ఎ' రెండో ఇన్నింగ్స్‌లో 46.5 ఓవర్లలో 185 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్, కెప్టెన్ నాథన్ మెక్‌స్వీని (249 బంతుల్లో 85; 10 ఫోర్లు, 1 సిక్స్) సహచరులు వెనుదిరుగుతున్నా... చక్కని పోరాటం చేశాడు. ఆరంభంలోనే హైదరాబాదీ స్పీడ్‌స్టర్ సిరాజ్ పేస్‌కు 17 పరుగుల వద్ద కూపర్ కానొలి (1) రూపంలో నాలుగో వికెట్ కోల్పోయింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో జోష్ ఫిలిప్ (48 బంతుల్లో 50; 8 ఫోర్లు)తో కలిసి మెక్‌స్వీని ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశాడు. ఇద్దరు కలిసి ఐదో వికెట్‌కు 90 పరుగులు జోడించడంతో జట్టు స్కోరు వంద దాటింది. ఈ దశలో సీమర్ గుర్నూర్ బ్రార్, స్పిన్నర్ మానవ్ సుథార్ కంగారూ ఇన్నింగ్స్‌ను కోలుకోని విధంగా దెబ్బకొట్టారు. దీంతో 78 పరుగుల వ్యవధిలో 6 వికెట్లను కోల్పోయి 200 పరుగుల్లోపే ఆలౌటైంది. గుర్నూర్, మానవ్ చెరో 3 వికెట్లు తీయగా... సిరాజ్‌కు 2 వికెట్లు దక్కాయి.

రాహుల్ 74 రిటైర్డ్‌హర్ట్

అనంతరం 412 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన భారత్ 'ఎ'కు ఓపెనర్లు కేఎల్ రాహుల్ (92 బంతుల్లో 74; 9 ఫోర్లు), జగదీశన్ (36; 5 ఫోర్లు) శుభారంభమిచ్చారు. 17 ఓవర్లలో 85 పరుగులు జోడించారు. 18వ ఓవర్ తొలి బంతికే జగదీశన్ అవుటవడంతో ఈ భాగస్వామ్యం చెదిరింది. తర్వాత కూడా టీమిండియా సీనియర్ బ్యాటర్ అయిన రాహుల్... వన్‌డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్ (84 బంతుల్లో 44 బ్యాటింగ్; 3 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి మరో భాగస్వామ్యానికి తెరలేపాడు. కానీ అర్ధసెంచరీ అనంతరం రాహుల్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. తర్వాత దేవదత్ పడిక్కల్ (5) నిరాశపరచగా, మానవ్ సుతార్ (1 బ్యాటింగ్) సుదర్శన్‌తో కలిసి నాటౌట్‌గా నిలిచాడు. టాడ్ మర్ఫీ 2 వికెట్లు తీశాడు. తొలి టెస్టు 'డ్రా'గా ముగియగా... ఈ మ్యాచ్ గెలిచిన జట్టే సిరీస్‌ను దక్కించుకుంటుంది.

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా 'ఎ' తొలిఇన్నింగ్స్: 420; **భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్:** 194; **ఆస్ట్రేలియా 'ఎ' రెండో ఇన్నింగ్స్:** 185 (మెక్‌స్వీని 85; గుర్నూర్ బ్రార్ 3/42, సిరాజ్ 2/20).

భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్: 169/2 (కేఎల్ రాహుల్ రిటైర్డ్‌హర్ట్ 74, సాయిసుదర్శన్ 44).

రెస్టాఫ్ ఇండియా జట్టులో షేక్ రషీద్

- విదర్భతో ఇరానీ కప్ మ్యాచ్‌కు జట్టు ఎంపిక
- కెప్టెన్‌గా రజత్ పాటీదార్



న్యూఢిల్లీ: నిలకడగా రాణిస్తున్న ఆంధ్రప్రదేశ్ యువ క్రికెటర్ షేక్ రషీద్... రెస్టాఫ్ ఇండియా జట్టులో చోటు దక్కించుకున్నాడు. వచ్చే నెల ఒకటి నుంచి ప్రారంభం కానున్న ఇరానీ కప్ మ్యాచ్ కోసం సెలెక్టర్లు గురువారం జట్టును ప్రకటించారు. నాగ్‌పూర్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌లో రంజీ చాంపియన్ విదర్భతో రెస్టాఫ్ ఇండియా జట్టు తలపడనుంది. ఈ జట్టుకు రజత్ పాటీదార్ సారథ్యం వహించనున్నాడు. ఈ ఏడాది రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)కు ఐపీఎల్ ట్రోఫీ అందించిన 32 ఏళ్ల రజత్ పాటీదార్... దులీప్ ట్రోఫీలో సెంట్రల్ జోన్ తరఫున దుమ్మురేపాడు. అభిమన్యు ఈశ్వరన్, రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్ కిషన్, ఖలీల్ అహ్మద్ వంటి వాళ్లతో రెస్టాఫ్ ఇండియా జట్టు పటిష్టంగా కనిపిస్తోంది. బ్యాటింగ్‌లో అభిమన్యు, రజత్, రుతురాజ్, యశ్ ధుల్, షేక్ రషీద్, ఇషాన్ కీలకం కానుండగా... ఆకాశ్‌దీప్, గుర్‌నూర్ బ్రార్‌తో కలిసి ఖలీల్ అహ్మద్ బౌలింగ్ భారం మోయనున్నాడు. మానవ్ సుతార్, తనుశ్ కొటియాన్ ఆల్‌రౌండర్‌ల కోటాలో చోటు దక్కించుకున్నారు.

శ్రేయస్ సారథ్యంలో...

ఆస్ట్రేలియా 'ఎ'తో జరగనున్న వన్డే సిరీస్‌కు శ్రేయస్ అయ్యర్ భారత 'ఎ' జట్టు సారథిగా ఎంపికయ్యాడు. సుదీర్ఘ ఫార్మాట్ నుంచి ఆరు నెలల విశ్రాంతి కోరిన శ్రేయస్ అయ్యర్ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో సత్తా చాటేందుకు ఇది మరో చక్కటి అవకాశం కానుంది. సెప్టెంబర్ 30 నుంచి భారత్ 'ఎ', ఆస్ట్రేలియా 'ఎ' జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ అనంతరం భారత సీనియర్ జట్టు పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఆడేందుకు ఆస్ట్రేలియాకు వెళ్లనుంది. ఈ నేపథ్యంలో మెరుగైన ప్రదర్శన చేసిన ఆటగాళ్లు సెలెక్టర్ల దృష్టిలో పడే అవకాశం ఉంది. ప్రభ్‌సిమ్రన్ సింగ్, రియాన్ పరాగ్, ఆయుశ్ బదోనీ, సూర్యాంశ్, విప్రాజ్, నిశాంత్, ప్రియాంశ్ వంటి పలువురు ప్రతిభావంతులు ఈ జట్టులో ఉన్నారు. తొలి మ్యాచ్ అనంతరం రెండో వన్డే నుంచి పలువురు భారత ఆటగాళ్లు ఈ జట్టులో చేరనున్నారు. రెండో వన్డే నుంచి తిలక్ వర్మ, అభిషేక్ శర్మ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్ ఆడనున్నారు. 'శ్రేయస్ అయ్యర్ మెరుగ్గా రాణించాలని కోరుకుంటున్నాం. అతడు జట్టును చక్కగా నడుపుతాడు. ఐపీఎల్‌లో తన ఫ్రాంచైజీలతో పాటు, భారత్ 'ఎ' నాయకుడిగానూ ఆకట్టుకున్నాడు' అని చీఫ్ సెలెక్టర్ అగార్కర్ అన్నాడు. ఇక అయ్యర్ ఆర్నెళ్ల బ్రేక్‌పై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందించాడు. 'అవును శ్రేయస్ ఎర్ర బంతి క్రికెట్ నుంచి ఆరు నెలలు విశ్రాంతి కావాలని బోర్డును కోరాడు. వెన్నెముక గాయం నుంచి కోలుకున్న అతడు కొంత ఇబ్బంది పడుతున్నాడు. అందుకే అతడిని ఇరానీ కప్‌నకు ఎంపిక చేయలేదు. ఈ సమయాన్ని అతడు సద్వినియోగం చేసుకొని పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడనుకుంటున్నాం' అని సైకియా వెల్లడించాడు. 2023లో శ్రేయస్ వెన్నెముక శస్త్రచికిత్స చేయించుకున్నాడు.

రెస్టాఫ్ ఇండియా జట్టు (ఇరానీ కప్): రజత్ పాటీదార్ (కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, ఆర్యన్ జుయల్, రుతురాజ్ గైక్వాడ్, యశ్ ధుల్, షేక్ రషీద్, ఇషాన్ కిషన్, తనుశ్ కొటియాన్, మానవ్ సుతార్, గుర్‌నూర్ బ్రార్, ఖలీల్ అహ్మద్, ఆకాశ్ దీప్, అన్షుల్ కంబోజ్, సారాంశ్ జైన్.

భారత్ 'ఎ' జట్టు (తొలి వన్డేకు): శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ప్రభ్‌సిమ్రన్ సింగ్, రియాన్ పరాగ్, ఆయుశ్ బదోనీ, సూర్యాంశ్ షెడ్గే, విప్రాజ్ నిగమ్, నిశాంత్, గుర్‌జపనీత్ సింగ్, యుధ్‌వీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పొరెల్, ప్రియాంశ్ ఆర్య, సిమర్‌జీత్ సింగ్.

రెండు–మూడో వన్డేలకు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, అభిషేక్ శర్మ, ప్రభ్‌సిమ్రన్ సింగ్, రియాన్ పరాగ్, ఆయుశ్ బదోనీ, సూర్యాంశ్ షెడ్గే, విప్రాజ్ నిగమ్, నిశాంత్, గుర్‌జపనీత్ సింగ్, యుధ్‌వీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పొరెల్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్.

ఘోర ప్రమాదం నుంచి కోలుకొని...

- ఐదేళ్ల తర్వాత ఎఫ్1 కారు నడపనున్న రొమైన్ గ్రొజాన్

స్కార్పెరియా ఇ శాన్ పియరో (ఇటలీ): సుమారు ఐదేళ్ల క్రితం ఫార్ములా వన్ ట్రాక్‌పై ఘోర ప్రమాదం నుంచి బయటపడిన ఫ్రెంచ్ డ్రైవర్ రొమైన్ గ్రోజాన్... తిరిగి స్టీరింగ్ చేతపట్టనున్నాడు. 2020 సీజన్ బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి రేసులో అతడి కారు ఘోర ప్రమాదానికి గురైంది. వాయు వేగంతో దూసుకెళ్తున్న సమయంలో ఉన్నట్టుండి ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో గ్రోజాన్ కారు రెండు ముక్కలవగా... పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. అందులో చిక్కుకున్న గ్రోజాన్... కాలిన గాయాలతో బయటపడ్డాడు. చికిత్స అనంతరం కోలుకున్న అతడు ఇక అప్పటి నుంచి ఎఫ్1 రేసులకు దూరంగా ఉంటున్నాడు. కాగా... గ్రోజాన్ శుక్రవారం ఇటలీలోని ముగెల్లో సర్క్యూట్‌లో తన పాత జట్టు 'హాస్' తరఫున కొత్త కారును పరీక్షించనున్నాడు. ఈ సమయంలో కుటుంబ సభ్యుల ఫొటోలు ఉన్న హెల్మెట్ అతడు ధరించనున్నాడు. 'నిజంగా నమ్మశక్యంగా లేదు. ప్రమాదం జరిగి ఐదేళ్లు అయింది. పాత మిత్రులతో కలిసి తిరిగి కారు నడపనుండటం ప్రత్యేకమైన అనుభూతి' అని గ్రోజాన్ పేర్కొన్నాడు. ప్రమాదం అనంతరం ఫార్ములావన్‌కు దూరమైన గ్రోజాన్... అమెరికా వేదికగా జరిగే ఇండి కార్, స్పోర్ట్స్ కార్ సిరీస్‌ల్లో పాల్గొంటున్నాడు.






2020 బహ్రెయిన్ గ్రాండ్‌ప్రిలో గ్రోజాన్ కారు ప్రమాదం దృశ్యం (ఫైల్)

ఆలిండియా లాయర్ల క్రికెట్ టోర్నీకి తెలంగాణ జట్టు



సాక్షి, హైదరాబాద్: రేపటి నుంచి న్యూఢిల్లీలో జరిగే ఆలిండియా లాయర్ల క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే తెలంగాణ హైకోర్టు జట్టుకు దినేశ్ చక్రవర్తి కెప్టెన్‌గా, డి.పల్లవి మేనేజర్‌గా వ్యవహరిస్తారు. అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ టోర్నీ జరుగుతుంది. వరంగల్‌లోని వాగ్దేవి కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ సీహెచ్ దేవేందర్ రెడ్డి, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు జె. శ్రీరంగా రావు, ఏబీవీపీ జాతీయ మాజీ అధ్యక్షుడు డి.మనోహర్ రావు ఈ టోర్నీలో పాల్గొంటున్న తెలంగాణ జట్టుకు స్పాన్సర్‌షిప్ చేస్తున్నారు.

తెలంగాణ హైకోర్టు క్రికెట్ జట్టు: దినేశ్ చక్రవర్తి (కెప్టెన్), మణి సాహిత్, ఎం.అమర్‌నాథ్, పి.సురేందర్ రెడ్డి, అభిషేక్ రిత్విక్, సాయి, విశ్వజిత్, శ్రీనివాస్ రెడ్డి, జయప్రకాశ్, కృష్ణన్, సాహిత్ గుప్తా, సాయి చరణ్, మనోజ్ గౌడ్, సతీశ్ చక్రవర్తి, పల్లవి (మేనేజర్).

వార్మప్ మ్యాచ్‌లో భారత్ ఓటమి

బెంగళూరు: మహిళల వన్డే ప్రపంచకప్ వార్మప్ మ్యాచ్‌లో భారత జట్టు పరాజయం పాలైంది. గురువారం జరిగిన పోరులో భారత జట్టు 153 పరుగుల తేడాతో ఇంగ్లండ్ మహిళల జట్టు చేతిలో ఓడింది. మొదట ఇంగ్లండ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 340 పరుగులు చేసింది. కెప్టెన్ సీవర్ బ్రంట్ (104 బంతుల్లో 120; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా... ఎమ్మా లాంబ్ (60 బంతుల్లో 84; 12 ఫోర్లు) ధనాధన్ హాఫ్‌సెంచరీ సాధించింది. భారత బౌలర్లలో క్రాంతి గౌడ్ 3 వికెట్లు తీసింది. భారీ లక్ష్య ఛేదనలో భారత జట్టు 34 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌటైంది. ఈ మ్యాచ్‌లో జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన జెమీమా రోడ్రిగ్స్ (68 బంతుల్లో 66; 8 ఫోర్లు), ఉమా ఛెత్రీ (50 బంతుల్లో 45; 9 ఫోర్లు) రాణించారు. ప్లేయర్లందరికీ ప్రాక్టీస్ దక్కాలనే ఉద్దేశంతో ఈ మ్యాచ్‌లో స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్, ప్రతీక రావల్ బ్యాటింగ్‌కు దిగలేదు.

అరుంధతికి గాయం



ఈ మ్యాచ్‌లో భారత బౌలర్ అరుంధతి రెడ్డి గాయపడింది. ఇన్నింగ్స్ 13వ ఓవర్‌లో తన బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ అందుకునే క్రమంలో అరుంధతి కింద పడింది. దీంతో కాలు మెలిక పడగా... నొప్పితో విలవిల్లాడిన హైదరాబాద్ ప్లేయర్ వీల్ చైర్ సహాయంతో మైదానాన్ని వీడింది. ప్రస్తుతం ఆమె వైద్యుల పర్యవేక్షణలో ఉంది. తదుపరి మ్యాచ్ వరకు కోలుకుంటుందా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

దబంగ్ ఢిల్లీ 'టాప్' షో

- యు ముంబాపై ఘనవిజయం



జైపూర్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో దబంగ్ ఢిల్లీ తిరిగి గెలుపుబాట పట్టింది. తొలి ఆరు మ్యాచ్‌ల్లో విజయాలు సాధించిన దబంగ్ ఢిల్లీ గత మ్యాచ్‌లో ఓడినా... వెంటనే కోలుకొని తిరిగి విజయం సాధించింది. లీగ్‌లో భాగంగా గురువారం జరిగిన పోరులో దబంగ్ ఢిల్లీ 47–26 పాయింట్ల తేడాతో యు ముంబాను మట్టికరిపించింది. దబంగ్ ఢిల్లీ తరఫున అశు మలిక్ 23 పాయింట్లతో విజృంభించాడు. నీరజ్ నర్వాల్ 7 పాయింట్లతో అతడికి అండగా నిలిచాడు. తాజా సీజన్‌లో 8 మ్యాచ్‌లాడిన దబంగ్ ఢిల్లీ 7 విజయాలు, ఒక పరాజయంతో 14 పాయింట్లు ఖాతాలో వేసుకొని తిరిగి పాయింట్ల పట్టికలో 'టాప్'కు దూసుకెళ్లింది. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 'టై బ్రేకర్'లో బెంగళూరు బుల్స్‌పై నెగ్గింది. నిర్ణీత సమయంలో ఇరు జట్ల పాయింట్లు 36–36తో సమం కాగా... విజేతను తేల్చేందుకు నిర్వహించిన టై బ్రేకర్‌లో యూపీ యోధాస్ 6–5తో బుల్స్‌ను చిత్తుచేసి ముందంజ వేసింది. యూపీ యోధాస్ తరఫున భవాని రాజ్‌పుత్ 10 పాయింట్లు సాధించాడు. శుక్రవారం లీగ్‌లో విశ్రాంతి దినం... శనివారం జరగనున్న మ్యాచ్‌ల్లో పట్నా పైరేట్స్‌తో బెంగాల్ వారియర్స్, జైపూర్ పింక్ పాంథర్స్‌తో తమిళ్ తలైవాస్ తలపడతాయి.



మయూర్ మహల్ ఇతివృత్తంగా అసోంలోని గౌహతిలో ఏర్పాటు చేసిన ఈ దుర్గ మంటపం అందరినీ ఆకర్షిస్తోంది



పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఏర్పాటు చేసిన దుర్గ మంటపం

జ్ఞాపకం 'మిగ్'లింది!

మిగ్–21 సౌందర్యానికి ఫిదా..

- విమానం కాదది.. నా ప్రియ నేస్తం
- తల్లి.. స్నేహితురాలు.. మార్గదర్శకురాలు
- రిటైర్డ్ వింగ్ కమాండర్ అవినాష్ చిక్టే భావోద్వేగం

ముంబై: తొలిచూపులో ప్రేమంటే ఇదేనేమో. మెరుపుతీగలాంటి ఆమె మహోన్నత, అద్భుత సౌందర్యం చూసి మనసు పారేసుకున్నాడు. ఆమెకు తగినవాడినా? అని మదనపడ్డాడు. ఆమె మనసు గెలుచుకున్నాడు.. ఆమె ఎవరో కాదు.. మిగ్–21 విమానం. ఆ ప్రేమికుడు రిటైర్డ్ వింగ్ కమాండర్ అవినాష్ చిక్టే. ఈ ప్రేమ కథంతా.. ఆరు దశాబ్దాల పాటు భారత వైమానిక దళానికి వెన్నెముకగా నిలిచిన మిగ్–21 విమానం గురించే సుమా.. అప్పటి సోవియట్ మూలాలున్న ఈ విమానం శుక్రవారం అధికారిక సేవలనుంచి విరమించుకోనుంది. చండీగఢ్‌లో దీనికి ఘనంగా వీడ్కోలు పలికేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రిటైర్డ్ వింగ్ కమాండర్ అవినాష్ చిక్టే కూడా.. తన ప్రియమైన మిగ్–21కు వీడ్కోలు చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. 'మిగ్–21 గురించి మాట్లాడటం, పాత ప్రేయసిని గుర్తు చేసుకున్నట్లే ఉంటుంది. మిగ్–21 ఎంతో సున్నితమైనది, సవాలుతో కూడుకున్నది, మరెంతో మరపురానిది'.. అంటారు చిక్టే.

'అద్భుతమైన ఎగిరే యంత్రంగా'.. ఆయన మిగ్–21ను అభివర్ణిస్తారు. మిగ్–21ను తొలిసారి చూసి 43 ఏళ్ల గడిచిపోయిందని చిక్టే గుర్తు చేసుకున్నారు. అప్పుడు అతని వయసు కేవలం 21 ఏళ్లు.. కానీ ఆ విమానంతో ఆయన మూటగట్టుకున్న మరపురాని జ్ఞాపకాలెన్నో..

'నేను నా మిగ్–21ని తొలిసారిగా 1982లో కలిశాను, సూర్యకాంతిలో అది మెరిసిపోతోంది. దాని ఆకృతి చాలా సుందరంగా, శంఖువులా అందంగా ఉండేది, అది చూసి తొలిచూపులోనే ప్రేమలో పడిపోయాను..'అని చిక్టే చెప్పుకున్నారు.

'కానీ నాకు భయంగా కూడా అనిపించింది. అప్పటికి నాకు విమానాలు నడపడంలో కేవలం 175 గంటల అనుభవం ఉంది. మిగ్–21 చాలా సున్నితంగా, పదునుగా కనిపించడంతో దానికి 'తీక్ష' (పదునైనది) అని పేరు పెట్టాను..'అని చిక్టే చెప్పారు. 64 ఏళ్ల చిక్టే.. ప్రస్తుతం ఒక కమర్షియల్ ఎయిర్‌లైన్‌లో సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఉన్నారు. ఆయన మిగ్–21ను 2,255 గంటల పాటు నడిపారు. మైకోయాన్–గురేవిచ్ మిగ్–21 సూపర్‌సోనిక్ జెట్ ఫైటర్, ఇంటర్‌సెప్టర్ విమానాన్ని.. పూర్వపు సోవియట్ యూనియన్‌లోని మైకోయాన్–గురేవిచ్ డిజైన్ బ్యూరో రూపొందించింది.

ఈ యుద్ధ విమానం 1963లో భారత వైమానిక దళంలోకి తొలిసారిగా ప్రవేశించింది. ఆరు దశాబ్దాల కాలంలో, భారత వైమానిక దళం (ఐఏఎఫ్) తన యుద్ధ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి.. 870కి పైగా మిగ్–21 విమానాలను కొనుగోలు చేసింది.

గాలిలో యుద్ధ గుర్రంలా పనిచేసిన ఈ విమానం, దాని భద్రతా ప్రమాణాల్లోనూ వార్తల్లో నిలవడం విశేషం. కొందరు దీన్ని 'ఎగురుతున్న శవపేటిక'.. అని కూడా అభివర్ణించారు. కాగా, 1965, 1971 పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధాల్లో మిగ్–21 విమానాలు పోషించిన పాత్ర జగద్విదితం. 1999 కార్గిల్ యుద్ధంలో, 2019 బాలాకోట్ వైమానిక దాడుల్లోనూ ఇది కీలక పాత్ర పోషించింది.

నిర్జీవమైన విమానాన్ని 'ఆమె' అని ఎందుకు వ్యక్తిగతీకరించారని ప్రశ్నిస్తే.. 'ఆమె ఒక తల్లిలా, ఒక స్నేహితురాలిలా, ఒక మార్గదర్శకురాలిగా ఉంటుంది. తుపాన్లు, ప్రమాదాలు సంభవించినప్పుడు వెన్నంటే ఉండేది.. ఆమె మాత్రమే మిమ్మల్ని సురక్షితంగా ఇంటికి చేరుస్తుంది..'అని చిక్టే కవితాత్మకంగా అభివర్ణించారు.

'మిగ్–21ను నడపడం సవాలుతో కూడుకుంది.. ఎందుకంటే ఇది చాలా వేగంగా ఉంటుంది.. తక్కువ వేగాల వద్ద గతిశక్తి పరంగా అస్థిరంగా ఉంటుందని స్పష్టం చేశారు. 'కాక్‌పిట్ చాలా చిన్నగా ఉంటుంది. పరికరాలు రష్యన్ భాషలో ఉంటాయి. మేము ఒక గట్టి ఎజెక్షన్ సీటు మీద కూర్చోవాల్సి వస్తుంది. ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థను రష్యన్ చలికాలానికి అనుగుణంగా రూపొందించారు. కాబట్టి, భారతదేశ వేసవిలో చాలా వేడిగా ఉంటుంది, అందువల్ల మాకు చాలా చెమట పట్టేది,.'అని చిక్టే గుర్తు చేసుకున్నారు.

'కానీ ఒక్కసారి తుమాన్స్కి ఆర్–25 టర్బోజెట్ ఇంజన్ పనిచేయడం మొదలైతే, మిగతావేవీ పట్టించుకోరు. టేక్–ఆఫ్ చాలా తక్కువ సమయంలో భయంకరంగా ఉంటుంది. క్షణాల్లో భూమి అస్పష్టంగా మారిపోతుంది.. ఆకాశం మిమ్మల్ని ఆకర్షిస్తుంది.. అని వివరించారు.

'మిగ్–21 విమానం సున్నితం, శక్తిమంతం, మర్మమైనది. మీరు ఆ విమానాన్ని తెలుసుకోవాలి, అర్థం చేసుకోవాలి, నమ్మాలి, ప్రేమతో చూసుకోవాలి, అప్పుడే సున్నితంగా స్పందిస్తుంది.. అని చిక్టే భావోద్వేగంతో చెప్పారు.

ఒకసారి, సముద్రంపై ఉన్నప్పుడు ఒక పక్షి గుద్దుకోవడంతో తన మిగ్–21 ఇంజిన్ ఆగిపోయిందని చిక్టే గుర్తు చేసుకున్నారు. అయితే, శిక్షణ, విమానం దృఢమైన డిజైన్ వల్ల తిరిగి ఇంజన్‌ను స్టార్ట్ చేయగలిగారు.

సతారా సైనిక్ స్కూల్, నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి అయిన చిక్టే చివరిసారిగా.. 2003లో మిగ్–21ను నడిపారు. తన ప్రియమైన విమానం నిష్క్రమిస్తున్నప్పుడు తన హృదయం ఆకాశంలో ఉంటుందని ఆయన చెప్పారు.

'నేను, నా మిగ్, చివరి వీడ్కోలు తర్వాత కూడా కలిసి ఎగురుతాం. దాస్విదానియా (రష్యన్ భాషలో 'మళ్ళీ కలిసే వరకు')..'అని చిక్టే అన్నారు.



టేకాఫ్ తీసుకుంటున్న మిగ్ విమానం (ఇన్‌సెట్‌లో) అవినాశ్

మథురలో రాష్ట్రపతి ముర్ము

మథుర: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం మథుర జిల్లాలో పర్యటించారు. ఉదయం 10 గంటలకు బృందావన్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న రాష్ట్రపతి మహారాజా ఎక్స్‌ప్రెస్‌లో పర్యటన సాగించారు. బృందావన్‌లోని బంకె బిహారీ ఆలయం, నిధివన్, సుధామ కుటీ ఆశ్రమంలలో ప్రత్యేకంగా పూజలు చేశారు. సుధామ కుటీర్ ఆశ్రమంలో ఆమె భజన్ కుటీర్‌ను ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో పారిజాత మొక్కను నాటారు. అనంతరం శ్రీ కుబ్జ–కృష్ణ ఆలయాన్ని ముర్ము సందర్శించుకున్నారని రాష్ట్రపతి కార్యాలయం తెలిపింది. రాష్ట్రపతి పర్యటనను పురస్కరించుకుని మథురలో విస్తృత బందోబస్తు చేపట్టారు. నగరంలో నిషేధాజ్ఞలు విధించారు. గగనతలాన్ని నో ఫ్లై జోన్‌గా ప్రకటించారు. యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ కమాండోలు సహా నాలుగువేల మంది పోలీసులను నియమించారు. పర్యటన వేళ కోతులతో ఇబ్బంది తలెత్తకుండా అటవీ శాఖ సిబ్బందిని వడిసెలలు, ఎయిర్ గన్‌లతో ముందు జాగ్రత్తగా ఆలయ పరిసరాల్లోని ఇళ్లపై సిద్ధం చేసి ఉంచారు. ప్రత్యేక రైలులో రాష్ట్రపతి ముర్ము సాయంత్రం మథుర నుంచి ఢిల్లీకి బయలు దేరారు.

మూడు రాష్ట్రాలకు బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జిల నియామకం

న్యూఢిల్లీ: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు బీజేపీ అధిష్టానం ఎన్నికల ఇన్‌చార్జిలను నియమించింది. బిహార్‌కు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, పశ్చిమ బెంగాల్‌కు మరో కేంద్ర మంత్రిభూపేంద్ర యాదవ్‌ను నియమిస్తున్నట్లు గురువారం ప్రకటించింది. మరో కీలక రాష్ట్రం తమిళనాడుకు సీనియర్ నేత బైజయంత్ జే పాండాను ఇన్‌చార్జిగా నియమించారు. బిహార్‌లో ఈ ఏడాది నవంబర్‌లో, పశ్చిమ బెంగాల్, తమిళనాడులో వచ్చే ఏడాది మార్చి–ఏప్రిల్‌లో శాసనసభ ఎన్నికలు జరుగబోతున్నాయి. బిహార్‌కు సహ ఇన్‌చార్జిలుగా కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్, ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్యను, పశ్చిమబెంగాల్ సహ ఇన్‌చార్జిగా త్రిపుర మాజీ సీఎం బిప్లవ్‌కుమార్ దేవ్, తమిళనాడు సహ ఇన్‌చార్జిగా కేంద్ర మంత్రి మురళీధర్ మోహోల్‌ను నియమించినట్లు బీజేపీ అధిష్టానం తెలియజేసింది. ధర్మేంద్ర ప్రధాన్, భూపేంద్ర యాదవ్‌లు బీసీ వర్గానికి చెందిన నాయకులు కావడం గమనార్హం.

విధ్వంస ఆయుధ రేసులో ప్రపంచం

మానవ చరిత్రలోనే ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదు

- యుద్ధాలను ఆపటంలో అంతర్జాతీయ సంస్థలు విఫలం
- ప్రస్తుతం ఎవరు బతకాలో ఆయుధాలే నిర్ణయిస్తున్నాయి
- ఐక్యరాజ్య సమితిలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

యునైటెడ్ నేషన్స్: ప్రపంచ దేశాలన్నీ మానవ చరిత్రలో గతంలో ఎన్నడూ చూడనంతగా విధ్వంసకర ఆయుధాల రేసులో పరుగులు పెడుతున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ విమర్శించారు. ప్రస్తుతం ప్రపంచంలో ఎవరు బతికి బట్టకట్టాలన్నది ఆయుధాలే నిర్ణయిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్.. ఉక్రెయిన్‌పై సాగిస్తున్న యుద్ధాన్ని యూరప్ ఖండం అంతటికీ విస్తరించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పుతిన్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ సమాజం మొత్తం ఏకం కావాలని పిలుపునిచ్చారు.

యుద్ధాలు ఆపటంలో ఐరాస విఫలం

ప్రపంచంలో ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలను ఆపటంలో ఐక్యరాజ్య సమితితోపాటు అంతర్జాతీయ సంస్థలన్నీ విఫలమయ్యాయని జెలెన్‌స్కీ ఆరోపించారు. ఉక్రెయిన్, గాజా, సూడాన్.. ఇలా ఏ ఒక్క యుద్ధాన్ని ఆపలేకపోయాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశాలు మనుగడ సాగించటానికి అంతర్జాతీయ చట్టాలు ఏమాత్రం ఉపయోగపడటం లేదని మండిపడ్డారు. 'స్నేహితులు, ఆయుధాలు ఉన్నవారికి తప్ప. ఇతరుల భద్రతకు ఎలాంటి హామీ లేదు'అని పేర్కొన్నారు. కలసి ఉంటే ఎంతో మార్పు తీసుకురాగలమని అన్నారు. రష్యాతో దాదాపు మూడేళ్లుగా సాగుతున్న యుద్ధంలో తమకు మద్దతుగా నిలిచిన అమెరికా, యూరప్ దేశాలకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపారు. యుద్ధాన్ని ఇంకా కొనసాగిస్తూ వెళ్తున్న రష్యా తీరును ఐరాస సభ్యదేశాలన్నీ ఖండించాలని కోరారు. 'రష్యా వెంటనే యుద్ధాన్ని ఆపకపోతే.. మేము కూడా దీనిని మరింత విస్తరిస్తాం. మరింత విధ్వంసకరంగా మారుస్తాం. మొదట ఉక్రెయిన్‌పై దాడిచేసిన రష్యా.. ఇప్పుడు యూరప్ అంతటా తన డ్రోన్లను తిప్పుతోంది. రష్యా కార్యకలాపాలు ఎప్పుడు ఎల్లలు దాటాయి. జార్జియా, బెలారస్‌లాగా కాకుండా రష్యాకు జోక్యం నుంచి మాల్డోవా తనను తాను కాపాడుకుంటోంది. యూరప్ ఖండం మాల్డోవాను కూడా కోల్పోకూడదు. ఆ దేశానికి ఇప్పుడు కావాల్సింది రాజకీయపరమైన సానుభూతి కాదు. నిధులు, ఇంధన మద్దతు కావాలి' అని పేర్కొన్నారు.



డ్రోన్లతోనే వేలమంది హత్య

ప్రస్తుత యుద్ధాల్లో డ్రోన్లతోనే వేలమందిని ఎలా చంపాలో చూపిస్తున్నారని జెలెన్‌స్కీ అన్నారు. 'ఇటీవల డ్రోన్ల కారణంగానే యూరప్‌లో విమానాశ్రయాలు మూసివేయాల్సి వచ్చింది. టాక్టికల్ డ్రోన్‌ను పరీక్షించినట్లు గత వారమే ఉత్తరకొరియా ప్రకటించింది. అతి తక్కువ వనరులు ఉన్న దేశాలు కూడా ప్రమాదకరమైన డ్రోన్లను తయారు చేస్తున్నాయి. ప్రస్తుతం మనం మానవ చరిత్రలోనే అత్యంత విధ్వంసకరమైన ఆయుధాల రేసు యుగంలో నివసిస్తున్నాం'అని పేర్కొన్నారు.

33 ఏళ్ల తర్వాత డిపోర్ట్ చేసిన అమెరికా

73 ఏళ్ల సిక్కు మహిళకు తీవ్ర వేదన

చండీగఢ్: అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం వలసదారుల పట్ల ఎంతటి అనుమాషంగా వ్యవహరిస్తోందో తెలిపే తాజా ఉదాహరణ ఇది. మూడు దశాబ్దాలుగా అమెరికాలో నివాసం ఉంటున్న ఓ వృద్ధ మహిళను కనీసం కనికరమైనా లేకుండా భారత్‌కు డిపోర్ట్ చేసింది. గౌరవప్రదంగా వీడ్కోలు చెప్పేందుకు అవకాశమివ్వాలని కోరినా తిరస్కరించి తీవ్ర అవమానకరంగా వ్యవహరించింది. కాలిఫోర్నియాలోని ఈస్ట్‌బే ప్రాంతంలో 33 ఏళ్లుగా నివాసం ఉంటున్న హర్జీత్ కౌర్ అనే 73 ఏళ్ల వృద్ధురాలికి కలిగిన వేదన ఇది. హర్జీత్ కౌర్ ఇటీవల సాధారణ వైద్య పరీక్షల కోసం బయటకు వెళ్లారు. ఆ సమయంలో ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ)అధికారులు ఆమెను అడ్డగించి నివాస పత్రాలు చూపాలని అడిగారు. లేవని చెప్పడంతో శాన్‌ఫ్రాన్సిస్కోలోని తమ కార్యాలయానికి అవసరమైన పత్రాలతో రావాలన్నారు. ఆమె అక్కడికి చేరుకోగా బేకర్‌ఫీల్డ్‌లోని వలసదారుల డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. కుటుంబసభ్యులకు చిట్టచివరి సారిగా వీడ్కోలు పలికేందుకు ఆమెకు అవకాశమివ్వాలని కుటుంబసభ్యులు కోరగా అధికారులు తిరస్కరించారు. అక్కడ వారం రోజులపాటు ఉంచి లాస్‌ఏంజెలెస్‌కు, అక్కడి నుంచి జార్జియాకు ఆమెను తీసుకెళ్లారు. జార్జియా నుంచి ఆర్మీనియా, ఆర్మీనియా నుంచి ఐసీఈ ఏర్పాటు చేసిన చార్టర్డ్ విమానంలో మరికొందరితో కలిపి ఢిల్లీకి చేర్చారని దీపక్ అహ్లూవాలియా అనే లాయర్ తెలిపారు. ఆమె బుధవారం పంజాబ్‌కు చేరుకున్నారని ఇన్‌స్టాలో వెల్లడించారు. 'హర్జీత్ కౌర్‌ను సోమవారం కమర్షియల్ విమానంలో పంపించేందుకు ప్రయాణపత్రాలు, టిక్కెట్లు కూడా బుక్ చేశాం. కుటుంబసభ్యులకు వీడ్కోలు చెప్పేందుకు కనీసం 24 గంటలు సమయమివ్వాలని కోరాం. అధికారులు నిరాకరించారు. కనీసం 70 గంటలపాటు ఒక దుప్పటితో ఆమె నేలపైనే పడుకున్నారు. కనీసం బెడ్ కూడా అధికారులు ఇవ్వలేదు. స్నానం చేయనివ్వలేదు. చేతులు బేడీలతోనే ఆమెను శనివారమే విమానమెక్కించారు'అని అహ్లూవాలియా ఆవేదన వ్యక్తం చేశారు. హర్జీత్ కౌర్ తన ఇద్దరు పిల్లలతో కలిసి 1992లో అమెరికా చేరుకున్నారు. 2012లో ఆమెకు ప్రభుత్వం ఆశ్రయం నిరాకరించింది. అప్పటి నుంచి గత 13 ఏళ్లుగా 6 నెలలకోసారి శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఐసీఈ కార్యాలయంలో క్రమం తప్పకుండా రిపోర్టు చేస్తున్నారని ఆమె కోడలు మంజీత్ కౌర్ తెలిపారు.

ఆ ఇళ్లను 80 ఏళ్ల తండ్రికే ఇచ్చేయండి

కన్న తండ్రిని నిర్లక్ష్యం చేసిన కుమారుడికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: తన నివాసంలో 80 ఏళ్ల కన్నతండ్రిని ఉండనివ్వని కుమారుడికి సుప్రీంకోర్టు తగినబుద్ధి చెప్పింది. తక్షణమే ఆస్తులన్నిటినీ తండ్రికి తిరిగి స్వాధీనం చేయాలనిఆదేశించింది. వృద్ధుల బాగోగులను చూసుకోవాల్సిన బాధ్యతను విస్మరించిన, సీనియర్ సిటిజన్ ఆస్తి నుంచి సంతానాన్ని, లేదా బంధువును వెళ్లగొట్టాలని ఆదేశించే అధికారం మెయింటెనెన్స్ అఫ్ వెల్ఫేర్ అఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్–2007 ప్రకారం మెయింటెనెన్స్ ట్రిబ్యునల్‌కు ఉందని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. రెండు చోట్ల ఉన్న ఆస్తులను తండ్రికి దఖలు పర్చాలంటూ కుమారుడిని ఆదేశిస్తూ మెయింటెనెన్స్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను ఏప్రిల్‌లో బాంబే హైకోర్టు కొట్టివేసింది. దీనిని సవాల్ చేస్తూ తండ్రి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈనెల 12వ తేదీన విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం..హైకోర్టు తీర్పును పక్కనబెట్టి, ట్రిబ్యునల్ తీర్పును సమర్థించింది. వృద్ధుల కష్టాలను తీర్చేందుకు, వారి సంరక్షణ, భద్రతకు గ్యారెంటీ ఇవ్వడమే 2007 నాటి చట్టం ముఖ్య ఉద్దేశమని ధర్మాసనం స్పష్టం చేసింది. 'సంక్షేమ చట్టం అయినందున బాధితులకు ప్రయోజనాలను అందించేందుకు అందులోని నిబంధనలను ఉదారంగా అర్థం చేసుకోవాలి. సీనియర్ సిటిజన్‌ల పోషణ బాధ్యతలను సరిగ్గా నెరవేర్చలేని సందర్భాల్లో వారి ఆస్తి నుంచి కుమారుడిని లేదా బంధువును వెళ్లిపోవాలని ఆదేశించే అధికారాలు ట్రిబ్యునల్‌కు ఉన్నాయని ఇప్పటికే అత్యున్నత న్యాయస్థానం పలుమార్లు స్పష్టం చేసింది'అని ధర్మాసనం తెలిపింది. ఆర్థికంగా స్థితిమంతుడై ఉండీ, తండ్రి సంపాదించిన ఇంట్లో నివాసముంటూ తండ్రినే ఉండనివ్వని కుమారుడు చట్టబద్ధమైన బాధ్యతలను ఉల్లంఘించాడని ధర్మాసనం పేర్కొంది. 'పిటిషనర్‌కు 80 ఏళ్లు, ఆయన భార్యకు 78 ఏళ్లు కాగా, వీరికి ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు వ్యాపార సంస్థకు యజమాని అని ఈ సందర్భంగా ధర్మాసనం తెలిపింది. ఈ ఏడాది నవంబర్ 30వ తేదీలోగా భవనాన్ని ఖాళీ చేస్తానని హామీ ఇవ్వడానికి ధర్మాసనం కుమారుడికి రెండు వారాల గడువిచ్చింది. ఆలోగా హామీపత్రాన్ని దాఖలు చేయకుంటే పిటిషనర్ అయిన వృద్ధ తండ్రికి తమ ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని కోరే హక్కుంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది.

మా క్యాంపస్ నుంచి ట్రాఫిక్‌కు 'నో'

విప్రో చైర్మన్ అజీమ్ ప్రేమ్‌జీ స్పష్టీకరణ

బెంగళూరు: బెంగళూరులో ట్రాఫిక్ కష్టాలను తగ్గించేందుకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ విప్రో క్యాంపస్ మధ్య నుంచి వాహనాలు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలన్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విజ్ఞప్తిని విప్రో వ్యవస్థాపక చైర్మన్ అజీమ్ ప్రేమ్‌జీ తోసిపుచ్చారు. ఆ స్థలం లిస్టెడ్ కంపెనీకి చెందిన ప్రైవేటు ఆస్తి అని, ప్రజలందరికీ సంబంధించినది కాదని స్పష్టంచేశారు. సర్జాపూర్‌లోని విప్రో క్యాంపస్ నుంచి ట్రాఫిక్‌ను అనుమతిస్తే న్యాయ, ప్రభుత్వ పరమైన సమస్యలు వస్తాయని తెలిపారు. సర్జాపూర్ క్యాంపస్ ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్న స్పెషల్ ఎకనమిక్ జోన్ (సెజ్) అని గుర్తుచేశారు. తమ క్యాంపస్‌లో నుంచి ట్రాఫిక్‌ను అనుమతించినంత మాత్రాన బెంగళూరులో ట్రాఫిక్ సమస్య పూర్తిగా పరిష్కారం కాదని తెలిపారు.

ఆ స్కూల్లో రామ్‌లీలా వేయొచ్చు: సుప్రీం

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని తుండ్ల ప్రభుత్వ పాఠశాల మైదానంలో 'రామ్‌లీలా' ప్రదర్శనకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. అక్కడ గత 100 సంవత్సరాల నుంచి రామ్‌లీలా ప్రదర్శన నిర్వహిస్తున్నారని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం గుర్తుచేసింది. అయితే, రామ్‌లీలా తప్ప ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఇతర మతపరమైన కార్యక్రమాలు ఏవీ ఏర్పాటుచేయరాదని స్పష్టంచేసింది. తుండ్లా పాఠశాలలో మతపరమైన కార్యక్రమాల వల్ల విద్యార్థులకు ఇబ్బంది కలుగుతోందని ప్రదీప్‌సింగ్ రాణా అనే వ్యక్తి అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీంతో స్కూల్లో మతపరమైన కార్యక్రమాలపై హైకోర్టు ఈ నెల 22న స్టే విధించింది. ఈ కేసు సుప్రీంకోర్టుకు రావటంతో రామ్‌లీలా ప్రదర్శనకు అనుమతిస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది. అయితే, ఆ సమయంలో విద్యార్థులకు ఏ విధంగానూ అసౌకర్యం కలిగించరాదని స్పష్టంచేసింది. స్కూల్లో విద్యార్థిగానీ, విద్యార్థి పేరెంట్ కూడా కాకుండా ఏ ప్రయోజనాలు ఆశించి ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు చేసిన తర్వాత పిటిషన్ వేశారని ప్రదీప్‌సింగ్‌ను ధర్మాసనం నిలదీసింది.

కేజ్రీవాల్‌కు పది రోజుల్లోగా వసతి

ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు పది రోజుల్లోగా సరైన వసతిని కేటాయిస్తామని కేంద్రం గురువారం ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు బంగ్లా కేటాయించాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సచిన్ దత్తా విచారణ జరిపి.. వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా.. కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ (ఎస్.జి) తుషార్ మెహతా మాట్లాడుతూ.. కేజ్రీవాల్‌కు పది రోజుల్లోగా సరైన వసతి కేటాయిస్తామని తెలిపారు. ఆప్ తరపు సీనియర్ న్యాయవాది రాహుల్ మెహ్రా వాదిస్తూ, గతంలో కేజ్రీవాల్‌కు ఇచ్చిన వసతి కంటే తక్కువ స్థాయి వసతిని కేటాయించరాదని కోరారు.

బార్ కోటాలో జిల్లా జడ్జీల నియామకంపై సుప్రీంకోర్టు తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: ఏడేళ్ల ప్రాక్టీస్ అనుభవంతో న్యాయాధికారులుగా నియమితులైన వారిని బార్ సభ్యుల కోటా కింద జిల్లా జడ్జీలుగా నియమించే విషయమై సుప్రీంకోర్టు తీర్పును రిజర్వులో ఉంచింది. ఇందుకు సంబంధించి దాఖలైన 30కి పైగా పిటిషన్లపై ఈ నెల 23వ తేదీ నుంచి బార్ కోటా కింద జిల్లా జడ్జీల ఎంపిక పరీక్షకు న్యాయాధికారులు అర్హులేనని కొందరు, కాదని పలువురు లాయర్లు వాదనలు వినిపించారు. గురువారంతో వాదనలు ముగియగా తీర్పును తర్వాత ప్రకటిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ప్రకటించింది. జిల్లా జడ్జీల నియామకాలపై రాజ్యాంగంలోని ఆర్టికల్ 233కు సంబంధించిన పలు ప్రశ్నలను ధర్మాసనం పరిశీలిస్తోంది. ఏదైనా రాష్ట్రంలోని జిల్లా జడ్జీల నియామకం, పోస్టింగ్, ప్రమోషన్ వంటివాటిపై సంబంధిత హైకోర్టుతో సంప్రదించిన మీదట ఆ రాష్ట్ర గవర్నర్ నిర్ణయం తీసుకుంటారని ఆర్టికల్ 233 చెబుతోంది.

మదరసా మరుగుదొడ్డిలో బందీలైన బాలికలు

తనిఖీల్లో 40 మంది గుర్తింపు

బహ్రైచ్ (యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్ జిల్లాలో ఒక అక్రమ మదరసాలో నిర్వహించిన తనిఖీల్లో బందీలుగా ఉన్న 40 మంది బాలికలను అధికారులు గుర్తించారు. మదరసాలోని మరుగుదొడ్డిలో.. 9 నుండి 14 ఏళ్ల మధ్య వయసున్న 40 మంది బాలికలను గుర్తించినట్లు గురువారం పోలీసులు తెలిపారు. పయగ్‌పూర్ మేజిస్ట్రేట్ అశ్విని కుమార్ పాండే మాట్లాడుతూ, పయగ్‌పూర్ తహసీల్‌లోని పహల్వారా గ్రామంలో.. మూడు అంతస్తుల భవనంలో అక్రమ మదరసా నడుస్తోందని జిల్లా యంత్రాంగానికి అనేకసార్లు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. తనిఖీల కోసం వెళ్లినప్పుడు, మదరసా నిర్వాహకులు తొలుత తమను అడ్డుకోవడానికి ప్రయత్నించారని తెలిపారు. మహిళా పోలీసు సిబ్బంది భవనం పైఅంతస్తులో తాళం వేసిన మరుగుదొడ్డి తలుపు తెరవగానే.. 9 నుండి 14 ఏళ్ల మధ్య వయసున్న 40 మంది బాలికలు ఒకరి తర్వాత ఒకరుగా బయటకు వచ్చారని వివరించారు. నిర్వాహకులు, సిబ్బంది మదరసా రిజిస్ట్రేషన్ లేదా చట్టబద్ధతకు సంబంధించిన ఎలాంటి పత్రాలను చూపించలేకపోయారని వెల్లడించారు.

వెనెజులాలో కంపించిన భూమి

కారకాస్: దక్షిణ అమెరికాలోని వెనెజులాలో వాయవ్య ప్రాంతం బుధవారం సాయంతం భూకంపం సంభవించింది. తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.2గా నమోదైంది. వాయవ్య జులియా రాష్ట్రం మెనె గ్రాండెకు 24 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉంది. భూమిలోపల 7.8 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించింది. దీని ప్రభావం వెనెజులాలోని జులియా, బరినాస్ రాష్ట్రాలతోపాటు పొరుగునున్న కొలంబియాలోనూ కనిపించింది. సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు ప్రకంపనలతో భయకంపితులైన ఇళ్లు, కార్యాలయాలను వదిలి రోడ్లపైకి చేరుకున్నారు. వెనెజులా, కొలంబియాల్లో నష్టానికి సంబంధించిన వివరాలు వెల్లడికాలేదు.

శ్రీలంకలో కేబుల్ కార్ ప్రమాదం

భారతీయుడు సహా ఏడుగురు బౌద్ధ సన్యాసులు మృతి

కొలంబో: శ్రీలంక వాయువ్య ప్రాంతంలోని ఒక అటవీ మఠంలో కేబుల్‌తో నడిచే రైలు కారు బోల్తా పడిన సంఘటనలో ఒక భారతీయుడు సహా ఏడుగురు బౌద్ధ సన్యాసులు మరణించారని.. మరో ఆరుగురు గాయపడ్డారని పోలీసులు గురువారం తెలిపారు. కొలంబోకు సుమారు 125 కిలోమీటర్ల దూరంలోని నికవెరటియాలోని నా ఉయాన అరణ్య సేనాసనయ అనే ప్రసిద్ధ బౌద్ధ మఠంలో బుధవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. మరణించిన ఏడుగురు సన్యాసులలో ఒక భారతీయుడు, ఒక రష్యన్, ఒక రొమేనియన్ జాతీయులు ఉన్నారని పోలీసులు తెలిపారు. గాయపడిన ఆరుగురిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు.

ఒడిశాలో బస్సు–ట్రక్కు ఢీ

ఆరుగురు మృతి.. 10 మందికి గాయాలు

భువనేశ్వర్/రూర్కెలా: ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలో గురువారం బస్సు, ట్రక్కు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మహిళలు సహా కనీసం ఆరుగురు మరణించారు, మరో 10 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. జాతీయ రహదారి 520పై కే బలంగ్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉదయం 11 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని ఒక సీనియర్ అధికారి చెప్పారు. ఐదుగురు సంఘటనా స్థలంలో, మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందారని, కనీసం 10 మంది తీవ్రంగా గాయపడ్డారని.. పశ్చిమ రేంజ్ డీఐజీ బ్రిజేష్ కుమార్ రాయ్ విలేకరులకు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వారిని రూర్కెలాలోని ఒక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, మిగిలిన వారికి కోయిడా, లహునిపాడ ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స అందిస్తున్నారని తెలిపారు.

విద్యా హక్కు చట్టాన్ని ఎప్పుడు చేశారు?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

వ్యక్తిగత స్వేచ్ఛలు, హక్కులు

ప్రకరణ 21

విస్తృత పరిధి, అభ్యుదయ వ్యాఖ్యానాలు

మేనకా గాంధీ కేసు, ఇంద్రజిత్, వెల్లూరు సిటిజన్స్ వెల్ఫేర్ కేసు, ప్రేమశంకర్ శుక్లా కేసు, నరేంద్రకుమార్ కేసు, మోహిని జైన్ కేసు, ఆటోశంకర్ కేసు, శ్రీమతి ఖుష్బు కేసు మొదలైన వాటిల్లో సుప్రీంకోర్టు జీవించే స్వేచ్ఛపై విస్తృత అర్థాన్ని చెప్పింది. ఈ తీర్పుల సారాంశం ప్రకారం ప్రకరణ 21లో కింద పేర్కొన్న హక్కులు కూడా అంతర్భాగమే.

- గౌరవప్రదంగా జీవించే హక్కు
- కాలుష్య రహిత వాతావరణ హక్కు
- రహస్యాలను, ఆరోగ్యాన్ని కాపాడుకునే హక్కు
- ఉచిత న్యాయ సలహా హక్కు
- విదేశాల పర్యటన హక్కు
- లాకప్ మరణాల వ్యతిరేక హక్కు
- సమాచార హక్కు
- సహజీవన హక్కు
- ఏకాంతంగా జీవించే హక్కు
- సత్వర విచారణ పొందే హక్కు
- మరణ శిక్ష అమలును ఆలస్యం చేయడంపై అడిగే హక్కు
- ఆహార హక్కు
- నిద్ర హక్కు

ఆత్మహత్యా ప్రయత్నం - జీవించే హక్కు - తాజా వివాదం

ప్రకరణ 21 జీవించే హక్కును కల్పించింది. ఇండియన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 309 ప్రకారం ఆత్మహత్యాయత్నం శిక్షార్హమైన నేరం. ఈ సెక్షన్ అమానుషమైందని, దాన్ని ఇండియన్ పీనల్ కోడ్ నుంచి తొలగించాలని సుప్రీంకోర్టు సూచించింది. ఆ సెక్షన్‌ను తొలగిస్తున్నట్లు ఇటీవలే కేంద్రం ప్రకటించింది.

'ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం అసహజమైన కోరిక. కాబట్టి ఆ కోరికకు కారణమైన పరిస్థితులను పరిశీలించాలి. అలాంటి వ్యక్తులకు సరైన కౌన్సెలింగ్ నిర్వహించాలి. పోలీసు కేసులతో వేధించరాదు' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

కారుణ్య మరణం (Euthanasia): 2011లో పింకీ విరానీ అనే జర్నలిస్టు అరుణా షాన్‌బాగ్ తరఫున సుప్రీంకోర్టులో కేసు వేసింది. వృత్తి రీత్యా నర్సు అయిన అరుణ షాన్‌బాగ్ బొంబాయి ఎడ్వర్డ్ ఆసుపత్రిలో లైంగిక దాడికి గురైంది. ఆమె సుమారు 37 సంవత్సరాలు కోమాలోనే ఉంది. ఆమె పరిస్థితి దృష్ట్యా కారుణ్య మరణానికి అనుమతివ్వాలని సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేసింది. న్యాయస్థానం కారుణ్య మరణాన్ని నిరాకరించింది. ప్రత్యేక పరిస్థితుల్లోనే పాసివ్ కారుణ్య మరణాన్ని అనుమతిస్తామని పేర్కొంది.

విద్యాహక్కు (ప్రకరణ 21-ఎ) (Right to education): విద్యాహక్కును 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్-21ఎలో చేర్చారు. 6 - 14 ఏళ్ల మధ్య వయసున్న బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలని పేర్కొన్నారు.

వాస్తవానికి 2002కు ముందు ఆదేశ సూత్రాల్లోని ఆర్టికల్ 45లో ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను పొందుపరిచారు. కానీ 86వ రాజ్యాంగ సవరణ ద్వారా దీన్ని ఆర్టికల్ 21-ఎకి బదలాయించి ప్రాథమిక హక్కుగా గుర్తించారు. ప్రస్తుతం నిబంధన 45లో ఉచిత ప్రాథమిక విద్యను (ఆరేళ్ల లోపు వారికి) అందించాలనే కొత్త అంశాన్ని చేర్చారు. 2009లో విద్యా హక్కు చట్టాన్ని చేశారు. ఈ చట్టం 2010 ఏప్రిల్ 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది.

విద్యా హక్కు చట్టం ముఖ్యాంశాలు

- ఒకటి నుంచి అయిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వారి నివాస ప్రదేశానికి ఒక కి.మీ. పరిధిలో పాఠశాల ఉండాలి.
- ప్రైవేట్ పాఠశాలల్లోని మొత్తం విద్యార్థుల సంఖ్యలో 25 శాతం సీట్లను బలహీన వర్గాలకు కేటాయించాలి.
- ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి 1:30గా ఉండాలి.
- ఈ చట్టం అమలుకయ్యే వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 65:35 నిష్పత్తిలో భరిస్తాయి. ప్రైవేట్ పాఠశాలల్లో ఈ కోటాలో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండరాదు.

విద్యాహక్కు - సుప్రీంకోర్టు తీర్పులు

1992లో మోహిని జైన్ v/s కర్ణాటక, ఉన్నికృష్ణన్ v/s ఆంధ్రప్రదేశ్ కేసుల్లో జీవించే హక్కు, వ్యక్తి గౌరవాన్ని పొందే హక్కుల్లో విద్యా హక్కు అంతర్భాగం. దాన్ని ప్రాథమిక హక్కుగా పరిగణించాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక నేపథ్యంతో సంబంధం లేకుండా బాలలకు ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని తమిళనాడు ప్రభుత్వం v/s శ్యామ్ సుందర్ కేసు (2011)లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

ప్రాథమిక విధి: ఇదే సవరణ ద్వారా నిబంధన 51-ఎలో ప్రతి తల్లిదండ్రులు, సంరక్షకులు 6 నుంచి 14 ఏళ్లలోపు వయసున్న తమ పిల్లలకు విద్యా సౌకర్యాలు కల్పించాలనే విధిని నూతన ప్రాథమిక విధిగా పేర్కొన్నారు.

ప్రకరణ-22

అక్రమ నిర్బంధం (Arrest), నిర్బంధం (Detention) నుంచి రక్షణ

అక్రమ అరెస్టులు, నిర్బంధాలకు వ్యతిరేకంగా ఆర్టికల్ 22 రక్షణ కల్పిస్తుంది. ఈ ప్రకరణ ప్రకారం చట్టబద్ధంగా అరెస్ట్ చేయడానికి కొన్ని ప్రాతిపదికలు పాటించాలి. అవి..

ప్రకరణ 22 (1):

ఎ) ప్రతి అరెస్టుకు కారణం ఉండాలి లేదా కారణాన్ని తెలియజేయాలి. న్యాయవాదిని సంప్రదించే అవకాశం ఇవ్వాలి.

బి) నిందితుణ్ని 24 గంటల్లోగా సమీప న్యాయస్థానంలో హాజరుపరచాలి.

24 గంటలను లెక్కించేటప్పుడు ప్రయాణ సమయాన్ని మినహాయిస్తారు. సెలవు దినాలను మినహాయించరు. అరెస్టయిన వ్యక్తిని సమీప మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చాలి. పై రక్షణలకు కొన్ని మినహాయింపులున్నాయి. ప్రకరణ 22(3) ప్రకారం శత్రు దేశ పౌరులకు, ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాల కింద అరెస్టయిన వారికి ఈ రక్షణలు వర్తించవు.

ప్రకరణ 22(4) ప్రకారం ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాల కింద అరెస్టయిన వారిని మూడు నెలలకు మించి నిర్బంధంలో ఉంచరాదు. కానీ ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాల కింద ఏర్పాటైన ఎడ్వైజరీ బోర్డు సూచన మేరకు మూడు నెలల కంటే ఎక్కువ కాలం నిర్బంధంలో ఉంచవచ్చు. ఈ బోర్డులో హైకోర్టు న్యాయమూర్తులు లేదా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యే అర్హతలున్న వ్యక్తులు సభ్యులుగా ఉంటారు.

ప్రకరణ 22(5) ప్రకారం ప్రివెంటివ్ డిటెన్షన్ కింద అరెస్టయిన వారికి తమను ఎందుకు అరెస్టు చేశారో వీలైనంత త్వరగా తెలపాలి. తద్వారా బాధితులకు పిటీషన్ వేసుకునే అవకాశం ఉంటుంది.

ప్రకరణ 22(6) ప్రకారం ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ప్రివెంటివ్ అరెస్టుకు కారణాలను వెల్లడించకుండా ఉండే అధికారం ప్రభుత్వానికి ఉంది.

ప్రకరణ 22(7) ప్రకారం పైన పేర్కొన్న క్లాజులతో సంబంధం లేకుండా మూడు నెలల కంటే ఎక్కువ కాలం నిర్బంధించే విధంగా పార్లమెంట్ శాసనాలు రూపొందించవచ్చు.

ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాలు, వివరణ: సాధారణంగా నిర్బంధాలు రెండు రకాలు:

1. శిక్షించే చట్టాలు 2. నివారక చట్టాలు.

శిక్షించే చట్టాల్లో ముద్దాయి నేరం రుజువయ్యాక కోర్టు విధించిన శిక్షను అమలు చేయడానికి నిర్బంధిస్తారు. నివారక నిర్బంధంలో విచారణ లేకుండా నేరం చేస్తారేమో అనే అనుమానంతో నిందితుణ్ని లేదా అనుమానితుణ్ని ముందుగానే నిర్బంధిస్తారు. దేశ రక్షణ, శాంతి భద్రతల దృష్ట్యా ఇలా చేస్తారు.

సుప్రీంకోర్టు తీర్పులు

ఎ.కె.గోపాలన్ v/s స్టేట్ ఆఫ్ మద్రాస్ (1950): ఒక వ్యక్తిని అరెస్టు చేస్తున్నప్పుడు అతడికి కారణాలను తెలపడం సంబంధిత పోలీస్ అధికారి బాధ్యత. అలాగే అరెస్టయిన వ్యక్తికి తన వాదనను వినిపించేందుకు అవకాశం ఇవ్వాలి. దీన్ని లాటిన్ పరిభాషలో 'ఆడీ ఆల్టిరమ్ పార్టెమ్' అంటారు. అంటే హియర్ ది అదర్ సౌండ్ టూ అని అర్థం. అభియోగం ఎదుర్కొంటున్న వ్యక్తికి తన నిర్దోషిత్వాన్ని వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని దీని అర్థం.

అబ్దుల్ సమర్థ v/s స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ (1962)

అరెస్టయిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీప కోర్టులో హాజరు పరచకపోతే 24 గంటల తర్వాత ఆ వ్యక్తికి విడుదలయ్యే హక్కు ఉంటుందని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.

జోగిందర్ కుమార్ v/s స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్

ఒక వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు ఆ సమాచారాన్ని కుటుంబ సభ్యులకు/స్నేహితుడికి/సంబంధిత వ్యక్తులకు తెలియజేయాలి.

ప్రకరణలు 23, 24

పీడన నిరోధ హక్కులు

మానవులతో వ్యాపారం, బలవంతపు వెట్టిచాకిరీని ప్రకరణ 23(1) నిషేధిస్తుంది. వ్యక్తుల ఇష్టానికి వ్యతిరేకంగా, బలవంతంగా ఏ పని చేయించరాదు. పై చర్యలకు పాల్పడితే పార్లమెంటు చట్టాల ప్రకారం శిక్షార్హులు అవుతారు.

నిబంధన 23లో బేగార్ అనే పదాన్ని ప్రయోగించారు. బేగార్ అంటే వెట్టిచాకిరీ. ఉత్తర భారతదేశంలో హాలీ అంటే.. ఎలాంటి పారితోషకం లేకుండా వ్యక్తులతో పని చేయించుకోవడం. దీన్ని 1976లో వెట్టిచాకిరీ చట్టం ద్వారా నిషేధించారు.

ఈ నిబంధన స్వయంగా అమల్లోకి రాదు. అందుకే 1956లో పార్లమెంటు అశ్లీల, అసభ్య వ్యాపార నిరోధక చట్టాన్ని రూపొందించింది.

ప్రకరణ 23(2) ప్రకారం ప్రజా ప్రయోజనం కోసం పౌరులు, ప్రభుత్వ ఉద్యోగులపై నిర్బంధ సేవలను విధించవచ్చు. దీన్ని దోపిడీగా పరిగణించరు.

ప్రకరణ-24

బాల కార్మిక వ్యవస్థ రద్దు

ఈ ఆర్టికల్ ప్రకారం 14 ఏళ్ల లోపు వయసు ఉన్న బాలలను ప్రమాదకర, ఇతర పనుల్లో వినియోగించరాదు. ఒకవేళ వినియోగిస్తే చట్ట ప్రకారం శిక్షార్హులవుతారు. ఈ నిబంధన కూడా స్వయంగా అమల్లోకి రాదు. దీనికి సంబంధించి పార్లమెంటు చట్టం చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు తదనుగుణంగా చట్టాలు చేశారు.

సుప్రీంకోర్టు తీర్పులు

ఎం.సి.మెహతా v/s తమిళనాడు(1997) కేసులో 14 ఏళ్ల లోపు వయసున్న బాలలను ఏ రకమైన ప్రమాదకర పరిశ్రమల్లో లేదా ఇతర పనుల్లో వినియోగించరాదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

బందువా ముక్తిమోర్చా v/s యూనియన్ ఆఫ్ ఇండియా, 1997 కేసులో కూడా సుప్రీంకోర్టు ఇదే తీర్పు వెలువరించింది. బాలల సంరక్షణకు ప్రత్యేక పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని, బాలకార్మికులను పనిలో వినియోగించే యజమానిపై రూ.20,000 వరకు జరిమానా విధించాలని పేర్కొంది.

ప్రకరణలు 25-28

మత స్వాతంత్ర్యపు హక్కులు

ప్రకరణ 25(1) ప్రకారం ప్రతి వ్యక్తి తన అంతరాత్మ ప్రబోధానుసారం ఏ మతాన్నైనా అవలంబించి, ఆచరించి, ప్రచారం చేసే స్వేచ్ఛ ఉంది.

ప్రకరణ 25(2) ప్రకారం మత స్వేచ్ఛ ప్రజా శాంతికి, నైతికతకు, ప్రజారోగ్యానికి భంగం కలిగించరాదు. అలాంటి సమయాల్లో ప్రభుత్వం పరిమితులు విధించవచ్చు. మత విషయాలను నియంత్రించవచ్చు. హిందూ మతంలో కొన్ని సామాజిక సంస్కరణలు చేపట్టవచ్చు.

ప్రకరణ-25లో రెండు వివరణలు ఉన్నాయి. అవి

- సిక్కులు తలపాగా, కత్తి ధరించడం వారి సంప్రదాయంలో భాగం.
- ప్రకరణ-25(2)(బి)లో హిందువులు అనే పదం ఉంది. ఇక్కడ హిందువులంటే సిక్కులు, జైనులు, బౌద్ధులు కూడా.

ప్రకరణ-26

మత సంస్థలు - మతపరమైన వ్యవహార నిర్వహణలో స్వేచ్ఛ

ప్రజా శాంతికి, నైతికతకు, ఆరోగ్యానికి భంగం కలిగించకుండా వ్యక్తులు మత సంస్థలను ఏర్పాటు చేసి నిర్వహించుకోవచ్చు.

- మత సంస్థలను, ధర్మాదాయ సంస్థలను స్థాపించవచ్చు.
- సంస్థలను నిర్వహించుకోవచ్చు.
- స్థిర, చరాస్తులను సంపాదించుకోవచ్చు.
- అమల్లో ఉన్న చట్టాలకు లోబడి వాటిని నిర్వహించుకోవచ్చు.

ప్రకరణ-27

మతవ్యాప్తి లేదా మత పోషణ కోసం పన్నులు వసూలు చేయరాదు

మత ప్రాతిపదికన ప్రజలపై పన్నులు విధించరాదు, వసూలు చేయరాదు. ఈ నిబంధన పన్నులు వసూలు చేయడాన్ని మాత్రమే నిషేధిస్తుంది. అయితే మత ప్రాతిపదికన ప్రత్యేక సేవలు అందించినందుకు ప్రజల నుంచి ప్రభుత్వం రుసుం వసూలు చేయవచ్చు.

ఉదా: దేవాలయంలో ప్రత్యేక దర్శనాల కోసం , సేవల కోసం రుసుం వసూలు చేయడం రాజ్యాంగబద్ధమే.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

English - (SA, SGT)

Finally the hero gets..

When you stop thinking new thoughts, new ideas, new imaginations, new feelings, new aptitudes and new intellectual creations, there is no need of a language. From the moment you get up from your bed, till the moment you go to your bed, the same set of stock vocabulary is enough. When you don't need any other vocabulary than your known, faded, stereotyped, boring, tiresome and tasteless vocabulary, it means that you have stopped thinking which makes you isolated. Find out what makes a word tick and how you can make it stick.

VOCABULARY

When somebody asked 'what is a language?', the other man replied 'words, words, words and words'. This is actually from William Shake-speare's immortal work 'Hamlet'.

It goes like this..

Polonius: What do you read, my Lord?
Hamlet: Words, words, words.
Polonius: What is the matter, my Lord?
Hamlet: Between whom? (In the original text, it is 'Between who?')
Polonius: I mean the matter that you read, my Lord.

In the above dialogue, one can see how important one's use of vocabulary is. Keeping a side the significance of the dialogue a while, there is a grammar mistake in it. 'Between' is a preposition. There is a rule that there must be an objective case pronoun after a preposition. Now this rule is violated. But we often say that they are exceptions. It may be true. Somebody wanted to know and asked "Did Shakespeare write in English?" Then the other man retorted "Shakespeare didn't write in English rather whatever he wrote is English".

Yes it is true. Hundred percent true. Emily Dickinson rightly opines;

"A word is dead
When it is said,
Some say. I say it just
Begins to live
That day"

Yes. Language is lively. Life is in language. Life without language is just unimaginable, a mere cipher. In vocabulary building, the problem is not so much finding new words or even finding out what they mean. The problem is to remember them, to fix them permanently in your mind. The simple way is to 'see the word, utter it thrice, use it once and it is yours'. Your being introduced to a number of words is of no use as you will forget them as quickly as you forget the names of people you are casually introduced to at a crowded party. Unless you meet them again or unless you spend some time with them, you can't say "I know them or they know me". Try to meet some of the more difficult words, see them in their contexts, look at them from other angles and spend some time with them. Your meeting them should not be a casual one. Some association should be established between you and the words. Try to bring into sharp and permanent focus those words that are now on the blurred fringe of your mind. Imagine a context and you will fall in the need of words.

Let's taste a spoon of words from the ocean of language...

Celibacy: Unmarried state, usually a religious vow of chastity.
Censorious: Being inclined to find faults.
Clinophobia: Morbid fear of lying in bed.
Confiscate: Seize (private property) by authority.
Connoisseur: One who appreciates, understands and enjoys arts.
Conscription: Compulsory enrollment, especially for the armed forces; draft.
Convalescence: Gradual return to health and strength after illness.
Claustrophobia: An abnormal fear of being in narrow or enclosed spaces.
Cynic: A person who believes all people are motivated by selfishness or one whose outlook is scor-nfully and often habitually negat-ive. (Cynic is a member of a sect of ancient Greek philosophers who believed virtue to be the only good and self-control to be the only means of achieving virtue).
Cynophobia: Morbid fear of dogs.
Cynosure: Centre of attention. An object that serves as a focal point of attention and admiration. Somebody or something that is the centre of admiration, attention or attraction.
Discophile: One who studies and collects phonographs.
Dissenter: Person who is hard to be pleased. (Often Dissenter One who refuses to accept the doctrines or usages of an established or a national church, especially a Protestant who dissents from the Church of England)
Dipsomania: Morbid craving or desire for alcohol.
Ditheism: Belief in independent principles of good and evil.
Diurnal: Relating to or occurring in a 24-hour period; daily or occurring or active during the daytime rather than at night: as in diurnal animals.

SYNONYMS AND ANTONYMS

S: = Synonyms **A:** = Antonym

- **Capricious**

S: Unpredictable, impulsive, fickle, changeable, inconstant, whimsical
A: Constant, firm, steadfast, unswerving

- **Cheek**

S: **Impertinent boldness:** (As in 'he shows the cheek to insult his hosts'). To speak impudently to or impudence, effrontery, gall, temerity, audacity, insolence, sauce, sass (=Impertinent, disrespectful speech; back talk)
A: Politeness, courtesy, humility, gentleness, respect.
(Cheek also means 'either side of the face below the eye. Eg. They are dancing cheek to cheek)

- **Dainty**

S: Pretty, neat, delicate, refined, tas-ty, delicious, fastidious, elegant, toothsome, exquisite, cute, palatable.
A: Inelegant, coarse, vulgar, rough, crude, rude, nasty, dirty.

- **Detrimental**

S: Harmful, injurious, hurtful, pernicious, damaging, noxious
A: Good, beneficial, valuable, useful, profitable, harmless, inoffensive, unobnoxious

- **Diligent**

S: Industrious, laborious, hard-working, attentive, assiduous, observant, mindful, vigilant, watchful, wakeful, careful
A: Careless, heedless, inattentive, indifferent, unobservant, unmindful

- **Docile**

S: Pliant, tractable, amenable, teachable, yielding, compliant, tame, submissive, gentle, unresisting, dutiful, passive, acquiescent, unassertive, manageable, governable, obsequious.
A: Obstinate, stubborn, intractable, self-willed, dogged, defiant, insolent, resistant, resisting, obdurate, disobedient, willful, uncompromising, unyielding, refractory, recalcitrant

- **Droll**

S: Amusing, laughable, funny, com-ic, sarcastic, whimsical, comical, odd, queer, farcical, ludicrous, ri-diculous, absurd, diverting, romp
A: Sad, lamentable, lugubrious, tragic, painful, dolorous, hurtful, distressing, grievous, woeful, rueful, mournful, deplorable, touching

- **Ephemeral**

S: Short lived, transitory, transient, fleeting, momentary, fugitive, evanescent, fugacious, temporary
A: Eternal, perpetual, perennial, permanent, intransient, lifelong, everlasting, long-lived, prolonged, protracted

- **Enormous**

S: Immense, gigantic, colossal, huge, vast, gargantuan, monstrous, prodigious, stupendous, plentiful, plenteous, copious
A: Trivial, insignificant, ordinary, average, small, little, tiny, diminutive.

MODEL QUESTIONS

Directions (Q. No. 1 - 5): ***Out of the four choices, select the one which can be substituted for the given words or sentences.***

1. Relating to the science of sounds
a) Acoustics b) Ultrasonic
c) Phonetic d) Sonics
2. A word formed from the initial letter or letters of each of the successive parts or major parts of a compound term:
a) Abbreviation b) Palindrome
c) Acronym d) Contraction
3. A substance which alleviates pain:
a) Narcotic b) Anodyne
c) Chloroform d) Intoxicant
4. A person who can speak several languages:
a) Linguist b) Lexicographer
c) Polyglot d) Multilingual
5. Deserving blame of an offence or crime:
a) Criminal b) Culpable
c) Punishable d) Culprit

Directions (Q. No. 6 - 14): ***From the given options, choose the one that is nearest in meaning to the underlined word:***

6. Gandhi is an ardent abolitionist.
a) Amnesty activist
b) One opposed to violence
c) War activist
d) One opposed to slavery
7. Only barren lands must be utili-zed for building the capital of AP
a) Unproductive b) Vacant
c) Fertile d) Assigned lands
8. With its good bandwidth, the company made good profits in its dish sales.
a) Measurement of handwritten data
b) Measurement of transferable data
c) Measurement of burned data
d) Measurement of shredded data
9. I felt it a little brackish.
a) Polluted b) Boring
c) Slightly salty d) Hot
10. Finally the hero gets catharsis.
a) Applaud
b) Gets relief from tension
c) Romantic reply d) Victory
11. The party's policies are deleterious to the state.
a) Beneficial b) Harmful
c) Retrospective d) Degrading
12. The invading force had no artillery and was completely annihilated.
a) Defeated b) Destroyed
c) Demolished d) Dismembered
13. The party can no longer win the admiration with its evanescent glory.
a) Vanishing b) Susceptive
c) Melting d) Evaporating
14. She looked at her friend's bristly chin.
a) Soft and shining
b) Rough c) Pricking
d) Cadent

KEY

1) a 2) c 3) b 4) c 5) b
6) d 7) a 8) b 9) c 10) b
11) b 12) b 13) a 14) b

విశ్వం మొత్తంలో అత్యంత శక్తిమంత కిరణాలు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఆధునిక భౌతికశాస్త్రం

ఐసోటోపులు

- ఒకే పరమాణు సంఖ్య, భిన్నమైన పరమాణు ద్రవ్యరాశులను కలిగిన పరమాణువులను ఐసోటోపులు అంటారు. వీటిని ఆస్టన్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.
- పరమాణు కేంద్రకంలో న్యూట్రాన్‌లు అదనంగా వచ్చి చేరినపుడు ఈ ఐసో టోపులు ఏర్పడతాయి.
- పరమాణువు భౌతిక, రసాయనిక ధర్మాలు మార్పుచెందకుండా దాని పరమాణు కేంద్రకంలో న్యూట్రాన్‌ను కలపొచ్చు.

ఉదాహరణ: హైడ్రోజన్ ఐసోటోపులు

ప్రోటియం (లేదా) హైడ్రోజన్: $_1H^1 = 1P^+ + 0_0^{n1}$

డ్యూటిరియం: $_1H^2 = 1P^+ + 1_0^{n1}$

ట్రిటియం: $_1H^3 = 1P^+ + 2_0^{n1}$

ఐసోటోపులు సహజసిద్ధంగా భూమిలో లభిస్తాయి. అదేవిధంగా మానవుడు తన అవసరాల కోసం ఐసోటోపులను న్యూక్లియర్ రియాక్టర్ ద్వారా ఉత్పత్తి చేస్తున్నాడు. ఐతే ఇలా ఉత్పత్తి చేసిన ఐసోటోపులు రేడియోధార్మికతను ప్రదర్శించడం వల్ల వీటిని రేడియో ఐసోటోపులు అంటారు.

రేడియో అయోడిన్: అయోడిన్ లోపం వల్ల ఏర్పడిన గాయిటర్ అనే వ్యాధిని నయం చేయడానికి ఈ ఐసోటోపులను ఉపయోగిస్తారు.

రేడియో సోడియం: మన శరీరంలోని రక్త సరఫరాలో లోపాలను తెలుసుకోవడానికి, హృదయ స్పందనను నియంత్రించడానికి ఈ ఐసోటోపులను ఉపయోగిస్తారు.

రేడియో ఫాస్ఫరస్: మెదడులో ఏర్పడిన కణతి స్థానాలను గుర్తించడానికి, యంత్రభాగాల అరుగుదలను అంచనా వేయడానికి, ఒక మొక్క లేదా చెట్టు నిర్దీత కాలంలో పీల్చుకొన్న నీటి శాతాన్ని లెక్కించడానికి ఈ ఐసోటోపులను ఉపయోగిస్తారు.

కోబాల్ట్ 60[CO^{60}]: వీటి నుంచి γ కిరణాలు విడుదలవుతాయి. ఈ కిరణాలకు ఆవేశం, ద్రవ్యరాశులు ఉండవు. అందువల్ల ఈ γ కిరణాలు పదార్థంలో ఎక్కువ లోతునకు చొచ్చుకొని వెళ్తాయి. ఈ కారణం వల్ల క్యాన్సర్ గడ్డలను కరిగించడానికి γ కిరణాలను ఉపయోగిస్తారు. ఈ పద్ధతిని కోబాల్ట్ థెరపీ అంటారు.

కార్బన్ డేటింగ్: దీన్ని లిబ్బి అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఈ పద్ధతిని ఉపయోగించి శిలాజాల వయసును నిర్ధారించొచ్చు.

$$\text{శిలాజాల వయస్సు} = \frac{_6C^{14}\text{ఐసోటోపుల సంఖ్య}}{_6C^{12}\text{మిగిలిపోయిన పరమాణువుల సంఖ్య}}$$

కార్బన్ మూలకాన్ని King of the ele ments అని కూడా అంటారు. ప్రతి జీవిలో ఈ మూలకం ఉంటుంది.

యురేనియం డేటింగ్: భూమి వయసును అంచనా వేయడానికి యురేనియం ఐసోటోపు లను ఉపయోగిస్తారు.

- మనదేశంలో రేడియో ఐసోటోపులను ఆయా రియాక్టర్లలో ఉత్పత్తి చేసి వాటిని కావాల్సిన ప్రాంతానికి సరఫరా చేయడానికి ముంబైలోని భారత అణుశక్తి సంఘంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ విభాగం పేరు Board of Radiation and Isotope Technology (BRIT)
- ఐసోటోపుల ఉత్పత్తి, వినియోగంలో మనదేశం ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంది.

x-కిరణాలు: x-కిరణాలను 1895లో రాంట్‌జెన్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఆయనకు భౌతికశాస్త్రంలో తొలి నోబెల్ బహుమతి లభించింది.

X- కిరణాల ధర్మాలు- ఉపయోగాలు

x-కిరణాల తరంగదైర్ఘ్య అవధి 0.01Å-100Å వరకు ఉంటుంది. కాబట్టి క్వాంటం సిద్ధాంతం ప్రకారం x-కిరణాలు చాలా శక్తిమంతమైనవి.

- ఈ కిరణాలకు ఎటువంటి ఆవేశం, ద్రవ్యరాశులు ఉండవు. కాబట్టి ఈ కిరణాలు ఒక రకమైన విద్యుత్ అయస్కాంత తరంగాలు మాత్రమే.
- x–కిరణాలకు ఎలాంటి ఆవేశం లేకపోవడం వల్ల విద్యుత్ క్షేత్రం, అయస్కాంత క్షేత్రాల్లో ఎటువైపు ఆవర్తనం చెందకుండా రుజుమార్గంలో ప్రయాణిస్తాయి.
- శూన్యంలో లేదా గాలిలో ఈ కిరణాల వేగం కాంతివేగానికి సమానంగా ఉం టుంది.
- ఈ కిరణాలు ఫొటోగ్రాఫిక్ ప్లేట్లను ప్రభావితం చేస్తాయి.
- x–కిరణాలకు ఆవేశం లేకపోవడం వల్ల వీటి అయనీకరణ సామర్థ్యం దాదాపు శూ న్యం.

x–కిరణాలను 2 రకాలుగా వర్గీకరించొచ్చు.

1. **కఠిన x–కిరణాలు:** వీటి తరంగదైర్ఘ్య అవధి 0.01Å - 4Å లుగా ఉంటుంది. అందువల్ల ఈ కిరణాలకు ఎక్కువ శక్తి ఉండి మెత్తగా ఉన్న రక్తం, మాంసం, కఠినమైనటువంటి ఎముకల, లోహాలు, లోహ మిశ్రమాల్లో చొచ్చుకొని వెళ్తాయి. అందువల్ల పెద్ద బాయిలర్‌లు, పైపులు, డ్యాంలు మొదలైన వాటిలోని పగుళ్ల లేదా రంధ్రాల స్థానాన్ని గుర్తించడానికి ఈ కిరణాలను ఉపయోగిస్తారు.

   అదేవిధంగా విమానాశ్రయాలు, నౌకా కేంద్రాలు, దేశ సరిహద్దుల్లో ప్రయాణికుల లగేజీని తనిఖీ చేయడానికి ఈ కిరణాలను వాడుతారు.

2. **మృదు x–కిరణాలు:** వీటి తరంగదైర్ఘ్య అవధి 4Å - 100Å వరకు ఉంటుంది. అందువల్ల వీటి శక్తి తక్కువగా ఉండి మెత్తగా ఉన్న రక్తం, మాంసం ద్వారా మాత్రమే చొచ్చుకొని వెళ్లగలుగుతాయి. కఠిన ఎముకలు, ఇతర పదార్థాల ద్వారా ఇవి చొచ్చుకొని వెళ్లలేవు. అందువల్ల ఈ మృదు కిరణాలను వైద్య రంగంలో ఉపయోగిస్తారు.

- C.T.స్కాన్‌లో x-కిరణాలను ఉపయోగిస్తారు.
- జీర్ణాశయం... x-కిరణాల Photoను తీయడానికంటే ముందు రోగికి బేరియం మీల్స్ అనే రసాయన ద్రావణాన్ని (బేరి యం సల్ఫేట్) తాగిస్తారు.
- కాబట్టి ఈ రసాయన పదార్థం x-కిరణాలను కావాల్సిన చోట కేంద్రీకృతం చేస్తుంది.
- x-కిరణాలను ఉపయోగించి రోగ నిర్ధారణ చేయడాన్ని రేడియోగ్రఫీ, రోగ నివారణ చేయడాన్ని రేడియో థెరపీ అని అంటారు. అందువల్ల x-కిరణాలతో పనిచేసే డాక్టర్‌ను రేడియాలజిస్ట్ అని పిలుస్తారు.
- x-కిరణాలను ఉత్పత్తి చేయడానికి కూలిడ్జ్ నాళాన్ని ఉపయోగిస్తారు. ఈ పరికరాన్ని సీసపు పెట్టెలో అమర్చుతారు. ఎందుకంటే సీసం సహజ రేడియోధార్మిక పదార్థాల్లో స్థిరమైన, ధృడమైన పదార్థం. అందువల్ల x-కిరణాలు సీసం ద్వారా చొచ్చుకొని వెళ్లలేవు.

విశ్వ కిరణాలు (లేదా) కాస్మిక్ కిరణాలు: వీటిని సీటీఆర్ విల్సన్ అనే శాస్త్రవేత్త తొలిసారి గుర్తించాడు. ఈ కిరణాలను ప్రయోగాత్మకంగా కనుగొన్న శాస్త్రవేత్త మిల్లికాన్.

- కాస్మిక్ కిరణాల్లోని కణాల్లో ఎలక్ట్రాన్‌లు, ప్రోటాన్‌లు, పాజిట్రాన్‌లు, న్యూట్రాన్‌లు, అయాన్‌లు ముఖ్యమైనవి. ఐతే ఈ కణాల్లో సుమారు 80శాతం వరకు ప్రోటాన్‌లు ఉంటాయి.
- కాస్మిక్ కిరణాల ఉనికిని, దిశను తెలుసుకునేందుకు ఉపయోగించే సాధనం.. కాస్మిక్ రే టెలిస్కోప్.
- కాస్మిక్ కిరణాల తీవ్రత ధృవాల వద్ద, భూమధ్యరేఖ వద్ద కనిష్టంగా ఉంటుంది.
- ఈ కిరణాల శక్తి సుమారు 10^8 ఎలక్ట్రాన్ వోల్ట్‌ల నుంచి 10^{20} ఎలక్ట్రాన్ వోల్ట్‌ల వరకు ఉంటుంది. కాబట్టి ఈ విశ్వం మొత్తంలో అత్యంత శక్తిమంత కిరణాలుగా కాస్మిక్ కిరణాలను పరిగణిస్తారు.

క్వాంటం సిద్ధాంతం ($E = hc/\lambda$) ప్రకారం పరిశీలించినప్పుడు ఈ కిరణాల తరంగ దైర్ఘ్యం తక్కువగా ఉంటుంది. ఈ విశ్వ కిరణాలను తిరిగి 2 రకాలుగా వర్గీకరిస్తారు.

1. **కఠిన కాస్మిక్ కిరణాలు:** ఇవి పది సెంటీమీటర్ల మందం ఉన్న సీసపు దిమ్మ ద్వారా చొచ్చుకొని వెళ్తాయి. ఈ కిరణాలు సూపర్‌నోవా నుంచి వెలువడుతాయని శాస్త్రవేత్తలు భావిస్తారు.
2. **మృదు కాస్మిక్ కిరణాలు:** ఈ కిరణాలు 10 సెం.మీ మందం ఉన్న సీసపు దిమ్మ ద్వారా చొచ్చుకొని వెళ్లలేక ఆగిపోతాయి. ఈ రకానికి చెందిన కాస్మిక్ కిరణాలు నోవా నుంచి లేదా సూర్యుని ఉపరితలం నుంచి వెలువడతాయని శాస్త్రవేత్తలు భావిం చారు.

- ఒక నక్షత్రం బ్లాక్ హోల్(కృష్ణబిలం) వరకు చేరుకోవాలంటే దాని ద్రవ్యరాశి సూర్యుడి ద్రవ్యరాశికి కనీసం 1.4 రెట్లు ఉండాలి. దీన్ని చంద్రశేఖర్ లిమిట్ అని అంటారు.

ఒక చంద్రశేఖర్ లిమిట్
= 1.4×సూర్యుని ద్రవ్యరాశి
$= 1.4\times2\times10^{30}kg$
$= 2.8\times10^{30}kg$

- బ్లాక్ హోల్ (కృష్ణబిలం) అని పేరుపెట్టిన శాస్త్రవేత్త జాన్ వీలర్.
- నక్షత్రం ద్రవ్యరాశి చంద్రశేఖర్ లిమిట్ కంటే తక్కువగా ఉంటే అది మరుగుజ్జు నక్షత్రంగా అంతరించిపోతుంది.
- ద్రవ్యరాశిని కొలవడానికి ఉపయోగించే అతిపెద్ద ప్రమాణం చంద్రశేఖర్ లిమిట్ ఐతే అతి చిన్న ప్రమాణం పరమాణు ద్రవ్యరాశి ప్రమాణం.
- ఈ విశ్వంలో ఉన్న నక్షత్రాలను పరిమాణం దృష్ట్యా 3 రకాలుగా వర్గీకరిస్తారు.

1. **భారీ నక్షత్రాలు:** వీటి ద్రవ్యరాశి, పరిమాణం చాలా ఎక్కువగా ఉంటుంది.
   ఉదాహరణ.. ఎప్సిలాన్ అరిగా
2. **మధ్య తరహా నక్షత్రం:** వీటి ద్రవ్యరాశి, పరిమాణం భారీ నక్షత్రాల కంటే చాలా తక్కువగా ఉంటుంది.
   ఉదాహరణ.. సూర్యుడు.
3. **మరుగుజ్జు నక్షత్రాలు:**

- వీటి ద్రవ్యరాశి, పరిమాణాలు చాలా తక్కువగా ఉంటాయి.
- భారతదేశంలో కాస్మిక్ కిరణాల గురించి అధ్యయనం చేసిన శాస్త్రవేత్తల్లో డాక్టర్ హోమీ జహంగీర్ బాబా, మేఘనాథ్ సాహా, డాక్టర్ విక్రమ్ సారాభాయ్ ముఖ్యమైనవారు.
- కాస్మిక్ కిరణాల గురించి అధ్యయనం చేయడానికి అనురాధ అనే ఒక ఉపగ్రహాన్ని భారత శాస్త్రవేత్తలు, నాసా శాస్త్రవేత్తలు అంతరిక్షంలోకి అనేక ఏళ్ల క్రితం ప్రయోగించారు.
- అంతరిక్షంలో వ్యోమగాములు చేసే ఏ చర్యనైనా(స్పేస్ వాక్) Extra vehicular activity (EVA)అంటారు.
- విశ్వాంతరాళంలో వ్యోమగాములు ధరించే Space suitను Extra Terristial mobile unit (ETMU) అని అంటారు. దీన్ని Fibre nylonతో తయారు చేస్తారు.

ప్రతి space suitలో కనీసం 7 పొర లుంటాయి. దీన్ని ధరించడం వల్ల విశ్వాంతరాళంలో నుంచి వస్తున్న కాస్మిక్ కిరణాలు, x-కిరణాలు, రేడియోధార్మిక కిరణాలు మొదలైన వాటి నుంచి వ్యోమ గాములకు రక్షణ కల్పించడమే కాకుండా కావాల్సిన పీడనాన్ని కూడా అందిస్తాయి.




సహజ రేడియో ధార్మికత:

సహజ రేడియో ధార్మికతను 1896 లో హెన్రీ బెకరల్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. పరమాణు కేంద్రకంలో గల ప్రోటాన్‌లు, న్యూట్రాన్లను బంధించే బలాలను కేంద్రక బలాలు అంటారు. ఈ విశ్వం మొత్తంలో పరిశీలించినప్పుడు అత్యంత బలమైనవి కేంద్రక బలాలు(గురుత్వాకర్షణ బలాలు, అయస్కాంత బలాలు, విద్యుత్ బలాలు మొదలైన వాటితో పోల్చినపుడు). ఈ బలాలను కూలుంబ్ అనే శాస్త్రవేత్త అధ్యయనం చేసి వీటిని కూలుంబ్ ఆకర్షణ బలాలు, వికర్షణ బలాలు అని రెండు రకాలుగా వర్గీకరించారు. ఈ రెండు బలాల పరిమాణాన్ని ఆధారంగా చేసుకొని పరమాణువుల స్థిరత్వాన్ని, సహజ రేడియోధార్మికతలను వివరించొచ్చు.

- పరమాణు సంఖ్య 1 నుంచి 30 వరకు గల పరమాణు కేంద్రకంలో కూలుంబ్ ఆకర్షణ బలాలు గరిష్టంగా, వికర్షణ బలాలు కనిష్టంగా ఉంటాయి. దీంతో వీటి పర మాణు కేంద్రకాలకు ఎక్కువ స్థిరత్వం కలు గుతుంది. కాబట్టి ఇలాంటి పరమాణు వులు రేడియోధార్మికతను ప్రదర్శించవు.
- పరమాణు సంఖ్య 31 నుంచి 82 వరకు గల పరమాణు కేంద్రకంలో కూలుంబ్ ఆకర్షణ బలాలు క్రమంగా తగ్గిపోయి, వికర్షణ బలాల పరిమాణం పెరగడం వల్ల అస్థిరత్వం ఏర్పడుతుంది.
- పరమాణు సంఖ్య 82 కంటే ఎక్కువగా ఉన్న పరమాణు కేంద్రకంలో కూలుంబ్ వికర్షణ బలాలు గరిష్టంగా మారడం వల్ల అస్థిరత్వం కూడా గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. కాబట్టి ఇలాంటి మూల కాలు స్థిరత్వం పొందడానికి తమంతట తాముగా α, β, γ కిరణాలను విరజిమ్ముతాయి. ఈ ధర్మాన్ని సహజ రేడియోధార్మికత అని అం టారు.
  ఉదా॥ యురేనియం, థోరియం.
- ప్రకృతిలో లభించే మూలకాల్లో యురేనియం ఎక్కువ భారాన్ని కలిగి ఉంటుంది.
- సహజ రేడియోధార్మికత పదార్థ స్వభావంపై మాత్రమే ఆధారపడి ఉంటుంది. బాహ్య కారకాలైన ఉష్ణోగ్రత, పీడనాలపై ఆధారపడి ఉండదు.

α, β, γ కిరణాలను రేడియోధార్మిక కిర ణాలు లేదా బెకరల్ కిరణాలు అని కూడా అంటారు.

Series increases gradually, it might be..



NUMBER SERIES

Number series questions are based on arithmetic operations such as addition, subtraction, multiplication and division.

i. If the series increases gradually, it might be a case of addition.
ii. If the series decreases gradually, it might be a case of subtraction.
iii. If there is a sharp increase in the terms at one or two places in the series, it might be multiplication or combination (i.e. multiplicati-on along with addition or subtra-ction).
iv. If there is a sharp decrease in the terms at one or two places in the series, it might be division or combination (i.e. division along with addition or subtraction).
v. If the case is pure multiplication or division, there will be an exact ratio between the successive terms but it will not be same in case of combination.

In present exams, two models of number series are given.

I. Missing term: In this series one term will be missing. Based on the logic of the other terms we have to find out the missing term.

II. Wrong number: In this series, one term will be given wrong. We have to find out that wrong number.

PRACTICE QUESTIONS

Directions (1-15): What should come in place of the question mark (?) in the following number series?

1. 987 587 331 187 123 ?
1) 104 2) 113 3) 107 4) 114
5) None of these

A: 3
−400 −256 −144 −64
987 587 331 187 123 ?
$400 \rightarrow (20)^2$, $256 \rightarrow (16)^2$,
$144 \rightarrow (12)^2$, $64 \rightarrow (8)^2$
The next value to be subtracted is 4^2.
The next term in the series is
$123 - 4^2 = 123 - 16 = 107$
$\therefore ? = 107$

2. 365 728 2160 8532 42340 ?
1) 253275 2)253280 3) 253285 4) 253290
5) 253295

A:4
−1 −8 −27 −64
365 728 2160 8532 42340 ?
×2 ×3 ×4 ×5
$1 \rightarrow (1)^3$, $8 \rightarrow (2)^3$, $27 \rightarrow (3)^3$, $64 \rightarrow (4)^3$
∴The value to be subtracted from 42340 is $(5)^3$ i.e.
$42340 - 125 = 42215$
$? = 42215 \times 6 = 253290$

3. 62 177 512 1507 4482 ?
1) 13396 2)13397 3) 13398
4) 13399 5) 13400

A: 2
×3 ×3 ×3 ×3
62 177 512 1507 4482 ?
−9 − 19 − 29 − 39
$? = 4482 \times 3 - 49 =$
$13446 - 49 = 13397$

4. 21 12342 22543 30824 37385 ?
1) 42422 2) 42424 3) 42426
4) 42428 5) 42430

A: 3
21 12342 22543 30824 37385 ?
+12321 +10201 +8281 + 6561
$= (111)^2 = (101)^2 = (91)^2 = (81)^2$
The perfect square to be added to the next term is $(71)^2 = 5041$
$? = 37385 + 5041 = 42426$

5. 800 160 48 19.2 9.6 ?
1) 6.48 2) 5.76 3) 5.12
4) 4.84 5) 4.56

A: 2
The sharp decrease from 800 to 160 indicates that, it might be division. But in series like this don't come to conclusion from the highest value. Take the lowest terms. They are decimal numbers. So it might be multipli-cation with decimal numbers.
×0.2 ×0.3 ×0.4 ×0.5
800 160 48 19.2 9.6 ?
$\therefore ? = 9.6 \times 0.6 = 5.76$

6. 63 95 119 135 143 ?
1) 151 2) 157 3)162
4) 168 5) None of these

A: 5
The values are increasing gradually. It indicates addition.
+32 +24 +16 +8
63 95 119 135 143 ?
The next value to be added is 0 (8 − 8).
$\therefore ? = 143 + 0 = 143$

7. 4 20 101 357 982 ?
1) 1632 2) 1848 3)2040
4) 2278 5) 2412

A: 4
4 20 101 357 982 ?
+16 +81 +256 +625
$16 \rightarrow (2)^4$, $81 \rightarrow (3)^4$,
$256 \rightarrow (4)^4$, $625 \rightarrow (5)^4$
$\therefore ? = 982 + (6)^4 = 982 + 1296 = 2278$

8. 14 50 166 522 1598 ?
1) 4832 2) 4834 3)4836
4) 4838 5) 4840

A: 2
×3 ×3 ×3 ×3
14 50 166 522 1598 ?
+8 +16 +24 +32
$\therefore ? = 1598 \times 3 + 40 = 4794 + 40 = 4834$

9. 4830 4556 4290 4032 3782 ?
1) 3510 2) 3520 3)3530
4) 3540 5) 3550

A: 4; The gradual decrease in the terms indicates subtraction.
−274 −266 −258 −250
4830 4556 4290 4032 3782 ?
$\therefore ? = 3782 - 242 = 3540$

10. 1320 1313 1288 1227 1106 ?
1) 875 2) 880 3)885
4) 890 5) 895

A: 5
−7 −25 −61 −121
1320 1313 1288 1227 1106 ?
$7 = (2)^3 - 1$, $25 = (3)^3 - 2$,
$61 = (4)^3 - 3$, $121 = (5)^3 - 4$.
$\therefore ? = 1106 - (6^3 - 5)$
$= 1106 - 211 = 895$

11. 150 152 149 153 148 154 ?
1) 155 2) 152 3) 147
4) 149 5) None of these

A: 3
The series is increasing and decreasing altemately. So the operators used might be addition and subtraction.
+2 −3 +4 − 5 +6
150 152 149 153 148 154 ?
∴ ? = 154−7= 147

12. 17 52 158 477 ? 4310
1) 1433 2) 1432 3)1435
4)1434 5) None of these

A: 3
×3 ×3 ×3
17 52 158 477 ? 4310
+1 +2 +3
∴?= 477×3+4=1431+4=1435

13. 3 22 ? 673 2696 8093
1) 133 2) 155 3) 156 4) 134 5) None of these

A: 4
×7 ×4 ×3
3 22 ? 673 2696 8093
+1 +4 +5
∴? = 22 × 6 +2=132+2=134
134×5+3=670+3=673

14. 6 13 38 ? 532 2675
1) 129 2) 123 3)172
4) 164 5) None of these

A: 1
+7 +6 +5
6 13 38 ? 532 2675
×1 ×2 ×5
∴? = (38 +5)×3= 43×3=129
(129+4)×4+133×4=532

15. 286 142 ? 34 16 7
1) 66 2) 72 3) 64
4) 74 5) None of these

A: 5
÷2 ÷2 ÷2
286 142 ? 34 16 7
−1 −1 −1
∴?=142÷2−1=71−1=70
70÷2−1=35−1=34

Directions (16-30): In each question below, a number series is given in which one number is **wrong.** Find out the **wrong** number.

16. 3601 3602 1803 604 154 36 12
1) 3602 2)1803 3)604
4) 154 5) 36

A: 4
÷1 ÷2 ÷3 ÷4 ÷6
3601 3602 1803 604 154 36 12
+1 +2 +3 +3 +6
∴? The wrong number is 154.
The actual series should be
÷1 ÷2 ÷3 ÷4 ÷5 ÷6
3601 3602 1803 604 155 36 12
+1 +2 +3 +4 +5 +6

17. 4 12 42 196 1005 6066 42511
1) 12 2) 42 3)1005
4) 196 5) 6066

A: 2
×2 ×3 ×4 ×5 ×6 ×7
4 12 42 196 1005 6066 42511
+4 +6 +28 +25 +36 +49
∴? Wrong number is 42
The actual series should be
×2 ×3 ×4 ×5 ×6 ×7
4 12 45 196 1005 6066 42511
+4 +9 +16 +25 +36 +49

18. 2 8 12 20 30 42 56
1) 8 2) 42 3) 30
4) 20 5) 12

A: 1
+6 +4 +8 +10 +12 +14
2 8 12 20 30 42 56
Wrong number is 8. It should be 6 in place of 8

19. 32 16 24 65 210 945 5197.5
1) 946 2) 16 3) 24 4) 210 5) 65

A: 5
×0.5 ×1.5 ×2.7 ×3.2 ×4.5 ×5.5
32 16 24 65 210 945 5197.5
The wrong number is 65.
The original series should be
×0.5 ×1.5 ×2.5 ×3.5 ×4.5 ×5.5
32 16 24 60 210 945 5197.5

20. 7 13 25 49 97 194 385
1) 13 2) 49 3) 97
4) 194 5) 25

A: 4
×2 ×2 ×2 ×2 ×2 ×2
7 13 25 49 97 194 385
−1 −1 −1 −1 −0 −3
∴? The wrong number is 194.
The actual series should be
×2 ×2 ×2 ×2 ×2 ×2
7 13 25 49 97 193 385
−1 −1 −1 −1 −1 −1

21. 13 25 40 57 79 103 130
1) 25 2) 40 3)57 4) 79 5) None

A: 3
+12 +15 +17 +22 +24 +27
13 25 40 57 79 103 130
The values are Added should be 3 more than the value added previously.
∴ 57 is the wrong number
The actual series should be
+12 +15 +18 +21 + 24 +27
13 25 40 58 79 103 130

22. 2 10 18 54 162 486 1458
1) 18 2) 54 3) 162 4) 10 5) None

A: 4
×5 +8 ×3 ×3 ×3 ×3
2 10 18 54 162 486 1458
The wrong number is 10.
The actual series should be
×3 ×3 ×3 ×3 ×3 ×3
2 6 18 54 162 486 1458